

'నేను కలలుగన్న మరో ప్రపంచానికి మహిళలే మూలస్తంభాలు'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 22 వెల: ₹ 5.50

సంపుటి: 17
సంచిక: 42

శనివారం 4-5-2024

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



పుష్కర కాలం తర్వాత...

ముంబైలో ముంబై ఇండియన్స్ జట్టుపై 12 ఏళ్ల తర్వాత కోల్‌కతా నైట్‌రైడర్స్ జట్టు గెలుపుబావుటా ఎగురవేసింది. ముందుగా కోల్‌కతా 19.5 ఓవర్లలో 169 పరుగులకు ఆలౌట్ అయింది. ఆ తర్వాత ముంబై 18.5 ఓవర్లలో 145 పరుగులకు ఆలౌటై ఓడిపోయింది. 19 లో

శుక్రవారం రాత్రి రామగుండంలో నిర్వహించిన బస్సు యాత్రలో ప్రసంగిస్తున్న బీఆర్ఎస్ అధినేత కేసీఆర్





ప్రశ్నిస్తే గొంతు నొక్కారు

బీజేపీ, కాంగ్రెస్ కుమ్మక్కై నా ప్రచారంపై నిషేధం పెట్టాయి
రామగుండం రోడ్ షోలో కేసీఆర్ ఫైర్

2 లో

నా బస్సుయాత్రతో బీజేపీ, కాంగ్రెస్‌లలో వణుకు పుట్టింది.. కేంద్రంలో వచ్చేది సంకీర్ణమే.. బీఆర్ఎస్ గెలిస్తే హక్కులను కాపాడుకోవచ్చని వ్యాఖ్య

స్పీడందుకున్న కారు

కేసీఆర్ బస్సుయాత్ర, రోడ్ షోలతో బీఆర్ఎస్‌లో జోష్

- ఉద్యమకాలం నాటి ఉత్సాహం కనిపిస్తోందని నేతల వెల్లడి
- గణనీయ స్థాయిలో ఎంపీ సీట్లు సాధించగలమనే ధీమా

- వివరాలు 2లో

క్లీన్ స్వీప్ ఖాయం

టైమ్స్ నౌ గ్రూప్ ఎడిటర్-ఇన్-చీఫ్ నవికా కుమార్ ఇంటర్వ్యూలో ఏపీ సీఎం జగన్



15 లో

గల్లీ నుంచి ఢిల్లీ వరకు ఉన్నదున్నట్లు మాట్లాడారు.. 'ఇంట్లో' పాలిటిక్స్ గురించి కుండబద్దలు కొట్టినట్లు చెప్పారు.. పొత్తు రాజకీయాల్లోని మతలబును తేల్చి పారేశారు.. చంద్రబాబు చేతిలోనే కాంగ్రెస్ పార్టీ రిమోట్ కంట్రోల్ ఉందంటూ ఉదాహరణ సహితంగా వివరించారు.. రాహుల్, నరేంద్ర మోదీలపై తన అభిప్రాయాలను స్పష్టంగా, సూటిగా వెల్లడించారు.. దమ్ము, ధైర్యం, ప్రేమ, ఆప్యాయత కలబోసిన అరుదైన నేత వైఎస్ జగన్.. అని ఎందుకంటారో తెలుసుకోవాలంటే ఈ ఇంటర్వ్యూ చదవాల్సిందే.


డాక్టర్ ఎవిటా ఫెర్నాండేజ్

సిజేరియన్లను తగ్గించడమే లక్ష్యం...

"ప్రసవం స్త్రీకి పునర్జన్మ లాంటిది. ఆ మరుజన్మ ఆమెకు ఎంతో ఆనందకరమైన అనుభూతిగా జీవితాంతం మిగిలిపోవాలి. అందుకోసమే నా కృషి' అన్నారు హైదరాబాద్‌లోని ఫెర్నాండేజ్ హాస్పిటల్స్ చెయిర్‌పర్సన్, ప్రసూతి వైద్యురాలు డాక్టర్ ఎవిటా ఫెర్నాండేజ్. ప్రసవ సమయంలో కీలకమైన మంత్రసానుల ఆవశ్యకతను గుర్తించి చేపట్టిన శిక్షణా కార్యక్రమాలతో పాటు గర్భిణులకు ప్రీ చైల్డ్ బర్త్ అవేర్‌నెస్ క్లాసులను నిర్వహిస్తున్నారు. భారతదేశంలో మిడ్‌వైఫరీ వ్యవస్థకు నాయకత్వం వహిస్తున్న ఈ డాక్టర్ 2011లో తెలంగాణలో మొట్టమొదటి ప్రొఫెషనల్ మిడ్‌వైఫరీ సర్వీసెస్ ప్రారంభించారు. మే5 'ఇంటర్నేషనల్ మిడ్‌వైఫ్ డే.' ఈ సందర్భాన్ని పురస్కరించుకొని డాక్టర్ ఎవిటాను కలిసినప్పుడు మాతాశిశు సంరక్షణలో మంత్రసానుల కీలక పాత్ర, గర్భిణులకు అవగాహన కలిగించే ఎన్నో విషయాలను తెలియజేశారు.

"సాధారణ ప్రసవాలను ప్రోత్సహించాలి. అవసరం లేని సిజేరియన్స్ శాతాన్ని తగ్గించాలి. మాతా, శిశు సంరక్షణే ధ్యేయంగా పని చేయాలన్నదే మా ప్రధాన ఉద్దేశ్యం. ఈ ఐదేళ్లలో సిజేరియన్ల శాతం బాగా తగ్గించగలిగాం. దీనికి గర్భిణుల్లో అవగాహన కల్పించడానికి ప్రత్యేకంగా కృషి చేస్తున్నాం. మహిళలు తమ శరీరం గురించి అర్థం చేసుకుని, భయాలు తొలగిపోయేలా, ప్రసవానికి సంబంధించి వీలైనంత అవగాహన పెంచుకుంటే ఒత్తిడిని తగ్గించుకొని ఎన్నో సమస్యల నుంచి బయటపడవచ్చు. గర్భం దాల్చిన ప్రతి స్త్రీకి ప్రసవం గౌరవప్రదంగా, ఆనందకరమైన అనుభవంగా మారాలి. అందుకు తగిన ప్రణాళికలు ఎప్పుడూ చేస్తుంటాం.

ప్రసూతి సేవలకు వెన్నెముక

మంత్రసాని వ్యవస్థ స్త్రీ చుట్టూ, స్త్రీల కోసం కేంద్రీకృతమైంది. గర్భవతికి మద్దతు, గోప్యత, విశ్వాసం కలిగిస్తుంది. 2007 నాటికి ఏడాదికి 5వేలకు పైగా డెలివరీ చేసేవాళ్లం. ఎంతోమంది గర్భిణులు ముఖ్యంగా చిన్నవయసు వారిలో ప్రసవ సమయంలో వచ్చే సమస్యలు నన్ను బాగా కలిచి వేసేవి. దీంతో ప్రపంచవ్యాప్తంగా ప్రసూతి మరణాల గురించి చదవడం, తెలుసుకోవడంపై దృష్టి పెట్టాను. అప్పటిదాకా మేం అనుసరించిన ప్రసవ పద్ధతుల్లో మార్పులు అవసరం అని గ్రహించాను. ఈ క్రమంలో ప్రసూతి మరణాల రేటు తక్కువ ఉన్న దేశాలు మిడ్‌వైఫరీ వ్యవస్థను బలోపేతం చేస్తున్నారని తెలిసింది. అయితే, మన దేశంలో ఆ వెసులుబాటు లేదు. ఒకప్పుడు గ్రామాల్లో ఒక అనుభవం ఉన్న మంత్రసాని ఉండేది. తల్లిలా చూసుకునే అనుభవజ్ఞురాలైన మంత్రసాని దేశంలోని అన్ని ఆసుపత్రులలో ఉండటం అత్యవసరం అనిపించింది. దీని ద్వారా ఎక్కువ మంది మహిళలకు అత్యున్నత స్థాయి గల ప్రసూతి సంరక్షణ అవకాశాన్ని కలిగించవచ్చని అనిపించింది. అలాగే, అనవసరమైన సిజేరియన్లు తగ్గించడానికి కూడా ఈ ప్రక్రియ ఎంతగానో దోహపడుతుంది.

తెలంగాణలో..

ఈ ఆలోచన చేసిన వెంటనే వెనకడుగు వేయకుండా 2011లో రెండేళ్ల అంతర్గత ప్రొఫెషనల్ మిడ్‌వైఫరీ ఎడ్యుకేషన్ అండ్ ట్రెనింగ్ (పిఎమ్ఇటి) ప్రోగ్రామ్‌ను ప్రారంభించాం. మొదట పైలట్ ప్రాజెక్ట్ పూర్తి చేశాం. ఆ తర్వాత ప్రభుత్వంతో కలిసి హెల్త్ కేర్ ఎకో సిస్టమ్‌లో మంత్రసానుల ప్రవేశం మొదలైంది. 2018లో ఫెర్నాండేజ్ ఫౌండేషన్, తెలంగాణ ప్రభుత్వం, యునిసెఫ్ సహకారంతో రాష్ట్ర ఆరోగ్య సంరక్షణ వ్యవస్థ నుండి నర్సుల కోసం మిడ్‌వైఫరీలో 18 నెలల సర్టిఫికేషన్ కార్యక్రమాన్ని ప్రారంభించాం. మిడ్‌వైఫ్స్ కోసం రూపొందించిన ఈ కోర్సు తెలంగాణలోనే మొట్టమొదటిది. మొదట తెలంగాణలోని పది మారుమూల ఆసుపత్రుల్లో 30 మంది నర్సులకు మిడ్‌వైఫరీలో శిక్షణ ఇవ్వడం, ప్రసూతి సంరక్షణలో గేమ్ ఛేంజర్‌గా నిరూపించబడింది. ఇప్పుడు తెలంగాణలో సహజ ప్రసవాల శాతం పెరుగుతుంది. ఈ పని ద్వారా ఎంతో సంతృప్తి కలుగుతుంది.

ఆంధ్రప్రదేశ్‌లో..

ఇటీవలే పీఎమ్‌టీ ప్రోగ్రామ్ ఆంధ్రప్రదేశ్‌లోనూ ప్రారంభించాం. యునిసెఫ్, డబ్ల్యూహెచ్‌వో, బర్మింగ్‌హామ్ యూనివర్శిటీ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంతో కలిసి పనిచేస్తున్నాం. మొదటగా తెనాలిలో ఈ ప్రాజెక్ట్ పూర్తయ్యింది. తర్వాత సి–సేఫ్ ప్రాజెక్ట్స్ జిజిహెచ్ రాజమహేంద్రవరం, జిజిహెచ్ ఏలూరు, జిజిహెచ్ మచిలీపట్నం, డిహెచ్ అనకాపల్లిలో చేయబోతున్నాం.


● శిక్షణా కార్యక్రమంలో...

విస్తరణ వైపుగా...

నవాబుల కాలంలో హైదరాబాద్‌లో మా అమ్మ నాన్నలు లెస్లీ, లౌర్దెస్ ఫెర్నాండెజ్‌లు రెండు పడకలతో ఫెర్నాండెజ్ ఆసుపత్రిని ప్రారంభించారు. ఆ రోజుల్లో మాతా, శిశు మరణాలను చూసి వాటిని అడ్డుకోవాలనే సదాశయంతో ఏర్పాటు చేసిన ఆసుపత్రి ఆ తర్వాత నేను బాధ్యతలు తీసుకునే నాటికి 30 పడకలకు పెరగింది. స్త్రీ వైద్య నిపుణురాలిగా, నిర్వాహకురాలిగా నా బాధ్యతలను విస్తరిస్తూ వస్తున్నాను. ఫలితంగా ఫెర్నాండేజ్ హాస్పిటల్స్ నేడు 300 పడకల సామర్థ్యంతో మూడు ఆసుపత్రులు, రెండు ఔట్ పేషెంట్ క్లినిక్‌లు, నర్సింగ్ స్కూల్‌కి పెరిగింది. ఈ క్రమంలో వారి ఆశయాన్ని నిలబెట్టడానికి ఎంతో కృషి జరిగింది. మాతా, శిశు సంరక్షణపై దృష్టి సారించి వారి ఆరోగ్య సంరక్షణ, వైద్య విద్య, పరిశోధన వైపుగానూ విస్తరించింది" అని వివరించారు.

– నిర్మలారెడ్డి
ఫొటోలు: మోర్ల అనీల్‌కుమార్

పవర్‌ఫుల్ ఉమెన్

గోద్రెజ్ సైనిక... నైరిక

వ్యాపార విభజనతో గోద్రెజ్ కంపెనీ వార్తల్లోకి వచ్చింది. ఈ నేపథ్యంలో 'గోద్రెజ్ అండ్ బోయ్స్' ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, ఆ కంపెనీ ఫ్యూచర్ మేనేజింగ్ డైరెక్టర్ క్యాండెట్ నైరికా హోల్కర్‌పై ప్రత్యేక దృష్టి పడింది. 'గోద్రెజ్'లో న్యూ జనరేషన్ ప్రతినిధిగా భావిస్తున్న నైరికా హోల్కర్ లీడర్‌షిప్ ఫిలాసఫీ గురించి....

గోద్రెజ్ కుటుంబంలో నాల్గవ తరానికి చెందిన నైరికా హోల్కర్‌కు నేర్చుకోవాలనే తపన. ఆఫీసులోని సీనియర్ల నుంచి ఇంట్లో చిన్న పిల్లల వరకు కొత్త విషయాలను తెలుసుకోవడానికి ఎలాంటి ఇబ్బందీ పడదు. 'వినడం వల్ల కలిగే ఉపయోగాలు, కమ్యూనికేషన్స్ స్కిల్స్ నా కూతురి నుంచి నేర్చుకున్నాను' అని వినమ్రంగా చెబుతుంది నైరిక. ఐడియా రాగానే ఆ క్షణానికి అది గొప్పగానే ఉంటుంది. అందుకే తొందరపడకుండా తనకు వచ్చిన ఐడియా గురించి అన్నీ కోణాలలో విశ్లేషించి ఒక నిర్ధారణకు వస్తుంది. 'నా అభిప్రాయమే కరెక్ట్' అని కాకుండా ఇతరుల కోణంలో కూడా ఆలోచించడం అలవాటు చేసుకుంది.

'యూనివర్శిటీ ఆఫ్ లండన్'లో లా చదివిన నైరిక కొలరాడో కాలేజీలో (యూఎస్)లో ఫిలాసఫీ అండ్ ఎన్విరాన్‌మెంటల్ ఎకనామిక్స్ చదువుకుంది. లీగల్ ఫర్మ్ 'ఏజెడ్‌బీ అండ్ పార్ట్‌నర్స్'తో కెరీర్ ప్రారంభించిన నైరిక మన దేశంలో పెట్టుబడులు పెట్టాలనుకునే విదేశీ కంపెనీలకు సలహాలు ఇవ్వడంలో ప్రత్యేక ప్రతిభ సాధించింది. గోద్రెజ్ అండ్ బోయ్స్ (జీ అండ్ బి)లోకి అడుగు పెట్టి డిజిటల్ స్ట్రాటజీ నుంచి కంపెనీ లీగల్ వ్యవహారాలను పర్యవేక్షించడం వరకు ఎన్నో విధులు నిర్వహించింది. ఆమె నేతృత్వంలో కంపెనీ ఎన్నో ఇంక్యుబేటెడ్ స్టార్టప్‌లతో భాగస్వామ్య ఒప్పందం కుదుర్చుకుంది.

మహిళా సాధికారతకు ప్రాధాన్యత ఇచ్చే నైరిక 'పవర్' అనే మాటకు ఇచ్చే నిర్వచనం...

'అర్థవంతమైన మార్గంలో ప్రభావం చూపే సామర్థ్యం'

'నాయకత్వ లక్షణాలకు చిన్నా పెద్ద అనే తేడా ఉండదు. చిన్న స్థాయిలో పనిచేసే మహిళలలో కూడా అద్భుతమైన నాయకత్వ సామర్థ్యం ఉండవచ్చు. అలాంటి వారిని గుర్తించి నాయకత్వ బాధ్యతలు అప్పగించడం నా ప్రాధాన్యతలలో ఒకటి' అంటుంది నైరిక.

కోవిడ్ కల్లోల కాలం నుంచి ఎంతోమంది లీడర్స్ లాగే నైరిక కూడా ఎన్నో విషయాలు నేర్చుకుంది.

'మాలాంటి కంపెనీ రాత్రికి రాత్రే డిజిటల్‌లోకి వచ్చి రిమోట్ వర్కింగ్‌లోకి మారుతుందని చాలామంది ఊహించలేదు' అంటున్న నైరిక సిబ్బంది వృత్తి నైపుణ్యాలను మరింతగా మెరుగుపరచడంపై దృష్టి పెట్టింది. 'స్ప్రింట్' ప్రోగ్రాం ద్వారా కొత్త ఐడియాలను ప్రోత్సహించడం నుంచి ప్రయోగాలు చేయడం వరకు ఎన్నో చేసింది.

'నైరిక ఎవరు చెప్పినా వినడానికి ఇష్టపడుతుంది. ఒక ప్రాజెక్ట్‌లో భాగంగా సమర్థులైన ఉద్యోగులను ఒకచోట చేర్చే నైపుణ్యం ఆమెలో ఉంది. న్యూ జనరేషన్ స్టైల్ ఆమె పనితీరులో కనిపిస్తుంది' అంటారు గోద్రెజ్‌లోని సీనియర్ ఉద్యోగులు.



'గోద్రెజ్ అండ్ బోయ్స్' చీఫ్ మేనేజింగ్ డైరెక్టర్ జంషెడ్ గోద్రెజ్ సోదరి స్మితా గోద్రెజ్ కూతురే నైరికా హోల్కర్. ఇండోర్ రాజ కుటుంబానికి చెందిన యశ్వంత్‌రావు హోల్కర్‌ను ఆమె పెళ్లి చేసుకుంది.

దశాబ్ద కాలానికి పైగా ఇంజనీరింగ్–ఫోకస్డ్ మాన్యుఫాక్చరింగ్ కంపెనీలో కీలక బాధ్యతలు తీసుకొని రాణించడం అంత తేలికేమీకాదు. ఎన్నో సవాళ్లు ఎదురవుతుంటాయి. ఆ సవాళ్లను తన సామర్థ్యంతో అధిగమించి గోద్రెజ్ మహాసామ్రాజ్యంలో తనకంటూ ప్రత్యేకతను సంపాదించుకుంది నైరికా హోల్కర్.

గ్లోబల్ లీగల్ స్ట్రాటజీ నుంచి స్త్రీ సాధికారతకు పెద్ద పీట వేయడం వరకు కంపెనీలో తనదైన ముద్ర వేసింది.

2030 నాటికి...


కోవిడ్ తరువాత కొత్త ప్రాధాన్యత రంగాలను... ఉత్పత్తులు, సేవలను మెరుగు పరిచే అవకాశాలను గుర్తించాం. కార్బన్ తీవ్రతను తగ్గించాలనుకుంటున్నాం. ఎనర్జీ ప్రొడక్టివిటీని రెట్టింపు చేయాలనుకుంటున్నాం. పర్యావరణ హిత ఉత్పత్తుల నుంచి 32 శాతం ఆదాయాన్ని లక్ష్యంగా నిర్దేశించుకున్నాం. రాబోయే కాలంలో కంపెనీ ఆదాయాన్ని రెట్టింపు చేయాలనేది మా లక్ష్యం.

– నైరికా హోల్కర్

ప్రయాణ కథనం

గమ్యాలు చెప్పే కథలు

వేసవి వస్తే ప్రయాణాలు గుర్తుకు వస్తాయి. విమానం ఎక్కితే మొబైల్ ఫోన్‌ను ఎయిర్‌ప్లేన్ మోడ్‌లో ఉంచాలి. కాని ఈ ప్రయాణాల వెనుక చాలా రాజకీయాలు ఉంటాయంటోంది షెహనాజ్ హబీబ్. అమెరికాలో ప్రొఫెసర్‌గా ఉన్న ఈ కేరళ వనిత స్థానిక సంపదను 'డిస్కవరీ' చేయడానికే సామ్రాజ్యవాదులు ప్రయాణాలు చేశారని చెబుతుంది. సగటు మనిషి ప్రయాణాలకు ఎన్ని అడ్డంకులున్నాయో ఆమె పుస్తకం 'ఎయిర్‌ప్లేన్ మోడ్' విశదంగా తెలియజేస్తోంది. ట్రావెల్ రైటర్ షెహనాజ్ పరిచయం.




షెహనాజ్ హబీబ్

'ప్రయాణాల్లో కూడా వివక్ష ఉంటుంది' అంటుంది షహనాజ్ హబీబ్. 'మీ ఒంటి రంగు, మీ పాస్‌పోర్ట్ రంగు మీ ప్రయాణం సులభం చేయవచ్చో, జటిలం చేయవచ్చో నిర్ణయిస్తాయి' అంటుందామె.

అమెరికాలోని బే పాత్ యూనివర్సిటీలో ప్రొఫెసర్‌గా పని చేసే షహనాజ్ హబీబ్ కేరళలోని ఎర్నాకుళంలో ఒక సామాన్య కుటుంబంలో జన్మించింది. కాని ఆమె నేర్చిన ఇంగ్లిష్ భాష, ఆమె వ్యక్తీకరణ ఆమెకు విశేషమైన గుర్తింపు తెచ్చి పెట్టింది. అమెరికాలోని వ్యాసకర్తల్లో ఆమెకు గుర్తింపు ఉంది. న్యూయార్క్ టైమ్స్‌లో షహనాజ్ హబీబ్ వ్యాసాలు వస్తాయి. కేరళ రచయిత బెన్యమిన్ రాసిన ఒక నవలను 'జాస్మిన్ డేస్' పేరున షహనాజ్ మలయాళంలో అనువదిస్తే ప్రతిష్ఠాత్మక 25 లక్షల రూపాయల జె.సి.బి. పురస్కారం లభించింది. కవిత్వం, కథలతో పాటు ట్రావెలోగ్స్ కూడా రాసే షహనాజ్ ఇటీవల వెలువరించిన యాత్రా కథనం 'ఏరోప్లేన్ మోడ్'. అమెరికాలోనూ ఇండియాలోనూ విడుదలైన ఈ పుస్తకం యాత్రల విషయంలో కొత్త చూపును కలిగిస్తోంది.

'ప్రపంచ దేశాల పర్యటనలు తెల్లవాళ్లకు ఒక రకంగానూ రంగు తక్కువ ఆసియా, ఆఫ్రికా దేశాల వారికి ఒక రకంగానూ జరుగుతాయి. అమెరికా, యూరప్ దేశాల వారి తెల్లరంగు చూడగానే వారి ప్రయాణాలకు ఒక విలువ, గౌరవం ఉన్నాయని భావిస్తారు. వారిని అధికారులు చూసే పద్ధతి వేరుగా ఉంటుంది. అదే బ్రౌన్, బ్లాక్ కలర్ ఉన్నవారికి అన్నీ ఆటంకాలే. ఇక అమెరికా పాస్‌పోర్ట్ ఉండి, వారు తెల్లవారైతే వారికి వీసా క్యూలన్నీ లేనట్టే. అమెరికా పాస్‌పోర్ట్ ఉంటే చాలా దేశాలకు అసలు వీసాయే అక్కర్లేదు. అంటే ఒక మనిషికి ప్రయాణ గౌరవం పాస్‌పోర్ట్ వల్లే వస్తోందన్న మాట. దీనినే నేను పాస్‌పోర్టిజమ్ అంటాను' అంటుంది షహనాజ్.

సంస్కృతి, సంపదల కోసం..

'17, 18 శతాబ్దాల్లో యాత్రీకులకు యూరప్ ప్రభుత్వాలు నిధులు ఇచ్చేవి. అలా ఇచ్చేది యాత్రికులను గౌరవించడానికి కాదు. వారు దేశ దేశాలు తిరిగి అక్కడి సంస్కృతులు, పంటలు, డబ్బు, బంగారం, వస్త్రాలు, మతాలు... వీటన్నింటి గురించి సమాచారం తెస్తే ఏ దేశాన్ని ఏ విధంగా కబళించవచ్చో ఆ ప్రభువులకు తెలిసేది. ఖండాలు, దేశాలు వాటిలోని ప్రజలు అనాదిగా జీవిస్తున్నా ఈ యూరోపియన్ యాత్రికులు వారిని 'డిస్కవరీ' చేశామని చరిత్రలు రాసుకున్నారు. కాని ఆ చరిత్రల్లో స్థానికులను ఏ విధంగా తుడిచి పెట్టారో ఉండదు. అలాగే ఇప్పుడు బ్రిటన్, యూరప్, ఆస్ట్రేలియా, జపాన్‌ల నుంచి ప్రపంచం తిరిగే పర్యాటకులకు వారి దేశాల్లోని పాఠ్య పుస్తకాల్లో తమ దేశాలు ఏయే దేశాలను ఎలా ఆక్రమించాయి, ఎలా దోచుకున్నాయో తెలియజేయరు. యాత్రల వెనుక చాలా చరిత్ర ఉంటుంది. అది తెలుసుకోవడం అవసరం' అంటుంది షహనాజ్.

ఎన్నో అందాలు..

'టూరిజమ్‌ను ఒక వ్యసనంగా మార్చారు. దీని వెనుక చాలా వ్యాపార ఎత్తుగడ ఉంది. కొత్త ప్రాంతాలు చూడకపోతే వెనుకబడతారనే భావజాలం సృష్టించారు. మా నాన్న ఎక్కడికీ తిరగడానికి ఇష్టపడే వాడు కాదు. మా అమ్మకు కొత్త ప్రాంతాలు చూడటం ఇష్టం. ఇద్దరూ కరెక్టే. ఈ టూరిజమ్‌లో కూడా తెల్లవారి దేశాలకే గిరాకీ ఎక్కువ. కాని ఆఫ్రికాలో ఎన్నో అందమైన దేశాలు ఉన్నాయి. ఇథియోపియాలోని అండర్ గ్రౌండ్ చర్చ్‌లను చూస్తే మతి పోతుంది. కాని వాళ్లకు ప్రమోట్ చేసుకోవడానికి డబ్బు లేదు. ప్రతి దేశంలో సాంస్కృతిక చిహ్నాలుంటాయి. వాటి ఘన చరిత్ర ఉంటుంది. అయితే దానిని వర్తమానంలో ప్రతీకారాలకు ఉపయోగించకూడదు' అంటుందామె.

పనీర్‌తో

ఎన్ని రకాలు వండవచ్చో తెలుసా! అలాగే ఒక కేజీ పనీర్ తయారు కావాలంటే ఎన్ని పాలు కావాలో తెలుసా? పాలను విరగ్గొట్టి నీరు మొత్తం కారిపోయే వరకు బరువు పెట్టి ఎదురు చూసే సమయం ఎవరికీ ఉండడం లేదు. పైగా మనం ఇంట్లో తయారు చేసే పనీర్ మెషీన్‌లో చేసినట్లు క్యూబ్స్‌గా రావడం కష్టం. రెస్టారెంట్‌లో తిన్న పనీర్‌లాగ ముక్కలుగా ఉంటే తప్ప పిల్లలు ఇష్టపడరు. ఇంకేం చేస్తాం... రెడీమేడ్‌గా మార్కెట్‌లో దొరికే పనీర్ తెచ్చుకుని సింపుల్‌గా వండేస్తాం.



పనీర్ స్వచ్ఛమైనదేనా?

ఏం కొంటున్నామో! ఏం తింటున్నామో!!

పనీర్ ఆరోగ్యానికి మేలు చేస్తుందని తెలిసిన తర్వాత ఇటీవల పనీర్ వాడకం పెరిగింది. అయితే వాడకం పెరిగినంత వేగంగా పనీర్ తయారీ పెరుగుతోందా? పనీర్ లభ్యత పెరుగుతోంది కానీ సహజమైన పనీర్ తయారీ జరగడం లేదు. మార్కెట్‌లో దొరికే పనీర్‌లో అసలు కంటే నకిలీ ఎక్కువ. ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎఫ్ఎస్ఎస్ఏఐ) ఇటీవల ఢిల్లీ– ముంబయి ఎక్స్‌ప్రెస్ హైవే మీద ఉన్న ఫుడ్ స్టాల్స్‌ను తనిఖీ చేసినప్పుడు 13వందల కిలోల నకిలీ పనీర్ దొరికింది. దొరికింది గోరంతే, నిజానికి నకిలీ పనీర్ వ్యాపారం కొండంత జరుగుతోంది. మనం ఇంట్లో వండుకోవడానికి కొనుక్కున్న పనీర్ అసలుదా కల్తీదా అని తెలుసుకోవడానికి ఇంట్లోనే పరీక్షించుకోవడానికి మూడు పద్ధతులను తెలియచేసింది ఎఫ్ఎస్ఎస్ఏఐ.

● పనీర్ కొద్దిగా ఒక పాత్రలోకి తీసుకుని నీరు పోసి వేడి చేసి అందులో నాలుగైదు చుక్కల అయోడిన్ వేయాలి. పనీర్ నీలం రంగులోకి మారితే అది కల్తీ అని అర్థం. అసలైన పనీర్ అయితే రంగు మారదు.

● పనీర్‌ని నీటిలో ఉడికించిన తర్వాత చల్లటి నీటిలో వేయాలి. అదే నీటిలో కందిపప్పు పది గింజలు వేయాలి. పది నిమిషాల సేపు కదిలించకుండా ఉంచాలి. నీరు లేత ఎరుపు రంగులోకి మారితే ఆ పనీర్ కల్తీ అని అర్థం. రంగు మారకపోతే నిర్భయంగా ఆ పనీర్‌ను వాడుకోవచ్చు.

● ఇంత ప్రక్రియ లేకుండా వాసన ద్వారా కూడా పనీర్ స్వచ్ఛతను గుర్తించవచ్చు. కంపెనీ ప్యాకింగ్, ఎఫ్ఎస్ఎస్ఏఐ ముద్ర లేకుండా లూజ్‌గా అమ్ముతుంటారు. ఆ పనీర్‌ను కొద్దిగా చేతిలోకి తీసుకుని వాసన చూడాలి. పాల వాసన వస్తే అది మంచి పనీర్. అప్పుడు రుచి చూడవచ్చు. మెత్తగా పాల రుచిని గుర్తు చేస్తుంటే కొనుక్కోవచ్చు. అలా కాక నమిలినప్పుడు రబ్బర్‌లాగ సాగుతుంటే దానిని ఎట్టి పరిస్థితుల్లోనూ కొనవద్దు. అలాగే పాలతో చేసిన పనీర్ అయినా సరే పుల్లటి వాసన వస్తుంటే అది సహజమైనదే అయినా తాజాగా లేదని అర్థం. దానిని కూడా కొనకూడదు.

● నిర్ధారిత అధీకృత ముద్ర, కంపెనీ ప్యాకింగ్ ఉన్న పనీర్ కొనేటప్పుడు కూడా దాని కాల పరిమితిని సరి చూసుకోవాలి. ఎక్స్‌పైరీ డేట్ చూడకుండా ఎట్టి పరిస్థితుల్లోనూ కొనకూడదు.


పాల ఉత్పత్తిని మించిన పాల ఉత్పత్తులు మార్కెట్‌లో రాజ్యమేలుతున్నాయి. పాల వ్యాపారులు ఒకప్పుడు పాలను కల్తీ చేసేవాళ్లు. ఇప్పుడు నకిలీ పాలను తయారు చేస్తున్నారు. మనం ఏం తింటున్నామో? ఎక్కడ తింటున్నామో? ఎల్లవేళలా జాగ్రత్తగా ఉండాలి. మన గురించి మనమే నిశితంగా పరిశీంచుకోవాలి, పరీక్షించుకోవాలి.

కిచెన్ టిప్

● బంగాళాదుంపతో చేసే ఫ్రెంచ్ ఫ్రై స్ ఎక్కువ సమయం కరకరలాడుతూ ఉండాలంటే రెండు దఫాలుగా వేయించాలి. మొదటి దఫా ఒక మోస్తరుగా (తెల్లగా ఉండగానే) వేయించి తీసి ఒక పాత్రలో వేసి



చల్లారిన తర్వాత మూత పెట్టి ఫ్రీజర్‌లో పెట్టాలి. నాలుగు గంటల తర్వాత ఫ్రీజర్ నుంచి తీసి మరోసారి (ఎర్రగా వచ్చేవరకు) వేయించాలి.



సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 22 వెల: ₹ 5.50

సంపుటి: 17
సంచిక: 42

శనివారం 4-5-2024

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



గరిష్టం నుంచి నిఫ్టీ వెనక్కి..

అధిక వెయిటేజీ షేర్లలో అమ్మకాలు.
74 వేల స్థాయి దిగువకు సెన్సెక్స్ - 19లో



బీఆర్ఎస్ అభ్యర్థిగా రాకేశ్‌రెడ్డి

'వరంగల్–ఖమ్మం– నల్లగొండ' గ్రాడ్యుయేట్ల స్థానం నుంచి బరిలోకి.. - 2లో



రాహుల్‌గాంధీ నామినేషన్

ఉత్తరప్రదేశ్‌లోని రాయ్‌బరేలీ లోక్‌సభ స్థానం నుంచి పోటీకి కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ నామినేషన్ దాఖలు చేశారు.

- వివరాలు 6లో



డరో మత్.. భాగో మత్

డరో మత్.. భాగో మత్ అంటూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీపై వ్యంగ్యాస్త్రాలు సంధించారు.

- వివరాలు 6లో



మోదీయే పారిపోయారు

ప్రధాని మోదీ వేరే చోట్ల గెలుపుపై నమ్మకం లేకనే యూపీలోని వారణాసిలో పోటీ చేస్తున్నారని మల్లికార్జున ఖర్గే అన్నారు.

- వివరాలు 6లో



హంతకుడని ఎలా ముద్ర వేస్తారు?

వివేకా హత్య కేసులో నిందితుడిగా ఉన్న వ్యక్తిని హంతకుడని ఎలా చెబుతారని షర్మిల, సునీత, బీటెక్ రవిని ఏపీ హైకోర్టు నిలదీసింది.

- వివరాలు 16లో

కాంగ్రెస్.. దద్దమ్మ ప్రభుత్వం

అసెంబ్లీ ఎన్నికలప్పుడు తప్పుడు హామీలతో వెన్నుపోటు



- మళ్లీ ఇప్పుడు లోక్‌సభ ఎన్నికలకు అసంబద్ధ హామీలా?
- కేంద్ర పథకాలపై దమ్ముంటే సీఎం రేవంత్‌రెడ్డి చర్చకు రావాలి
- కేంద్రం చేస్తున్నవి కూడా కాంగ్రెస్ చేస్తున్నట్టు చూపి లబ్ధి పొందే కుట్ర
- సిగ్గులేకుండా ట్రిపుల్ ఆర్‌ను తన ఖాతాలో వేసుకున్నారు
- కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి

13 లో

ఎమ్మెల్సీ దండె విఠల్ ఎన్నిక చెల్లదు

- స్వతంత్ర అభ్యర్థి రాజేశ్వర్‌రెడ్డి పిటిషన్‌పై హైకోర్టు తీర్పు
- పిటిషనర్‌కు రూ.50 వేలు చెల్లించాలని ఆదేశం

2 లో

మోదీది సవతి తల్లి ప్రేమ

పదేళ్లలో రాష్ట్రానికి గాడిద గుడ్డు తప్ప ఏమీ ఇవ్వలే..: సీఎం రేవంత్‌రెడ్డి

- మోదీ చెప్పే 5 ట్రిలియన్ ఎకానమీ ఆద్యుడు మన పీవీనే
- బీఆర్ఎస్ కాలనాగు.. దానిని పడగ మీద కొట్టాలి
- రాజారాంపల్లి, సిరిసిల్ల బహిరంగ సభల్లో ముఖ్యమంత్రి

సాక్షిప్రతినిధి, కరీంనగర్/సిరిసిల్ల: ప్రధాని మోదీ తెలంగాణపై సవతితల్లి ప్రేమ చూపిస్తున్నాడని, పదేళ్లలో ఆయన రాష్ట్రానికి చేసిందేమీ లేదని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. మోదీ తరచుగా చెప్పే ఐదు ట్రిలియన్ల ఎకానమీకి ఆద్యుడు ఒకప్పటి మంథని నుంచి ప్రాతినిధ్యం వహించిన మాజీ ప్రధాని పీవీ నరసింహారావు అని గుర్తుచేశారు. పదేళ్లు పాలించిన బీఆర్ఎస్ పార్టీ కాలనాగు అని దాన్ని ఈసారి ఎన్నికల్లో తలమీదే కొట్టాలని పిలుపునిచ్చారు. జనజాతర సభలో భాగంగా శుక్రవారం జగిత్యాల జిల్లా ధర్మపురి నియోజకవర్గంలోని రాజారాంపల్లి, సిరిసిల్లలో ఏర్పాటు చేసిన బహిరంగసభ, కార్నర్ మీటింగ్‌లో సీఎం రేవంత్ మాట్లాడారు. బీజేపీ, బీఆర్ఎస్‌లపై నిప్పులు చెరిగారు.

సీఎం రేవంత్ ఏమన్నారంటే....

నేను మధ్యాహ్నం రెండు గంటలకే రావాల్సి ఉన్నా.. రాయ్‌బరేలిలో రాహుల్‌గాంధీ నామినేషన్ కార్యక్రమానికి హాజరుకావడం, విమానంలో సాంకేతిక సమస్యల కారణంగా ఆలస్యమైంది. బీఆర్ఎస్ చచ్చిన పాము. తోక మీద కాదు.. పడగ మీద కొట్టండి. కాలనాగు పీడ విరగడవుతుంది. ఇక బీజేపీ నోరు తెరిస్తే.. అబద్ధాలే. ఎన్టీపీసీలో 4,000 మెగావాట్లకుగాను పదేళ్లలో 1,600 మెగావాట్ల ప్లాంట్ మాత్రమే నిర్మించారు. దేశంలో రాజ్యాంగం, రిజర్వేషన్లు ఉండాలంటే రాహుల్‌గాంధీ ప్రధాని కావాలి. గాంధీ కుటుంబానికి తోడుగా నిలబడాలి. మా ప్రభుత్వం జోలికొస్తే కార్యకర్తలు ఊరుకోరు'' అని ముగించారు. అనంతరం బయ్యారం ఉక్కు కర్మాగారం, కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, ఐటీఐఆర్, గిరిజన వర్సిటీ, ఐఐటీ, ఐఐఎం ఇలా ఏది



సిరిసిల్ల సభలో మాట్లాడుతున్న సీఎం రేవంత్

మిగతా 8వ పేజీలో ▶

హైదరాబాద్‌కు సుప్రీం బెంచ్ తెస్తాం

ఏపీలో విలీనమైన 5 గ్రామాలను రాష్ట్రంలో తిరిగి కలుపుతాం

- పాలమూరు ప్రాజెక్టు, మేడారానికి జాతీయ హోదా కల్పిస్తాం
- లోక్‌సభ ఎన్నికలకు తెలంగాణ కాంగ్రెస్ హామీలు.. 23 అంశాలతో ప్రత్యేక మేనిఫెస్టో విడుదల
- పాల్గొన్న పార్టీ ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ, మంత్రి శ్రీధర్‌బాబు తదితరులు

8 లో



మేనిఫెస్టో విడుదల చేస్తున్న దీపాదాస్ మున్షీ, శ్రీధర్‌బాబు, దానం నాగేందర్ తదితరులు

దోస్త్ నోటిఫికేషన్ విడుదల

వివిధ యూనివర్సిటీల్లో డిగ్రీ కోర్సుల్లో ప్రవేశాలకు జారీ

సాక్షి, హైదరాబాద్: డిగ్రీ కోర్సుల్లో ప్రవేశాలకు సంబంధించి డిగ్రీ ఆన్‌లైన్ సర్వీసెస్ తెలంగాణ (దోస్త్) నోటిఫికేషన్ విడుదలైంది. రాష్ట్రవ్యాప్తంగా ఆరు యూనివర్సిటీల (ఉస్మానియా, మహాత్మాగాంధీ, కాకతీయ, తెలంగాణ, పాలమూరు, శాతవాహన) తోపాటు మహిళా విశ్వవిద్యాలయం, జేఎన్‌టీయూ, సాంకేతిక విద్య, శిక్షణ బోర్డు పరిధిలోని కాలేజీల్లో బీఏ, బీఎస్సీ, బీకాం, బీసీఏ, బీబీఏ, బీబీఎం, బీఎస్‌డబ్ల్యూ, డీఫార్మసీ కోర్సుల్లో ఫస్టియర్ ప్రవేశాలను దోస్త్ ద్వారా నిర్వహించనున్నారు. ఈ మేరకు తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్, దోస్త్ కన్వీనర్ ఆర్.లింబాద్రి, విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం శుక్రవారం దోస్త్ నోటిఫికేషన్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారిద్దరూ మాట్లాడారు. అడ్మిషన్లకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. ఇంటర్‌లో విద్యార్థుల మెరిట్ ఆధారంగా ఆయా కాలేజీల్లో డిగ్రీ ఫస్టియర్‌లో ప్రవేశాలు కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఉన్నత విద్యామండలి వైస్ చైర్మన్ వి.వెంకటరమణ, ఎస్కే మహమూద్ అలీ,



నోటిఫికేషన్ విడుదల చేస్తున్న దోస్త్ కన్వీనర్ లింబాద్రి, విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం

మిగతా 7వ పేజీలో ▶

అమిత్ షా డీప్‌ఫేక్ వీడియో.. తెలంగాణ నుంచే వైరల్

- మొదట పోస్ట్ చేసింది తెలంగాణ నుంచే అంటూ నివేదిక ఇచ్చిన 'ఎక్స్'
- ఒక ల్యాండ్ లైన్ ఐపీ అడ్రస్ నుంచి పోస్ట్ అయినట్టు గుర్తింపు
- ఫేస్‌బుక్‌లో పోస్ట్ చేసిన, వైరల్ చేసిన వారిపైనా ఢిల్లీ స్పెషల్ సెల్ ఆరా
- తెలంగాణలో మరికొన్ని అరెస్టులు జరిగే అవకాశం!

సాక్షి, న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా హాట్ టాపిక్‌గా మారిన కేంద్ర హోంమంత్రి అమిత్‌షా డీప్‌ఫేక్ వీడియో ఎక్కడ నుంచి వచ్చిందనే సందేహానికి తెరపడింది. ఆ ఫేక్ వీడియోను మొదట పోస్ట్ చేసినది తెలంగాణ నుంచేనంటూ ప్రముఖ సోషల్ మీడియా సంస్థ 'ఎక్స్' (ట్విట్టర్) ఢిల్లీ స్పెషల్ సెల్ పోలీసులకు నివేదిక ఇచ్చింది. ఆ నివేదిక ఆధారంగా ఢిల్లీ పోలీసులు చర్యలు

మిగతా 17వ పేజీలో ▶

క్లుప్తంగా...

జిల్లాలను కుదిస్తే రాష్ట్రం అగ్నిగుండమే

నాగర్‌కర్నూల్ బీఆర్‌ఎస్ అభ్యర్థి ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్



సాక్షి, నాగర్‌కర్నూల్: జిల్లాలకు కుదించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రయత్నం చేస్తోందని నాగర్‌కర్నూల్ బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ ఆరోపించారు. జిల్లాలను తగ్గిస్తే రాష్ట్రం అగ్నిగుండంగా మారుతుందని ఆయన హెచ్చరించారు. జిల్లాకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఆర్‌ఎస్ ప్రవీణ్ శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ...కాంగ్రెస్ పాలనలో రైతులకు తీవ్ర అన్యాయం జరుగుతోందన్నారు. ఎన్నికల హామీలు అమలుపర్చడంలో పూర్తిగా విఫలమైందని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన ఐదు నెలలకే రాష్ట్రం నివురుగప్పిన నిప్పులా రగులుతోందని చెప్పారు. కర్ణాటకలో 2,946 మంది మహిళలను అత్యాచారానికి పాల్పడ్డ ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణకు మద్దతుగా ప్రధాని మోదీ ప్రచారం నిర్వహించారని, బేటీ పడావో.. భారతమాతను గౌరవించే విధానం ఇదేనా? అని ప్రశ్నించారు.

బీజేపీతో రేవంత్‌రెడ్డి రహస్య ఒప్పందం

బీఆర్‌ఎస్ నేత గట్టు రామచంద్రరావు

సాక్షి, హైదరాబాద్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి బీజేపీతో రహస్య ఒప్పందం ఉందని, అందుకే బీజేపీని తిడుతూనే రహస్య ఒప్పందాన్ని కొనసాగిస్తున్నారని బీఆర్‌ఎస్ నేత గట్టు రామచంద్రరావు ఆరోపించారు. శుక్రవారం తెలంగాణ భవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ కేసీఆర్ ప్రజల్లోకి వెళ్తే కాంగ్రెస్, బీజేపీలకు వణుకుపుడుతోందన్నారు. ఎన్నికల ప్రచారంలో రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై 8 సార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోని ఈసీ.. మాజీ సీఎం కేసీఆర్ ప్రచారాన్ని 48 గంటల పాటు ఆపేసిందని ఆగ్రహం వ్యక్తంచేశారు. కాంగ్రెస్ పార్టీలో ఒరిజినల్ కాంగ్రెస్, రేవంత్ కాంగ్రెస్, తుమ్మల కాంగ్రెస్, పొంగులేటి కాంగ్రెస్ అని నాలుగు గ్రూపులున్నాయని ఎద్దేవా చేశారు. రేవంత్‌రెడ్డిని సీఎంగా ఎప్పటి వరకు ఉంచుతారో తెలియ దన్నారు. పింఛన్లు రాక వృద్ధులు ఇబ్బందులు పడుతున్నారని, పద్మశ్రీ కిన్నెర మొగులయ్య పింఛన్‌ను ప్రభుత్వం ఆపేసిందని ఆవేదన వ్యక్తంచేశారు. ఆర్‌ఆర్ ట్యాక్స్‌పై మోదీ విచారణ చేయించడంలేదని మండిపడ్డారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి మూడో స్థానం ఖాయమని రాంచందర్‌రావు జోస్యం చెప్పారు.

జూన్ 1 నుంచి తిరుమలలో హనుమత్ జయంతి ఉత్సవాలు

డయల్ యువర్ ఈవోలో ధర్మారెడ్డి

తిరుమల: తిరుమలలోని ఆకాశగంగ వద్ద బాలాంజనేయస్వామివారి ఆలయంలో జూన్ 1- 5 వరకు హనుమత్ జయంతి ఉత్స వాలు ఘనంగా నిర్వహిస్తామని టీటీడీ ఈవో ఏవీ ధర్మారెడ్డి తెలిపారు. ఇందులో భాగంగా హనుమంతుని జన్మ విశేషాలు, ఇతర అంశాలను ఆధ్యాత్మికపరంగానే కాకుండా వైజ్ఞానిక కోణంలో కూడా ప్రముఖ పండితులతో ప్రసంగాలు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. తిరుపతి టీటీడీ పరిపాలన భవనంలో శుక్రవారం జరిగిన డయల్ యువర్ ఈవో కార్యక్రమంలో భక్తులు ఫోన్ ద్వారా అడిగిన ప్రశ్నలకు ఈవో సమాధానాలిచ్చారు. తిరుమల ధర్మగిరి వేద విజ్ఞాన పీఠంలో జూన్ 2న సూర్యోదయంతో సంపూర్ణ సుందరకాండ అఖండ పారాయణం ప్రారంభమవుతుందని తెలిపారు. టీటీడీ ఆధ్వర్యంలోనిఆస్పత్రుల్లో ఒక సంవత్సరంలో 14 గుండె మార్పిడి శస్త్రచికిత్సలు నిర్వహించి రికార్డు సృష్టించామని, ఇప్పటివరకు 2,500కు పైగా గుండె శస్త్ర చికిత్సలు నిర్వహించామని వివరించారు. ఇంటర్, పదో తరగతి పరీక్ష ఫలితాల్లో టీటీడీ కళాశాలలు, ఉన్నత పాఠశాలలు 98% ఫలితాలు సాధించినట్లు చెప్పారు. మే 17-19 వరకు తిరుమలలో శ్రీ పద్మావతీ పరిణయోత్సవాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఏప్రిల్‌లో శ్రీవారిని 20.17 లక్షల మంది దర్శించుకోగా, హుండీ ఆదాయం రూ. 101.63 కోట్లు లభించినట్లు తెలిపారు.

ఇదండీ సంగతి!



ఇచ్చిన హామీలు అమలుకు మీ ముగ్గులో ఎవరు బాధ్యత తీసుకుంటారని అడిగానంతే!



శుక్రవారం రాత్రి పెద్దపల్లి జిల్లా రామగుండంలో జరిగిన రోడ్ షోలో ప్రజలకు అభివాదం చేస్తున్న మాజీ సీఎం కేసీఆర్

ప్రశ్నిస్తే.. గొంతు నొక్కారు!

బీజేపీ, కాంగ్రెస్ కుమ్మక్కై నా ప్రచారంపై నిషేధం పెట్టాయి

- పెద్దపల్లి జిల్లా రామగుండం రోడ్ షోలో కేసీఆర్ ఫైర్
- చేనేత కార్మికుల కోసం మాట్లాడటం తప్పా?
- నా బస్సుయాత్రతో బీజేపీ, కాంగ్రెస్‌లలో వణుకు పుట్టింది
- అందుకే నన్ను ఆపేందుకు ప్రయత్నాలు చేస్తున్నాయి
- ఎలా ఉండే రాష్ట్రం ఐదు నెలల్లో ఎలా అయిపోయింది?
- కేంద్రంలో వచ్చేది సంకీర్ణమే.. బీఆర్‌ఎస్ గెలిస్తే హక్కులను కాపాడుకోవచ్చని వ్యాఖ్య

సాక్షి, పెద్దపల్లి: చేనేత కార్మికులకు అన్యాయం చేస్తున్నారని తాను మాట్లాడితే, ప్రభుత్వ తీరును ప్రశ్నిస్తే.. తన గొంతు నొక్కేశారని బీఆర్‌ఎస్ అధినేత, మాజీ సీఎం కె.చంద్రశేఖర్‌రావు పేర్కొన్నారు. బీజేపీ, కాంగ్రెస్ వాళ్లు కుమ్మక్కై తన ప్రచారంపై నిషేధం పెట్టించారని ఆరోపించారు. అదే ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, సీఎం రేవంత్ ఎన్నికల నిబంధనలను ఉల్లంఘించి మాట్లాడుతున్నా ఎలాంటి చర్యలూ తీసుకోవడం లేదేమని నిలదీశారు. బీజేపీ, కాంగ్రెస్‌లలో ఎవరికి ఓటేసినా.. సింగరేణిని ముంచేసి, కార్మికుల నోట్లో మట్టికొడతాయని వ్యాఖ్యానించారు. లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా కేసీఆర్ చేపట్టిన బస్సుయాత్ర.. ఈసీ పెట్టిన 48 గంటల నిషేధం అనంతరం శుక్రవారం రాత్రి రామగుండం పట్టణంలో తిరిగి మొదలైంది. ఈ సందర్భంగా నిర్వహించిన రోడ్ షోలో కేసీఆర్ ప్రసంగించారు. వివరాలు ఆయన మాటల్లోనే..

''నిషేధించిన నా గొంతు 48 గంటల తర్వాత మాట్లాడుతోంది. నేను ఏం చేశానని నా గొంతును నొక్కేశారు. చేనేత కార్మికులకు ఆర్డర్స్ ఇవ్వడం లేదని, గత ప్రభుత్వం ఇచ్చిన ఆర్డర్ల బిల్లులు రూ.375 కోట్లు విడుదల చేయడం లేదని, ఆత్మహత్యలు చేసుకుంటున్నారని మా పార్టీ నేతలు ప్రశ్నిస్తే.. ఓ కాంగ్రెస్ నాయకుడు.. 'ఇన్ని రోజులు దొబ్బితిన్నది చాలలేదా? పాయి నిరోధ్‌లు, పాపడాలు అమ్ముకోండి' అన్నడు. మీకు చేనేత కార్మికులు అంత చులకనగా కనపడుతున్నారా? అధికారంలో ఉన్న మీరు ఇలా మాట్లాడొచ్చా.. అని కోపంలో ఒక్కమాట మాట్లాడిన.

వాళ్ల మాటలు ఈసీకి కనిపించవు

కేసీఆర్ బస్సుయాత్ర చేపడితే కాంగ్రెస్, బీజేపీలకు గుండెలు వణుకుతున్నాయి. వాళ్లు కుమ్మక్కై నన్ను ఆగబట్టేందుకు నాపై నిషేధం పెట్టారు. రాజకీయాల్లో మతం గురించి మాట్లాడటం చాలా పెద్ద తప్పు. ఎన్నికల నిబంధనలకు విరుద్ధం. కేంద్ర మంత్రి అమిత్ షా రోజూ దేవుడి బొమ్మను చేతిలో, నెత్తిన పెట్టుకుని మాట్లాడితే ఎన్నికల సంఘానికి కనిపించదు. డైరెక్టుగానే హిందువులు, ముస్లింలని దేశ ప్రధాని మోదీ మాట్లాడినా కనిపించదు. రాష్ట్ర సీఎంని ప్రజలకు ఇచ్చిన వాగ్దానాల అమలు ఏదని మేం అడిగితే.. గుడ్లు పీకి గోళీలు ఆడుతం, పేగులు తీసి మెడలో వేసుకుంటం, పండబెట్టి తొక్కుతం అంటే సభ్యతగా ఉందా? కానీ చేనేత కార్మికులకు అన్యాయం చేస్తున్నారని నేను మాట్లాడితే.. నా గొంతు నొక్కేశారు. ప్రజలు ఈ విషయాన్ని గుర్తించారు.

పంటలు ఎందుకు ఎండాయి?

ఐదు నెలల కింద రాష్ట్రం ఎట్లా ఉండే.. ఇప్పుడు ఎట్లా ఉంది? ఎవరి చేతకానితనం దీనికి కారణం? ఒక్క పెద్దపల్లి జిల్లాలోనే 50వేల ఎకరాలకుపైగా పంటలు ఎండిపోయాయి. గత పదేళ్లలో ఎప్పుడైనా పంటలు ఎండాయా? గత తొమ్మిదేళ్ల కడుపు నిండా కరెంటు ఉండేది. ఇప్పుడు కరెంట్ కోతలు మొదలయ్యాయి. ఈ కోతలు ఎవరు పెట్టారో ప్రజలు ఆలోచించాలి. గతంలో గోదావరిలో పైసలు వేయాలంటే నీళ్ల వెతికేలా ఉండేది. అలాంటి గోదావరిని సజీవంగా చేశా. ప్రతి ఇంటికి నల్లా కనెక్షన్ ఇచ్చినం. ఇప్పుడు ఎందుకు రోజు తప్పి రోజు నీళ్లు వస్తున్నాయో ప్రజలు ఆలోచించాలి.

హామీల అమలు ఏది?

కాంగ్రెస్ హామీలు అమలు చేయకుండా తప్పించుకుంటోంది. రైతు రుణమాఫీ అయిందా? రైతు కూలీలకు రూ.15 వేలు ఎక్కడ? కల్యాణలక్ష్మి కింద తులం బంగారం ఎక్కడ? మహిళలకు నెలకు రూ.2,500 వస్తున్నాయా? మహిళలకు ఫ్రీ బస్ పెట్టారు. సంతోషమే. మరి ఆటో కార్మికులు నష్టపోయి ఆత్మహత్యలు చేసుకుంటుంటే.. ఆదుకోరా? ఆటోకార్మికులకు న్యాయం జరగాల్సిందే. వారి తరఫున బీఆర్‌ఎస్ పోరాడుతుంది. సీఎం ఏ ఊరికి పోతే ఆ ఊరి దేవుడి మీద ఒట్టేస్తున్నారు. పనిచేసేటోడు ఎవడైనా ఒట్టు పెట్టుకుంటడా?

పెద్ద ప్రమాదం రాబోతున్నా.. సీఎం మాట్లాడట్లేదు..

ఇప్పుడున్న సీఎం కృష్ణా నదిని తీసుకెళ్లి కేఆర్‌ఎంబీకి అప్పజెప్పిండు. గోదావరి నీళ్లు ఎత్తుకుపోతా, తమిళనాడు, కర్ణాటకలకు ఇస్తానని ప్రధాని మోదీ అంటుంటే.. చప్పుడు చేయడం లేదు. నేను సీఎంగా ఉన్నప్పుడు ఇదే ప్రతిపాదన తెస్తే.. నా ప్రాణం ఉన్నంత వరకు నీళ్లు తీసుకుపోనివ్వనని చెప్పిన. మరి ఈ ముఖ్యమంత్రి మౌనం వెనుక మతలబేంటో ప్రజలు ఆలోచించాలి.

సింగరేణిని ముంచిందే కాంగ్రెస్

సింగరేణి కార్మికులు ఆలోచించాలి. మంచిగా ఉన్న సింగరేణిని ఒకప్పుడు నిండా ముంచిందే కాంగ్రెస్ పార్టీ. వాస్తవానికి సింగరేణి 100శాతం మన దగ్గరే ఉండే. కేంద్రం దగ్గర అప్పులు తెచ్చి, అది తీర్చలేక 49శాతం వాటాను అప్పజెప్పింది ఈ కాంగ్రెస్ పార్టీయే. మేం సింగరేణికి లాభాలు తేవడానికి, కార్మికుల కోసం ఎన్నో మంచి పనులు చేశాం. సీపీఐ, సీపీఎం నాయకులను ఒక్కటే ప్రశ్న అడుగుతున్నా.. ధైర్యముంటే సమాధానం చెప్పాలి, సీఎంతో సమాధానం చెప్పించాలి. నాడు నష్టాల్లో ఉన్న సింగరేణిని లాభాల్లోకి తెచ్చింది మేం కాదా? తెలంగాణ ప్రభుత్వం వచ్చాక 19వేల మంది కార్మికుల పిల్లలకు ఉద్యోగాలు ఇచ్చాం. మెడికల్ కాలేజీ పెట్టి కార్మికుల పిల్లలకు 5శాతం రిజర్వేషన్ కల్పించాం. సింగరేణిని లాభాల్లోకి తెచ్చేందుకు డైరెక్టర్లను ఆస్ట్రేలియా, ఇండోనేషియాలకు పంపి.. అక్కడ బొగ్గు గనులు తీసుకుని వెలికితీయాలనే ప్రయత్నం చేశాం. కానీ కేంద్ర ప్రభుత్వం సింగరేణిని అదానీకి అప్పజెప్పి మన కార్మికుల నోట్లో మట్టి కొట్టాలని చూస్తోంది. బీజేపీ, కాంగ్రెస్‌లలో ఎవరిని గెలిపించినా సింగరేణి ప్రాంతాలు బొగ్గు అయ్యే పరిస్థితి.

కేంద్రంలో వచ్చేది సంకీర్ణమే..

దేశం అప్పుల పాలైంది. రూపాయి విలువ పడిపోయింది. మోదీ కంటే ముందున్న 14 మంది ప్రధానుల కాలంలో ఎన్నడూ ఇంత తక్కువకు పడిపోలేదు. పబ్లిక్ సెక్టార్ నాశనమైంది. అన్నీ ప్రైవేటీకరణ చేస్తున్నారు. కార్మికులు రోడ్డున పడుతున్నారు. కేంద్రంలో బీజేపీకి 200 సీట్లు కూడా వచ్చేలా లేవు. వచ్చేది సంకీర్ణ ప్రభుత్వమే. తెలంగాణలో 14 మంది బీఆర్‌ఎస్ ఎంపీలను గెలిపిస్తే.. మన హక్కులను, మన సింగరేణిని కాపాడుకోవచ్చు. అరచేతిలో వైకుంఠం చూపి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌కు కర్రుకాల్చి వాత పెట్టాలి..'' అని కేసీఆర్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్, జడ్పీ చైర్మన్ పుట్ట మధు, మాజీ ఎమ్మెల్యేలు కోరుకంటి చందర్, దాసరి మనోహర్‌రెడ్డి, బాల్క సుమన్, ఎమ్మెల్సీ భానుప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మీరు లేని లోటు కనిపిస్తోంది



సారూ మీరు సీఎంగా ఉన్నప్పుడు మంచిగుండె. ఇప్పుడు మీరు లేని లోటు కనిపిస్తోంది. పచ్చగా ఉండే పల్లెలు మళ్లీ ఎండిపోతున్నాయి. మాకు దిక్కు, దిశ మీరే.. మీరు మళ్లీ వస్తేనే మా బతుకులు మారుతాయి.

– రేణుక, గృహిణి

మళ్లీ కరువు వచ్చింది



మీ పాలనలో పచ్చని పొలాలు చూసినం. ఇప్పుడు ఎండిపోయిన పంటలు కనిపిస్తున్నాయి. మీ పాలన లేని లోటు కనిపిస్తోంది. రైతుబంధు రాలేదు. నీళ్ల కరువు వచ్చింది. మీరు రావాలె. మునుపటిలా కావాలె..

– బొల్లెడ సదువలి, భూపాలజిల్లా

మాకు అండగా నిలవాలి



కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణలో నేడు కరువు ప్రారంభమైంది. మీ పాలనలో కల్యాణలక్ష్మి, దళిత బంధు పథకాలు వచ్చినయి. ఇప్పుడు వాటిని నిలిపివేశారు. మీ పాలనలో అందరికీ న్యాయం జరిగింది. ఇప్పుడు కష్టాలు మొదలయ్యాయి. మాకు అండగా ఉండాలి.

– కృష్ణప్రసాద్, యువకుడు

పట్టభద్రుల ఎమ్మెల్సీ బీఆర్‌ఎస్ అభ్యర్థిగా ఏనుగుల రాకేశ్‌రెడ్డి

'వరంగల్-ఖమ్మం- నల్లగొండ' గ్రాడ్యుయేట్ల స్థానం నుంచి బరిలోకి

పల్లా రాజేశ్వర్‌రెడ్డి రాజీనామాతో జరుగుతున్న ఉప ఎన్నిక

సాక్షి, హైదరాబాద్: శాసనమండలి 'వరంగల్- ఖమ్మం-నల్లగొండ' పట్టభద్రుల నియోజకవర్గం ఉప ఎన్నికకు బీఆర్‌ఎస్ అభ్యర్థిగా ఏనుగుల రాకేశ్‌రెడ్డి పేరును పార్టీ అధినేత కె.చంద్రశేఖర్‌రావు శుక్రవారం ఖరారు చేశారు. సుమారు అరడజను మంది బీఆర్‌ఎస్ అభ్యర్థిత్వాన్ని ఆశించినా రాకేశ్‌రెడ్డికి అవకాశం దక్కింది. హనుమకొండ జిల్లా హసన్‌పర్తి మండలం వంగపహాడ్‌కు చెందిన రాకేశ్‌రెడ్డి.. బెంగళూరు, అమెరికాలలో వివిధ కార్పొరేట్ సంస్థల్లో పనిచేశారు. 2013లో బీజేపీ ద్వారా ప్రత్యక్ష రాజకీయాల్లో అడుగుపెట్టారు. బీజేవైఎం రాష్ట్ర కార్యదర్శిగా, బీజేపీ అధికార ప్రతినిధిగా పనిచేశారు. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో వరంగల్ పశ్చిమ నియోజకవర్గం నుంచి టికెట్ ఆశించారు. కానీ కుదరకపోవడంతో బీఆర్‌ఎస్‌లో చేరారు. తాజాగా పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికలో బీఆర్‌ఎస్ అభ్యర్థిగా అవకాశం దక్కింది.

పల్లా రాజీనామాతో ఉప ఎన్నిక

శాసన మండలి 'వరంగల్-ఖమ్మం-నల్లగొండ' పట్టభద్రుల స్థానానికి 2021 మార్చిలో జరిగిన ఎన్నికల్లో బీఆర్‌ఎస్ తరఫున పోటీ చేసిన పల్లా రాజేశ్వర్‌రెడ్డి గెలిచారు. అయితే గత ఏడాది జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో పల్లా రాజేశ్వర్‌రెడ్డి బీఆర్‌ఎస్ నుంచి జనగామ ఎమ్మెల్యేగా విజయం సాధించారు. దీంతో ఎమ్మెల్సీ పదవికి ఆయన రాజీనామా చేయడంతో ఉప ఎన్నిక వచ్చింది. దీనికి ఈ నెల 9వ వరకు నామినేషన్లు స్వీకరించనున్నారు. బీఆర్‌ఎస్ నేతలు ఓ.నర్సింహారెడ్డి, డాక్టర్ కేతిరెడ్డి వాసుదేవరెడ్డి, పల్లె రవికుమార్, సుందర్ రాజు తదితరులు ఎమ్మెల్సీ టికెట్ ఆశించినా.. రాకేశ్‌రెడ్డికి దక్కింది. ఉమ్మడి వరంగల్, ఖమ్మం, నల్గొండ జిల్లాల పరిధిలో 4.61 లక్షల మంది పట్టభద్రులు ఈ ఎన్నికలో ఓటేయనున్నారు.

ఎమ్మెల్సీ దండె విఠల్ ఎన్నిక చెల్లదు

- స్వతంత్ర అభ్యర్థి రాజేశ్వర్‌రెడ్డి పిటిషన్‌పై హైకోర్టు తీర్పు
- పిటిషనర్‌కు రూ.50 వేలు చెల్లించాలని ఆదేశం
- ఆదిలాబాద్ స్థానిక సంస్థల స్థానానికి మళ్లీ ఎన్నిక నిర్వహించాలని ఈసీకి సూచన
- సుప్రీంకోర్టులో సవాల్ చేస్తానన్న దండె విఠల్

సాక్షి, హైదరాబాద్: ఆదిలాబాద్ స్థానిక సంస్థల కోటాలో బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ దండె విఠల్ ఎన్నిక చెల్లదంటూ హైకోర్టు శుక్రవారం సంచలన తీర్పు ఇచ్చింది. అలాగే రూ.50 వేలు పిటిషన్‌కు చెల్లించాలని ఆదేశించింది. ఈ స్థానానికి మళ్లీ ఎన్నిక నిర్వహించాలని ఎన్నికల కమిషన్‌కు స్పష్టం చేసింది. 2021లో ఆదిలాబాద్ స్థానిక సంస్థల కోటా స్థానానికి బీఆర్‌ఎస్ అభ్యర్థిగా విఠల్ నామినేషన్ వేశారు. దీంతో అదేపార్టీ నుంచి టికెట్ ఆశించి భంగపడ్డ పత్తిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ వేశారు. కాగా, తనను పోటీ నుంచి తప్పించడానికి విఠల్ తన సంతకాన్ని ఫోర్జరీ చేశార న్నది రాజేశ్వర్‌రెడ్డి ఆరోపణ. రాజేశ్వర్‌రెడ్డి తన నామినేషన్‌ను ఉపసంహరించుకున్నట్టు రిటర్నింగ్ అధికారికి దరఖాస్తు రావడంతో ఆయన నామినేషన్ ఉపసంహరణకు గురైంది. ఈ విషయాన్ని ఆలస్యంగా తెలుసుకున్న రాజేశ్వర్‌రెడ్డి 2022లో హైకోర్టును ఆశ్రయించారు. తాను నామినేషన్‌ను ఉపసంహరించుకోలేదని, తన సంతకాన్ని ఫోర్జరీ చేశారని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో విఠల్ ఎన్నికను రద్దు చేయాలని కోరారు. ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టిన న్యాయమూర్తి జస్టిస్ కె.లక్ష్మణ్ ధర్మాసనం శుక్రవారం తీర్పు వెలువరించింది. నామినేషన్ ఉపసంహరణ దరఖాస్తుపై ఉన్న సంతకాన్ని నిర్ధారించడానికి కేంద్ర ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబొరేటరీకి పంపిన న్యాయస్థానం.. ల్యాబ్ నివేదిక ప్రకారం ఆ సంతకం రాజేశ్వర్‌రెడ్డిది కాదని పేర్కొంది. వివరాలు పరిశీలించిన న్యాయమూర్తి.. విఠల్ ఎన్నిక చెల్లదని ఉత్తర్వులు జారీ చేశారు. అయితే అప్పీల్ దాఖలు చేసుకోవడానికి వీలుగా ఉత్తర్వుల అమలును సస్పెన్షన్‌లో ఉంచాలని విఠల్ న్యాయవాది కోరగా, న్యాయమూర్తి నాలుగు వారాల వరకు అవకాశం ఇచ్చారు. 2021, డిసెంబర్‌లో ఆదిలాబాద్ స్థానిక సంస్థల కోటా ఎమ్మెల్సీ ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికల్లో 667 ఓట్లతో గెలిచిన విఠల్ 2022, ఫిబ్రవరిలో ఎమ్మెల్సీగా ప్రమాణస్వీకారం చేశారు.

'సుప్రీం'లో సవాలు చేస్తా : దండే విఠల్



'నా ఎన్నిక చెల్లదని హైకోర్టు ఇచ్చిన తీర్పుని సుప్రీం కోర్టులో సవాలు చేస్తా. వేరే అభ్యర్థి నామినేషన్ ఉపసంహరణ సరిగా జరగలేదన్న కారణంతో హైకోర్టు ఈ తీర్పు ఇచ్చింది. ఆ అభ్యర్థి నామినేషన్ ఉపసంహరణకు నాకు ఎలాంటి సంబంధం లేదు. ఏదేమైనా ఈ తీర్పుపై అప్పీల్‌కు నాలుగు వారాల గడువు లభించింది. సుప్రీంకోర్టులో నాకు న్యాయం జరిగి, హైకోర్టు తీర్పుపై స్టే వస్తుందని ఆశిస్తున్నా'.

ఏపీలో 158 ట్యూటర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్

సాక్షి, అమరావతి: రాష్ట్ర వైద్య శాఖలోని డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (డీఎంఈ) పరిధిలో కొత్తగా ప్రారంభించిన 5 వైద్య కళాశాలల్లో 158 ట్యూటర్ పోస్టుల నియామకానికి శుక్రవారం ఏపీ మెడికల్ రిక్రూట్‌మెంట్ బోర్డ్ నోటిఫికేషన్ జారీ చేసింది. కాంట్రాక్ట్ పద్ధతిలో పోస్టుల భర్తీ చేపట్టనున్నట్లు బోర్డ్ కార్యదర్శి ఎం.శ్రీనివాసరావు తెలిపారు. పూర్తి నోటిఫికేషన్‌ను https://dme.ap.nic.in/https://apmsrb.ap.gov.in./msrbలో అందుబాటులో ఉంచామన్నారు. అర్హులైనవారు https://dme.ap.nic.in లో ఈ నెల 4-15వ తేదీలోగా సమర్పించాలని పేర్కొన్నారు.

స్పీడందుకున్న కారు..



కేసీఆర్ బస్సుయాత్ర, రోడ్ షోలతో బీఆర్‌ఎస్‌లో జోష్

- ఉద్యమకాలం నాటి ఉత్సాహం కనిపిస్తోందని నేతల వెల్లడి
- గణనీయ స్థాయిలో ఎంపీ సీట్లు సాధించగలమనే ధీమా

సాక్షి, హైదరాబాద్: అసెంబ్లీ ఎన్నికల తర్వాత కాస్త వెనుకంజగా కనిపించిన కారు పార్టీలో తిరిగి కొత్త జోరు కనిపిస్తోంది. పార్టీ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ నేరుగా రంగంలోకి దిగడం బీఆర్‌ఎస్ శ్రేణుల్లో జోష్ నింపుతోంది. కేసీఆర్ చేపట్టిన బస్సుయాత్ర, రోడ్ షోలకు ప్రజల నుంచి వస్తున్న స్పందనతో పార్టీకి పునర్వైభవం వస్తుందన్న ధీమా కనిపిస్తోందని బీఆర్‌ఎస్ వర్గాలు చెప్తున్నాయి. అసెంబ్లీ ఎన్నికల్లో గణనీయమైన సీట్లు సాధించినా.. కొందరు నేతలు పార్టీని వీడటం, ఎంపీలు కూడా పార్టీని వీడి ఇతర పార్టీల తరఫున లోక్‌సభ అభ్యర్థులుగా బరిలోకి దిగడంతో పార్టీ శ్రేణుల్లో కొంత నిరుత్సాహం కనిపించిందని అంటున్నాయి. కానీ కేసీఆర్ చేపట్టిన బస్సుయాత్ర, తన ప్రసంగాల్లో కాంగ్రెస్, బీజేపీలపై సంధిస్తున్న విమర్శనాస్త్రాలు.. ఉద్యమ కాలం నాటి సభలను తలపిస్తున్నాయని నేతలు చెప్తున్నారు. కేసీఆర్ ఎక్కడికి వెళ్లినా, ఎవరితో మాట్లాడినా.. మళ్లీ మీరే సీఎంగా రావాలని ప్రజలు కోరుకుంటున్నారని అంటున్నారు. ఈ క్రమంలో బీఆర్‌ఎస్ గణనీయమైన స్థాయిలోనే లోక్‌సభ స్థానాలను గెలుచుకుంటుందన్న నమ్మకం వస్తోందని కార్యకర్తలు ఆశావహంగా ఉన్నారు.

జనం నుంచి మంచి స్పందనతో..

లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భారీ బహిరంగ సభలకు బదులు క్షేత్రస్థాయి కార్యక్రమాలకే కేసీఆర్ మొగ్గుచూపారు. ఈ మేరకు ఏప్రిల్ 24 నుంచి మే 10 వరకు 17 రోజులపాటు బస్సుయాత్ర, రోడ్ షోలకు ప్రణాళిక రూపొందించారు. కేసీఆర్ చేపట్టిన బస్సుయాత్రకు ప్రజల్లో మంచి స్పందన కనిపించడం పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం నింపింది. కేసీఆర్‌కు మహిళలు మంగళ హారతులు, డప్పులు, బతుకమ్మలు, బోనాలతో స్వాగతం పలుకుతున్నారని.. బస్సుయాత్ర సాగే మార్గంలో రైతులు, యువకులు కేసీఆర్‌ను చూసేందుకు, కలిసేందుకు ఆసక్తి చూపుతున్నారని పార్టీ వర్గాలు చెప్తున్నాయి. రోడ్ షోలు, కార్నర్ మీటింగ్‌ల కోసం పార్టీపరంగా జన సమీకరణ చేస్తున్నా.. అంచనాలకు మించి జనం కూడా వస్తున్నారని అంటున్నాయి.

స్థానికులతో మమేకం.. రాత్రి బసతోనూ..

బస్సుయాత్రలో భాగంగా మార్గమధ్యలో రైతులతో, వివిధ వర్గాలతో కేసీఆర్ భేటీ అవుతున్నారు. రోడ్డు పక్కన హోటళ్ల వద్ద ఆగి చాయ్ తాగుతూ, స్థానికులతో మాట్లాడుతున్నారు. స్థానిక సమస్యలపై ఆరా తీస్తున్నారు. రైతులతో ముచ్చటిస్తూ, వారి సమస్యలను తెలుసుకుంటూ.. తాను చేస్తున్న పోరాటంలో కలసి రావాలని పిలుపునిస్తున్నారు. మరోవైపు రోడ్ షోలు ముగిసిన తర్వాత కేసీఆర్ స్థానికంగా బస చేస్తున్నారు. ఆ సమయంలో, మరుసటి రోజు ఉదయం.. స్థానిక నేతలు, న్యాయవాదులు, వైద్యులు, వివిధ రంగాలకు చెందిన వారితో మాట్లాడుతున్నారు. స్థానికంగా ముఖ్య నేతల నివాసానికి వెళ్లి కలుస్తున్నారు. ఇలాంటివన్నీ ప్రజలను మరింతగా ఆకట్టుకుంటున్నాయని పార్టీ నేతలు చెప్తున్నారు.

పార్టీలో సమన్వయం.. ప్రచార వ్యూహాలు కూడా

రాత్రి బస వద్ద సంబంధిత లోక్‌సభ నియోజకవర్గం పరిధిలోని ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌చార్జులు, ముఖ్య నేతలతో కేసీఆర్ భేటీ అవుతున్నారు. ప్రచార తీరుతెన్నులపై సమీక్షిస్తున్నారు. బూత్ స్థాయి వరకు ప్రచారంతోపాటు గెలుపు వ్యూహాలపై దిశానిర్దేశం చేస్తున్నారు. కేసీఆర్ నేరుగా కలసి చేస్తున్న సూచనలతో పార్టీ శ్రేణుల్లో ఉత్సాహకం కనిపిస్తోందని అంటున్నారు. ఈ క్రమంలోనే బస్సుయాత్ర, రోడ్ షోలను విజయవంతం చేసేందుకు సర్వశక్తులూ ఒడ్డుతున్నారని.. నియోజకవర్గాల్లో తమ సత్తా చూపాలని ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జులు భావిస్తున్నారని చెప్తున్నారు.

కాంగ్రెస్, బీజేపీపై విమర్శనాస్త్రాలతో..

జాతీయ పార్టీలు కాంగ్రెస్, బీజేపీలను లక్ష్యంగా చేసుకుని కేసీఆర్ విమర్శనాస్త్రాలు సంధిస్తుండటం.. తన ప్రసంగాల్లో వ్యవసాయం, రైతుల సమస్యలను ప్రస్తావిస్తుండటం ఆకట్టుకుంటోందని బీఆర్‌ఎస్ వర్గాలు చెప్తున్నాయి. రుణమాఫీ, రైతు బంధు, వరికి రూ.500 బోనస్, విద్యుత్, తాగు నీరు, సాగునీటి సమస్యలను ఎత్తిచూపుతూ.. బీఆర్‌ఎస్ హయాంలో తాము చేపట్టిన చర్యలను వివరిస్తూ.. కేసీఆర్ చేస్తున్న ప్రసంగాలు జోష్ నింపుతున్నాయని అంటున్నాయి. ముఖ్యంగా బీఆర్‌ఎస్‌కు ఎక్కువ ఎంపీ సీట్లు ఇస్తే.. రాష్ట్రంలోని కాంగ్రెస్ సర్కారు మెడలు వంచి హామీలు అమలు చేయిస్తామని చెప్పడం ప్రభావం చూపుతోందని చెప్తున్నాయి.

ఎక్కువ ఎంపీ సీట్లు సాధిస్తామనే ధీమా!

లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కు ఒక్క సీటు కూడా రాదంటూ కాంగ్రెస్, బీజేపీ రెండూ కూడా ప్రచార ఆరంభంలో విమర్శలు చేశాయి. కానీ కేసీఆర్ బస్సుయాత్ర, ప్రజా స్పందనతో ఆ అభిప్రాయాన్ని మార్చేశారన్న వాదన వినిపిస్తోంది. మొదట్లో బీఆర్‌ఎస్‌కు 8 సీట్లలో సానుకూలత ఉందని చెప్పిన కేసీఆర్.. ఇప్పుడు 12 సీట్ల వరకు వస్తాయని చెప్తుండటం గమనార్హం. ఈసారి కేంద్రంలో ఏ కూటమికీ స్పష్టమైన మెజారిటీ వచ్చే అవకాశం లేదని, బీఆర్‌ఎస్‌కు ఎక్కువ ఎంపీ సీట్లు ఇస్తే సంకీర్ణ ప్రభుత్వంలో కీలకపాత్ర పోషిస్తామని కూడా అంటున్నారు. ఈ క్రమంలో రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వంపై మొదలైన వ్యతిరేకత తమకు అనుకూలిస్తుందని బీఆర్‌ఎస్ నేతలు చెప్తున్నారు. కొన్ని సర్వే సంస్థలు బీఆర్‌ఎస్‌కు 8 నుంచి 12 సీట్లు వస్తాయని చెప్తున్నాయని ఉదహరిస్తున్నారు.

ఈసీ నిషేధంతో కాస్త లాభమే!

కేసీఆర్ ఎన్నికల ప్రచారంపై ఎన్నికల కమిషన్ విధించిన 48 గంటల నిషేధం కూడా బీఆర్‌ఎస్‌కు కాస్త అనుకూల పరిస్థితిని సృష్టించిందని ఆ పార్టీ వర్గాలు చెప్తున్నాయి. బీఆర్‌ఎస్ పట్ల, కేసీఆర్ పట్ల కక్షపూరితంగా వ్యవహరిస్తున్నారనే అభిప్రాయాన్ని ఈ చర్య కలిగించిందని అంటున్నాయి. దీనిపై ప్రజల్లో బీఆర్‌ఎస్ పట్ల పెద్ద ఎత్తున సానుకూల చర్చ జరిగిందని.. పార్టీ శ్రేణుల్లోనూ పట్టుదలను పెంచిందని వివరిస్తున్నాయి.

వాస్తవాలకు అనుగుణంగా పే రివిజన్

సాక్షి, హైదరాబాద్: వాస్తవ పరిస్థితులకు అనుగుణంగా ఉద్యోగుల పే రివిజన్ ప్రక్రియ చేపట్టాలని తెలంగాణ ఎంప్లాయీస్ అసోసియేషన్ (టీఈఏ) రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు జి.నిర్మల, యూఎఫ్ఏ యాకుబ్ పాషా కోరారు. టీఈఏ ప్రతినిధుల బృందం శుక్రవారం పే రివిజన్ కమిటీని కలిసింది. ఈమేరకు ఉద్యోగుల సమస్యలపై వినతిపత్రం సమర్పించింది. కార్యక్రమంలో టీఈఏ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎంకే రాజు, హైదరాబాద్ అధ్యక్షుడు కొంకటి మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

ట్యాంకర్‌ను ఢీకొట్టి.. కేబిన్‌లో ఇరుక్కొని

అరగంటకుపైగా లారీ డ్రైవర్ నరకయాతన



కేబిన్ నుంచి డ్రైవర్‌ను బయటకు తీసేందుకు ప్రయత్నిస్తున్న సహాయక సిబ్బంది

సిద్దిపేట అర్బన్: రాజీవ్ రహదారిపై డివైడర్ మధ్యలో ఉన్న మొక్కలకు నీళ్లు పడుతున్న ట్యాంకర్‌ను లారీ ఢీకొట్టిన ఘటనలో లారీ డ్రైవర్ కేబిన్‌లో ఇరుక్కుపోయాడు. ఈ ఘటన శుక్రవారం సిద్దిపేట అర్బన్ మండలం మందపల్లి గ్రామ శివారులో చోటుచేసుకుంది. ట్యాంకర్ సిబ్బంది మొక్కలకు నీరు పడుతున్న సమయంలో హైదరాబాద్ నుంచి కరీంనగర్ వెళ్తున్న లారీ అదుపుతప్పి వెనక నుంచి ట్యాంకర్‌ను ఢీకొట్టింది. దీంతో లారీ ముందు భాగం నుజ్జునుజ్జయింది. లారీ డ్రైవర్ సైదులు కేబిన్‌లో ఇరుక్కుపోయాడు. విషయం తెలుసుకున్న టూటౌన్ సీఐ ఉపేందర్ సిబ్బందితో కలిసి సంఘటనా స్థలానికి చేరుకొని కేబిన్‌లో ఇరుక్కున్న డ్రైవర్‌ను జేసీబీ, గ్యాస్ కట్టర్ సాయంతో అరగంట పాటు శ్రమించి బయటకు తీశారు. డ్రైవర్ కాలుకు తీవ్రగాయాలు కావడంతో చికిత్స నిమిత్తం సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించారు. చెట్లకు నీరు పడుతున్న అనిల్‌కు స్వల్పగాయాలయ్యాయి. టూటౌన్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అప్పులతో రైతు బలవన్మరణం

గజ్వేల్ రూరల్: అప్పుల బాధతో ఓ రైతు ట్రాక్టర్ సైలెన్సర్‌కు ఉరి వేసుకున్నాడు. సిద్దిపేట జిల్లాలో జరిగిన ఈ సంఘటనపై శుక్రవారం బేగంపేట పోలీసులు, మృతుని కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలివి. గజ్వేల్ మండలం బంగ్లా వెంకటాపూర్‌కు చెందిన అన్నమైన శివరాములు(48) తనకున్న కొద్దిపాటి భూమిలో పంటలు సాగు చేస్తూ కుటుంబాన్ని నెట్టుకొస్తున్నాడు. గురువారం సాయంత్రం మిరపతోటకు నీళ్లు పెట్టేందుకు వెళ్తున్నానని ఇంట్లో చెప్పి వెళ్లాడు. వ్యవసాయ భూమి వద్ద ట్రాక్టర్ ఇంజన్ సైలెన్సర్ (పొగ గొట్టం)కు తాడుతో ఉరి వేసుకొన్నాడు. పంటల సాగుకు, చిట్టీలు, కుటుంబ పోషణకు తెచ్చిన సుమారు రూ.5 లక్షల అప్పు తీర్చే మార్గం లేక జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్యకు పాల్పడినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

రోహిత్ వేముల ఆత్మహత్యకు
ఎవరూ కారణం కాదు

- హైకోర్టుకు తెలియజేసిన పోలీసులు
- రోహిత్ ఎస్సీ కాదని, అందుకు ఆధారాలు లేవని వెల్లడి
- ఈ కేసులో దాఖలైన పిటిషన్ల విచారణను ముగించిన హైకోర్టు
- కేంద్రమంత్రి స్మృతి ఇరానీ, మాజీ ఎంపీ బి.దత్తాత్రేయతో పాటు పలువురికి ఉపశమనం



సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో పీహెచ్‌డీ స్కాలర్ రోహిత్ వేముల ఆత్మహత్య కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. అతని ఆత్మహత్యకు ఎవరూ కారణం కాదని.. అలాగే అతను ఎస్సీ అనేందుకు ఎటువంటి ఆధారాలు కూడా లేవని, బీసీ వడ్డెర కులానికి చెందినవాడని హైకోర్టుకు పోలీసులు తెలియజేశారు. రోహిత్ ఆత్మహత్యకు వీసీ అప్పారావుకు ఎలాంటి సంబంధం లేదని పోలీసులు కోర్టుకు చెప్పారు. ఈ అంశాలను పరిగణనలోకి తీసుకున్న హైకోర్టు పలు పిటిషన్లలో విచారణను ముగించింది. రోహిత్ వేముల ఆత్మహత్య కేసులో తనపై దాఖలైన ఎఫ్ఐఆర్‌ను రద్దు చేసేలా పోలీసులను ఆదేశించాలని కోరుతూ వర్సిటీ వైస్ చాన్సలర్ అప్పారావుతో పాటు పలు కారణాలతో మరికొందరు పిటిషన్లు వేశారు. ఈ పిటిషన్లపై విచారణ చేపట్టిన జస్టిస్ ఈవీ వేణుగోపాల్ శుక్రవారం తీర్పు వెలువరించారు. ట్రయల్ కోర్టులో పోలీసులు దాఖలు చేసిన అఫిడవిట్‌ను పరిగణనలోకి తీసుకుని ఇక్కడి పిటిషన్లలో విచారణ ముగిస్తున్నట్లు చెప్పారు.

సస్పెండ్ చేయడంతోనే ఆత్మహత్య

రోహిత్ వేములను సస్పెండ్ చేయడంతోనే ఆత్మహత్యకు పాల్పడ్డారని ట్రయల్ కోర్టులో పోలీసులు రిపోర్టు దాఖలు చేశారు. రోహిత్ మృతిపై నిరసనలు వెల్లువెత్తడంతో గచ్చిబౌలి స్టేషన్‌లో క్రిమినల్ కేసు నమోదు చేశామని అతనిది హత్య అనేందుకు ఎలాంటి సాక్ష్యాధారాల్లేవని, కనుక కేసును మూసివేయాలని భావిస్తున్నామని అందులో పేర్కొన్నారు. రోహిత్ వేముల కుటుంబానికి చెందిన కుల ధ్రువీకరణ పత్రాలను ఫోర్జరీ చేశారని, అతడు దళితుడని చెప్పేందుకు ఆధారాలు లేకపోవడంతో కేసును మూసివేస్తున్నామని అందులో తెలిపారు.

దిగువ స్థాయి కోర్టులో అప్పీలు చేసుకోవచ్చు: హైకోర్టు

పోలీసుల పిటిషన్‌పై దిగువ స్థాయి కోర్టులో అప్పీలు చేసుకోవచ్చని వేముల రోహిత్ కుటుంబానికి హైకోర్టు సూచించింది. దీంతో.. ఈ కేసులో నిందితులుగా ఉన్న సికింద్రాబాద్ మాజీ ఎంపీ బండారు దత్తాత్రేయ, ఎమ్మెల్సీ రామచందర్‌రావు, యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ వీసీ అప్పారావు, కేంద్ర మంత్రి స్మృతి ఇరానీతో పాటు పలువురు ఏబీవీపీ నేతలకు ఈ కేసు నుంచి ఉపశమనం దొరికినట్లైంది.

రోహిత్ వేముల ఆత్మహత్య కేసు
మళ్లీ దర్యాప్తు చేస్తాం

- రోహిత్ తల్లి, మరికొందరు అనుమానాలతో ఈ నిర్ణయం
- డీజీపీ రవిగుప్తా వెల్లడి



సాక్షి, హైదరాబాద్: సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థి రోహిత్ వేముల ఆత్మహత్య కేసులో మళ్లీ విచారణ చేపట్టాలని నిర్ణయించినట్టు డీజీపీ రవిగుప్తా వెల్లడించారు. 2016 జనవరి 17వ తేదీన హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీకి చెందిన విద్యార్థి రోహిత్‌వేముల ఆత్మహత్యపై గచ్చిబౌలి పీఎస్‌లో కేసు నమోదైన విషయం తెలిసిందే. అయితే ఈ కేసుకు సంబంధించి శుక్రవారం పలు ఎలక్ట్రానిక్, సోషల్ మీడియా చానళ్లలో రకరకాల వార్తలు, కథనాలు ప్రసారమయ్యాయి. దీనిపై స్పందించిన డీజీపీ శుక్రవారం ప్రకటన విడుదల చేశారు. 'ఈ కేసులో ఇన్వెస్టిగేషన్ ఆఫీసర్‌గా మాదాపూర్ అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ ఉన్నారు. ఈ కేసుకు సంబంధించిన తుది నివేదిక గత సంవత్సరం అంటే నవంబర్ 2023 కన్నా ముందే నిర్వహించిన దర్యాప్తు ఆధారంగా తయారు చేశారు. ఆ తుది నివేదికనే అధికారికంగా 21.03.2024న ఇన్వెస్టిగేషన్ ఆఫీసర్ సంబంధిత కోర్టులో దాఖలు చేశారు. అయితే విచారణ, విచారణ జరిగిన విధానంపై రోహిత్ వేముల తల్లితోపాటు మరికొందరు అనుమానాలు వ్యక్తం చేశారు. దీంతో కేసు విషయంలో మళ్లీ విచారణ చేపట్టాలని నిర్ణయించామని, తదుపరి దర్యాప్తును అనుమతించాలని మేజిస్ట్రేట్‌ను అభ్యర్థిస్తూ సంబంధిత కోర్టులో పిటిషన్ దాఖలు చేస్తాం'అని డీజీపీ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

జస్టిస్ రామలింగేశ్వరరావుకు ఏపీ హైకోర్టు ఘన నివాళి



సాక్షి, అమరావతి: ఇటీవల కన్నుమూసిన ఉమ్మడి హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ ఎ.రామలింగేశ్వరరావుకు హైకోర్టు శుక్రవారం ఘనంగా నివాళులు అర్పించింది. ప్రధాన న్యాయమూర్తి (సీజే) జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్ నేతృత్వంలో న్యాయమూర్తులందరూ మొదటి కోర్టు హాలులో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా జస్టిస్ రామలింగేశ్వరరావు న్యాయవ్యవస్థకు అందించిన సేవలను సీజే కొనియాడారు. జస్టిస్ రామలింగేశ్వరరావు మరణం న్యాయవ్యవస్థకు తీరని లోటన్నారు. అనంతరం అడ్వొకేట్ జనరల్ (ఏజీ) ఎస్.శ్రీరామ్, హైకోర్టు న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు కలిగినీడి చిదంబరం మాట్లాడుతూ జస్టిస్ రామలింగేశ్వరరావు సేవలను గుర్తు చేసుకున్నారు. జస్టిస్ రామలింగేశ్వరరావు ఆత్మకు శాంతి చేకూరాలంటూ అందరూ రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు.

సాక్షి రియల్టీ

లగ్జరీ రయ్!



విలాసవంతమైన ఇళ్లకు గిరాకీ

- ఏడాదిలో 110 శాతం వృద్ధి
- 2024 క్యూ1లో 800 గృహాల విక్రయం
- జూబ్లీ, బంజారాహిల్స్, హైటెక్స్, రాయదుర్గం, నియోపోలీస్ హాట్‌స్పాట్స్
- ఇక్కడ రూ.20–40 కోట్ల ధర ఉన్న ఇళ్ల అమ్మకాలు కూడా
- సీబీఆర్ఈ సౌత్ ఏషియా నివేదికలో వెల్లడి

సాక్షి, హైదరాబాద్: కరోనా తర్వాతి నుంచి విలాసవంతమైన ఇళ్లకు గిరాకీ పెరిగింది. విస్తీర్ణమైన గదులు, ఆధునిక వసతులు, గ్రీనరీ, ఆహ్లాదకరమైన వాతావరణం వంటి కారణంగా లగ్జరీ గృహాల కొనుగోళ్లు పెరుగుతున్నాయి. ఈ ఏడాది తొలి త్రైమాసికం (క్యూ1)లో దేశంలోని ఏడు ప్రధాన నగరాల్లో రూ.4 కోట్ల కంటే ఎక్కువ ధర ఉన్న లగ్జరీ గృహాలు 4,140 అమ్ముడుపోయాయి. గతేడాది క్యూ1లో వీటి సంఖ్య 3,780 యూనిట్లుగా ఉన్నాయి. ఏడాది కాలంలో 10 శాతం మేర పెరిగాయని సీబీఆర్ఈ సౌత్ ఏషియా నివేదిక వెల్లడించింది.

- దేశంలోని లగ్జరీ గృహ విక్రయాలలో 10 శాతం వాటాతో హైదరాబాద్ మూడో స్థానంలో నిలిచింది. ముంబై, ఢిల్లీ–ఎన్సీఆర్ తొలి రెండు స్థానాల్లో నిలిచాయి. దక్షిణాది నగరాలైన బెంగళూరు, చెన్నైల కంటే భాగ్యనగరంలోనే విలాసవంతమైన ఇళ్ల అమ్మకాలు ఎక్కువగా ఉండటం గమనార్హం. 2024 క్యూ1లో ముంబైలో 1,330, ఢిల్లీ–ఎన్సీఆర్‌లో 1,150 లగ్జరీ యూనిట్లు అమ్ముడుపోయాయి.

నగరాల వారీగా లగ్జరీ గృహాల విక్రయాలు

నగరం	2024 క్యూ1	2023 క్యూ1
ముంబై	1330	1150
ఢిల్లీ–ఎన్సీఆర్	1150	1880
హైదరాబాద్	800	380
పుణే	700	150
బెంగళూరు	10	70
కోల్‌కతా	70	110
చెన్నై	60	40

దక్షిణాదిలో హైదరాబాద్ టాప్..

ఈ ఏడాది జనవరి నుంచి మార్చి మధ్యకాలంలో హైదరాబాద్‌లో 800 విలాసవంతమైన ఇళ్లు అమ్ముడుపోయాయి. అదే 2023 క్యూ1లో వీటి సంఖ్య కేవలం 380 శాతంగా ఉంది. అంటే ఏడాది కాలంలో రికార్డు స్థాయిలో 110 శాతం వృద్ధి రేటు నమోదైందన్నమాట. దేశంలోని ఏ నగరాల్లోనూ ఈ స్థాయిలో వృద్ధి కనిపించకపోవడం గమనార్హం. ఇక, దక్షిణాది నగరాలైన బెంగళూరులో కేవలం 10 యూనిట్లు, చెన్నైలో 60 గృహాలు విక్రయమయ్యాయి. ఐటీ రంగంలో హైదరాబాద్‌తో పోటీ పడే బెంగళూరులో 2023 క్యూ1తో పోలిస్తే 2024 క్యూ1లో లగ్జరీ ఇళ్ల విక్రయాలు క్షీణించాయి. గతేడాది తొలి త్రైమాసికంలో ఇక్కడ 70 యూనిట్లు అమ్ముడుపోయాయి.

ఈ ప్రాంతాలు హాట్‌స్పాట్స్..

లగ్జరీ గృహ విక్రయాలకు జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, హైటెక్ సిటీ, రాయదుర్గం, నియోపోలీస్ ప్రాంతాలు హాట్‌స్పాట్లుగా మారాయి. ఆయా ప్రాంతాల్లో రూ.20–40 కోట్ల మధ్య ధర ఉన్న అల్ట్రా లగ్జరీ గృహాల విక్రయాలు సైతం నమోదవడం గమనార్హం. 2024 క్యూ1లో నగరంలో జరిగిన గృహ విక్రయాల్లో లగ్జరీ హోమ్స్ వాటా 5 శాతంగా ఉంది.

తొలి స్థానంలో ముంబై..

అత్యధికంగా ముంబైలో రికార్డు స్థాయిలో విలాసవంతమైన ఇళ్ల అమ్మకాలు జరిగాయి. విక్రయాలలో 40 శాతం వాటా కలిగి ఉంది. ఆల్టామౌంట్ రోడ్, నేపియన్ సీ రోడ్, వర్లీ, ప్రభాదేవి, జుహూ, బాంద్రా వెస్ట్ ప్రాంతాలలో రూ.20–60 కోట్ల ధర ఉన్న లగ్జరీ గృహాల విక్రయాలు ఎక్కువగా జరిగాయి. ఇవే ప్రాంతాలలో రూ.100 కోట్లకు పైగా ధర ఉన్న అపార్ట్‌మెంట్ల అమ్మకాలు కూడా నమోదయ్యాయి.

45% ఐదేళ్లలో వచ్చినవే..

ప్రస్తుతం దేశంలోని విలాసవంతమైన ఇళ్లలో 45 శాతం గత ఐదేళ్లలో వచ్చినవే. పర్యావరణ అనుకూలమైన, ఇంధన సమర్థవంతమైన నివాసాలకు ప్రాధాన్యం పెరుగుతుంది. ఇవే స్థిరాస్తి రంగంలో స్థిరమైన అభివృద్ధికి కీలకంగా మారాయి.

– అన్షుమన్ మ్యాగజైన్, చైర్మన్ అండ్ సీఈఓ, సీబీఆర్ఈ

ఏ విధంగానైతే సాలెపురుగు తన (కడుపు) నుండి గూడు అల్లుకుంటుందో, తిరిగి దాన్ని తన (కడుపు)లోకి మింగివేసుకుంటుందో, అదే విధంగా ఆ అనశ్వర (పరబ్రహ్మ) తత్వం నుండి ఈ సృష్టిలోని సర్వస్వమూ ఉత్పన్నమవుతుంది.

– ముండకోపనిషత్తు (హైందవ ధర్మం)

సాక్షి

శనివారం, 4 మే 2024

రగులుతున్న క్యాంపస్‌లు!

గాజాలో ఇజ్రాయెల్ అమానుష హత్యాకాండ మొదలైనప్పటినుంచీ అమెరికన్ విద్యాసంస్థల్లో అలుముకున్న అశాంతి ఈ వారం తీవ్ర రూపం దాల్చింది. ప్రపంచంలోనే పేరెన్నికగన్న విశ్వవిద్యాలయాలు విద్యార్థి ఉద్యమాలతో అట్టుడుకుతున్నాయి. వియత్నాంను వల్లకాడు చేస్తున్న అమెరికా సైనిక దురాక్రమణకు వ్యతిరేకంగా 1968లో తిరుగుబాటు జెండా ఎగరేసిన విద్యార్థుల పోరాటాన్నీ, 1980ల్లో దక్షిణాఫ్రికా జాత్యహంకార ప్రభుత్వం నెల్సన్ మండేలాను దీర్ఘకాలం చెరసాలలో బంధించటాన్ని నిరసిస్తూ సాగిన ఉద్యమాలనూ గుర్తుచేస్తున్నాయి. అప్పటిమాదిరే ఈ ఉద్యమాలు అట్లాంటిక్ మహా సముద్రం ఆవలితీరాల్లోని యూనివర్సిటీ క్యాంపస్‌లకు సైతం విస్తరించాయి. ఫ్రాన్స్, బ్రిటన్ తదితర దేశాల్లో మాత్రమేకాదు... పశ్చిమాసియాలోని బీరూట్, కువైట్, లెబనాన్, ట్యునీసియా యూనివర్సిటీలు కూడా రగులుతున్నాయి. లాఠీచార్జిలు, బాష్పవాయు గోళాలు ఎవరినీ భయపెట్టడం లేదు. వేలాదిమంది విద్యార్థులను అరెస్టుచేస్తూ ఉద్యమాలను చల్లార్చాలని పోలీసులు ప్రయత్నిస్తున్నా సాగటం లేదు. వీటి తీవ్రత పెరుగుతున్నదే తప్ప తగ్గటం లేదు. ప్రజాస్వామ్యం గురించి ప్రపంచానికి ప్రవచనాలు చెప్పే అమెరికా తన క్యాంపస్‌లను ప్రస్తుతం పోలీసు శిబిరాలుగా మార్చింది. అక్టోబర్ 7న ఇజ్రాయెల్ భూభాగంలోకి ప్రవేశించిన హమాస్ మిలిటెంట్‌లు 1,200 మంది పౌరులను కాల్చిచంపి, దాదాపు 250 మందిని బందీలుగా తీసుకెళ్లిన ఉదంతాన్ని ప్రపంచ వ్యాప్తంగా అందరూ తీవ్రంగా ఖండించారు. స్వతంత్ర పాలస్తీనా కోసం సాగుతున్న ఉద్యమాలను ఇలాంటి దుందుడుకు చర్యలు బలహీనపరుస్తాయని హెచ్చరించారు. దాన్ని సాకుగా తీసుకుని ఇజ్రాయెల్ గత ఆర్నెల్లుగా సాగిస్తున్న మారణహోమం తక్కువేమీ కాదు. ఇంతవరకూ 35,000 మంది పాలస్తీనా పౌరులు ఇజ్రాయెల్ సైనిక దళాల దాడుల్లో మరణించారని చెబుతున్నారు. ఇందులో అత్యధికులు నిరాయుధులైన స్త్రీలు, పిల్లలే. చివరికి బాంబుదాడుల్లో శిథిలమైన జనావాసాల్లో బాధితులకు అండగా నిలబడుతున్న ఐక్యరాజ్యసమితి ఆధ్వర్యంలోని స్వచ్ఛంద సంస్థల కార్యకర్తలను సైతం ఇజ్రాయెల్ సైన్యం వదిలిపెట్టడం లేదు. కావాలని ఉద్దేశపూర్వకంగా వారిని కాల్చిచంపుతూ పాలస్తీనా పౌరులకు బాసటగా నిలబడాలన్న సంకల్పంతో వచ్చేవారిని భయభ్రాంతుల్ని చేసేందుకు ప్రయత్నిస్తోంది. మరోపక్క అనేకమంది హమాస్ ఉగ్రవాదులను మట్టుబెట్టామని చెప్పుకుంటోంది.

ఇజ్రాయెల్‌కు ఎడాపెడా మారణాయుధాలు సరఫరా చేస్తూ, భద్రతామండలి వంటి అంతర్జాతీయ వేదికలపై అది సాగిస్తున్న నరమేధాన్ని నిలువరించే అన్ని రకాల ప్రయత్నాలకూ మోకాలడ్డుతూ మద్దతుగా నిలబడుతున్న అమెరికా అప్పుడప్పుడు కోమానుంచి నిద్రలేచిన రోగి మాదిరిగా శాంతి వచనాలు వల్లిస్తోంది. ఇది సబబేనా? నిరాయుధ సాధారణ పౌరులను కాల్చిచంపటం ప్రపంచమంతా మౌనంగా వీక్షిస్తూ ఉండాల్సిందేనా? ఈ ప్రశ్నలే విశ్వవిద్యాలయాల విద్యార్థులను కలవరపరిచాయి. తాము మూగసాక్షులుగా మిగిలిపోలేమంటూ ఆ విద్యార్థులు గొంతెత్తటం వెనకున్న నేపథ్యం ఇదే. జార్జి వాషింగ్టన్ యూనివర్సిటీ, యూనివర్సిటీ ఆఫ్ కాలిఫోర్నియా లాస్ ఏంజెలెస్ (యూసీఎల్‌ఏ), కొలంబియా యూనివర్సిటీ, యూనివర్సిటీ ఆఫ్ పెన్సిల్వేనియా వగైరా ఉన్నతశ్రేణి విద్యాసంస్థలు నినాదాలతో మార్మోగుతున్నాయి. పేరెన్నికగన్న హార్వర్డ్, బర్కిలీ, యేల్ వర్సిటీలు సైతం రణక్షేత్రాలయ్యాయి. అమెరికా ప్రభుత్వ వైఖరిని ప్రశ్నిస్తున్నాయి. ఈ విశ్వవిద్యాలయాలు సాధారణమైనవి కాదు. పేరెన్నికగన్న ప్రపంచశ్రేణి సంస్థలు. ఉదాహరణకు యూసీఎల్‌ఏ 16 మంది నోబెల్ బహుమతి గ్రహీతలను తయారుచేసింది. ఆ సంస్థనుంచి ఇంతవరకూ 15 మంది మెక్‌ఆర్థర్ ఫెలోషిప్‌లను అందుకున్నారు. అసాధారణ ప్రతిభాపాటవాలున్నవారికి ఈ ఫెలోషిప్‌లు ఇస్తారు. ఇక్కడి పట్టభద్రుల్లో క్రీడల్లో రాణించి ఒలింపిక్స్‌లో పతకాలు అందుకున్నవారెందరో! ఎన్నో దేశాలు అందుకునే పతకాల సంఖ్యతో పోలిస్తే ఈ యూనివర్సిటీ పట్టభద్రులు సాధించే పతకాలే ఎక్కువంటారు. ఇలాంటిచోట చదువుకునే పిల్లలు సమాజ పరిణామాలపట్ల ఇంతగా కలవరపడటం బహుశా మన దేశంలో చాలామందిని ఆశ్చర్యపరిచి వుండొచ్చు. విద్యార్థి ఉద్యమ కేంద్రాలుగా ముద్రపడిన ఢిల్లీలోని జేఎన్‌యూ, జమియా మిలియా, కోల్‌కతాలోని జాదవ్‌పూర్ యూనివర్సిటీలను ఛీత్కరించటం అలవాటు చేసుకున్న మర్యాదస్తులకు ప్రపంచశ్రేణి విశ్వవిద్యాలయాల వర్తమాన పోకడలు మింగుడుపడకపోవచ్చు. అయోమయానికి గురిచేయవచ్చు. కానీ అమెరికా తదితర దేశాల విశ్వవిద్యాలయాల క్యాంపస్‌లు ఎప్పుడూ ప్రశ్నించే తత్వాన్ని ప్రోత్సహిస్తూనే వున్నాయి. ఇప్పుడు సాగుతున్న విద్యార్థి ఉద్యమాలతో ప్రొఫెసర్లు సైతం గొంతు కలపటం, అరెస్టుకావటం యాదృచ్ఛికం కాదు. ఈ నిరసనలను యూదు వ్యతిరేక ఆందోళనలుగా చిత్రించి అధికారుల, రిపబ్లికన్ పార్టీ శ్రేణుల ప్రాపకంతో పోటీ ఉద్యమాలను నిర్వహిస్తున్న విద్యార్థులు లేక పోలేదు. పాలస్తీనా సంఘీభావ ఉద్యమకారులపై వారు దాడులకు కూడా వెనకాడటం లేదు. ఇది విచారకరం.

పిల్లి కళ్లు మూసుకుని పాలుతాగుతూ ఎవరూ చూడటంలేదని భ్రమపడుతుంది. అమెరికా ప్రభుత్వం ఈ ధోరణిని విరమించుకోవాలి. తన ఆయుధ పరిశ్రమ లాభార్జనకు తోడ్పడుతున్నాయన్న ఏకైక కారణంతో ఇజ్రాయెల్, ఉక్రెయిన్ తదితర దేశాలకు అమెరికా భారీగా సైనిక సాయం అందించటం అనైతికం, అమానుషం. విద్యార్థి ఉద్యమాలు పంపుతున్న సందేశాన్ని సక్రమంగా అర్థం చేసుకుని ప్రపంచశాంతికి దోహదపడటం అగ్రరాజ్యంగా తన బాధ్యతని ఇప్పటికైనా ఆ దేశం గుర్తించాలి. లేకుంటే మున్ముందు ఈ ఉద్యమాలు మరింత విస్తరిస్తాయి.

కోడ్ ఉల్లంఘిస్తే గట్టి చర్యలుండాలి!

విశ్లేషణ



అశోక్ లవాసా

ఎన్నికల ప్రచారంలో పాల్గొనే అభ్యర్థుల నైతిక వర్తన నియమావళి (మోరల్ కోడ్ ఆఫ్ కాండక్ట్)ని తొలిసారి 1960లో రూపొందించారు. ఈ కోడ్‌ను ఎన్నికల సందర్భంగా అన్ని పార్టీలకు జారీ చేయడం 1979 నుంచి ఆనవాయితీగా మారింది. 1991లో పార్టీలన్నింటి అనుమతితో దీన్ని మరింత బలపరిచారు. కానీ రాజకీయ వాతావరణం పదును తేలినకొద్దీ, ఉల్లంఘనలు పెరిగాయి. కోడ్‌కు కట్టుబడి ఉండటం కంటే తప్పించుకునే మార్గాలను అన్వేషించేందుకే నేతలు ఇష్టపడుతుంటారు. కాబట్టి, వీలైనంత పారదర్శకంగా నిబంధనల ఉల్లంఘనలకు ఎలాంటి శిక్షలుంటాయో స్పష్టం చేయాలి. అదే సమయంలో, ప్రస్తుత పరిస్థితులకు తగ్గట్టుగా కోడ్‌ను మార్చాలి. ప్రజాజీవితంలో గౌరవ మర్యాదలను కొనసాగించేందుకు ఇది చాలా ముఖ్యం.

'చాలాసార్లు ఎన్నికలు ఒక మనిషిలోని చెడ్డతనపు పార్శ్వాన్ని బయటికి తెస్తాయి, అవి ప్రతిసారీ మంచి మనిషి విజయానికి దారితీయవనేది కూడా నిశ్చయం' అన్నారు భారత తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ. ఆయన రాసిన 'డిస్కవరీ ఆఫ్ ఇండియా' పుస్తకంలోని ఈ పేరా ఎన్నికలు, ప్రజాస్వామ్య వ్యవస్థల్లోని లోటుపాట్లను ఎత్తిచూపుతుంది. అప్పటికి ఎన్నికల కమిషన్ లేదు... మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్ (ఎంసీసీ– నైతిక వర్తన నియమావళి) కూడా లేదు. రాజకీయ నేతలు, వ్యవస్థలన్నింటి ప్రత్యేక సమ్మతితో ఏర్పడిందీ ఎంసీసీ. మార్పులు, చేర్పులతో కాలంతోపాటు ఎదుగుతూ వచ్చింది. ఎన్నికల ప్రకటన వెలువడిన వెంటనే ఎంసీసీపై ఒత్తిడి విపరీతంగా పెరిగిపోతుంది. పార్టీలతో సహా నేతలు, అభ్యర్థులు... ఎన్నికల కమిషన్‌కు సవాళ్లు విసురుతూనే ఉంటారు. ఇదంతా కూడా మీడియా నిఘా, న్యాయ వ్యవస్థ కీలక డేగ కన్ను మధ్యలోనే జరుగుతూంటుంది.



కేరళతో మొదలు...

గతాన్ని కొంచెం తరచి చూద్దాం. కేరళ అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కొన్ని విధివిధానాలతో మొదలైందీ మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్. ప్రచార సభలు, ప్రదర్శనలు, ప్రసంగాలు, నినాదాలు, పోస్టర్లు, ప్లకార్డుల వంటివి ఎలా ఉండాలో ఈ విధి విధానాల్లో పొందుపరిచారు అప్పటి (1960) ఎన్నికల ప్రధాన అధికారి కేవీకే సుందరం.

1968లో ఎస్పీ సేన్ వర్మ ప్రధానాధికారిగా ఉండగా ఎన్నికల కమిషన్ దేశంలోని అన్ని రాజకీయ పార్టీలతో సంప్రదింపులు జరిపింది. కేరళ ఎన్నికల సందర్భంగా రూపొందించిన విధి విధానాలను అందరికీ జారీ చేస్తూ, ఎన్నికలు సజావుగా జరిగేందుకు (ఫ్రీ అండ్ ఫెయిర్) కనీస మర్యాదలను పాటించాలని కోరింది. తరువాతి కాలంలో అంటే 1979 నుంచి ఈ కోడ్‌ను సార్వత్రిక ఎన్నికల సందర్భంగా అన్ని పార్టీలకు జారీ చేయడం ఆనవాయితీగా మార్చారు అప్పటి సీఈసీ ఎస్.ఎల్. శక్ధర్. అంతేకాకుండా, రాజకీయ పార్టీల సమ్మతితో ఈ కోడ్‌ను మరింత విశదంగా రూపొందించారు. అధికార పార్టీకి కొన్ని పరిమితులు విధించడం, అధికార దుర్వినియోగాన్ని అడ్డుకోవడం వంటి చర్యలు అమల్లోకి వచ్చింది అప్పుడే. 1991లో టీఎన్ శేషన్ ఎన్నికల ప్రధానాధికారిగా ఉండగా మరో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించి పార్టీలన్నింటి అను మతితో 'కోడ్'ను మరింత బలపరిచారు. అయితే అప్పటినుంచి ఇప్పటివరకూ రాజకీయ వాతావరణం మరింత పదును తేలింది. ఫలితంగా మోడల్ కోడ్ సామర్థ్యం మొద్దుబారింది. ఉల్లంఘనలు పెచ్చుమీరి పోయాయి.

ఉల్లంఘనల పరిణామాలు స్పష్టం చేయాలి...

ప్రస్తుతం అమల్లో ఉన్న మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్‌లో ఉన్న ప్రధాన లోపం కోడ్‌ను ఉల్లంఘిస్తే ఎటువంటి పరిణామాలను ఎదుర్కోవాల్సి వస్తుందీ? అన్నది లేకపోవడం. అందుకే ఈ కోడ్... నిబంధనల ఉల్లంఘనలకు అడ్డు కావడం లేదు. కాబట్టి వీలైనంత పారదర్శకంగా నిబంధనల ఉల్లంఘనలకు ఎలాంటి శిక్షలు ఉంటాయో స్పష్టం చేయాల్సి ఉంటుంది. విద్వేషపూరిత ప్రసంగాలు, కుల మతాలను అడ్డం పెట్టుకుని ఓట్లు అడగడం వంటి విషయాల్లో మరీ కఠినంగా వ్యవహరించాల్సిన అవసరముంది. ఓట్ల కోసం పెట్టే ప్రలోభాలు, ప్రత్యర్థి పార్టీలు, నేతల గురించి అసభ్యకరమైన సంభాషణలు, భారత సాయుధ దళాలను పొగుడుతూ లేదా విమర్శిస్తూ, చర్యలను ప్రశ్నిస్తూ చేసే ప్రసంగాల గురించి ప్రత్యేకంగా దృష్టి పెట్టాల్సి ఉంటుంది. ఏ రకమైన ఉల్లంఘనలకు ఎలాంటి శిక్షలు ఉంటాయో స్పష్టంగా, బహిరంగంగా ప్రకటించాలి. ఉదాహరణకు విద్వేషపూరిత ప్రసంగాల వంటి వాటికి ప్రచారంపై నిర్దిష్ట కాలం నిషేధం విధించడం, మరింత తీవ్రమైన ఉల్లంఘనలకు నిషేధ సమయాన్ని పొడిగించడం, అప్పటికీ ఉల్లంఘనలు మానకపోతే మోడల్ కోడ్ అమల్లో ఉన్నంత కాలం నిషేధాన్ని కొనసాగించడం చేయవచ్చు. ఇది కేవలం ప్రచార సభలకు మాత్రమే పరిమితం కాకుండా... మీడియాలో కనిపించడం, ఇంటర్వ్యూలు ఇవ్వడం వంటి వాటికీ వర్తించేలా నిబంధనలు రూపొందించాలి. 'ఉల్లంఘనులు' స్టార్ క్యాంపెయినర్లు అయితే తరువాతి ఎన్నికల్లో ఆ గుర్తింపు రద్దు చేయడం కూడా చేయవచ్చు.

అయితే వీటి నుంచి తప్పించుకునేందుకు నేతలు సర్వశక్తులూ ఒడ్డుతారు. యుక్తులు పన్నుతారు కూడా. ఒకప్పుడు కండబలం ఉపయోగిస్తే ఇప్పుడు ఆ స్థానాన్ని ధన బలం ఆక్రమించింది. టెక్నాలజీ ఈ ఆయుధానికి మరింత పదును పెట్టింది. కోడ్‌కు కట్టుబడి ఉండటం కంటే తప్పించుకునేందుకు ఉన్న మార్గాలను అన్వేషించేందుకు నేతలు మరింత ఎక్కువ ఇష్టపడుతూంటారు. అందుకే ప్రస్తుత పరిస్థితుల్లో ఎంసీసీని రీమోడల్ చేయాల్సిన అవసరముంది. అది కూడా విపక్షకు తావులేని విధంగా అమలు చేసేలా ఉండాలి. ప్రజాజీవితంలో కొద్దోగొప్పో గౌరవ మర్యాదలను కొనసాగించేందుకు ఇది చాలా ముఖ్యం.

పార్టీలకు నోటీసులు... కొత్త పంథా!

ఎన్నికల కమిషన్(ఈసీ) ఈ మధ్యకాలంలో ఓ కొత్త పంథాను ఎంచుకుంది. కోడ్ ఉల్లంఘించిన వ్యక్తులకు కాకుండా... ఆ వ్యక్తుల పార్టీలకు నోటీసులు పంపుతోంది. అయితే ట్రాఫిక్ ఉల్లంఘనలకు డ్రైవరే బాధ్యుడైనట్లు కోడ్ ఉల్లంఘనల బాధ్యత కూడా పార్టీది కాదన్నది గుర్తించాలి. పైగా ఈసీ నోటీసు ప్రాథమికంగా ఉల్లంఘనపై సంతృప్తి చెందిన తరువాతే వెళుతుందన్న విషయం ఇక్కడ మనం గుర్తుపెట్టుకోవాలి. పార్టీకి చెందిన స్టార్ క్యాంపెయినర్లు, కీలక వ్యక్తులు కోడ్‌ను ఉల్లంఘిస్తే ఈసీ ఆ పార్టీపై కఠిన చర్యలు తీసుకునేందుకు కూడా వెనుకాడరాదు. ఈ చర్యలు జరిమానా కావచ్చు లేదా పార్టీ గుర్తులకు సంబంధించినదైనా కావచ్చు. అవసరమైతే ఈ రెండు రకాల చర్యలు కూడా తీసుకునేలా మార్పులు చేయాల్సి ఉంటుంది. అంతేకాకుండా... ఉల్లంఘనలు జరిగిన 72 గంటల్లోపే చర్యలు తీసు కోవడం కూడా అవసరం. వీటికి సంబంధించి స్పష్టమైన పద్ధతి ఒకదాన్ని సిద్ధం చేయాలి. ఆలస్యంగా తీసుకునే తూతూ మంత్రపు చర్యల వల్ల ప్రజల్లో ఈసీపై నమ్మకం సడలుతుంది.

కోడ్ ఉల్లంఘనలు ఎన్ని జరిగాయో ఒక జాబితా సిద్ధం చేసి వాటిల్లో ఎన్నింటిపై చర్యలు తీసుకున్నారు? ఎన్ని అంశాలు పెండింగ్‌లో ఉన్నాయి? వంటి వివరాలను వెబ్‌సైట్‌లో ఉంచాలి.

కోడ్ ఉల్లంఘనలను నేరుగా ఇతర చట్టాలకు అనుసంధానించడం జరిగితే వాటిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత అధికార యంత్రాంగంపై పడుతుంది. అయితే, ఈ చర్యలన్నీ రాజకీయ పార్టీలు కోడ్ విషయంలో స్వీయ నియంత్రణ పాటించేలా చేస్తాయా? ఇది మన రాజకీయ నేతల క్యారెక్టర్‌పై ఆధారపడి ఉంటుంది. అయితే ఈ వ్యవహారాలకు న్యాయనిర్ణేతగా వ్యవహరించే వారి విచక్షణాధికారాలకు పరిమితి విధిస్తుందనడంలో సందేహం లేదు. తద్వారా ఎన్నికల ప్రధానాధికారిపై విపక్ష, ఏకపక్ష ధోరణి వంటి ఆరోపణలు వచ్చే అవకాశాలు తగ్గుతాయి. ఉల్లంఘనలపై తీసుకునే చర్యలు నిర్దిష్ట కాలావధిలోగా పూర్తవుతాయన్న భరోసా ఎన్నికల కమిషన్ ప్రజలకు కల్పించడం కూడా అవసరమే. వీటన్నింటికంటే ముఖ్యమైన విషయం ఇంకోటి ఉంది. నాయకత్వం వహిస్తున్న వారు ఆదర్శప్రాయంగా వ్యవహరిస్తే ఎలాంటి మోడల్ కోడ్‌లూ అవసరం ఉండదు.

వ్యాసకర్త ఎన్నికల మాజీ ప్రధాన అధికారి

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

అతడిని నిలపాలా?



ఎన్డీయే కూటమి 400 పైచిలుకు స్థానాలను గెలుచుకుంటుందన్న ఆత్మవిశ్వాసం బీజేపీకి ఉన్నప్పుడు, అది బ్రిజ్‌భూషణ్ కొడుకును అభ్యర్థిగా నిలపవలసింది కాదు. అది మన ఒలింపిక్ అమ్మాయిలదే కాదు, లైంగిక దుర్వర్తనకు వ్యతిరేకంగా పోరాడుతున్న ప్రతి అమ్మాయి నైతిక స్థైర్యాన్ని దెబ్బకొడుతుంది.

– ప్రీతిష్ నంది, మాజీ ఎంపీ, జర్నలిస్ట్

తెలిసే అడుగుతున్నారా?



యూరప్ మీకు ఉచిత విద్య ఇచ్చింది, ఉచిత ఆరోగ్య సేవలు ఇచ్చింది, ఉచిత ఇల్లు ఇచ్చింది, మిగతా ఇస్లామిక్ ప్రపంచం మిమ్మల్ని కాదనుకున్నప్పుడు మీకు సురక్షితమైన ఆశ్రయం ఇచ్చింది: ఇప్పుడు యూరప్‌ను తిరిగి ఇస్లామిక్ నియంతృత్వంగా మార్చాలని కోరడం ద్వారా మీరు మీ రుణం తీర్చుకుంటున్నారా? ఈ జనాలకు ఏమైంది?

– లుయిూ అహ్మద్, స్వీడన్ కాలమిస్ట్

కొట్టలేకుండా వేస్తే...



ఫోర్లకు అవార్డుంది, సిక్సులకు అవార్డుంది, ఆఖరికి అత్యధిక స్ట్రైక్ రేటుకు కూడా ఉంది. బ్యాట్స్‌మన్ ఏది చేసినా మనం గుర్తిస్తాం. బౌలర్లు వేసే డాట్ బాల్స్‌ను గుర్తించాల్సిన సమయం ఇదే. ఈ ఫార్మట్ (టీ20)లో ఇది అత్యంత విలువైనది.

– రాహుల్ రవీంద్రన్, నటుడు

ఎవరిది కుట్ర?



కొన్నేళ్ల క్రితం, కోవిడ్ టీకాలు రక్తాన్ని గడ్డకట్టిస్తాయని (బ్లడ్ క్లాట్స్) హెచ్చరించినవాళ్లను 'కుట్ర సిద్ధాంతకారులు' అని ముద్ర వేయడం గుర్తుందా? ఇప్పుడు ఆస్ట్రాజెనెకా కంపెనీ కోర్టులో దాన్నే అంగీకరించింది. కుట్ర సిద్ధాంతకారులు మరోసారి నిజమే అని తేలింది.

– పీటర్ స్వీడన్, జర్నలిస్ట్

ఎండల్లో హోయ్



బెంగళూరుకు బయట నివసించే ప్రతి ఒక్కరికీ తెలియజేయునది ఏమనగా, ఇక్కడ వర్షం పడుతోంది! సందేహం లేదు, ఈ అప్‌డేట్ కోసం మీరు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారని తెలుసు.

– రమేశ్ శ్రీవత్స, వ్యంగ్య వ్యాఖ్యాత

ఇన్ బాక్స్

ప్రజాస్వామ్యమే ఎజెండా

'ఏ దేశ భవిష్యత్తు అయినా ఆ దేశ విద్యావంతుల మీద ఆధారపడి ఉంటుంది' అంటారు బాబా సాహెబ్ అంబేడ్కర్. ప్రస్తుతం దేశంలో భిన్న సమూహాలు లేకుండా కేవలం ఒకే ఒక్క మతం మాత్రం ఉండాలి, ఒకే ఒక్క భాష మాత్రమే ఉండాలి, ఒకే ఒక్క సంస్కృతి మాత్రమే ఉండాలి అనే దుర్మార్గం చాపకింద నీరులా విస్తరిస్తోంది. ఇవాళ బీజేపీ రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో 400 సీట్లు సాధిస్తామని ప్రగల్భాలు పలుకుతోంది. అందుకోసం ఎంతకైనా తెగించడానికి సిద్ధమవుతోంది. ముఖ్యంగా హిందూ మతాన్ని అందుకు ఆధారం చేసుకుంటోంది. బహుళ మతాలు, జాతులు, సంస్కృతులు ఉన్న ఈ దేశంలో మూడువేల యేండ్ల క్రితమే మనువాదం కులవ్యవస్థ రూపంలో మనుషులను విభజించింది. దానిని ప్రస్తుత బీజేపీ ప్రభుత్వం కొనసాగిస్తోంది. ఇవాళ దళితులు, మైనారిటీల మీద జరుగుతున్న దాడులు ఇందులో భాగంగానే చూడాలి.

మనది ఆధునిక రాజ్యాంగం. ఇది అందరికీ విద్యాహక్కు, ఆస్తి హక్కు, పాలించే హక్కు ఉండాలని చెబుతోంది. దీనిని పక్కన పెట్టి మానవ హక్కులను కాలరాసే మూడువేల యేండ్ల నాటి మనుస్మృతి రాజ్యాంగాన్నే మన పాలకులు అమలుచేసే పనిలో ఉన్నారు. అందులో భాగంగానే మనం జనం తినే తిండి మీద, ధరించే బట్ట మీద వాళ్లు ఆంక్షలు పెడుతున్నారు.


ఒక వైపు వేలకోట్ల రూపాయలను కార్పొరేటు శక్తుల జేబులు నింపుతోంది మోదీ–షా ద్వయం. మరోవైపు కార్పొరేటు శక్తులు మతోన్మాదానికి పెట్టుబడిని అందిస్తున్నాయి. దీనంతటికీ కారణం మతమే రాజ్యంగా అవతరించడమూ, అలాగే మతమే కార్పొరేటు శక్తిగా ఆవిర్భవించడం అనే పరిణామం ఈ దేశంలో ప్రస్తుతం ఏకకాలంలో సంభవించడం.

ప్రగతిశీల ప్రజాస్వామికవాదులంతా ఐక్యంగా నిలబడాల్సిన ఒక సందర్భం ముందుకు వచ్చింది. ముఖ్యంగా విద్యావంతులు, మేధావులు ప్రజలను మేల్కొలిపే బాధ్యతను స్వీకరించాలి. ప్రజలు కూడా ఫాసిస్ట్ పాలకుల ద్వంద్వ విలువలను అర్థం చేసుకోవాలి. ప్రజలను తమ స్వార్థ ప్రయోజనాలకు బలిచేసిన వారికి ఓటుతోనే బుద్ధి చెప్పాలి.

– డా॥ పసునూరి రవీందర్
కవి, రచయిత । 77026 48825

దశ దిశ మార్చే విజన్ అంటే ఇదే కదా!

అభిప్రాయం



అడుసుమిల్లి జయప్రకాష్

అటు సంక్షేమం, ఇటు అభివృద్ధి... రెండు పగ్గాలను ఒకే చేత్తో పట్టుకొని ప్రభుత్వాన్ని జనరంజకంగా నడపడం సాధారణ విషయం కాదు. గత ఐదేళ్లగా రాష్ట్రంలో వైఎస్ జగన్ మోహన్ రెడ్డి నడకను చూస్తే ఈ విషయం స్పష్టమవుతుంది. తాను పాలన చేపట్టేనాటికి ఉన్న అస్తవ్యస్తమైన పాలనను గాడిలో పెట్టడమే గాక ప్రతి పథకాన్నీ ఒక విజన్‌తో రూపొందించడం జగన్ ప్రత్యేకతగా చెప్పుకోవచ్చు. విద్య, వైద్యం, మౌలిక అవస్థాపనా సౌకర్యాల ఏర్పాటు, వ్యవసాయం, రైతు సంక్షేమం, బడుగు ప్రజలకు ఆవాసం... ఇలా ఏ కార్యక్రమాన్ని తీసుకున్నా వాటి వెనుక సంక్షేమం, అభివృద్ధి అనే రెండు కాన్సెప్టులూ పడుగు పేకల్లా కలిసే కనిపిస్తాయి.

రాష్ట్ర విభజన జరిగిన తర్వాత 13 జిల్లాల ఆంధ్రప్రదేశ్ మాత్రమే మనకు మిగిలితే, ఆ సంఖ్యను రెట్టింపు చేసి 26 జిల్లాల రాష్ట్రంగా మార్చడంలో జగన్ విజన్ ఏమిటో మనకు స్పష్టమవుతుంది. అధికార వికేంద్రీకరణ జరిగితేనే ప్రజల వద్దకు పాలన అనే విజన్ కార్యరూపంలోకి వస్తుంది గనుక జిల్లాలను విభజించి కలెక్టర్లు, ఎస్పీలు ప్రజలకు మరింత దగ్గరయ్యేట్లు చేశారు. గ్రామ సచివాలయాలు ఏర్పాటు చేసి ప్రభుత్వ పథకాలను ప్రజల ముంగిటకు చేర్చారు.

ఏ శ్రేయో రాజ్యంలోనైనా ఉద్యోగ కల్పన అనేది చాలా ముఖ్యమైన అంశం. ప్రజలకు ఎంత ఎక్కువగా ఉపాధి సమకూరితే రాష్ట్రం అంత ఎక్కువగా అభివృద్ధి చెందుతుంది. రాష్ట్ర విభజన తర్వాత మొదటి అయిదేళ్లలో టీడీపీ ప్రభుత్వం 34 వేల ఉద్యోగాలు మాత్రమే ఇవ్వగా, వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత దాదాపు నాలుగు లక్షలకు పైనే ఉద్యోగాలు ఇచ్చింది. దీనికి అధికారికమైన లెక్కలు ఉన్నాయి. వాటిలో పర్మినెంట్ ఉద్యోగాలే 2.31 లక్షలు ఉన్నాయంటే యువతకు ఉద్యోగాల కల్పన అంశానికి జగన్ ప్రభుత్వం ఎంతటి ప్రాధాన్యమిచ్చిందో అర్థమవుతుంది. సరైన విజన్ అంటే ఇదేకదా!!

ఉద్యోగాలు ఇంత పెద్ద ఎత్తున ఇవ్వడమేకాదు, ముందు ముందు యువతకు మరిన్ని ఉపాధి అవకాశాలు కల్పించడం కోసం వాటికి 'నైపుణ్య శిక్షణ' ఇచ్చే కార్యక్రమాలు రూపొందించడం మరింత ప్రత్యేకమైనదిగా చెప్పవచ్చు. ఇంజినీరింగ్, ఇతర విభాగాలలో విద్యార్థుల నైపుణ్యాలను మరింత మెరుగుపరచి వారిని వివిధ పరిశ్రమల్లో పనిచేయడానికి అర్హులుగా చేయడానికి ప్రతి పార్లమెంటు నియోజకవర్గ కేంద్రంలో స్కిల్ డెవలప్మెంట్ కాలేజీలు, తిరుపతి, విశాఖ నగరాల్లో స్కిల్ డెవలప్మెంట్ వర్సిటీలు కూడా సంకల్పించారు. విద్యార్థులకు మెరుగైన భవిష్యత్తు ఇవ్వాలనుకొనేవారు ఏ విధంగా ఆలోచిస్తారో దీనిని బట్టి తెలుసుకోవచ్చు. సమాజంలోని వివిధ ప్రాధాన్య వర్గాలను బేరీజు వేసుకొని వారికి సరిపోయే ప్రణాళిక రూపొందించాలనేది సరైన విజన్ ఉన్న నేతకే సాధ్యమవుతుందని కూడా దీనిని బట్టి అర్థమవుతుంది.

బడుగు ప్రజలు కూడా సమాజంలోని అన్ని రంగాలలో అభివృద్ధి చెందాలనీ, అభివృద్ధి ఫలితాలు వారు కూడా అందుకోవాలనే లక్ష్యంతో జగన్ తమ మొదటి మేనిఫెస్టోలోనే ఎన్నో సంక్షేమ పథకాలను ప్రకటించారు. 'నవరత్నాల'ను ప్రజలందరికీ అందించారు. కొద్ది రోజుల క్రితం విడుదల చేసిన రెండో మేనిఫెస్టోలో... గతంలో ఇచ్చిన హామీలను ఎలా నెరవేర్చారో తెలియజేసి, కొత్తగా మరికొన్ని పథకాలను ప్రతిపాదించారు. వాటిలో ముఖ్యంగా పేద పిల్లల చదువులకు ముఖ్యమంత్రి ఎంత ప్రాధాన్యమిచ్చారో చూస్తే అర్థమవుతుంది. ఆడపిల్లలు బాగా చదువుకోవాలనీ, అన్ని రంగాలలో ముందుకు వెళ్ళాలనే లక్ష్యంతో ప్రాథమిక విద్య నుంచి అనేక పథకాలను ప్రవేశపెట్టారు. 'అమ్మఒడి', 'విద్యా దీవెన' 'కళ్యాణమస్తు', వంటి పథకాలు అందుకే ప్రజల ఆదరణను అంతగా చూరగొన్నాయి.



ఆరోగ్యం, విద్య, జీవన ప్రమాణాలు... ఈ మూడు అంశాలలో రాష్ట్రం సాధించిన ప్రగతినే 'వాస్తవ అభివృద్ధి'గా చెబుతారు. అందుకే ఈ అంశాలకు జగన్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఎక్కువ ప్రాధాన్యమిచ్చినట్లు కనిపిస్తుంది. మానవాభివృద్ధి పథకాలు ఎంత ఎక్కువగా అమలైతే, సంక్షేమం అంత అభివృద్ధిగా మారుతుంది. ఇది తెలియని చాలా మంది సంక్షేమాన్ని అభివృద్ధిని వేర్వేరుగా చూస్తుంటారు. సంక్షేమం ముందుకు వెళ్తే అభివృద్ధిగా మారుతుందనే సిద్ధాంతాన్ని జగన్ నమ్మారు కనుకనే జగన్ అన్ని సంక్షేమ కార్యక్రమాలు అమలు చేయగలుగుతున్నారు. ప్రజలు ఆరోగ్యవంతులైతేనే ఎన్ని పనులైనా చేయగలుగుతారు. దానిని దృష్టిలో ఉంచుకొనే ఆరోగ్యరంగాభివృద్ధికి ప్రభుత్వం పలు కొత్త పథకాలను ప్రవేశపెట్టి అమలు చేస్తోంది. వైఎస్సార్ పేరిట, జగన్ పేరిట పలు పథకాలు అమలవు తున్నాయి. కొత్తగా పలువైద్య కళాశాలల ఏర్పాటుకు కృషి జరుగుతోంది.


'ఆరోగ్య శ్రీ' ద్వారా రూ. 25 లక్షల విలువైన వైద్య చికిత్స అందించడానికి జగన్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం దేశంలో పేరుపొందింది. పేదలు చికిత్స కోసం ఎలాంటి అప్పులు చేయరాదనే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ పథకాన్ని రూపొందించింది. ఆరోగ్యశ్రీ పరిధిని విస్తరించడం, ఉచిత సేవలను ఎక్కువ ఆసుపత్రులకు విస్తరించడం, చివరకు కేన్సర్ చికిత్స కూడా ఉచితంగా అందించడం ఎంతో విశేషం. చికిత్స అనంతరం వైద్యులు సూచించిన విశ్రాంతి సమయంలో 'ఆరోగ్య ఆసరా'తో ఆదుకుంటున్నది వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం. వృద్ధాప్య పెన్షన్ పెంపు, 'వైఎస్సార్ చేయూత' వంటి పథకాల ద్వారా ఏ ఇంటిలోనూ ఎలాంటి సమస్యలు లేని వాతావరణం సృష్టించడంకంటే 'శ్రేయోరాజ్య'నికి అసలైన అర్థం ఇంకేం ఉంటుంది?

పాలనలో పిరమిడ్ నమూనాను పక్కన పెట్టి, చతురస్ర నమూనాను స్వీకరించడం జగన్ ప్రత్యేకత. ప్రభుత్వ పథకాలు అమలు అన్ని వైపులకు విస్తరించడానికి (అధికార యంత్రాంగం సమాజంలోని ఏ వర్గాన్ని వదలకుండా పథకాల ప్రయోజనాలు అందరికీ అందేట్లు చేయడం) ఈ చతురస్ర నమూనాను అనుసరించడం ఒక చక్కని ప్రయోగం. ఇలా ఒకటి రెండు కాదు, 'జగన్'ను తెర మీద పరచే కార్యక్రమాలు, పథకాలు అనేకానేకం. అన్నీ ప్రజాదరణ పొందడం ఒక విశేషం. వాటన్నిటితో పాటు మళ్లీ ప్రభుత్వం ఏర్పాటు కాగానే మరింత కొత్త 'విజన్'తో ముందుకు వస్తానని జగన్ ప్రకటించడం ముదావహం.

వ్యాసకర్త ఏపీ మాజీ శాసనసభ్యులు । 98481 28844

నిజమైన జీవితం

ఓమారు ఓ వృద్ధుడు బుద్ధుడి వద్దకు వచ్చారు. ఆయన బోధనలు వింటూ కొంతకాలం ఆయనతోనే గడిపారు. బుద్ధుని సాంగత్య ప్రభావంతో ఆయన నిజమైన భిక్కుగా మారి పోయారు. ఓరోజు బుద్ధుడు ఆయనను పిలిచి మాట్లాడారు. అప్పుడాయన బుద్ధుడు అడిగిన ఓ ప్రశ్నకు జవాబిస్తూ తనకిప్పుడు అయిదేళ్ళు అని అన్నారు. బుద్ధుడికి విషయం అర్థమైనా పైకి మాత్రం 'మీకిప్పుడు డెబ్బై ఏళ్లు ఉంటాయి కదా. కానీ అయిదేళ్ళంటారేంటీ' అని అడిగారు.



జ్యోతిర్మయం

దానికి ఆ పెద్దాయన 'ఎందుకిలా చెప్తున్నా నంటే, నిజమైన జ్ఞానం నాకు ఒంటబట్టి అయిదేళ్ళే అయ్యింది కనుక' అన్నారు. 'నా హృదయంలో ప్రేమ పుట్టిందీ ఈ అయిదేళ్ళలోనే. అంతకుముందు నేను జీవించిన కాలమంతా ఓ కల లాంటిదే. ఆ జీవితం ఎటువంటి ప్రయోజనం లేకుండా గడిపేశాను. అందువల్ల నాకిప్పుడు అయిదేళ్ల వయసే'.

ఆ వృద్ధుని అవగాహన సరైనదే. ఈ ప్రపంచంలో జీవిస్తున్న వారందరూ నిజమైన జీవితాన్ని గడుపుతున్నారని అనుకోవడానికి వీల్లేదు. తమిళులు దక్షిణ వేదంగా భావించే 'తిరుక్కురళ్' కర్త తిరువల్లువర్... ఆరోపణలు, ప్రత్యారోపణలు వంటి వాటికి అతీతంగా జీవించాలన్నారు. అదే నిజమైన జీవితమవుతుందన్నారు. 'ఎదుటి మనిషికి సాయం చేయడంతో లభించే ఖ్యాతితో బతకాలి. అంతే తప్ప ఎవరికో ఒకరికి హాని చేసి దాని వల్ల మూట కట్టుకునే అపఖ్యాతితో బతికే బతుకు ఓ బతుకే కాదు.'

దుష్ట ఆలోచనలు రానీయక సదా మంచి ఆలోచనలతో మంచి చేతలతో బతకాలి. ఒకరికి ఉపకారం చేయకపోయినా పరవాలేదు అపకారం చేయకూడద'ని అనుభవజ్ఞులు చెప్పడం అందుకే.

– యామిజాల జగదీశ్

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంత ఋతువు, చైత్ర మాసం, **తిథి:** బ.ఏకాదశి సా.5.58 వరకు, తదుపరి ద్వాదశి, **నక్షత్రం:** పూర్వాభాద్ర రా.7.51 వరకు, తదుపరి ఉత్తరాభాద్ర, **వర్జ్యం:** ఉ.8.44 నుండి 10.13 వరకు, తిరిగి రా.1.54 నుండి 3.23 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.5.36 నుండి 7.13 వరకు, **అమృతఘడియలు:** ప.12.27 నుండి 1.56 వరకు; **రాహుకాలం:** ఉ.9.00 నుండి 10.30 వరకు, **యమగండం:** ప.1.30 నుండి 3.00 వరకు, **సూర్యోదయం:** 5.37, **సూర్యాస్తమయం:** 6.16.


D Mart®
Daily Discounts Daily Savings
సెలవుల షాపింగ్
ఇప్పుడు బడ్జెట్‌లో
DMart ready
గ్రోసరీ మరియు రోజువారీ అవసరాలు
₹ 40.50* మాత్రమే లూస్ చక్కెర 1 కిలో
₹ 31* మాత్రమే లూస్ గోధుమ పిండి 1 కిలో
₹ 51* మాత్రమే లూస్ సోనా మసూరి కర్నూల్ రైస్ 1 కిలో
₹ 50* మాత్రమే లూస్ సోనా మసూరి రాయచూర్ స్టీమ్ రైస్ 1 కిలో
₹ 89* మాత్రమే లూస్ బిర్యానీ రైస్ 1 కిలో
₹ 127* మాత్రమే లూస్ మినప గుళ్ళు 1 కిలో
₹ 165* మాత్రమే లూజ్ కందిపప్పు 1 కిలో
₹ 35* మాత్రమే లూస్ ఇడ్లీ రవ్వ 1 కిలో
₹ 59* మాత్రమే లూస్ వడియాలు 1 కిలో
₹ 170* మాత్రమే జీరా 500 గ్రాములు ఎంఆర్‌పి ₹ 274
₹ 349* మాత్రమే కాజు 500 గ్రాములు ఎంఆర్‌పి ₹ 577
₹ 115* మాత్రమే ఇండియన్ కిస్మిస్ 500 గ్రాములు ఎంఆర్‌పి ₹ 187
₹ 289* మాత్రమే స్వాద్ బాదంపప్పు 500 గ్రాములు ఎంఆర్‌పి ₹ 450
₹ 355* మాత్రమే స్వాద్ పిస్తా 400 గ్రాములు ఎంఆర్‌పి ₹ 564
కొనండి 1 పొందండి 1 ఉచితంగా సన్‌ఫీస్ట్ డార్క్ ఫాంటసీ చోకో ఫిల్స్ 600 గ్రాములు ఎంఆర్‌పి ₹ 340*
కొనండి 1 పొందండి 1 ఉచితంగా పిల్లే రియల్ ఇలైచి రస్క్ 1 కిలో ఎంఆర్‌పి ₹ 200*
కొనండి 1 పొందండి 1 ఉచితంగా దొడ్ల కర్డ్ పౌచ్ 500 గ్రాములు ఎంఆర్‌పి ₹ 48*
₹ 599* మాత్రమే ప్రొ వి సెలెక్ట్ కాలిఫోర్నియా బాదంపప్పు 1 కిలో ఎంఆర్‌పి ₹ 1,349
₹ 135* మాత్రమే లోట్టె చోకో పై 504 గ్రాములు ఎంఆర్‌పి ₹ 220
₹ 45* మాత్రమే అప్పీ ఫిజ్ ఆపిల్ ఫ్లేవర్ స్పార్క్లింగ్ డ్రింక్ 1 లీ ఎంఆర్‌పి ₹ 60
₹ 125* మాత్రమే థమ్స్ అప్ మల్టీప్యాక్ బాటిల్ 8U x 250 ప్రతి మి.లీ ఎంఆర్‌పి ₹ 160
కొనండి 1 పొందండి 1 ఉచితంగా నివియా మెన్ డీప్ ఇంపాక్ట్ ఫ్రెష్‌నెస్ రోల్-ఆన్ 50 మి.లీ ఎంఆర్‌పి ₹ 240*
కొనండి 1 పొందండి 1 ఉచితంగా షవర్ టు షవర్ కొలోన్ టాల్క్ 150 గ్రాములు ఎంఆర్‌పి ₹ 145*
కొనండి 1 పొందండి 1 ఉచితంగా లైఫ్ బాయ్ లెమన్ ఫ్రెష్ సోప్ 5x125 గ్రాములు ఎంఆర్‌పి ₹ 370*
₹ 160* మాత్రమే పారాచూట్ ఆలోవెరా హెయిర్ ఆయిల్ 400 మి.లీ ఎంఆర్‌పి ₹ 260
₹ 299* మాత్రమే విప్రో సాఫ్ట్ టచ్ 2 ఎక్స్ ఫ్రెంచ్ పెర్ఫ్యూమ్ ఫాబ్రిక్ కండీషనర్ 2 లీ ఎంఆర్‌పి ₹ 480
₹ 599*/₹ 539* మాత్రమే సర్ఫ్ ఎక్సెల్ మాటిక్ ఫ్రంట్ లోడ్/టాప్ లోడ్ లిక్విడ్ డిటర్జెంట్ 4 లీ ఎంఆర్‌పి ₹ 950/ ₹ 850
కొనండి 1 పొందండి 1 ఉచితంగా పార్క్ అవెన్యూ వోయేజ్ పెర్ఫ్యూమ్ స్ప్రే 220 మి.లీ ఎంఆర్‌పి ₹ 390*
ఇల్లు మరియు వంటగది
₹ 99** మాత్రమే ఎరా డాటెడ్ గ్లాస్ 6 పీస్‌ల సెట్ 210 మి.లీ ప్రతి ఎంఆర్‌పి ₹ 230
₹ 79** నుంచి ఐస్ ట్రే ఎక్స్‌ఎల్
₹ 69** మాత్రమే కుల్ఫీ మేకర్ 8 కోన్లు ఎంఆర్‌పి ₹ 80
₹ 329** మాత్రమే బకెట్ 25 లీ ఎంఆర్‌పి ₹ 380
₹ 249** మాత్రమే వెల్స్పన్ బాత్ టవల్ 70 సెం.మీ x 140 సెం.మీ ఎంఆర్‌పి ₹ 285
₹ 1,099** నుంచి సీలింగ్ ఫ్యాన్
ప్రయాణం మరియు క్రీడలు
₹ 299** నుంచి బ్యాడ్మింటన్ రాకెట్లు
₹ 349** మాత్రమే ఫుట్‌బాల్ ఎంఆర్‌పి ₹ 430
₹ 149** నుంచి స్టీల్ బాటిల్
₹ 699** మాత్రమే హైకింగ్ బ్యాగ్ ఎంఆర్‌పి ₹ 995
₹ 1,899** మాత్రమే వి.ఐ.పి - అరిస్టోక్రాట్ నెక్సస్ ట్రాలీ బ్యాగ్ 24 సెం.మీ x 37 సెం.మీ x 55 సెం.మీ ఎంఆర్‌పి ₹ 10,000
₹ 2,655** నుంచి వి.ఐ.పి ఇగ్నస్ ట్రాలీ బ్యాగ్ 24 సెం.మీ x 39 సెం.మీ x 55 సెం.మీ
దుస్తులు
₹ 299** నుంచి గర్ల్స్ ఫ్రాక్
₹ 229** నుంచి గర్ల్స్ జీన్స్
₹ 199** నుంచి గర్ల్స్ టాప్
₹ 79** నుంచి బాయ్స్ మరియు గర్ల్స్ టీ-షర్ట్
₹ 199** నుంచి బాయ్స్ షార్ట్స్
₹ 249** నుంచి బాయ్స్ జీన్స్
పాదరక్షలు ఎంఆర్‌పిపై కనీసం 7% తగ్గింపు
Paragon
walkmate
Bata
VKC
RELAXO
©Disney
కనీసం 6% డిస్కౌంట్
₹ 199** నుంచి లేడీస్ ఎతినిక్ షార్ట్/లాంగ్ కుర్తా
₹ 99** నుంచి లేడీస్ దుపట్టా/స్టోల్
₹ 199** నుంచి లేడీస్ యాంకిల్ కాటన్ స్ట్రెచింగ్ లెగ్గింగ్
₹ 499** నుంచి లేడీస్ డ్రెస్సులు
₹ 99** నుంచి లేడీస్ క్యాజువల్ లోయర్
₹ 99** నుంచి లేడీస్ టీ-షర్ట్
₹ 149** నుంచి లేడీస్ టాప్
₹ 349** నుంచి లేడీస్ డెనిమ్/జెగ్గింగ్
₹ 169** నుంచి లేడీస్ లాంగ్ నైటీ
₹ 199** నుంచి లేడీస్ పైజామా
₹ 99** నుంచి పురుషుల ఫ్యాన్సీ టీ-షర్ట్
₹ 199** నుంచి పురుషుల కాజువల్/ఫార్మల్ షర్ట్
₹ 349** నుంచి పురుషుల ఫార్మల్ ట్రౌజర్/జీన్స్
₹ 449** నుంచి పురుషుల కాటన్ చినోస్
₹ 99** నుంచి ఫ్యాషన్ క్యాప్
₹ 149** నుంచి పురుషుల ఫ్యాషన్ షర్ట్
ఎంఆర్‌పిపై కనీసం 25% తగ్గింపు అన్ని బ్రాండెడ్ పురుషుల అండర్ గార్మెంట్స్
రామంతాపూర్: 040-27032906 • ఉప్పల్ భాగ్: 9154846426 • మేడిపల్లి: 7337325489 • ఉప్పల్ రంగారెడ్డి, తెలంగాణ డీమార్ట్: 040-29331007 • బండ్లగూడ: 040-29556703 • సనత్‌నగర్ (మైహోమ్): 040-69014700 • బాలానగర్: 040-23075362 • మూసాపేట (పిపిఎస్ఆర్): 040-29568367/65 • కొంపల్లి: 040-27165371 • అంబర్‌పేట్: 040-27428335
హైదర్‌గూడ (హిమాయత్‌నగర్): 040-23298560 • కాటేదాన్: 040-29550956 • మదీనాగూడ (మియాపూర్): 040-23047281 • ఆరసి పురం: 0845-5297917 • నల్లగండ్ల: 040-29568265 • హాఫీజ్‌పేట్: 040-49024270 • కూకట్‌పల్లి (ఎన్ఎస్ఎల్): 040-29568182 • షేక్‌పేట్ (టోలి చౌకీ): 7207851375 • కావూరి హిల్స్: 040- 43730255
ఉప్పర్‌పల్లి (అత్తాపూర్): 040-29705890 • బోయినపల్లి: 040-46014924 • ఎస్.డి. రోడ్డు (సికింద్రాబాద్): 040 27718041 • కుషాయిగూడ: 040-49884386 • సాహిల్‌గూడ: 040-27130123 • వనస్థలిపురం: 040-29882485 • చంపాపేట: 7207268492 • మలక్‌పేట: 040-68234900 • ఎల్.బి నగర్: 040-69019809 • ఘట్కేసర్: 7382054232
సూర్యాపేట: 8684-293301 • నిజాంపేట: 040-29370013 • నార్సింగి: 8333905810 • మిర్యాలగూడ: 8500259852
చిత్రాలు ప్రాతినిధ్య ప్రయోజనాల కోసం మాత్రమే • ఉత్పత్తి ఆఫర్‌లు స్టాక్‌లు ఉండే వరకు చెల్లుబాటు అవుతాయి • స్టోరాలను బట్టి ధరలు మరియు ఆఫర్‌లు మారవచ్చు
ప్రదర్శించబడే బ్రాండ్‌లు సంబంధిత బ్రాండ్ యజమానుల స్వంతం • ^ నిర్వాహణ తర అలోచనుసారం ధరలను మార్చడానికి మరియు ఉత్పత్తులను విక్రయించే హక్కును కలిగి ఉంది. • నియమ నిబంధనలు వర్తిస్తాయి • *రిటైల్ విక్రయ ధర• #
1N
Impulse/05/24



శుక్రవారం రాయ్‌బరేలీలో రిటర్నింగ్ అధికారికి నామినేషన్ పత్రాలను అందజేస్తున్న రాహుల్ గాంధీ. చిత్రంలో సోనియా గాంధీ, ప్రియాంకా గాంధీ, రాబర్ట్ వాద్రా

రాయ్‌బరేలీ నుంచి రాహుల్ గాంధీ

అమేథీ నుంచి కిశోరీలాల్

- ఉత్తరప్రదేశ్‌లో కాంగ్రెస్ కంచుకోటలపై ఉత్కంఠకు తెర
- సోనియా గాంధీ 20 ఏళ్లు ప్రాతినిధ్యం వహించిన స్థానం నుంచి తనయుడి పోటీ
- ఈసారి పోటీకి దూరంగా ప్రియాంకా గాంధీ

సాక్షి, న్యూఢిల్లీ: ఉత్తరప్రదేశ్‌లో కాంగ్రెస్ కంచుకోటలైన రాయ్‌బరేలీ, అమేథీ లోక్‌సభ స్థానాల్లో ఈసారి ఎవరు పోటీ చేస్తారన్న దానిపై కొన్నిరోజులుగా కొనసాగుతున్న ఉత్కంఠకు తెరపడింది. ఈ రెండు స్థానాల్లో తమ అభ్యర్థులను కాంగ్రెస్ అధిష్టానం శుక్రవారం ఉదయం ప్రకటించింది. రాయ్‌బరేలీ నుంచి అనూహ్యంగా రాహుల్ గాంధీ పోటీకి దిగుతున్నారు. సోనియా గాంధీ కుటుంబానికి వీరవిధేయుడైన కిశోరీలాల్ శర్మ అమేథీ నుంచి పోటీ చేస్తున్నారు. రాహుల్, కిశోరీలాల్ శుక్రవారమే నామినేషన్లు దాఖలు చేశారు. ఈ రెండు నియోజకవర్గాల్లో ఐదో విడతలో భాగంగా ఈ నెల 20న పోలింగ్ జరుగనుంది.

రాయ్‌బరేలీ నుంచి రాహుల్ గాంధీ అభ్యర్థిత్వం ఖరారు కావడం అందరినీ ఆశ్చర్యానికి గురిచేసింది. ఈ స్థానంలో ఆయన సోదరి, పార్టీ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ వాద్రాను బరిలోకి దింపాలని పలువురు కాంగ్రెస్ సీనియర్లు పట్టుబట్టారు. కాంగ్రెస్ వారసత్వ రాజకీయాలు చేస్తోందని, ఆ పార్టీలో సోనియా గాంధీ కుటుంబానిదే అసలు పెత్తనం అంటూ బీజేపీ విమర్శలు చేస్తున్న నేపథ్యంలో ఈ ఎన్నికల్లో పోటీకి దూరంగా ఉండాలని ప్రియాంక గాంధీ నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది. దీంతో ఎవరూ ఊహించని విధంగా రాయ్‌బరేలీ నుంచి రాహుల్ పేరు తెరపైకి వచ్చింది. గత ఎన్నికల్లో రాయ్‌బరేలీ నుంచి ఎంపీగా గెలిచిన సోనియా గాంధీ ఈసారి పోటీ చేయడం లేదు. ఆమె ఇప్పటికే రాజస్తాన్ నుంచి రాజ్యసభకు ఎన్నికయ్యారు. రాయ్‌బరేలీ స్థానం ప్రస్తుతం ఖాళీగానే ఉంది. రాహుల్ గాంధీని పోటీ చేయించడం ద్వారా ఇక్కడ మరోసారి విజయకేతనం ఎగురవేయాలని, తమ పట్టు నిలుపుకోవాలని కాంగ్రెస్ అధిష్టానం భావిస్తోంది. తన తల్లి సోనియా గాంధీ 20 ఏళ్లపాటు ప్రాతినిధ్యం వహించిన లోక్‌సభ స్థానం నుంచి రాహుల్ పోటీకి దిగుతుండడం ఆసక్తికరంగా మారింది.

రాయ్‌బరేలీలో రాహుల్ నామినేషన్

ఉత్తరప్రదేశ్‌లోని రాయ్‌బరేలీ లోక్‌సభ స్థానం నుంచి పోటీకి కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ శుక్రవారం నామినేషన్ దాఖలు చేశారు. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, పార్లమెంటరీ పార్టీ నేత సోనియా గాంధీ, కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ వాద్రా, ఆమె భర్త రాబర్ట్ వాద్రాలతో కలిసి రాహుల్ తన నామినేషన్ పత్రాలను రాయ్‌బరేలీ జిల్లా మెజిస్ట్రేట్ హర్షితా మాథుర్‌కు అందజేశారు. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కె.సి.వేణుగోపాల్, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, రాజస్తాన్ మాజీ ముఖ్యమంత్రి అశోక్ గహ్లోత్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా రాహుల్‌కు మద్దతుగా కాంగ్రెస్, సమాజ్‌వాదీ పార్టీ కార్యకర్తలు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. బీజేపీ కార్యకర్తలు 'గో బ్యాక్ రాహుల్' అంటూ నినాదాలు చేస్తూ కనిపించారు. ఈ ఎన్నికల్లో రాయ్‌బరేలీలో బీజేపీ అభ్యర్థిగా ఉత్తరప్రదేశ్ మంత్రి దినేష్ ప్రతాప్ సింగ్‌తో బరిలో నిలిచారు.

రూ.20 కోట్లకు పైగా ఆస్తులు

తనకు రూ.20 కోట్లకు పైగా ఆస్తులు ఉన్నట్లు రాహుల్ తన నామినేషన్ పత్రాల్లో వెల్లడించారు. రూ.3.81 కోట్ల విలువైన షేర్లతో కలిపి రూ.9.24 కోట్ల విలువైన చరాస్తులు ఉన్నట్లు తెలియజేశారు. రూ.26.25 లక్షల బ్యాంక్ బ్యాలెన్స్, రూ.15.21 కోట్ల విలువైన గోల్డ్ బాండ్లు ఉన్నట్లు పేర్కొన్నారు. అలాగే రూ.11.15 కోట్ల స్థిరాస్తులు ఉన్నట్లు తెలిపారు. ప్రస్తుతం చేతిలో రూ.55 వేల నగదు ఉందని, రూ.49.79 లక్షల అప్పులు ఉన్నాయని ప్రస్తావించారు. 2022–23 ఆర్థిక సంవత్సరంలో రాహుల్ వార్షికాదాయం రూ.1.02 కోట్లు.

మా కర్మభూమి రాయ్‌బరేలీ

రాయ్‌బరేలీ నుంచి పోటీ చేస్తుండడం తనకు భావోద్వేగ సమయమని రాహుల్ గాంధీ పేర్కొన్నారు. నామినేషన్ దాఖలు చేసిన అనంతరం ఆయన 'ఎక్స్'లో పోస్టు చేశారు. ''మా కుటుంబానికి కర్మభూమి అయిన రాయ్‌బరేలీని మా తల్లి సోనియా గాంధీ ఎంతో నమ్మకంతో నాకు అప్పగించారు. ఇక్కడి ప్రజలకు సేవ చేసుకొనే భాగ్యం కల్పించారు. అమేథీ, రాయ్‌బరేలీ లోక్‌సభ స్థానాలు నాకు వేర్వేరు కాదు. ఇవి రెండూ నా సొంత కుటుంబం లాంటివే. 40 ఏళ్లుగా అమేథీ నియోజకవర్గానికి సేవలందిస్తున్న కిశోరీలాల్ శర్మ ఇక్కడి నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేస్తుండడం నాకు చాలా సంతోషంగా ఉంది. దేశంలో రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని కాపాడుకొనేందుకు సాగుతున్న ఈ పోరాటంలో అందరూ నాకు అండగా నిలుస్తున్నారన్న విశ్వాసం ఉంది'' అని రాహుల్ వెల్లడించారు.

డరో మత్.. భాగో మత్

అమేథీలో పోటీచేసే ధైర్యం లేక రాయ్‌బరేలీకని ఎద్దేవా!

- రాహుల్ ఇకనైనా భయపడడం, పారిపోవడం ఆపాలి
- ఈ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు 50 సీట్లు కూడా కష్టమే
- ఆ పార్టీకి చరిత్రలోనే అత్యంత తక్కువ సీట్లు
- తేల్చిచెప్పిన ప్రధాని మోదీ
- పశ్చిమ బెంగాల్, జార్ఖండ్‌లో ఎన్నికల ప్రచారం

బర్ధమాన్/కృష్ణనగర్/చైబాసా: కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఉత్తరప్రదేశ్‌లోని రాయ్‌బరేలీ నుంచి ఎన్నికల బరిలోకి దిగుతుండడంపై ప్రధాని నరేంద్ర మోదీ వ్యంగ్యాస్త్రాలు విసిరారు. డరో మత్.. భాగో మత్(భయపడొద్దు.. దూరంగా పారిపోవద్దు) అంటూ రాహుల్‌కు సూచించారు. కేరళలోని వయనాడ్‌లో పోలింగ్ పూర్తికాగానే కాంగ్రెస్ యువరాజు అక్కడి నుంచి పారిపోయి మరో స్థానం వెతుక్కుంటాడని ఇంతకుముందే చెప్పానని, తాను చెప్పినట్లే జరిగిందని అన్నారు. కాంగ్రెస్ యువరాజు వయనాడ్‌లో ఓటమి తప్పదని గ్రహించి రాయ్‌బరేలీ నుంచి పోటీ చేస్తున్నాడని పేర్కొన్నారు. గత ఎన్నికల్లో అమేథీలో ఓడిపోయిన రాహుల్ గాంధీ వయనాడ్‌కు పారిపోయాడని, ఇప్పుడు అక్కడినుంచి రాయ్‌బరేలీకి వచ్చాడని పేర్కొన్నారు. ఈసారి అమేథీలో పోటీ చేసే ధైర్యం లేక రాయ్‌బరేలీని ఎంచుకున్నాడని ఎద్దేవా చేశారు. భయపడొద్దు అంటూ కాంగ్రెస్ నాయకులు తరచుగా ప్రజలకు చెబుతుంటారని, తాను అదే మాట ఇప్పుడు వారికి చెబుతున్నానని అన్నారు. ఇకనైనా భయపడడం, దూరంగా పారిపోవడం ఆపేయాలని రాహుల్ గాంధీకి హితవు పలికారు. శుక్రవారం పశ్చిమ బెంగాల్‌లోని బర్ధమాన్–దుర్గాపూర్, కృష్ణనగర్, బీర్భుమ్, బోల్‌పూర్ లోక్‌సభ స్థానాల పరిధిలో ఎన్నికల ప్రచార సభల్లో, జార్ఖండ్‌లోని చైబాసాలో 'మహా విజయ్ సంకల్ప సభ'లో ప్రధాని నరేంద్ర మోదీ ప్రసంగించారు. దేశంలో కాంగ్రెస్ ప్రభ మసకబారుతోందని, ప్రజాదరణ కోల్పోతోందని, ఈ ఎన్నికల్లో ఆ పార్టీకి చరిత్రలోనే అత్యంత తక్కువ స్థానాలు లభిస్తాయని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. కనీసం 50 సీట్లయినా గెలుచుకోవడం కష్టమేనని చెప్పారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ ఘోరంగా ఓడిపోతుందని చెప్పడానికి ఒపీనియన్ పోల్స్ గానీ, ఎగ్జిట్ పోల్స్ గానీ అవసరం లేదని అన్నారు. కాంగ్రెస్ ఓటమి గురించి తాను గతంలోనే పార్లమెంట్‌లో స్పష్టంగా చెప్పానని గుర్తుచేశారు. ఆ పార్టీ సీనియర్ నాయకురాలు(సోనియా గాంధీ) లోక్‌సభ ఎన్నికల్లో ఓటమి తప్పదని ముందే గుర్తించి, రాజస్తాన్ నుంచి రాజ్యసభలో అడుగుపెట్టారని వెల్లడించారు. కాంగ్రెస్ విజయం సాధిస్తుందన్న నమ్మకం ఆ పార్టీ నేతలకే లేదన్నారు. ఎన్నికల సభల్లో ప్రధాని మోదీ ఇంకా మాట్లాడారంటే..



మూడు సవాళ్లపై సమాధానమేదీ?

దేశంలో దళితులు, గిరిజనులు, ఓబీసీలు బీజేపీకి మద్దతుగా నిలుస్తుండడం చూసి కాంగ్రెస్ భరించలేకపోతోంది. అందుకే వారి రిజర్వేషన్లు లాక్కొని మైనార్టీలకు కట్టబెట్టాలని పథకం వేసింది. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే 'జిహాదీ ఓటు బ్యాంక్' కోసం ఎస్సీ, ఎస్టీ, ఓబీసీల రిజర్వేషన్లు లాక్కోవడం తథ్యం. కాంగ్రెస్‌తోపాటు విపక్ష కూటమికి నేను 3 సవాళ్లు విసురుతున్నా. మొదటిది.. అధికారంలోకి వస్తే రాజ్యాంగాన్ని మార్చబోమని లేదా మతం ఆధారం రిజర్వేషన్లు ఇవ్వబోమని దేశ ప్రజలకు లిఖిత పూర్వకంగా గ్యారంటీ ఇవ్వాలి. రెండోది.. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీల రిజర్వేషన్లను కాజేయబోమని, మతం ఆధారంగా ఆయా వర్గాల ప్రజలను విభజించబోమని రాతపూర్వకంగా హామీ ఇవ్వాలి. మూడోది.. ప్రతిపక్షాలు అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో ముస్లింలను ఓబీసీ కోటాలో చేర్చి రిజర్వేషన్లు కల్పించబోమని లిఖితపూర్వకంగా గ్యారంటీ ఇవ్వాలి. ఈ మూడు సవాళ్లపై ప్రతిపక్షాలు నోరుమెదపడం లేదు. నాకు సమాధానం ఇవ్వడం లేదు.

దశాబ్దాలుగా నిశ్శబ్దంగా 'ఓటు జిహాద్'

దేశంలో ఓటు జిహాద్ ఆట గత కొన్ని దశాబ్దాలుగా నిశ్శబ్దంగా కొనసాగుతూనే ఉంది. మోదీకి వ్యతిరేకంగా ఓటు జిహాద్ చేయాలని కొందరు పిలుపునిస్తున్నారు. ఇంత జరుగుతున్నా ప్రతిపక్షాలు నోరెత్తడం లేదు. అంటే ఈ పిలుపును ప్రతిపక్షాలు అంగీకరిస్తున్నట్లే లెక్క. ఓటు జిహాద్‌లో పాలుపంచుకున్నవారికి ప్రజల ఆస్తులను దోచిపెట్టాలని కాంగ్రెస్ కుట్రలు పన్నుతోంది. ప్రతిపక్ష 'ఇండియా' కూటమికి బుజ్జగింపు తప్ప మరో విధానం లేదు. మతం ఆధారంగా ఇప్పటికే మన దేశాన్ని ముక్కలు చేశారు. సిక్కులు, క్రైస్తవులు, పార్శీలు అవతలి గట్టుపై చిక్కుకొని నానా కష్టాలూ పడుతున్నారు. వారికి న్యాయం చేకూర్చడానికి పౌరసత్వ సవరణ చట్టం తీసుకొచ్చాం. కానీ, విపక్షాలు మాత్రం ఓటు బ్యాంక్ రాజకీయాలతో ఈ చట్టాన్ని వ్యతిరేకిస్తున్నాయి. దేశంలో వనరులపై, సందపపై ముమ్మాటికీ పేదలకే మొదటి హక్కు ఉంది. ఈ భూగోళంపై ఏ శక్తి కూడా మన రాజ్యాంగాన్ని మార్చేయలేదు. 15 సీట్లు కూడా నెగ్గలేని తృణమూల్ కాంగ్రెస్, 50 సీట్లయినా దక్కించుకోలేని కాంగ్రెస్ కేంద్రంలో స్థిరమైన ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయలేవు. ఎన్నికల్లో అత్యధిక స్థానాలు గెలిచి స్థిరమైన, బలమైన ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే సత్తా బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయేకు మాత్రమే ఉంది. పశ్చిమ బెంగాల్‌లో తృణమూల్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం హిందువులను రెండో తరగతి పౌరులుగా మార్చేసింది. విచ్చలవిడిగా అవినీతికి పాల్పడుతోంది. ఎన్నికల్లో ఆ పార్టీకి బుద్ధి చెప్పాలి. చిత్తుచిత్తుగా ఓడించాలి. ప్రజలను లూటీ చేసినవారిని శిక్షించకుండా వదిలిపెట్టబోమని గ్యారంటీ ఇస్తున్నా'' అని ప్రధాని మోదీ స్పష్టం చేశారు.

ఎవరీ కిశోరీ లాల్ శర్మ?



న్యూఢిల్లీ: అమేథీలో రాహుల్ బదులు బరిలో నిలిచిన కాంగ్రెస్ అభ్యర్థి కిశోరీ లాల్ శర్మ ఎవరబ్బా? అని నెటిజన్లు ఆన్‌లైన్‌లో తెగవెతికేస్తున్నారు. రాహుల్ గాంధీనే మట్టికరిపించిన స్మృతి ఇరానీని ఎన్నికల రణక్షేత్రంలో ఈయన ఢీకొట్టగలరా? అన్న మీమాంస స్థానిక ఓటర్లలో మొదలైంది. గాంధీల కుటుంబానికి అత్యంత సన్నిహితుడిగా శర్మకు పేరుంది. నాలుగు దశాబ్దాలుగా కాంగ్రెస్‌లో ఈయన క్రియాశీలంగా పనిచేస్తున్నారు. శర్మ సొంత రాష్ట్రం పంజాబ్. లూథియానా పట్టణానికి చెందిన శర్మ మాజీ ప్రధాని దివంగత రాజీవ్‌గాంధీకి సన్నిహితుడు. 1983లో రాజీవ్‌గాంధీతో పాటు ఒకేసారి ఉత్తరప్రదేశ్ రాజకీయాల్లో అడుగుపెట్టారు. ఆనాటి నుంచి యూపీ రాష్ట్ర రాజకీయాల్లోనే కొనసాగుతున్నారు. 1991 మే నెలలో రాజీవ్‌గాంధీ మరణానంతరం గాంధీల కుటుంబంతో సన్నిహిత సంబంధాలు కొనసాగించారు. 1999లో తొలిసారిగా సోనియాగాంధీ అమేథీలో ఘన విజయం సాధించడంలో శర్మ కృషి దాగిఉందని అక్కడి వాళ్లు చెబుతారు. అమేథీ, రాయ్‌బరేలీల్లో రాహుల్, సోనియా అందుబాటులో లేనపుడు నియోజకవర్గ సమస్యలపై పార్టీ అగ్రనాయకత్వానికి తెలియజేయడం వంటి పనులనూ ఈయన చక్కబెట్టేవారు. రాయ్‌బరేలీ ప్రజలకు ఈయన బాగా తెలుసు. గత ఎన్నికల్లో అమేథీలో రాహుల్ ఓడిపోయాక అప్పటి నుంచి నియోజకవర్గంలో కాంగ్రెస్ వ్యవహారాలను ఈయనే చూశారు. గతంలో కొంతకాలం బిహార్, పంజాబ్ రాష్ట్రాల వ్యవహారాలనూ శర్మ చూసుకున్నారు.

మోదీయే పారిపోయి వారణాసికి వచ్చారు..!

ఖర్గే ఎదురు దాడి

న్యూఢిల్లీ: అమేథీలో పోటీ చేసే ధైర్యం లేక రాహుల్ గాంధీ రాయ్‌బరేలీకి పారిపోయారంటూ ప్రధాని మోదీ, బీజేపీ నేతలు సాగిస్తున్న విమర్శల దాడికి కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే దీటుగా బదులిచ్చారు. ప్రధాని మోదీ వేరే చోట్ల గెలుపుపై నమ్మకం లేకనే యూపీలోని వారణాసిలో పోటీ చేస్తున్నారు కదా అని వ్యాఖ్యానించారు. 'గుజరాత్‌లోని గాంధీనగర్ నుంచి ఎందుకు పారిపోయి వచ్చారో ఆయన్నే అడగండి' అంటూ ఖర్గే మీడియాతో పేర్కొన్నారు. మోదీ 2014 ఎన్నికల్లో గాంధీనగర్, వారణాసి సీట్లకు పోటీ చేసి, రెండు చోట్లా గెలుపొందారు. గాంధీనగర్‌కు తర్వాత రాజీనామా చేశారు. 2019 ఎన్నికల్లో వారణాసి నుంచి మాత్రమే పోటీ చేసిన విషయం తెలిసిందే.

'రహస్య వ్యూహం' ఏమిటో?

- ఎన్నికల నుంచి ప్రియాంక దూరంపై కాంగ్రెస్‌లో రకరకాల చర్చలు
- వారసత్వ పోకడ అన్న బీజేపీ విమర్శలకి చెక్ పెట్టేందుకే అంటూ కొందరి వ్యాఖ్య
- ఉప ఎన్నిక ద్వారా ఎంట్రీ ఇస్తారని మరికొందరు

సాక్షి, న్యూఢిల్లీ: కాంగ్రెస్ అగ్రనేత సోనియాగాంధీ రాయ్‌బరేలీ నుంచి నిష్క్రమించాక ఆమె కుమార్తె ప్రియాంకా గాంధీ రాజకీయ ఆరంగ్రేటం చేస్తారని గంపెడాశ పెట్టుకున్న స్థానిక నాయకత్వంపై ఏఐసీసీ నీళ్లు చల్లింది. రాయ్‌బరేలీ లేదా అమేథీలో ప్రియాంక కచ్చితంగా పోటీచేస్తారని తెగ ప్రచారం జరిగినా చివరకు ఆమె పోటీకి నిలబడకపోవడం పార్టీ శ్రేణుల్ని ఆశ్చర్యానికి గురిచేసింది. దీనిపై ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ స్పందించారు. ప్రియాంకను పోటీలో ఉండకపోవడం వెనుక 'రహస్య వ్యూహం' ఉందంటూ చేసిన వ్యాఖ్యలతో అదేమిటన్న ఆసక్తి మరింత ఎక్కువైంది.

అరంగేట్రం వయా ఉప ఎన్నిక !

వాస్తవానికి ప్రస్తుత ఎన్నికల్లో పోటీ చేయకూడదని ప్రియాంక బలంగా నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది. అయినాసరే దశాబ్ధాలుగా రాయ్‌బరేలీతో అనుబంధం పెంచుకున్న గాంధీలు కచ్చితంగా పోటీచేయాలని స్థానిక నేతల నుంచి డిమాండ్లు ఎక్కువయ్యాయి. విపక్షాల 'ఇండియా' కూటమిలో భాగస్వామ్య పార్టీ అయిన సమాజ్‌వాదీ సైతం ఇదే డిమాండ్ చేసింది. ఈ నేపథ్యంలో చివరికి రాహుల్ పోటీకి అంగీకరించినట్లు చెబుతున్నారు. ఇప్పటికే రాజస్థాన్ నుంచి రాజ్యసభకు సోనియా ఎన్నికయ్యారు. రాయ్‌బరేలీ నుంచి ప్రియాంక, అమేథీ నుంచి రాహుల్ పోటీ చేసి గెలిస్తే పార్లమెంట్‌లో ముగ్గురు గాంధీలు ఉంటారని, ఇది వారసత్వ రాజకీయాలను వ్యతిరేకిస్తున్న బీజేపీకి పెద్ద అస్త్రంగా మారుతుందన్న ఉద్దేశ్యంతో ప్రియాంక పోటీ నుంచి తప్పుకున్నారన్న విశ్లేషణలూ వినిపిస్తున్నాయి. రాయ్‌బరేలీ, వయనాడ్‌లలో రాహుల్ గెలిస్తే రాయ్‌బరేలీలో రాజీనామా చేస్తారని, ఆ స్థానానికి వచ్చే ఉప ఎన్నిక ద్వారా ప్రియాంక రాజకీయ అరంగ్రేటం చేస్తారని కాంగ్రెస్ వర్గాల్లో చర్చ నడుస్తోంది. ప్రస్తుత ఎన్నికల్లో పార్టీ స్టార్ క్యాంపెయినర్‌గా ప్రియాంకగాంధీ దేశమంతా విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆమెను ఒక్క రాయ్‌బరేలీ నియోజకవర్గానికే పరిమితం చేయకూడదన్న ఉద్దేశంతో పార్టీ అధిష్టానం ఈ నిర్ణయం తీసుకుందని విశ్వసనీయవర్గాలు చెబుతున్నాయి.

బెయిల్ అంశాన్ని పరిశీలిస్తాం

కేజ్రీవాల్ పిటిషన్‌పై 7న విచారణ: సుప్రీం

న్యూఢిల్లీ: మద్యం కుంభకోణానికి సంబంధించిన మనీ లాండరింగ్ కేసులో అరెస్టై ప్రస్తుతం తిహార్ జైలులో ఉన్న ఢిల్లీ ముఖ్యమంత్రి, ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్‌కు కొంత ఊరట కలిగించే పరిణామమిది. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఆయనకు మధ్యంతర బెయిల్ మంజూరు చేసే అంశాన్ని పరిశీలిస్తామని సుప్రీంకోర్టు వెల్లడించింది. ఢిల్లీలో ఈ నెల 25న పోలింగ్ జరుగనుందని, తనకు మధ్యంతర బెయిల్ ఇవ్వాలని కోరుతూ కేజ్రీవాల్ దాఖలు చేసిన పిటిషన్‌ను జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ దీపాంకర్ దత్తాతో కూడిన సుప్రీంకోర్టు ధర్మాసనం శుక్రవారం పరిశీలించింది. ఈ పిటిషన్‌పై ఈ నెల 7న వాదనలు వింటామని తెలియజేసింది. విచారణకు సిద్ధమై రావాలని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ తరఫు న్యాయవాదికి సూచించింది. లిక్కర్ స్కామ్‌లో తనను అరెస్టు చేయడాన్ని సవాలు చేస్తూ కేజ్రీవాల్ దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణకు ఇంకా సమయం పట్టే అవకాశం ఉందని, అందుకే మధ్యంతర బెయిల్ పిటిషన్‌ను విచారిస్తామని పేర్కొంది. కేజ్రీవాల్‌కు మధ్యంతర బెయిల్ ఇవ్వడాన్ని తాము వ్యతిరేకిస్తామని ఈడీ తరఫున అదనపు సొలిసిటర్ జనరల్ ఎస్.వి.రాజు చెప్పారు. ఇదే కేసులో గత నెలలో బెయిల్ పొంది బయటకు వచ్చిన ఆమ్ ఆద్మీ పార్టీ నాయకుడు సంజయ్ సింగ్ చేస్తున్న వ్యాఖ్యలను గమనించాలని కోరారు. కేజ్రీవాల్‌కు కూడా బెయిల్ ఇస్తే అలాంటి వ్యాఖ్యలు చేసే అవకాశం ఉందని పరోక్షంగా వెల్లడించారు. ధర్మాసనం స్పందిస్తూ.. మధ్యంతర బెయిల్ పిటిషన్‌పై కేవలం విచారణ జరుపుతామని, కేజ్రీవాల్‌కు కచ్చితంగా మధ్యంతర బెయిల్ ఇస్తామని తాము చెప్పడం లేదని, ఆయనకు బెయిల్ ఇవ్వొచ్చు, ఇవ్వకపోవచ్చు అని స్పష్టం చేశారు.

పీవోకేలో బస్సు ప్రమాదం.. 20 మంది దుర్మరణం

పెషావర్: పాక్ ఆక్రమిత కశ్మీర్(పీవోకే)లోని గిల్గిట్–బల్టిస్తాన్‌లో శుక్రవారం ఉదయం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో కనీసం 20 మంది మృత్యువాతపడ్డారు. రావల్పిండి నుంచి గిల్గిట్ వైపు 43 మంది ప్రయాణికులతో వెళ్తున్న బస్సు దియామెర్ జిల్లాలో కారకోరం హైవేపైని పర్వత ప్రాంతంలో అదుపు తప్పి నది ఒడ్డున పడింది. ఈ దుర్ఘటనలో 20 మంది చనిపోగా మరో 21 మంది గాయపడ్డారు. డ్రైవర్ బస్సుపై నియంత్రణ కోల్పోయినందునే ప్రమాదం జరిగిందని పోలీసులు తెలిపారు.

మహిళా ఉద్యోగితో అనుచితంగా ప్రవర్తించారు

- బెంగాల్ గవర్నర్‌పై సీఎం మమతా బెనర్జీ తీవ్ర ఆరోపణ
- అంతా డ్రామా అంటూ కొట్టిపారేసిన ఆనంద బోస్
- తనపై మరిన్ని ఆరోపణలు రావొచ్చని వ్యాఖ్యలు

కోల్‌కతా: లోక్‌సభ ఎన్నికల వేళ తృణమూల్ కాంగ్రెస్ చీఫ్, పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ రాష్ట్ర గవర్నర్ సీవీ ఆనంద బోస్‌ల మధ్య విభేదాలు తీవ్రరూపం దాల్చాయి. ఉద్యోగం కోసం వచ్చిన మహిళతో గవర్నర్ అసభ్యంగా ప్రవర్తించారంటూ మమత ఆరోపించారు. గత రాత్రి రాజ్‌భవన్‌కు వచ్చిన ప్రధాని మోదీ ఈ ఆరోపణలపై ఎందుకు మాట్లాడలేదంటూ ఆమె ప్రశ్నించారు. సీఎం మమత శుక్రవారం పూర్బ బర్ధమాన్ జిల్లాలో ఎన్నికల ర్యాలీలో ప్రసంగించారు. 'రాజ్‌భవన్‌లో పనిచేసే ఓ యువతి నిన్న నా దగ్గరికి వచ్చింది. వేళకాని వేళ పిలిపించి గవర్నర్ అసభ్యంగా ప్రవర్తించారని చెప్పి కన్నీళ్లు పెట్టుకుంది. మళ్లీ రాజ్‌భవన్‌కు వెళ్లాలంటేనే భయం వేస్తోందంటూ వాపోయింది. అది చూసి నా గుండె పగిలింది. వీళ్లా తల్లులు, చెల్లెళ్ల మర్యాద, గౌరవం గురించి మాట్లాడేది?' అంటూ ఈ సందర్భంగా ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళను వేధించారంటూ గవర్నర్ సీవీ ఆనందబోస్‌పై గురువారం టీఎంసీ నేతలు కోల్‌కతా పోలీసులకు ఫిర్యాదు చేశారు. నిష్పాక్షికంగా దర్యాప్తు జరిపించాలని కోరారు. ఫిర్యాదును పరిశీలిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ పరిణామంపై గవర్నర్ ఆనందబోస్ స్పందిస్తూ..వారివన్నీ కట్టుకథలన్నారు. ఇదంతా డ్రామా అంటూ కొట్టిపారేశారు.

పోలీసుల బదిలీపై మమత ఆగ్రహం

పశ్చిమబెంగాల్‌కు చెందిన 1,500 మంది పోలీసు అధికారులను ఎన్నికల కమిషన్ ఇతర రాష్ట్రాల్లో ఎన్నికల విధులకు పంపించడంపై మమత తీవ్రంగా స్పందించారు. ఇతర రాష్ట్రాలు సాయం అడగకుండానే ఇలాంటి నిర్ణయం ఎలా తీసుకుంటుందని ప్రశ్నించారు. ఇతర రాష్ట్రాల నుంచి పోలీసులకు బదులుగా కేంద్రబలగాలను మాత్రమే బెంగాల్‌కు ఈసీ తీసుకువస్తోందన్నారు. రాష్ట్ర పోలీసులకు పోస్టల్ బ్యాలెట్‌ను వాడుకునే అవకాశం కూడా లేకుండా చేయమేంటంటూ ఈసీపై ఆగ్రహం వ్యక్తం చేశారు. న్యాయపరమైన ముగింపు దొరికే వరకు పోరాడతామన్నారు.



ఎన్నికల విచిత్రం

లోక్‌సభ మూడో విడత ఎన్నికల వేళ గుజరాత్ రాష్ట్రం అహ్మదాబాద్‌లోని ఓ షాపింగ్ మాల్‌లో ఓటర్లకు అవగాహన కల్పించేందుకు అధికారులు ఏర్పాటు చేసిన చిత్ర ప్రదర్శన ఇది

ఎలక్షన్ బీట్

నాలుగో విడత బరిలో 1,717 మంది: ఈసీ

సాక్షి, న్యూఢిల్లీ: లోక్‌సభకు నాలుగో విడతలో ఈ నెల 13వ తేదీన జరగనున్న పోలింగ్‌లో 1,717 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు.ఆంధ్రప్రదేశ్, తెలంగాణ సహా 10 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లోని 96 సీట్లకు మొత్తం 4,264 నామినేషన్లు అందాయి. నామినేషన్ పత్రాల పరిశీలన, ఉపసంహరణ ప్రక్రియలు ముగిసిన తర్వాత 1,717 మంది అభ్యర్థులు పోటీలో నిలిచారు. ఈ దశలో ఒక్కో స్థానానికి సగటున 18 మంది పోటీ పడుతున్నట్లు శుక్రవారం న్నట్లు కేంద్ర ఎన్నికల సంఘం వెల్లడించింది.

తెలుగు రాష్ట్రాల్లో 979 మంది..

తెలంగాణలోని 17 పార్లమెంటు స్థానాలకు అత్యధికంగా 1,488 నామినేషన్లు దాఖలయ్యాయి. పరిశీలన అనంతరం 625 ఆమోదం పొందగా 525 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. ఇందులో మల్కాజ్‌గిరి స్థానానికి అత్యధికంగా 177 నామినేషన్లు, నల్గొండ, భువనగిరి స్థానాలకు 144 చొప్పున నామినేషన్లు వచ్చాయి. ఆంధ్రప్రదేశ్‌లోని 25 ఎంపీ స్థానాలకు 1,103 నామినేషన్లు అందాయి. పరిశీలన అనంతరం 503 నామినేషన్లు ఆమోదం పొందగా మొత్తం 454 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు.

మిగతా రాష్ట్రాల్లో ..

నాలుగో విడత పోలింగ్ జరిగే బిహార్‌లోని 5 పార్లమెంట్ స్థానాలకు 55 మంది పోటీలో ఉన్నారు. జమ్మూకశ్మీర్‌లోని ఒక్క సీటుకు 24 మంది, జార్ఖండ్‌లోని 4 నియోజకవర్గాలకు 45 మంది, మధ్యప్రదేశ్‌లోని 8 సీట్లకుగాను 74, మహారాష్ట్రలోని 11 స్థానాలకు 298 మంది, ఒడిశాలోని 4 సీట్లకు 37 మంది, ఉత్తరప్రదేశ్‌లోని 13 స్థానాల్లో 130 మంది, పశ్చిమబెంగాల్‌లోని 8 సీట్లకు 75 మంది బరిలో నిలిచారు.

14న ప్రధాని మోదీ నామినేషన్

వారణాసి: ప్రధానమంత్రి మోదీ ఈ నెల 14న వారణాసి లోక్‌సభ స్థానానికి నామినేషన్ దాఖలు చేయనున్నారు. సిట్టింగ్ ఎంపీగా ఉన్న ఆయన ముందు రోజు 13వ తేదీన వారణాసిలో భారీ రోడ్ షోలో పాల్గొంటారని బీజేపీ వర్గాలు తెలిపాయి. ఇక్కడ కాంగ్రెస్ పార్టీ యూపీ చీఫ్ అజయ్ రాయ్‌ను పోటీలో ఉంచింది. 2014, 2019 సాధారణ ఎన్నికల్లోనూ మోదీపై పోటీకి దిగిన అజయ్ ఓటమి పాలయ్యారు. అదేవిధంగా, రాజస్తాన్‌కు చెందిన కమెడియన్, ప్రధాని మోదీ స్వరాన్ని అనుకరించడంలో సిద్ధహస్తుడు అయిన శ్యామ్ రంగీలా కూడా వారణాసి నుంచి పోటీ చేయనున్నట్లు ప్రకటించారు.

కాంగ్రెస్ ఓటమిని అంగీకరించింది

అమేథీలో గాంధీలు పోటీచేయకపోవడంపై స్మృతి ఇరానీ వ్యాఖ్య

అమేథీ: అమేథీ నియోజకవర్గం నుంచి గాంధీల కుటుంబసభ్యులు పోటీ నుంచి తప్పుకుని కాంగ్రెస్ ఓటమిని పోలింగ్‌కు ముందే అంగీకరించారని అమేథీ బీజేపీ అభ్యర్థి, సిట్టింగ్ మహిళా ఎంపీ స్మృతి ఇరానీ వ్యాఖ్యానించారు. ''ఇక్కడ కాస్తయినా విజయావకాశాలు ఉన్నాయని భావిస్తే ఇతరుల బదులు గాంధీలే ఇక్కడ పోటీచేసేవారు'' అని ఎద్దేవాచేశారు.

రాహుల్‌కు పరాజయం తప్పదు: అమిత్ షా

హుక్కేరి: రాయ్‌బరేలీలో కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీకి పరాజయం తప్పదని హోం మంత్రి అమిత్ షా అన్నారు. కుమారుడు రాహుల్‌ను గెలిపించుకునేందుకు సోనియా గాంధీ చేస్తున్న 21వ ప్రయత్నం కూడా విఫలమవక తప్పదని వ్యాఖ్యానించారు. శుక్రవారం అమిత్ కర్ణాటకలోని బెళగావి జిల్లా హుక్కేరిలో ఎన్నికల ప్రచార కార్యక్రమంలో మాట్లాడారు. 'చంద్రయాన్ మిషన్‌ను మోదీ జీ ఒకే విడతలో విజయవంతం చేయగలిగారు. సోనియా గాంధీ రాహుల్ బాబా(రాహుల్ గాంధీ) మిషన్‌ను విజయవంతం చేయడానికి 20 పర్యాయాలు ప్రయత్నించి, విఫలమయ్యారు. తాజాగా, 21వ ప్రయత్నంగా అమేథీకి బదులు రాయ్‌బరేలీలో ఆయనతో నామినేషన్ వేయించారు'అని పేర్కొన్నారు.

ప్రజ్వల్‌పై కిడ్నాపింగ్ కేసు

మైసూరు: కర్ణాటకలో మహిళలపై లైంగిక వేధింపులు, దౌర్జన్యం ఆరోపణలు ఎదుర్కొంటున్న జేడీ(ఎస్) ఎంపీ ప్రజ్వల్‌పై తాజాగా అపహరణ కేసు నమోదైంది. ఆయన తండ్రి అయిన ఎమ్మెల్యే హెచ్‌డీ రేవణ్ణపైనా కిడ్నాప్ కేసు నమోదైంది. బాధితురాలి కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు ప్రకారం బాధితురాలు హోళేనరసీపురలోని రేవణ్ణ ఇంట్లో గతంలో ఆరేళ్ల పనిచేసింది. మూడేళ్ల క్రితం పనిమానేసి సొంతూరు వచ్చి కూలీ పనులు చేసుకుంటోంది. అయితే ఏప్రిల్ 29వ తేదీ రాత్రి నుంచి ఆమె జాడ కనిపించట్లేదు. ఒక మహిళను ప్రజ్వల్ కట్టేసి రేప్ చేసినట్లు వైరల్ అయిన ఒక వీడియోలో ఉన్నది నీ తల్లే అంటూ స్నేహితులు మే ఒకటో తేదీన కుమారుడికి ఫోన్‌చేసి చెప్పారు. దాంతో కుమారుడు మైసూరు జిల్లాలోని కృష్ణరాజనగర్ పట్టణంలోని కేఆర్ నగర పోలీసు స్టేషన్‌లో గురువారం ఫిర్యాదుచేశాడు. దీంతో రేవణ్ణ, అతని అనుచరుడు సతీశ్ బాబాన్నలపై కేసు నమోదు చేశారు.

బీజేడీ కీలక నేత భార్యపై ఈసీ బదిలీ వేటు

భువనేశ్వర్: ఒడిశాలోని అధికార బీజేడీ కీలక నేత వీకే పాండ్యన్ భార్య, సీనియర్ అధికారి సుజాతా కార్తికేయన్‌ను ఈసీ ఆదేశాల మేరకు ప్రభుత్వం అప్రాధాన్య శాఖకు బదిలీ చేసింది. సుజాత ప్రస్తుతం మిషన్ శక్తి శాఖలో కమిషనర్ కం సెక్రటరీగా ఒడియా భాష, సాహిత్యం, సాంస్కృతిక విభాగాలకు అదనపు బాధ్యతలను నిర్వహిస్తున్నారు. అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నారని, బీజేడీ ప్రతినిధిగా వ్యవహరిస్తున్నారంటూ సుజాతపై ప్రతిపక్ష బీజేపీ ఈసీకి ఫిర్యాదు చేసింది. ఈసీ ఆదేశాల మేరకు ప్రభుత్వం శుక్రవారం సుజాతను ఆర్థిక శాఖలో ప్రత్యేక కార్యదర్శిగా నియమించింది.

వర్సిటీల్లో 2,300 దాటిన అరెస్టులు

న్యూయార్క్: గాజాలో పాలస్తీనియన్లపై ఇజ్రాయెల్ దాడులు ఆపాలంటూ అమెరికావ్యాప్తంగా విశ్వవిద్యాలయాల్లో కొనసాగుతున్న నిరసనలు ఆగట్లేవు. పోలీసులు వర్సిటీల్లో ఆందోళనకారులను చెదరగొట్టి తాత్కాలిక శిబిరాలను ధ్వంసం చేస్తున్నారు. ఏప్రిల్ 17న కొలంబియా వర్సిటీలో మొదలై అమెరికాలో 44 విశ్వవిద్యాలయాలు/ కాలేజీలకు పాకిన ఈ విద్యార్థి ఉద్యమంలో ఇప్పటిదాకా 2,300 మందికిపైగా ఆందోళనకారులను పోలీసులు అరెస్ట్‌చేశారు. శుక్రవారం న్యూయార్క్ యూనివర్సిటీలో టెంట్లను ఖాళీచేసి వెళ్లాలని నిరసనకారులను పోలీసులు హెచ్చరించారు. స్టేట్ యూనివర్సిటీ ఆఫ్ న్యూయార్క్‌లో 133 మందిని అరెస్ట్‌చేశారు.

దోస్త్ నోటిఫికేషన్ విడుదల

▶ మొదటి పేజీ తరువాయి

కార్యదర్శి శ్రీరామ్ వెంకటేశ్ పాల్గొన్నారు.

రిజిస్ట్రేషన్, కౌన్సెలింగ్ తేదీలు ఇలా...

మొదటి విడత

ఈ నెల 6 నుంచి రిజిస్ట్రేషన్ ప్రారంభమవుతుంది. విద్యార్థులు రూ. 200 రిజిస్ట్రేషన్ ఫీజు ఆన్‌లైన్‌లో చెల్లించి ఈ నెల 25 వరకు దోస్త్ వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. ఈ నెల 15 నుంచి 27 మధ్య కాలేజీల ప్రాధాన్యత క్రమంలో వెబ్ ఆప్షన్లు ఇవ్వాలి. దివ్యాంగులు, ఇతర ప్రత్యేక రిజర్వేషన్లు ఉన్న వారికి ఈ నెల 24, 25 తేదీల్లో ధ్రువపత్రాల పరిశీలన ఉంటుంది. తొలివిడత సీటు అలాట్‌మెంట్ జూన్ 3న ఉంటుంది. సీట్లు పొందిన విద్యార్థులు జూన్ 4 నుంచి 10లోగా ఆన్‌లైన్‌లో సెల్ఫ్ రిపోర్టింగ్ పూర్తి చేయాలి.

రెండో విడత..

జూన్ 4 నుంచి రిజిస్ట్రేషన్ ప్రారంభమవుతుంది. విద్యార్థులు రూ. 400 రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించి జూన్ 13 వరకు రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు. అలాగే జూన్ 4 నుంచి 14 వరకు కాలేజీల వెబ్ ఆప్షన్లు ఇవ్వాలి. దివ్యాంగులు, ఇతర ప్రత్యేక రిజర్వేషన్లు ఉన్న వారికి జూన్ 13న ధ్రువపత్రాల పరిశీలన ఉంటుంది. రెండో విడత సీటు అలాట్‌మెంట్ జూన్ 18న ఉంటుంది. సీట్లు పొందిన విద్యార్థులు జూన్ 19 నుంచి 24లోగా ఆన్‌లైన్‌లో సెల్ఫ్ రిపోర్టింగ్ పూర్తి చేయాలి.

మూడో విడత..

రిజిస్ట్రేషన్ ప్రక్రియ జూన్ 19 నుంచి మొదలవుతుంది. రూ. 400 రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించి జూన్ 19 నుంచి 25 వరకు రిజిస్ట్రేషన్ చేసుకొనేందుకు అవకాశం ఉంటుంది. జూన్ 19 నుంచి 26 వరకు వెబ్ ఆప్షన్లు ఇచ్చేందుకు చాన్స్ ఇస్తారు. దివ్యాంగులు, ఇతర ప్రత్యేక రిజర్వేషన్లు ఉన్న వారికి జూన్ 25న ధ్రువపత్రాల పరిశీలన జరుగుతుంది. మూడో విడత సీటు అలాట్‌మెంట్ జూన్ 29న ఉంటుంది. సీట్లు పొందిన విద్యార్థులు జూన్ 29 నుంచి జూలై 3లోగా ఆన్‌లైన్‌లో సెల్ఫ్ రిపోర్టింగ్ పూర్తి చేయాలి.

- సీట్లు పొందిన విద్యార్థులు ఆయా కాలేజీల్లో జూన్ 29 నుంచి జూలై 5లోగా ఆయా కాలేజీల్లో రిపోర్టు చేయాలి. • డిగ్రీ మొదటి సంవత్సరంలో ప్రవేశాలు పొందిన విద్యార్థులకు జూలై 1 నుంచి 6 వరకు ఓరియెంటేషన్ తరగతులుంటాయి.
- ఫస్టియర్ సెమిస్టర్ తరగతులు జూలై 8 నుంచి ప్రారంభమవుతాయి.

మాకు సహాయ కార్యదర్శులతో సమాన వేతనాలివ్వాలి

- **పీఆర్సీ కమిటీకి డిప్యూటీ కలెక్టర్ల సంఘం విజ్ఞప్తి**

సాక్షి, హైదరాబాద్: డిప్యూటీ కలెక్టర్లకు రాష్ట్ర ప్రభుత్వ సహాయ కార్యదర్శులతో సమానమైన వేతనాలను సిఫారసు చేయాలని తెలంగాణ వేతన సవరణ సంఘానికి తెలంగాణ స్టేట్ సివిల్ సర్వీసెస్ (ఎగ్జిక్యూటివ్ బ్రాంచ్) డిప్యూటీ కలెక్టర్ల సంఘం విజ్ఞప్తి చేసింది. సహాయ కార్యదర్శులతో సమాన బాధ్యతలను సహాయ కలెక్టర్లు నిర్వహిస్తున్నారని గుర్తుచేసింది. ఈమేరకు పీఆర్సీ కమిటీకి సంఘం ప్రతినిధులు శుక్రవారం వినతిపత్రం అందించారు. ప్రభుత్వ డిప్యూటీ కార్యదర్శులతో సమానంగా స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్లకు వేతనాలను అందించేలా సిఫారసులు చేయాలని కోరారు. డిప్యూటీ కలెక్టర్లకు పదోన్నతులు కల్పించేందుకు ప్రభుత్వ జాయింట్ సెక్రటరీ హోదాకు సమానమైన నాన్ కేడర్ కలెక్టర్ పోస్టులను సృష్టించాలని విజ్ఞప్తి చేశారు. తమ విజ్ఞప్తులపై పీఆర్సీ కమిటీ సానుకూలత వ్యక్తం చేసిందని సంఘం నేత భాస్కరరావు ఒక ప్రకటనలో తెలిపారు.

బీసీలకు 50% రిజర్వేషన్లు ప్రకటించాలి: కృష్ణయ్య



కాచిగూడ (హైదరాబాద్): దేశవ్యాప్తంగా చర్చ జరుగుతున్న రిజర్వేషన్ల వివాదానికి తెరదించేందుకు చట్ట సభల్లో బీసీలకు 50శాతం రిజర్వేషన్లు పెడతామని ప్రధాని నరేంద్రమోదీ ప్రకటించాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్. కృష్ణయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, గవ్వల భరత్ కుమార్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజ్యాంగాన్ని రద్దు చేసి రిజర్వేషన్లను బీజేపీ ఎత్తివేస్తుందని ప్రజల్లో అనుమానాలు, భయాందోళనలు కలుగుతున్నాయని, రిజర్వేషన్లపై ప్రధాని, హోంశాఖ మంత్రి అమిత్‌షా, బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా స్పష్టమైన ప్రకటన చేయాలని కోరారు. బీజేపీని నమ్మే పరిస్థితి ప్రస్తుతం బీసీల్లో లేదని, బీసీలు నమ్మాలంటే బీసీ కుల గణన చేస్తామని, కేంద్రంలో బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేస్తామని ప్రక టించాలని కృష్ణయ్య అన్నారు. కులవృత్తులు కోల్పోయిన వృత్తి కులాల వారికి రూ.20 లక్షలు సబ్సిడీ ఇస్తామని బీజేపీ ప్రకటించాలన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీసీల మద్దతు ప్రకటించేందుకు ఈనెల 7న రాష్ట్ర స్థాయి బీసీల విస్తృత స్థాయి సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ఈనెల 6న టీఎస్ ఈసెట్

సాక్షి, హైదరాబాద్: టీఎస్ ఈసెట్–2024 పరీక్ష ఈనెల 6న నిర్వహించనున్నట్లు సెట్ కన్వీనర్ పి.చంద్రశేఖర్ తెలిపారు. ఇందుకు సంబంధించి ఏర్పాట్లు పూర్తి చేశామని, పరీక్షకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు హాల్‌టికెట్లను వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్లు వెల్లడించారు. ఈ పరీక్షకు 24,272 మంది అభ్యర్థులు హాజరు కానున్నారని, తెలుగు రాష్ట్రాల్లో 99 కేంద్రాల్లో పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. తెలంగాణ పరిధిలో 92 కేంద్రాలు ఏర్పాటు చేశామని, హైదరాబాద్ రీజియన్‌లో 48 పరీక్షా కేంద్రాలున్నాయన్నారు. మరో 7 కేంద్రాలు ఆంధ్రప్రదేశ్‌లో ఏర్పాటు చేసినట్లు చెప్పారు.

పరీక్షల భయంతో విద్యార్థిని ఆత్మహత్య

- **హాస్టల్ భవనం పైనుంచి దూకిన వైనం**

తిమ్మాపూర్: చదువుపై ఇష్టం లేకపోవడం.. పరీక్షలంటే భయంతో ఓ ఫార్మసీ విద్యార్థిని శుక్రవారం తానుంటున్న హాస్టల్ భవనం పైనుంచి దూకి ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం రామకృష్ణకాలనీ పంచాయతీ పరిధిలోని సుభాష్‌నగర్‌లో జరిగింది. మంచిర్యాల జిల్లా బెల్లంపల్లికి చెందిన శివప్రియ (19) స్థానిక కళాశాలలో ఫార్మసీ–డీ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. స్థానికంగా ఓ ప్రైవేటు హాస్టల్‌లో ఉంటోంది. శుక్రవారం నుంచి పరీక్షలుండటంతో ఆందోళన చెందుతోంది. గురువారం రాత్రి భోజనం చేసి పడుకున్న శివప్రియ ఫెయిల్ అవుతానేమో అనే భయంతో శుక్రవారం తెల్లవారుజామున హాస్టల్ రెండో అంతస్తు పైనుంచి దూకింది. గమనించిన హాస్టల్ నిర్వాహకులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు తీవ్రంగా గాయపడిన శివప్రియను కరీంనగర్ ఆస్పత్రికి తరలించారు. కానీ చికిత్స పొందుతూ సాయంత్రం చనిపోయింది. శివప్రియ తండ్రి గతంలోనే చనిపోయాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎల్‌ఎండీ ఎస్సై చేరాలు తెలిపారు.

కరెంటు కోతల్లేవ్

నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేస్తున్నాం

- గతేడాది కంటే ఎక్కువ ఇస్తున్నాం
- ఎన్నికల్లో రాజకీయ లబ్ధి కోసమే బీఆర్ఎస్ కరెంట్ కట్ నాటకం
- కాంగ్రెస్ వస్తే కరెంటు పోతుందన్న దుష్ప్రచారంపై బీఆర్ఎస్‌కు అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలే బుద్ధి చెప్పారు
- ఈ ఏడాది విద్యుత్ డిమాండ్ బాగా పెరిగింది
- జీహెచ్‌ఎంసీలో 226 స్పెషల్ వ్యూ ఆఫ్ కాల్ టీమ్‌ల ఏర్పాటు
- విద్యుత్ శాఖ మంత్రి భట్టి విక్రమార్క



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో కరెంట్ కోతలు లేనే లేవని, పీక్ డిమాండ్‌లోనూ నిరంతరాయంగా విద్యుత్‌ను సరఫరా చేస్తున్నామని ఉప ముఖ్యమంత్రి, విద్యుత్‌శాఖ మంత్రి భట్టి విక్రమార్క మళ్లీ స్పష్టం చేశారు. పార్లమెంటు ఎన్నికల్లో రాజకీయ లబ్ధి కోసమే బీఆర్ఎస్ నాయకులు కరెంట్ కట్ నాటకానికి తెర తీశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ వస్తే కరెంటు పోతుందని అసెంబ్లీ ఎన్నికల ముందు బీఆర్ఎస్ నేతలు చేసిన దుష్ప్రచారాన్ని ప్రజలు తిప్పి కొట్టి ఎన్నికల్లో గుణపాఠం చెప్పినా.. వారికి ఇంకా బుద్ధి రాలేదని విమర్శించారు. సూర్యాపేటలో, మహబూబ్ నగర్‌లో కేసీఆర్ ఉన్నప్పుడే కరెంటు పోయిందని సోషల్ మీడియాలో లేనిపోని అబద్ధాలు ప్రచారం చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేశారని మండిపడ్డారు. తెలంగాణలో ఇందిరమ్మ రాజ్యం వచ్చినప్పటి నుంచి నాణ్యమైన విద్యుత్తును సరఫరా చేస్తున్నామనీ, ఎక్కడ కరెంట్ కోతలు లేవని పునరుద్ఘాటించారు. ఎక్కడైనా సాంకేతిక కారణాలతో అంతరాయం తలెత్తినా.. వెంటనే విద్యుత్ సిబ్బంది అక్కడ విద్యుత్ సరఫరాను పునరుద్ధరిస్తున్నారని తెలిపారు. విద్యుత్ సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించి ప్రజలకు అసౌకర్యం కలిగిస్తే వాటిని కూడా ఉపేక్షించటం లేదనీ. వెంటనే వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. విధుల్లో నిర్లక్ష్యంగా ఉన్న సిబ్బందిపై చర్యలు తీసుకుంటే కూడా బీఆర్ఎస్ నాయకులు రాజకీయం చేస్తూ తప్పు పట్టడం దురదృష్టకరమని పేర్కొన్నారు. ఈ మేరకు భట్టి విక్రమార్క శుక్రవారం హైదరాబాద్‌లో సుదీర్ఘ ప్రకటన విడుదల చేశారు.

గతేడాదితో పోలిస్తే విద్యుత్ వినియోగం పెరిగింది

2022 డిసెంబర్ నుంచి 2023 ఏప్రిల్ వరకు మొత్తం 36, 207 మిలియన్ యూనిట్ల విద్యుత్ సరఫరా చేయగా, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 2023 డిసెంబర్ నుంచి 2024 ఏప్రిల్ 30 వరకు 38,155 మిలియన్ యూనిట్ల విద్యుత్తు సరఫరా చేశా మని భట్టి తెలిపారు. ఒకే రోజున గరిష్టంగా 15,497 మెగావాట్ల పీక్ డిమాండ్ విద్యుత్ సరఫరా చేసిన చరిత్ర కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని వెల్లడించారు. ఈ వేసవిలో ఉష్ణోగ్రతలు 45 డిగ్రీలకు చేరడంతో విద్యుత్ డిమాండ్ సహజంగానే పెరిగిందని వివరించా రు. అక్కడక్కడా లోడ్ పెరిగితే ఒక్కోసారి ట్రిప్ అవటం, దీంతో విద్యుత్ సరఫరాలో సాంకేతిక అవాంతరాలు తలెత్తుతున్నా.. వాటిని ఎప్పటికప్పుడు విద్యుత్ సిబ్బంది అధిగమిస్తూ ప్రజలకు అసౌకర్యం లేకుండా సత్వర సేవలు అందిస్తున్నారని తెలిపారు.

అంతరాయాలను తగ్గించాం.. ఇదిగో ఆధారం

'గత ఏడాది ఏప్రిల్ 24 నుంచి ఏప్రిల్ 30 వరకు వారం రోజులు మండు టెండలున్నాయి. అప్పుడు బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉంది. అప్పుడు గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్‌ఎంసీ) పరిధిలో 1,369 సార్లు 11 కేవీ లైన్ ట్రిప్ అయ్యాయి. మొత్తం ఆ వారం రోజుల్లో 580 గంటలు విద్యుత్‌కు అంతరాయం వాటిల్లింది. ఇప్పుడు అదే గడిచిన వారంలో కేవలం 272 చోట్ల 11 కేవీ విద్యుత్ సరఫరా ట్రిప్ అయింది. కేవలం 89 గంటలు మాత్రమే అంతరాయం వాటిల్లింది' అని భట్టి విక్రమార్క వివరించారు. 'గత ఏడాది అదే వారంలో లెక్కలు చూసుకుంటే అప్పుడు 301 ట్రాన్స్ ఫార్మర్లు ఫెయిలయ్యాయి. ఇప్పుడు కేవలం 193 ట్రాన్స్ ఫార్మర్లు మాత్రమే ఫెయిలయ్యాయి. వాటిని కూడా వెంటనే మార్చి కొత్తవి బిగించి విద్యుత్ పునరుద్ధరించాం. అప్పటితో పోలిస్తే ఇప్పుడు ప్రభుత్వం మెరుగైన విద్యుత్ సరఫరా చేస్తుందనడానికి ఇంతకంటే ఏం ఆధారం కావాలి.? అని ప్రశ్నించారు. అప్పట్లో కరెంట్ కోత లేనేలేదని మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు వీటికేం సమాధానం చెబుతారని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క నిలదీశారు.

నగరంలో 226 స్పెషల్ టీంలు

జీహెచ్‌ఎంసీ పరిధిలో ఎక్కడైనా విద్యుత్ అంతరాయానికి సంబంధించిన ఫిర్యాదు వచ్చినా వేగవంతంగా పరిష్కరించేందుకు ప్రత్యేకంగా 226 స్పెషల్ వ్యూ ఆఫ్ కాల్ టీమ్ లను ఏర్పాటు చేశామని భట్టి వెల్లడించారు. హైదరాబాద్‌లో ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను ఏర్పాటు చేసి విద్యుత్ సరఫరాను నిరంతరం పర్యవేక్షిస్తున్నట్టు తెలిపారు. ఎక్కడ ఇబ్బందొచ్చినా వెంటనే పరిష్కరించేందుకు ఈ కమాండ్ కంట్రోల్ సెంటర్ నిర్విరామంగా పని చేస్తోందని భట్టి విక్రమార్క వివరించారు.

టీఎస్‌పీఎస్సీ వెబ్‌సైట్‌లో గ్రూప్-3 ఉద్యోగ ఖాళీల పట్టిక

సాక్షి, హైదరాబాద్: వివిధ ప్రభుత్వ శాఖల్లో భర్తీ చేయనున్న గ్రూప్–3 ఉద్యోగ ఖాళీల పట్టికను తెలంగాణ స్టేట్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచింది. ఈ కేటగిరీలో 1,365 ఉద్యోగ ఖాళీల భర్తీకి టీఎస్‌పీఎస్సీ 2022, డిసెంబర్ 30న నోటిఫికేషన్ జారీ చేసింది. ఉద్యోగాల భర్తీ ప్రక్రియలో మహిళలకు హారిజాంటల్ పద్ధతిలో రిజర్వేషన్లు అమలు చేయాలని సుప్రీం కోర్టు ఆదేశించిన నేపథ్యంలో ఉద్యోగ ఖాళీల పట్టికను ఆమేరకు సవరించి రిజర్వేషన్ల వారీగా నూతన ఖాళీల పట్టికను కమిషన్ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచింది.

వీఐటీఈఈఈ ఎంట్రన్స్ ఫలితాల వెల్లడి

సాక్షి, హైదరాబాద్: వెల్లూర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఇంజనీరింగ్ ఎంట్రన్స్ ఎగ్జామ్ (వీఐటీ ఈఈఈ) ఫలితాలను వెల్లడించినట్లు ఆ సంస్థ ఒక ప్రకటనలో తెలిపింది. ఫలితాల కోసం https://ugresults.vit.ac.in/viteee వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించింది. ఎంట్రన్స్‌లో హరియాణాకు చెందిన రూపిందర్ సింగ్‌కు ఫస్ట్ ర్యాంకు, రాజస్తాన్‌కు చెందిన భాను మహేశ్ చేకూరి రెండో ర్యాంకు, ఏపీకి చెందిన వేదాంత్‌కు మూడో ర్యాంకు, అసోంకు చెందిన ఆయుషి నాలుగో ర్యాంకు సాధించినట్లు వెల్లడించింది. లక్ష లోపు ర్యాంకు వచ్చిన విద్యార్థులు వీఐటీ వెల్లూర్, వీఐటీ చెన్నై, వీఐటీ ఏపీ, వీఐటీ భోపాల్‌లో ఇంజనీరింగ్ అడ్మిషన్ పొందేందుకు అర్హులని పేర్కొంది. మొదటి విడత కౌన్సెలింగ్‌లో 1–20 వేల లోపు ర్యాంకు పొందిన వారికి ఈనెల 7 నుంచి 10 వరకు, రెండో విడతలో 20,001–45 వేల ర్యాంకు పొందిన వారికి ఈనెల 18 నుంచి 21 వరకు, మూడో విడతలో 45,001–70 వేల ర్యాంకు వచ్చిన వారికి ఈనెల 29 నుంచి జూన్ 1 వరకు, నాలుగో విడతలో 70,001–1 లక్ష లోపు ర్యాంకు వచ్చిన వారికి జూన్ 9 నుంచి 12 వరకు కౌన్సెలింగ్ ఉంటుంది.

క్లుప్తంగా...

రాయ్‌బరేలీకి సీఎం రేవంత్
రాహుల్‌గాంధీ నామినేషన్ కార్యక్రమానికి హాజరు

సాక్షి, హైదరాబాద్: ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి శుక్రవారం ఉత్తరప్రదేశ్‌లోని రాయ్‌బరేలి వెళ్లారు. పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీ నామినేషన్ కార్యక్రమంలో పాల్గొన్నారు. అంతకు ముందు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జునఖర్గే రాయ్‌బరేలి వెళ్లేందుకు బెంగళూరు నుంచి హైదరాబాద్‌కి వచ్చారు. ఆయనతో కలిసి సీఎం రేవంత్, రాజ్యసభ సభ్యుడు అనిల్‌కుమార్‌యాదవ్ రాయ్‌బరేలి వెళ్లారు. అక్కడ నామినేషన్ కార్యక్రమంలో పాల్గొన్న అనంతరం సాయంత్రం 5 గంటల సమయంలో రేవంత్ తిరిగి బేగంపేట విమానాశ్రయానికి వచ్చారు. అక్కడి నుంచి ధర్మపురి సభకు హెలికాప్టర్‌లో వెళ్లిన సీఎం.. ఆ తర్వాత సిరిసిల్ల సభలో పాల్గొని లోక్‌సభ ఎన్నికల ప్రచారం నిర్వహించారు.

తాతా.. నీకు టాటా..
కాంగ్రెస్ సరికొత్త వీడియో

సాక్షి, హైదరాబాద్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ వైఫల్యాలు, తెలంగాణ రాష్ట్రానికి చేసిన అన్యాయాలపై కాంగ్రెస్ పార్టీ తాజాగా మరో వీడియో విడుదల చేసింది. విభజన చట్టాల అమల్లో వైఫల్యం, వరంగల్, కరీంనగర్ స్మార్ట్ సిటీ పనుల్లో నిర్లక్ష్యం, 2020లో హైదరాబాద్‌లో వచ్చిన భారీ వరదలకు కేంద్రం ఎలాంటి సాయం చేయకపోవడం, ఐటీఐఆర్ లాంటి అనేక అంశాల్లో తెలంగాణకు బీజేపీ చేసిన అన్యాయాలను వీడియోలో పేర్కొంది. 'పదేళ్ల తెలంగాణకు ద్రోహం చేసింది చాలు.. తాతా.. నీకు టాటా' అంటూ రూపొందించిన వీడియోను శుక్రవారం విడుదల చేసింది.

మొన్ననే పెళ్లి చేసింద్రు.. ఇప్పుడే పిల్లలంటే ఎట్లా?
టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి వ్యాఖ్యలు




నర్సాపూర్ (మెదక్): ''మొన్ననే పెళ్లి చేసింద్రు...అప్పుడే పిల్లలు పుడతాలేరంటే ఎలా..''అని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి వ్యాఖ్యానించారు. మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి నీలం మధుకు మద్దతుగా శుక్రవారం మెదక్ జిల్లా నర్సాపూర్‌లో చేపట్టిన బైక్ ర్యాలీలో ఆయన పాల్గొన్నారు. తమకు పావలా వడ్డీ రుణం రావడం లేదని, ఇళ్లు రాలేదని తదితర హామీలను మహిళలు ప్రశ్నించగా..బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రజలను డబుల్ బెడ్ రూం ఇళ్లు ఇవ్వడంలో మోసం చేసిందని విమర్శించారు. ప్లాట్లు ఉన్న దళితులకు తమ ప్రభుత్వం రూ.6 లక్షలు, ఇతరులకు రూ.5లక్షలు ఇస్తుందని తెలిపారు. ఈ సందర్భంగా ''మొన్ననే మాకు పెళ్లి చేసింద్రు. అప్పుడే పిల్లలు పుడుతలేరంటే ఎట్లా? మూడు నెలలే అయింది, ముచ్చటగా 3 నిద్రలు చేసినం. తొందర పడకండి, జెరా టైమియ్యండ్రి, హామీ లన్నీ అమలు చేస్తాం ''అని జగ్గారెడ్డి చెప్పారు.

కాంగ్రెస్‌లోకి ఖమ్మం మేయర్ పునుకొల్లు నీరజ
ఉదయం బీఆర్‌ఎస్ సమావేశంలో.. మధ్యాహ్నం హస్తంగూటికి



ఖమ్మం వన్‌టౌన్: ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ పునుకొల్లు నీరజ కాంగ్రెస్‌లో చేరారు. ఖమ్మంలోని కాంగ్రెస్ కార్యాలయంలో శుక్రవారం ఆమె మరో ఇద్దరు కార్పొరేటర్లు కొత్తపల్లి నీరజ, సరిపూడి రమాదేవితో కలిసి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సమక్షంలో కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఖమ్మంను రాష్ట్ర స్థాయిలో అభివృద్ధి చేయాలన్నదే తన లక్ష్యమని తెలిపారు. అనంతరం మేయర్ నీరజ మాట్లాడుతూ అభివృద్ధి ప్రదాత అయిన తుమ్మలతో కలిసి సాగుతూ ఖమ్మం నగరాన్ని మరింత అభివృద్ధి చేయాలనే తలంపుతోనే కాంగ్రెస్‌లో చేరానని వెల్లడించారు. కాగా, శుక్రవారం ఉదయం ఖమ్మంలోని బీఆర్‌ఎస్ జిల్లా కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, ఎంపీ అభ్యర్థి నామా నాగేశ్వరరావు, ఎమ్మెల్సీ మధుతో కలిసి మేయర్ నీరజ పాల్గొన్నారు. మధ్యాహ్నం కల్లా ఆమె కాంగ్రెస్ కార్యాలయంలో హస్తం కండువా కప్పుకోవడం చర్చనీయాంశమైంది.

8, 9, 10 తేదీల్లో తుది విడత ఇంటింటికీ బీజేపీ
బీజేపీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి శ్రుతి



సాక్షి, హైదరాబాద్: వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి 400కు పైగా సీట్లలో విజయం సాధించాలన్న నిర్దేశిత లక్ష్యసాధన నిమిత్తం పోలింగ్‌బూత్ స్థాయినుంచి బీజేపీ పటిష్టానికి చర్యలు తీసుకుంటున్నట్టు బీజేపీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి బంగారు శ్రుతి తెలిపారు. ఇందులో భాగంగా శనివారం రాష్ట్రవ్యాప్తంగా మండలస్థాయిలో సమావేశాలు నిర్వహించనున్నట్టు ఒక ప్రకటనలో తెలిపారు. ఆది, సోమవారాల్లో పోలింగ్‌బూత్ సమావేశాలు నిర్వహించనున్నట్టు తెలిపారు. ఈ నెల 8, 9, 10 తేదీల్లో ఇంటింటికి వెళ్లి ఓటర్లను కలుసుకునే కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు ఆమె వెల్లడించారు.



శుక్రవారం ధర్మపురి సభలో మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి



సిరిసిల్ల బహిరంగ సభకు హాజరైన జనం

మోదీది సవతి తల్లి ప్రేమ

▶ మొదటి పేజీ తరువాయి

అడిగినా.. బీజేపీ గాడిద గుడ్డు ఇచ్చిందని సభికులతో సీఎం రేవంత్ అనిపించారు.

కారు ఢిల్లీకి పోతే.. కమలం అవుతుంది

'తెలంగాణలో కారు ఢిల్లీకి పోతే కమలం అవుతుంది. 2014, 2019లో రెండుసార్లు 12 ఎంపీ సీట్లు, 9 ఎంపీ సీట్లు ఇస్తే.. కేసీఆర్ ఏం చేశాడు..ఢిల్లీ సుల్తాన్‌లకు తాకట్టుపెట్టాడు'అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. సిరిసిల్లలో ఆయన మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం తెచ్చిన నల్లాచట్టాలు, నోట్ల రద్దుకు బీఆర్‌ఎస్ మద్దతు పలికిందన్నారు. కరీంనగర్‌లో పోటీ చేసిన ఒక్కరు అపరమేధావి, మరొకరు అరగుండు మేధావి అని, ఇద్దరూ పాతవారే, ఎంపీలుగా పనిచేసిన వారే కదా అని ప్రశ్నించారు. ఎంపీలుగా ఉన్నప్పుడు ఏమీ చేయనోళ్లు.. ఇప్పుడు మళ్లీ గెలిచి ఏం చేస్తారన్నారు. పదేళ్ల తెలంగాణను నిర్లక్ష్యం చేసి, తెలంగాణ పునర్విభజన చట్టాన్ని అమలు చేయని బీజేపీకి ఓట్లు ఎట్లా వేస్తామన్నారు. బయ్యారం ఉక్కు పరిశ్రమ, వరంగల్ రైల్వే కోచ్ ప్యాక్టరీ, గిరిజన యూనివర్సిటీ, ఐటీఐఆర్ కారిడార్ వంటి తెలంగాణ పునర్విభజన చట్టంలోని ఒక్కదాన్ని కూడా బీజేపీ ఇవ్వలేదని చెప్పారు.

ఉద్దెరోడు పెట్టిన రూ. 40 వేల కోట్లు కట్టలేకపోతున్నా..

రాష్ట్రంలో ఈ ఉద్దెరోడు పెట్టిపోయిన రూ.40వేల కోట్లు కట్టలేకపోతున్నానని, సిరిసిల్ల నేతన్నలకు రూ.275 కోట్లు బకాయి పెట్టిపోయిండని రేవంత్‌రెడ్డి అన్నారు. నేత, గీత కార్మికులను ఆదుకోవాలని నేతకార్మికులకు ఇటీవల రూ.50 కోట్లు మంజూరు చేశామని, ఎన్నికలు ముగిసిన తర్వాత మిగతా బకాయిలు ఇస్తామన్నారు. అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే ఐదు గ్యారంటీలను అమలు చేశామని, 4.50 లక్షల ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని రేవంత్‌రెడ్డి అన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, చొప్పదండి, మానకొండూర్ ఎమ్మెల్యేలు మేడిపల్లి సత్యం, డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నేడు 4 చోట్ల సీఎం రేవంత్ ప్రచారం

సాక్షి, హైదరాబాద్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శనివారం రాష్ట్రంలో నాలుగు చోట్ల ఎన్నికల ప్రచారం నిర్వహించనున్నారు. ఉదయం 11 గంటలకు కొత్తగూడెం జన జాతర సభకు హాజరుకానున్న రేవంత్.. సాయంత్రం 5 గంటలకు కొత్తకోట (మహబూబ్‌నగర్) కార్నర్ మీటింగ్‌లో పాల్గొంటారు. ఆ తర్వాత సాయంత్రం 6.30 గంటలకు సికింద్రాబాద్ కార్నర్ మీటింగ్, రాత్రి 8 గంటలకు ముషీరాబాద్ కార్నర్ మీటింగ్‌కు సీఎం హాజరవుతారని గాంధీభవన్ వర్గాలు వెల్లడించాయి.

మతం, బద్నాం.. బీజేపీ, బీఆర్‌ఎస్ నినాదాలివే
టీపీసీసీ ఎన్నికల నిర్వహణ కమిటీ మండిపాటు



గాంధీ భవన్‌లో మాట్లాడుతున్న వినోద్‌రెడ్డి, కత్తి వెంకటస్వామి

సాక్షి, హైదరాబాద్: ఈసారి ఎన్నికలు గతం కంటే భిన్నంగా జరుగుతున్నాయని, మతం పేరుతో లబ్ధి పొందాలని బీజేపీ.. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని బద్నాం చేయడం ద్వారా లబ్ధి పొందాలని బీఆర్‌ఎస్ చూస్తున్నాయని టీపీసీసీ ఎన్నికల నిర్వహణ కమిటీ విమర్శించింది. కమిటీ నేతలు ఎంఆర్‌జీ వినోద్‌రెడ్డి, కత్తి వెంకటస్వామి శుక్రవారం గాంధీభవన్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని దెబ్బతీయాలన్న బీజేపీ కుట్రకు బీఆర్‌ఎస్ సహకరిస్తోందని ఆరోపించారు. ఈ కుట్రను భగ్నం చేస్తామని, కాంగ్రెస్ శ్రేణుల అండతో ఈ ఎన్నికల్లో మెజార్టీ స్థానాలు సాధిస్తామని వారు ధీమా వ్యక్తంచేశారు. ఎన్నికల కమిషన్, పోలీసు వ్యవస్థతో తాము సహకరిస్తామని, ఎప్పటికప్పుడు కాంగ్రెస్ కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ ఈ ఎన్నికల్లో ముందుకెళ్తామని చెప్పారు.

పేగుల ఆరోగ్యానికి మామిడి రక్ష

- హైదరాబాద్ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తల అధ్యయనంలో వెల్లడి
- వాటి వివరాలను ప్రచురించిన ఓ అమెరికన్ జర్నల్

సాక్షి, హైదరాబాద్: పండ్లలోకెల్లా రారాజు అయిన మామిడి.. పేగు పూత వ్యాధి (ఐబీడీ) సహా చాలా రకాల జీర్ణ సంబంధ రుగ్మతల నుంచి రక్షిస్తుందని తాజా అధ్యయనం వెల్లడించింది. పేగుల ఆరోగ్యాన్ని కాపాడటంలో సహాయ పడుతుందని తెలిపింది. ఈ అంశంపై యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ (హెచ్‌సీయూ)కు చెందిన శాస్త్రవేత్తలు చేపట్టిన అధ్యయన వివరాలను 'అమెరికన్ కెమికల్ సొసైటీ ఫార్మకాలజీ అండ్ ట్రాన్స్‌లేషనల్ సైన్స్'జర్నల్ ప్రచురించింది. ఈ జర్నల్ తెలిపిన వివరాల ప్రకారం హెచ్‌సీయూలోని స్కూల్ ఆఫ్ లైఫ్ సైన్సెస్ ప్రొఫెసర్ రెడ్డన్న ల్యాబ్‌కు చెందిన డాక్టర్ గంగాధర్, డాక్టర్ సురేష్ కలంగి, డాక్టర్ అనిల్ కొత్త శాస్త్రవేత్తల బృందం జంతువుల్లో పేగు పూత వ్యాధి నుంచి మామిడి ఎలా రక్షిస్తుందో ప్రయోగాత్మకంగా నిరూపించింది. కొన్ని జంతువులకు కోలైటిస్ అనే పేగు పూత వ్యాధిని కృత్రిమంగా కలగజేయగా మామిడిలోని మాంగిఫెరిన్ అనే సహజ కాంపౌండ్ దాన్ని అడ్డుకుందని శాస్త్రవేత్తలు తెలిపారు. పేగుల పైపొర క్షీణించడాన్ని మాంగిఫెరిన్ నివారించిందని, పేగుల్లో వాపు కలిగించే కణాలు దరిచేరనీయకుండా నిరోధించిందని వివరించారు. పేగు కేన్సర్ వ్యతిరేక ప్రభావాలను కూడా మాంగిఫెరిన్ ప్రదర్శించిందని చెప్పారు. అయితే పేగు వాపు వ్యాధుల చికిత్సలో మాంగిఫెరిన్‌ను ఉపయోగించే విషయంలో మరిన్ని ప్రయోగాలు చేపట్టాల్సి ఉందన్నారు.

తప్పుడు ప్రచారంలో ఎంపీ అర్వింద్ దిట్ట
సామ రామ్మోహన్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: మెట్‌పల్లిలో ఇన్నోవా కారు ఢీకొని భూక్యా రాములు చనిపోయిన ఘటనకు సీఎం కాన్వాయ్‌కు ఎలాంటి సంబంధంలేదని టీపీసీసీ మీడియా, కమ్యూనికేషన్ చైర్మన్ సామ రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. ఎలాంటి సంబంధం లేని ఈ ప్రమాదాన్ని ఎంపీ ధర్మపురి అర్వింద్ సీఎంకు అంటగట్టడం విడ్డూరమని శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తప్పుడు ప్రచారం చేయడంలో అర్వింద్ బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను మించిపోయాడని ఎద్దేవా చేశారు.

హైదరాబాద్‌కు సుప్రీం బెంచ్ తెస్తాం

లోక్‌సభ ఎన్నికలకు తెలంగాణ కాంగ్రెస్ హామీలు.. 23 అంశాలతో ప్రత్యేక మేనిఫెస్టో విడుదల

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ సమాజం కోరుకునే మొత్తం 23 అంశాలతో లోక్‌సభ ఎన్నికల కోసం ప్రత్యేకంగా రాష్ట్ర మేనిఫెస్టోను రూపొందించామని టీపీసీసీ మేనిఫెస్టో కమిటీ చైర్మన్, మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు చెప్పారు. కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే ఏపీ పునర్వ్యవస్థీకరణ చట్టంలోని అన్ని హామీలను నెరవేరుస్తామన్నారు. హైదరాబాద్‌లో సుప్రీంకోర్టు బెంచ్‌ను ఏర్పాటు చేయడం సహా వివిధ హామీలు అమలు చేస్తామని తెలిపారు. శుక్రవారం గాంధీభవన్‌లో జరిగిన కార్యక్రమంలో టీపీసీసీ ఆధ్వర్యంలో లోక్‌సభ ఎన్నికల మేనిఫెస్టోను విడుదల చేశారు. పాంచ్‌న్యాయ్, తెలంగాణకు ప్రత్యేక హామీల పేరుతో రూపొందించిన ఈ మేనిఫెస్టో విడుదల కార్యక్రమంలో రాష్ట్ర పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్సీ బి. మహేశ్‌కుమార్‌గౌడ్, ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, మేనిఫెస్టో కమిటీ సభ్యులు రియాజ్, ఆల్దాసు జానయ్య, వినోద్‌కుమార్, కమలాకర్‌రావు, అనంతుల శ్యాంమోహన్, లింగం యాదవ్, కప్పర హరిప్రసాదరావు, పార్టీ నేతలు మెట్టు సాయికుమార్, చనగాని దయాకర్ పాల్గొన్నారు.

నీతి ఆయోగ్ ప్రాంతీయ కార్యాలయం ఏర్పాటు చేస్తాం..

ప్రత్యేక మేనిఫెస్టో విడుదల సందర్భంగా మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ నీతి ఆయోగ్ కార్యాలయాన్ని హైదరాబాద్‌లో పెట్టాలని నిర్ణయించామన్నారు. అలాగే పలు జాతీయ స్థాయి ప్రతిష్టాత్మక సంస్థలను ఏర్పాటు చేస్తామని చెప్పారు. పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టు, మేడారం జాతరకు జాతీయ హోదా కల్పిస్తామని, ఏపీలో విలీనమైన 5 గ్రామాలను తెలంగాణలో కలుపుతామని హామీ ఇచ్చారు. బీఆర్‌ఎస్ హయాంలో తెలంగాణ ఆర్థిక వ్యవస్థ చిన్నాభిన్నమైందని శ్రీధర్‌బాబు విమర్శించారు. గత పదేళ్లలో కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ, రాష్ట్రంలో అధికారం చేపట్టిన బీఆర్‌ఎస్ తెలంగాణకు ఏమీ చేయలేదని మండిపడ్డారు. తాము అధికారంలోకి వచ్చాక పాలనను గాడిలో పెట్టామని చెప్పారు. అనంతరం దీపాదాస్ మున్షీ మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా 400 సీట్లు గెలిచి రాజ్యాంగాన్ని మార్చాలని ప్రధాని మోదీ ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. తెలంగాణలో రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో 14 సీట్లు గెలుస్తామని ఆమె ధీమా వ్యక్తం చేశారు.



మాట్లాడుతున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి. చిత్రంలో పల్లా వెంకట్‌రెడ్డి, జానారెడ్డి తదితరులు

బీజేపీని ఓడించడమే మన కర్తవ్యం
సీపీఐ కార్యకర్తల సమావేశంలో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

హుజూర్‌నగర్: బీజేపీని ఓడించడమే మన కర్తవ్యమని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. కాంగ్రెస్ గెలవాలని పాకిస్తాన్ కోరుకుంటోందని ప్రధాని హోదాలో నరేంద్రమోదీ చేస్తున్న ఆరోపణలు, దిగజారుడు మాటలు చాలా దురదృష్టకరం అన్నారు. శుక్రవారం సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్‌లో నిర్వహించిన సూర్యాపేట, కోదాడ, మిర్యాలగూడ, హుజూర్‌నగర్ అసెంబ్లీ నియోజకవర్గాల సీపీఐ ముఖ్య కార్యకర్తల సమావేశంలో మంత్రి ఉత్తమ్ మాట్లాడారు. బీజేపీ, మోదీ దేశానికి, తెలంగాణకు ఏం చేశారని, వారి కుటుంబాలు దేశానికి ఏమైనా త్యాగాలు చేశాయా చెప్పాలని ఆయన నిలదీశారు. గాంధీ కుటుంబం దేశం కోసం ప్రాణ త్యాగాలు చేసిందని, అటువంటి వారిపై ప్రధాని మోదీ ఎలా మాట్లాడుతున్నారో ఆలోచన చేయాలని చెప్పారు. దేశవ్యాప్తంగా బీజేపీపై పోరాడే దానిలో మీరే (కమ్యూనిస్టులే) ముందుంటారని మంత్రి పేర్కొన్నారు. తెలంగాణలో పాగా వేసేందుకు బీజేపీ ప్రయత్నిస్తున్నదని, దానిని తిప్పికొట్టాలన్నారు. ఇక బీఆర్‌ఎస్.. చాప్టర్ క్లోజ్ అయిందని, మొన్న శాసనసభ ఎన్నికల్లో ప్రజలు బొంద పెట్టారని, ఇప్పటికే నలుగురు ఎమ్మెల్యేలు కాంగ్రెస్ పార్టీలో చేరారని, మరో 20 మంది చేరబోతున్నారని ఆయన చెప్పారు. ప్రస్తుతం పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీకి వచ్చే సీట్లు సున్నా అని ఆ తర్వాత ఆ పార్టీ మిగలదని ఆయన చెప్పారు. ఈ సమావేశంలో మాజీ మంత్రి కుందూరు జానారెడ్డి, కాంగ్రెస్ నల్లగొండ ఎంపీ అభ్యర్థి రఘువీర్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు సాముల శివారెడ్డి, దొంతగాని శ్రీనివాస్, సీపీఐ జాతీయ సమితి సభ్యుడు పల్లా వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కేంద్రమంత్రి అమిత్ షాపై కేసు
ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించినందుకు నమోదు



గౌలిపురా (హైదరాబాద్): ఎన్నికల నిబంధనలను ఉల్లంఘించిన అంశంలో కేంద్రమంత్రి అమిత్ షాపై మొఘల్‌పురా పోలీసులు కేసు నమోదు చేశారు. ఈమేరకు ఇన్‌స్పెక్టర్ పి.నాగదుర్గాప్రసాద్ వివరాలు వెల్లడించారు. ఈనెల 1న పాతబస్తీలో హైదరాబాద్ బీజేపీ ఎంపీ అభ్యర్థి మాధవీలతకు మద్దతుగా అమిత్ షా ప్రచారం నిర్వహించారు. ఈ నేపథ్యంలో ఎన్నికల నియమాలను బీజేపీ పట్టించుకోలేదని, చిన్నారులతో ప్రచారం చేయించారని టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు గోపిశెట్టి నిరంజన్ ఢిల్లీలోని ఎన్నికల ప్రధాన అధికారికి మెయిల్ ద్వారా ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన ఈసీ జరిగిన సంఘటనపై విచారణ జరిపించాలంటూ హైదరాబాద్ పోలీసు కమిషనర్‌ను ఆదేశించింది. సీపీ కొత్తకోట శ్రీనివాస్ రెడ్డి ఆదేశాలతో దక్షిణ మండలం డీసీపీ స్నేహా మెహ్రా ఆదేశాల మేరకు మొఘల్‌పురా పోలీసులు విచారణ చేపట్టి సెక్షన్ 188 ఐపీసీ కింద కేసు నమోదు చేశారు. మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ కోడ్‌ను ఉల్లంఘించిన నిర్వాహకుడు టి.యమన్ సింగ్, ఎంపీ అభ్యర్థి మాధవీలత, కేంద్రమంత్రి అమిత్ షా, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి, ఎమ్మెల్యే రాజాసింగ్‌లపై కేసు నమోదు చేశారు.

కేంద్రంలో కాంగ్రెస్ రావడం అనివార్యం

- కాంగ్రెస్ మేనిఫెస్టోపై ప్రధాని అబద్ధాలు
- మిగులు రాష్ట్రాన్ని కేసీఆర్ అప్పుల్లో ముంచారు
- మీట్ ది ప్రెస్‌లో టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్



సాక్షి, హైదరాబాద్: కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం రావడం అనివార్యమని, జనాభాలో అధిక శాతం ఉన్న పేద వర్గాలకు సామాజిక న్యాయం కల్పించేందుకు ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీ పోరాటం కొనసాగిస్తున్నారని టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్ అన్నారు. కాంగ్రెస్ హయాంలో స్థాపించిన సంస్థలను అమ్మడమే తప్ప.. మోదీ సర్కార్ కొత్తగా ఏర్పాటుచేసిన సంస్థలేమీ లేవని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టుల సంఘం (టీయూడబ్ల్యూజే) ఆధ్వర్యంలో శుక్రవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన 'మీట్ ది ప్రెస్'లో మధుయాష్కీ పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ, దేశంలో రిజర్వేషన్లు ఎత్తివేసి, రాజ్యాంగాన్ని రద్దు చేసేందుకు పన్నిన కుట్రలో భాగంగానే తమకు 400 సీట్లు ఇవ్వాలంటూ మోదీ ప్రజలను కోరుతున్నారన్నారు. కాంగ్రెస్ విడుదల చేసిన మేనిఫెస్టోపై ప్రధాని మోదీ పచ్చి అబద్ధాలు మాట్లాడుతున్నారని మధుయాష్కీ ధ్వజమెత్తారు. విదేశాలనుంచి నల్లధనం తెస్తానని, ప్రతి ఒక్కరి అకౌంట్లో రూ.15 లక్షలు వేస్తానన్న మాటలు ఏమయ్యాయని ప్రశ్నించారు. తాను ఓబీసీ అని చెప్పుకునే మోదీ.. ఓబీసీలకు ఒక్క మేలు కూడా చేయలేదన్నారు.

కేసీఆర్ అప్పుల్లో ముంచారు

మిగులు రాష్ట్రంగా ఉన్న తెలంగాణను మాజీ సీఎం కేసీఆర్ రూ.7 లక్షల కోట్ల అప్పుల్లో ముంచారని, అవినీతి.. అక్రమాలతో తెలంగాణను సర్వనాశనం చేశారని మధుయాష్కీ విమర్శించారు. తెలంగాణ రాష్ట్రం వచ్చాక కేసీఆర్ కుటుంబమే బాగుపడిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి కూల్చేస్తాం, పడగొడతామంటూ ఒకదిక్కు బీఆర్‌ఎస్, మరోదిక్కు బీజేపీ అవాకులు చవాకులు పేలుతున్నాయని, అందుకే తాము ఇతర పార్టీలనుంచి వచ్చే వారిని ఆహ్వానిస్తున్నామని ఒక ప్రశ్నకు ఆయన బదులిచ్చారు. టీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు విరాహత్ అలీ అధ్యక్షతన ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.



చౌటుప్పల్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బీవీ రాఘవులు

దేశవ్యాప్తంగా జనాభా, కులగణన చేపట్టాలి: బీవీ రాఘవులు

చౌటుప్పల్: దేశవ్యాప్తంగా జనాభా, కులగణన చేపట్టాలని సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు డిమాండ్ చేశారు. తద్వారా దేశంలో బీసీల జనాభా ఎంత ఉన్నది, ఏ మేరకు వెనుకబాటులో ఉన్నారన్న విషయం తెలుసుకొని తగిన చర్యలు తీసుకునే అవకాశం ఉంటుందన్నారు. పట్టణ కేంద్రంలోని కందాల రంగారెడ్డి స్మారక భవనంలో శుక్రవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ..బీజేపీ మొదటి నుంచీ రిజర్వేషన్లకు వ్యతిరేకమని, అందుకే జనాభా, కులగణన చేయడం లేదని ఆరోపించారు. మతపరమైన రిజర్వేషన్లను తొలగిస్తామంటున్న బీజేపీ ఆ తర్వాత మొత్తం రిజర్వేషన్లను కూడా తొలగిస్తుందని హెచ్చరించారు. తెలంగాణ రాష్ట్రాన్ని రజాకార్లకు అప్పగించేందుకు కమ్యూనిస్టులు ప్రయత్నిస్తున్నారని ప్రధాని నరేంద్రమోదీ మాట్లాడటం సిగ్గుచేటన్నారు. ఈ రాష్ట్రం నుంచి రజాకార్లను తరిమికొట్టిన చరిత్ర కమ్యూనిస్టులదేనని తెలిపారు. సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు చెరుపల్లి సీతారాములు మాట్లాడుతూ..నిస్వార్థంగా ప్రజల కోసం 35ఏళ్లుగా పనిచేస్తున్న భువనగిరి సీపీఎం అభ్యర్థి జహంగీర్‌ను గెలిపించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. బీజేపీ నాయకత్వం ఫేక్ వీడియో అంశంతో భయభ్రాంతులకు గురిచేస్తుందని మండిపడ్డారు. విలేకరుల సమావేశంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు పైళ్ల ఆశయ్య తదితరులు పాల్గొన్నారు.

రిజర్వేషన్లు రద్దంటే చెప్పుతో ఉరికించి కొట్టండి

- మోదీ బతికున్నంత వరకు రిజర్వేషన్లను కొనసాగిస్తాం
- ఫోన్ ట్యాపింగ్ పైసలతో మీ ఓట్లను కొనాలనుకుంటున్నరు
- పొరపాటున పైసలు తీసుకుంటే.. నోటీసులొచ్చే ప్రమాదం ఉంది
- 300 సీట్లకు మించి పోటీ చేయని కాంగ్రెస్‌కు అధికారం ఎట్లా సాధ్యం?
- కాంగ్రెస్‌కు ఓట్లేస్తే మూసీలో వేసినట్లే... బండి సంజయ్ సంచలన వ్యాఖ్యలు

హుజూరాబాద్/కరీంనగర్ టౌన్: రిజర్వేషన్లను రద్దు చేస్తామని చెప్పేవాళ్లను చెప్పు, చీపుర్లతో తరిమితరిమి కొట్టాలని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్ కుమార్ పిలుపునిచ్చారు. ఫోన్ ట్యాపింగ్ పైసలతో కరీంనగర్‌లో కాంగ్రెస్ అభ్యర్థి ఓట్లను కొనాలనుకుంటున్నారని ఆరోపించారు. పొరపాటున ఆ పైసలు తీసుకుంటే.. నోటీసులు వచ్చే ప్రమాదముందని ప్రజలను హెచ్చరించారు. 300 సీట్లకు మించి పోటీ చేయని కాంగ్రెస్ పార్టీకి కేంద్రంలో అధికారం ఎలా సాధ్యమని ప్రశ్నించిన బండి సంజయ్ ఆ పార్టీకి ఓటేస్తే మూసీలో వేసినట్లేనని వ్యాఖ్యానించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా హుజూరాబాద్‌లో కార్నర్ మీటింగ్, కరీంనగర్‌లో నిర్వహించిన సమావేశాలు, సభల్లో ఆయన మాట్లాడారు. ''కాంగ్రెస్ నన్ను ఓడగొట్టడానికి బి.సంజయ్ అనే వ్యక్తిని బరిలోదింపి కాలీఫ్లవర్ గుర్తు ఇప్పిస్తామని మభ్యపెట్టింది. తనను ఎదుర్కొనే దమ్ములేక ఇట్లాంటి లుచ్చా పనులు చేస్తోంది'అని మండిపడ్డారు.

6 గ్యారంటీలపై ఎందుకు మాట్లాడరు?

''సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడితే బీజేపీ తెలంగాణకు ఏమిచ్చిందని అడుగుతున్నడు. బండి సంజయ్ ఏం చేసిండని అంటున్నడు. ఆయనకు తెల్వదేమో.. రాష్ట్రానికి కేంద్రం రూ.10 లక్షల కోట్లకు పైగా నిధులు ఇచ్చింది. జమ్మికుంటకు వచ్చి ప్రధానిని తిట్టినవ్. నన్ను కూడా గుండు అని తిట్టినవ్. గాడిద గుడ్డు అన్నవ్. నా మీద, గాడిద గుడ్డు మీద ఉన్న శ్రద్ధ ఆరు గ్యారంటీల అమలుపై ఎందుకు లేదు''అని బండి ప్రశ్నించారు. తాను మాట్లాడితే దేవుడితో రాజకీయమంటారు? మరి రేవంత్ చేస్తుందేమిటని నిలదీశారు.

''సీఎం రేవంత్‌కి సీటు పోతుందని భయం పట్టుకుంది. ఎంపీ సీట్లు రాకపోతే ఎట్లా అని ఆలోచిస్తున్నడు. ఆ బాధతోనే మోదీని తిడుతున్నడు. మోదీ అధికారంలోకి వస్తే రిజర్వేషన్లు రద్దు చేస్తారని అబద్ధాలు చెబుతున్నడు. మేం మళ్లీ చెబుతున్నాం.. రిజర్వేషన్లను కొనసాగించి తీరుతాం. మోదీ బతికున్నంత వరకు రిజర్వేషన్లను కొనసాగిస్తాం''అని స్పష్టం చేశారు.

కాంగ్రెస్ ఎట్ల అధికారంలోకి వస్తది?

పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి ఎట్లా వస్తది? ఆ పార్టీ పోటీ చేసే స్థానాలే 300 దాటడం లేదు? అధికారం కావాలంటే 275 సీట్లు కావాలి కదా. మరి అధికారం ఎట్లా సాధ్యం? అసలు కాంగ్రెస్‌కు ఎవరిని చూసి ఓటేయాలి? ఆ పార్టీ ప్రధాని అభ్యర్థి ఎవరు?''అని బండి సంజయ్ ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీకి ఓటేస్తే మూసీలో వేసినట్లేనన్నారు. అయోధ్యలో ప్రాణ ప్రతిష్ఠకు పిలిస్తేనే రాని కేసీఆర్ రామభక్తుడు ఎట్లా అవుతారని నిలదీశారు. భారతీయ జనతా మహిళా మోర్చా మహిళ శక్తి సమ్మేళనంలో పాల్గొన్న బండి మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్రమోదీ మహిళల పక్షపాతి అని కొనియాడారు.



హుజూరాబాద్‌లో జరిగిన స్ట్రీట్ కార్నర్ మీటింగ్‌లో మాట్లాడుతున్న బండి సంజయ్

రేవంత్ ప్రచారం చేయకుండా నిషేధించాలి

- మోదీ, అమిత్ షాలను కించపరిచేలా మాట్లాడుతున్నారు
- సీఈఓకు ఫిర్యాదు చేసిన బీజేపీ

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ఎన్నికల ప్రచారం నిర్వహించకుండా టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిపై నిషేధం విధించాలని రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి వికాస్‌రాజ్‌కు బీజేపీ విజ్ఞప్తి చేసింది. ఎన్నికల ప్రచార సభలు, మీడియా సమావేశాల్లో ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షాలను కించపరిచేలా రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలు చేయడంతోపాటు, తప్పుడు ప్రకటనలు చేస్తున్నారని సీఈఓ దృష్టికి తీసుకొచ్చింది. వచ్చే ఎన్నికల్లో ఎన్డీఏ మళ్లీ అధికారంలోకి వస్తే రాజ్యాంగ సవరణల ద్వారా రిజర్వేషన్లు రద్దు చేస్తుందని, ఎన్నికల ప్రచారంలో ఓటర్లను తప్పుదోవ పట్టించేలా రేవంత్‌రెడ్డి దుష్ప్రచారం చేస్తున్నారని పేర్కొంది. ఇటీవల సిద్దిపేటసభలో అమిత్‌షా చేసిన ప్రసంగ వీడియోను మార్ఫింగ్ చేసి ఆయనతోపాటు, మోదీ వ్యక్తిత్వానికి భంగం కలిగించి ప్రజల్లో వ్యతిరేకత వచ్చేలా రేవంత్‌రెడ్డి వ్యవహరిస్తున్నారని ఆరోపించింది. అమిత్‌షా మాటలను మార్ఫింగ్ చేసిన వీడియోపై సైబర్ క్రైంస్టేషన్‌లో బీజేపీ కేసు నమోదు చేయించగా, దానిపై విచారణ సాగుతోందని తెలిపింది. అయితే దీనిని కూడా తప్పుదారి పట్టించేలా, మళ్లీ తాజాగా నిజామాబాద్ సభలో మోదీ, అమిత్‌షాలను కించపరిచేలా రేవంత్‌రెడ్డిని వివాదాస్పద వ్యాఖ్యలు చేశారని సీఈఓ దృష్టికి తెచ్చింది. రిజర్వేషన్ల రద్దుపై మోదీ, అమిత్‌షాలను తాను ప్రశ్నించడం వల్ల తనపై కేసులు పెడుతున్నారంటూ రేవంత్‌రెడ్డి మార్ఫింగ్ వీడియో అంశాన్ని ప్రస్తావించకుండా ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని పేర్కొంది. తాను రిజర్వేషన్ల రద్దుపై పోరాడుతూ ప్రజలను చైతన్యవంతులను చేస్తున్నందున హోంశాఖ తనను అరెస్ట్ చేయాలని కోరుకుంటోందని రేవంత్‌రెడ్డి నిజామాబాద్ సభలో, హైదరాబాద్ మీడియా సమావేశంలో మాట్లాడారని తెలిపింది. ఈ వీడియోను కూడా తమ ఫిర్యాదుతో జతచేసినట్టు వెల్లడించింది. రేవంత్‌రెడ్డి చేసిన ప్రసంగం ఆధారరహితమైనదని, దీనివల్ల దేశంలో అశాంతి చెలరేగే ప్రమాదముందని ఆందోళన వ్యక్తం చేసింది. ఈ నేపథ్యంలో రేవంత్‌రెడ్డిపై చర్యలు చేపట్టడంలో భాగంగా...మళ్లీ ఆయన ఇలాంటి వ్యాఖ్యలు చేయకుండా నిరోధించేందుకు రేవంత్ ప్రచారం చేయకుండా నిషేధించాలని కోరింది. బీజేపీనేత ఎస్.రామచందర్‌రావు పార్టీనేతలు గోకుల రామారావు, ఆంథోనిరెడ్డి శుక్రవారం సీఈఓను కలిసి వినతిపత్రం సమర్పించారు.

సాక్షి హైదరాబాద్
శనివారం ౹ 4 ౹ మే ౹ 2024







సనత్‌నగర్, అడ్డగుట్ట, సీతాఫల్‌మండి, నాంపల్లి ప్రాంతాల్లో శుక్రవారం రాత్రి నిర్వహించిన రోడ్ షోల్లో బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రసంగించారు. బీఆర్‌ఎస్ అభ్యర్థులను గెలిపించాలని ప్రజలను కోరారు.

చిరుత చిక్కింది




మేక కోసం బోనులోకి వెళ్తున్న చిరుత


నెహ్రూ జూకు తరలిస్తూ..

మేక కోసం బోనులోకి వచ్చి..

జూకు తరలించిన అధికారులు

ఆరు రోజులుగా ఎయిర్‌పోర్టు పరిసరాల్లోనే..

శంషాబాద్: ఆరు రోజులుగా అటవీ, ఎయిర్‌పోర్టు అధికారులకు.. సమీప గ్రామస్తులకు ముచ్చెమటలు పట్టించిన చిరుత ఎట్టకేలకు చిక్కింది. బోనులో ఎరగా వేసిన మేకతో పాటు మాంసం కోసం వచ్చి దొరికిపోయింది. గత శనివారం అర్ధరాత్రి గొల్లపల్లి సమీపంలోని మూడు అడుగుల ఎత్తు ఉన్న ఎయిర్‌పోర్టు ప్రహరీ దూకి ఎయిర్‌పోర్టులోకి చిరుత ప్రవేశించినట్లు సీసీ కెమెరాల్లో నమోదైంది. అదే రోజు రాత్రి రన్‌వేకు అత్యంత సమీపంలో సంచరించినట్లు గుర్తించిన ఎయిర్‌పోర్టు భద్రతాధికారులు వెంటనే అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. తొలుత చిరుతా? అడవి పిల్లినా? అని అనుమానించిన అధికారులు సీసీ కెమెరాల్లో స్పష్టమైన ఆనవాళ్లు కనిపించడంతో చిరుతగా నిర్ధారించి పట్టుకునేందుకు తీవ్రంగా శ్రమించారు. మొదట రెండు బోన్లను మాత్రమే ఏర్పాటు చేసిన అధికారులు రెండు రోజుల తర్వాత చెట్లు దట్టంగా ఉన్న ప్రాంతాల్లో మొత్తం అయిదు బోన్లను పెట్టారు. 25 ట్రాప్ కెమెరాలు ఏర్పాటు చేశారు. మూడు రోజులుగా బోన్ల వద్ద మేక మాంసంతో పాటు మేకను కూడా ఎరగా వేస్తూ వచ్చారు. రెండు రోజుల క్రితం చిరుత బోన్లకు అతి సమీపంలోకి వచ్చినా లోనికి వెళ్లలేదు. గురువారం రాత్రి 8 గంటల సమయంలో రన్‌వేకు రెండు కిలోమీటర్ల దూరంలో చిన్నపాటి కొండలా ఉన్న ప్రాంతంలో ఏర్పాటు చేసిన బోను సమీపంలోకి వెళ్లింది. తొలుత బోను చుట్టూ రెండు చక్కర్లు కొట్టింది. ఆ తర్వాత బోనులో ఉన్న మేకను చూసిన చిరుత అందులోకి ప్రవేశించిన వెంటనే వాటి గ్రిల్స్ ఒక్కసారిగా మూసుకుపోయాయి. దీంతో చిరుత చిక్కినట్లయింది.

కుందేళ్లు, నెమళ్లను తింటూ..

శుక్రవారం ఉదయం ఎఫ్‌డీఓ విజయానంద్‌రావు మాట్లాడుతూ.. ఆరురోజులుగా విమానాశ్రయం లోపలి ప్రాంతంలోనే చిరుత సంచరించినట్లు నిర్ధారించారు. సుమారు మూడేళ్ల వయసున్న మగ చిరుతగా గుర్తించినట్లు తెలిపారు. ఆరు రోజులుగా ఏడు మీటర్ల ఎత్తున్న గడ్డి ప్రాంతంలో ఎక్కువగా ఇది సంచరించిందని పేర్కొన్నారు. కుందేళ్లు, నెమళ్లను తింటూ ఆకలి తీర్చుకుందన్నారు. సమీపంలో నీటి గుంతలు కూడా ఉండడంతో దాని దాహానికి కూడా ఎలాంటి ఇబ్బందులు కలగలేదన్నారు. చిరుత పూర్తి ఆరోగ్యంతో పాటు ఆగ్రహంగా ఉందని ఆయన చెప్పారు. దానిని జూకు తరలించి వైద్యపరీక్షలు పూర్తి చేసిన అనంతరం అమ్రాబాద్ అడవుల్లో విడిచిపెట్టనున్నట్లు చెప్పారు. అది ఏ ప్రాంతం నుంచి వచ్చిందన్నది మాత్రం ఇంకా నిర్ధారణ కాలేదన్నారు.

మల్కాజిగిరి మాదే


'సాక్షి' ఇంటర్వ్యూ

- ప్రజలు కాంగ్రెస్ పాలన కోరుకుంటున్నారు
- ఎల్‌బీ నగర్, ఉప్పల్‌లో ఐటీ అభివృద్ధి చేస్తాం
- మౌలిక సదుపాయాల కల్పనపై ప్రత్యేక దృష్టి
- మల్కాజిగిరి లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థి సునీతా మహేందర్‌రెడ్డి

మల్కాజిగిరి ఎంపీ సిట్టింగ్ స్థానాన్ని మళ్లీ కాంగ్రెస్సే కైవసం చేసుకుంటుందని ధీమా వ్యక్తం చేస్తున్నారు ఆ పార్టీ అభ్యర్థి పట్నం సునీతా మహేందర్‌రెడ్డి. ఎంతో మంది ఉద్దండుల ఉజ్వల భవిష్యత్‌కు బాటలు వేసిన చోట తన అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు ఆమె. నియోజకవర్గంలోని ఏ ప్రాంతానికి వెళ్లినా ప్రజలు తనకు బ్రహ్మరథం పడుతున్నారని.. బీజేపీ, బీఆర్‌ఎస్ నుంచి నాయకులు, కార్యకర్తలు భారీగా పార్టీలో చేరుతున్నారని చెబుతున్నారు. మల్కాజిగిరి స్థానంలో విజయం సాధిస్తానని భరోసా వ్యక్తం చేస్తున్నారు. ఈ నియోజకవర్గ పరిధిలో సమస్యలపై తనకు స్పష్టమైన అవగాహన ఉందని.. గెలిచిన తర్వాత ఈ ప్రాంత అభివృద్ధికి అధిక నిధులు కేటాయిస్తానని సునీతారెడ్డి స్పష్టం చేశారు. శుక్రవారం 'సాక్షి'తో ఆమె ప్రత్యేకంగా మాట్లాడారు.

- వివరాలు 10లో▸

శుక్రవారం ఉష్ణోగ్రతలు ఇలా..	అల్లాపూర్	కుత్బుల్లాపూర్	నాచారం	చిలకలగూడ	సరూర్‌నగర్	యాకుత్‌పురా	షేక్‌పేట	ఖైరతాబాద్	మియాపూర్	మెట్టుగూడ	మధురానగర్	రాజేంద్రనగర్
	44.2	44.1	44.0	44.0	43.9	43.8	43.8	43.8	43.6	43.6	43.5	43.5

ప్రచండ'మే'

రారెత్తిస్తున్న ఎండలు • శివారులో 45.7.. సిటీలో 44.2

తొమ్మిదేళ్లలో రికార్డు స్థాయి ఉష్ణోగ్రతలు




నయాపూల్ వద్ద శుక్రవారం పావురాల దాహం తీరుస్తున్న పక్షి ప్రేమికుడు

సాక్షి, సిటీబ్యూరో: మహానగరంలో ఎండలు ప్రచండ'మే' అనేంతగా బెంబేలెత్తిస్తున్నాయి. భానుడి భగభగలు సెగలు పుట్టిస్తున్నాయి. ఉష్ణోగ్రతలు సరికొత్త రికార్డులను నమోదు చేస్తున్నాయి. సూరీడి ఉష్ణతాపానికి శుక్రవారం 'ఫ్రై' డేను తలపించింది. శివార్లలోని కీసరలో 45.7, చిలుకూరులో 45.2, అల్లాపూర్ వివేకానందనగర్‌లో 44.2 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. గత తొమ్మిదేళ్లలో ఇదే రికార్డు. 2015 మే 22న మాత్రం సికింద్రాబాద్‌లో 47.6, అబ్దుల్లాపూర్‌మెట్‌లో 47.2 డిగ్రీల ఉష్ణోగ్రతలు ఆల్‌టైమ్ రికార్డు. మహానగర సగటు ఉష్ణోగ్రత సైతం రికార్డు సృష్టిస్తోంది. మరో నాలుగు రోజుల్లో మరింత రికార్డు స్థాయిలో ఉష్ణోగ్రత నమోదయ్యే అవకాశాలున్నాయని హైదరాబాద్ వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసింది. అత్యవసరమైతే తప్ప పగటి పూట అడుగు బయటపెట్టొద్దని వైద్యులు సూచిస్తున్నారు. ఉదయం 9 గంటలకే సూరీడు సుర్రుమంటుండడంతో ద్విచక్ర వాహనదారులు, ఇంట్లోని పిల్లలు, వృద్ధులు త్వరగా డీహైడ్రేషన్‌కు లోనై అపస్మారక స్థితిలోకి వెళ్లే ప్రమాదం పొంచి ఉంది. వడదెబ్బ కారణంగా జ్వరం, తలనొప్పి, వాంతులు, విరేచనాలతో బాధపడుతూ నిలోఫర్ చిన్న పిల్లల ఆస్పత్రి సహా నల్లకుంట ఫీవర్ ఆస్పత్రి సహా ఉస్మానియా, గాంధీ ఆస్పత్రుల్లోని ఔట్ పేషెంట్ విభాగాలకు బాధితులు భారీగా వస్తున్నారు.

ఆల్కహాల్‌తోనూ డీ హైడ్రేషన్..

సాధ్యమైనంత వరకు మధ్యాహ్నం వేళ బయటికి వెళ్లక పోవడమే ఉత్తమం అని వైద్యనిపుణులు సూచిస్తున్నారు. అనివార్యమైతే వెంట గొడుగుతో పాటు వాటర్ బాటిల్, ఒంటికి చలువ చేసే మజ్జిగ, పండ్ల రసాలను తీసుకెళ్లాలని స్పష్టం చేస్తున్నారు. వేళకు సరిపడా నీరు తాగక పోవడం, ఉక్కపోతకు శరీరంలోని నీరు చమట రూపంలో బయటికి వెళ్లిపోతుండటంతో త్వరగా డీహైడ్రేషన్‌కు లోనవుతుండటంతో పాటు మూత్ర పిండాల్లో రాళ్లు ఏర్పడే ప్రమాదం ఉంది. ఆల్కహాల్ త్వరగా డీహైడ్రేట్ చేస్తుంది. సాధ్యమైనంత వరకు దాని జోలికి వెళ్లక పోవడమే ఉత్తమం.

వడదెబ్బ లక్షణాలివీ..

వడదెబ్బకు గురైన వ్యక్తికి మూత్ర విసర్జనలో భరించలేని నొప్పి, కండరాల తిమ్మిరి, భారీగా చెమట పట్టడం, విపరీతమైన బలహీనత, తలనొప్పి, వాంతులు, విరేచనాలు, అధిక హృదయ స్పందన, చర్మం పాలిపోవడం వంటి లక్షణాలు కన్పిస్తాయి. వీరిని తక్షణమే రోగిని చల్లగా ఉండే ప్రదేశానికి తరలించాలి, రోగి చుట్టూ గుంపులు గుంపుగా ఉండకూడదు. చన్నీటి బట్ట, స్పాంజ్‌తో నుదురు, మెడ, తల భాగాన్ని తుడవాలి. వదులుగా ఉండే, తేలిక పాటి, లేత రంగు దుస్తులను ధరించాలి. దోసకాయ, పుచ్చకాయ, దానిమ్మ పండ్లను ఎక్కువ తీసుకోవాలి. ఏరోబిక్ వ్యాయామాలకు బదులు తేలికపాటి వ్యాయామాలు, ఈత ఉత్తమం. ఆరుబయట ఉంటే, నీడలో క్రమం తప్పకుండా విశ్రాంతి తీసుకోవాలి. తరచూ నీళ్లు తాగాలి. నెత్తిన టోపి, కళ్లకు కూలింగ్ గ్లాసులు ధరించడం ద్వారా సూర్య రశ్మి నుంచి శరీరాన్ని, కళ్లను కాపాడుకోవచ్చు.

బాటలో మాటేసిన మృత్యువు


తుమ్మా భవానీ రుషి (ఫైల్)

బంజారాహిల్స్: జీహెచ్ఎంసీ స్ట్రీట్‌లైట్ విభాగం సిబ్బంది నిర్లక్ష్యం ఓ యువకుడి నిండు ప్రాణాన్ని బలిగొంది. తనకు ఉద్యోగం వచ్చిందన్న ఆనందాన్ని జీవిత భాగస్వామితో పంచుకునేందుకు వెళ్తున్న ఓ యువకుడిని కరెంటు స్తంభం రూపంలో మృత్యువు కాటేసింది. ఈ ఘటన జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. పెద్దపల్లి జిల్లా జూలపల్లి మండలం కుమ్మరికుంట గ్రామానికి చెందిన తుమ్మా భవానీ రుషి (35) హార్డ్‌వేర్ ఇంజినీర్‌గా పని చేస్తున్నాడు. ఆయన భార్య సుజాత స్లేట్ స్కూల్‌లో టీచర్. యూసుఫ్‌గూడ సమీపంలోని వెంకటగిరిలో అద్దె ఇంట్లో నివసిస్తున్నారు. గురువారం ఉదయం రుషి ఎక్కువ జీతంతో కూడిన మరో ఉద్యోగానికి సంబంధించిన ఇంటర్వ్యూకు హాజరయ్యాడు. సాయంత్రం తనకు కొత్త సంస్థలో ఉద్యోగం వచ్చిందని భార్యకు ఫోన్ చేసి చెప్పాడు. రాత్రి 10 గంటల సమయంలో కృష్ణానగర్ నుంచి ఇంటికి నడుచుకుంటూ వెళ్తున్నాడు. ఈ క్రమంలో మెయిన్ రోడ్డులోని మెట్రో పిల్లర్ నంబర్- 1546 వద్ద జీహెచ్ఎంసీ సర్కిల్- 19 వీధిదీపాల కరెంటు స్తంభానికి అతని చేయి తగిలింది. స్ట్రీట్‌లైట్ స్తంభానికి ఉన్న ఫ్యూజ్‌బాక్స్ ఓపెన్ చేసి ఉండడం, విద్యుత్ తీగలు వేలాడుతూ స్తంభానికి ఆనుకుని ఉండడంతో షాక్‌కు గురై రుషి అక్కడికక్కడే మృతి చెందినట్లు పోలీసులు గుర్తించారు. జీహెచ్ఎంసీ నిర్లక్ష్యం కారణంగానే తన భర్త విద్యుదాఘాతానికి గురై మృతి చెందినట్లు పోలీసులకు రుషి భార్య సుజాత ఫిర్యాదు చేసింది. ఈ మేరకు జీహెచ్ఎంసీ సర్కిల్-19 స్ట్రీట్‌లైట్ విభాగం అధికారులపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.

పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ ప్రక్రియ షురూ

సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్ లోక్‌సభ నియోజకవర్గంలో శుక్రవారం పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ ప్రక్రియ ప్రారంభమైంది. అబిడ్స్‌లోని ఆల్ సెయింట్స్ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన ఓటర్ ఫెసిలిటేషన్ కేంద్రంలో హైదరాబాద్ లోక్‌సభ నియోజకవర్గంలోని మలక్ పేట్, కార్వాన్, చార్మినార్, చాంద్రాయణగుట్ట, యాకుత్ పురా, బహదూర్‌పురా అసెంబ్లీ సెగ్మెంట్‌ల పోస్టల్ బ్యాలెట్ పోలింగ్ ప్రారంభమైంది. తొలి రోజు 488 మంది ఓటు హక్కును పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ ద్వారా వినియోగించుకున్నారు. ఎన్నికల రిటర్నింగ్ అధికారి అనుదీప్ దురిశెట్టి కేంద్రాన్ని సందర్శించి రిజిస్ట్రేషన్, ఓటర్స్ రిజిస్ట్రేషన్ రిజిస్టర్లను, ఓటింగ్ సరళిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 8 వరకు నిర్వహించే పోస్టల్ బ్యాలెట్ ఓటు హక్కును ఉద్యోగులందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ వెంకటాచారి, ఆర్‌డీఓ మహిపాల్ రెడ్డి, నోడల్ అధికారి రమేష్, ఏఆర్వోలు ప్రేమ్ కుమార్, జయమ్మ, చంద్రశేఖర్, జయశ్రీ, నిహారిక పాల్గొన్నారు.

హోమ్ ఓటింగ్ సైతం..

సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్ లోక్‌సభ పరిధిలో వృద్ధులు, వికలాంగుల కోసం ఓట్ ఫ్రమ్ హోమ్ ఓటింగ్ ప్రక్రియ ప్రారంభమైంది. శుక్రవారం ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఎన్నికల సిబ్బందితో కలిసి ఓటరు ఇంటి వద్దకే వెళ్లి ఓటు వేయించే కార్యక్రమంలో పాల్గొన్నారు. గుడిమల్కాపూర్‌లోని తాళ్లగడ్డలో దివ్యాంగుడు ఎస్.భాస్కరాచారి తన ఇంటి నుంచే ఈసీ నిబంధనలకు అనుగుణంగా ఓటు హక్కును వినియోగించుకున్నాడు. ఈ సందర్భంగా భాస్కరాచారిని అనుదీప్ దురిశెట్టి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 85 ఏళ్లు దాటిన వృద్ధులు, 40 శాతం కంటే ఎక్కువ వైకల్యం ఉన్న వారికి ఇంటి నుంచే ఓటు వేసేలా కేంద్ర ఎన్నికల సంఘం అవకాశం కల్పించిందని తెలిపారు. హైదరాబాద్ లోక్‌సభ నియోజకవర్గంలో 121 మంది హోమ్ ఓటింగ్ వినియోగించుకోనున్నారని తెలిపారు.

ఎన్నికల తర్వాత మెట్రో రెండో దశ

- కేంద్రం ఆమోదంతో పనులు ప్రారంభం
- హెచ్ఎంఆర్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డి వెల్లడి



సాక్షి, సిటీబ్యూరో: లోక్‌సభ ఎన్నికల అనంతరం మెట్రో రైల్ రెండో దశ ప్రాజెక్టుపై కార్యాచరణ చేపట్టనున్నట్లు హైదరాబాద్ మెట్రోరైల్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డి తెలిపారు. రెండో దశపై ఇప్పటికే డీపీఆర్ (డీటెయిల్డ్ ప్రాజెక్ట్ రిపోర్ట్)ను సిద్ధం చేసినట్లు పేర్కొన్నారు. ఎన్నికల తర్వాత కేబినెట్ అనుమతి కోసం డీపీఆర్‌ను అందజేయనున్నట్లు పేర్కొన్నారు. అనంతరం కేంద్రం ఆమోదంతో మెట్రో రెండో దశ పనులు ప్రారంభమవుతాయని చెప్పారు. ఎల్బీనగర్ నుంచి శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం వరకు మెట్రో రెండో దశ పనులను త్వరలో చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. మెట్రో ప్రయాణికులు 50 కోట్లకు చేరిన సందర్భంగా అమీర్‌పేట్ మెట్రో స్టేషన్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో ఆయనతో పాటు మెట్రో రైల్ సీఈఓ, ఎండీ కేవీబీ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా మెట్రో ప్రయాణికులను ఆకర్షించే మెట్రో కస్టమర్ లాయలిటీ, గ్రీన్‌మైల్స్ లాయలిటీ క్లబ్ పథకాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎన్వీఎస్ రెడ్డి మాట్లాడుతూ.. మొదటి దశలో 69 కిలోమీటర్లు పూర్తి చేయగా.. ప్రస్తుతం రెండో దశలో 70 కి.మీ కారిడార్‌లను నిర్మించనున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా 50 కోట్ల సంఖ్యను సూచించే చివరి ప్రయాణికురాలు రాజశ్రీకి లాయిడ్ ఎయిర్ కండీషనర్‌ను బహూకరించారు. మరో అయిదుగురు ప్రయాణికులకు బహుమతులను అందజేశారు. మెట్రో రైల్ కొత్తగా ప్రారంభించిన మెట్రో లాయలిటీ పథకంలో ఎంపికైన వారికి సిల్వర్ బాండ్‌కు రూ.50 వేలు, గోల్డ్ బాండ్‌కు రూ.75 వేలు, ప్లాటినంకు రూ.1.25 లక్షల చొప్పున బహుమతులను ఏడాదికోసారి బహుమతులను అందజేస్తారు.

ఇక ఈ- పేమెంట్

చెక్కుల ద్వారా చెల్లింపులకు చెల్లు




సాక్షి, సిటీబ్యూరో: వేతనాలు, పెన్షన్లు సహా అన్ని రకాల చెల్లింపులకు జీహెచ్ఎంసీ ఈ- పేమెంట్ విధానాన్ని అందుబాటులోకి తెచ్చింది. మాన్యువల్ చెక్కుల స్థానంలో ప్రవేశపెట్టిన ఈ విధానం వల్ల లబ్ధిదారులకు ఎప్పటికప్పుడే ఖాతాలో నిధులు జమ అవుతాయని జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రాస్ పేర్కొన్నారు. ఈ నెల 1వ తేదీ నుంచి అందుబాటులోకి వచ్చిన ఈ విధానం వల్ల పారదర్శకతతో పాటు తగిన నియంత్రణ ఉంటుందని తెలిపారు. ఇందుకుగాను ఎస్‌బీఐ క్యాష్ మేనేజ్‌మెంట్ ప్రొడక్ట్(సీఎంపీ) సేవల్ని వినియోగించుకున్నట్లు పేర్కొన్నారు. తద్వారా జీహెచ్ఎంసీ ఈఆర్‌పీ.. ఎస్‌బీఐ పోర్టల్‌తో, సీజీజీ హెచ్ఆర్ఎంఎస్ మాడ్యూల్‌తో అనుసంధానమవుతుందని, నగదు చెల్లింపుల్లో మానవ జోక్యానికి తావుండదని ఆయన తెలిపారు. ఈ-పేమెంట్ సిస్టమ్ అన్ని రకాల చెల్లింపుల్ని ప్రాసెస్ చేస్తుందని, డిజిటల్ చెల్లింపుల్లో ఇదో పెద్ద ముందడుగు అని అభివర్ణించారు.

అతిరథులొస్తున్నారు!



ప్రచారంలో జాతీయ నేతలు

- బీజేపీ నుంచి మోదీ, అమిత్‌షా..
- కాంగ్రెస్ తరఫున రాహుల్, ప్రియాంక, రేవంత్
- బీఆర్‌ఎస్ నుంచి కేటీఆర్ రోడ్‌షోలు సైతం



సాక్షి, సిటీబ్యూరో: గ్రేటర్ నగరంలో ఓవైపు ఎండ తీవ్రత రోజురోజుకూ పెరుగుతోంది. ఇప్పటికే 44 డిగ్రీల సెల్షియస్‌కు చేరుకుంది. మరోవైపు రాజకీయ వేడి కూడా పెరుగుతోంది. మరికొన్ని రోజుల పాటు ఇటు సమ్మర్ హీట్, అటు పొలిటికల్ హీట్‌తో నగరం ఉక్కిరిబిక్కిరి కానుంది. ఈ నెల 13న జరగనున్న లోక్‌సభ ఎన్నికల్లో విజయఢంకా మోగించేందుకు మూడు ప్రధాన పార్టీలు ప్రచారం ముమ్మరం చేశాయి. రాబోయే రోజుల్లో ఇది మరింత తీవ్రరూపం దాల్చనుంది. ఢీ అంటే ఢీ అంటూ విమర్శలు, ప్రతివిమర్శలతో నగరం దద్దరిల్లిపోనుంది. కేంద్ర హోంమంత్రి అమిత్‌షా పాతబస్తీలో, రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శేరిలింగంపల్లి, కూకట్‌పల్లి ప్రాంతాల్లో ఇప్పటికే రోడ్‌షోలు నిర్వహించారు. బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ గురువారం రోడ్ షోలను ప్రారంభించారు.

ప్రధాని మోదీ సైతం..

కాంగ్రెస్, బీజేపీ, బీఆర్‌ఎస్ వేటికవి ఈ ఎన్నికలను సవాల్‌గా తీసుకున్నాయి. తమ పార్టీ గెలిచేందుకు పార్టీ అగ్రగణ్యులు, కేంద్ర స్థాయి నేతలను ప్రచారానికి రప్పిస్తున్నాయి. హైదరాబాద్ లోక్‌సభ నుంచి పోటీ చేస్తున్న మాధవీలత కోసం ఇప్పటికే అమిత్‌షా రోడ్‌షో నిర్వహించగా, 5వ తేదీన మల్కాజిగిరి లోక్‌సభ పరిధిలో పర్యటించనున్నారు. పదో తేదీన ఆ పార్టీ నుంచి ప్రధాన మంత్రి మోదీ ప్రచారం చేయనున్నారు. ఎల్‌బీ స్టేడియంలో జరిగే బహిరంగ సభలో ఆయన ప్రసంగించనున్నారు. రోడ్‌షో కూడా జరగనున్నట్లు తెలుస్తోంది. ఆ రోజు ఉదయం మహబూబ్‌నగర్‌లో పార్టీ అభ్యర్థి డీకే అరుణ తరఫున ప్రచారం చేసే ప్రధాని, సాయంత్రం నగరంలో ప్రచారం చేయనున్నారు.

రాహుల్, ప్రియాంకలు

ఈ నెల 9న కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ సరూర్‌నగర్ స్టేడియంలో జరిగే బహిరంగ సభ ద్వారా గ్రేటర్ పరిధిలోకొచ్చే పార్టీ అభ్యర్థుల కోసం ప్రచారం చేయనున్నారు. ఆ రోజు ఉదయం కరీంనగర్ బహిరంగ సభ అనంతరం ఇక్కడికి చేరుకుంటారు. కాంగ్రెస్ పార్టీ మరో నాయకురాలు ప్రియాంక గాంధీ ఈ నెల 6న చేవెళ్ల లోక్‌సభ నియోజకవర్గ పరిధిలోని తాండూరు సభలో పాల్గొంటారు. అనంతరం సికింద్రాబాద్ రోడ్‌షోలో, మర్నాడు 7వ తేదీన సాయంత్రం కూకట్‌పల్లి, శేరిలింగంపల్లిలలో జరిగే రోడ్‌షోల్లో పాల్గొననున్నారు.

తమిళిసై సైసై..

కొద్దికాలం క్రితం వరకు రాష్ట్ర గవర్నర్‌గా పని చేసి తనదైన స్టైల్‌తో ప్రత్యేకత చాటుకున్న తమిళిసై సౌందరరాజన్ సైతం బీజేపీ తరఫున నగరంలో ప్రచారంలో పాల్గొంటున్నారు. పార్టీ ఆమెను హైదరాబాద్ లోక్‌సభ కోఆర్డినేటర్‌గా నియమించినందున నగరంలోనే ఉండనున్నారు. గ్రేటర్ పరిధిలోని లోక్‌సభ నియోజకవర్గాల బీజేపీ అభ్యర్థులకు మద్దతుగా ఆమె ప్రచారం కొనసాగించనున్నారు.

కేటీఆర్ రోడ్‌షోలు

ఇక బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ రోడ్‌షోలు జూబ్లీహిల్స్ కూకట్‌పల్లి నియోజకవర్గాల్లో ఇప్పటికే ప్రారంభమయ్యాయి. గ్రేటర్ పరిధిలోని వివిధ నియోజక వర్గాల్లో ఇవి ఈ నెల 7వ తేదీ వరకు కొనసాగుతాయి.

తమిళిసై.. ప్రచారానికి సై!

మొన్నటి దాకా ఆమె మన రాష్ట్ర గవర్నర్. రాజ్యాంగబద్ధమైన పదవిలో కొనసాగారు. కొన్నిరోజుల క్రితం రాజీనామా చేశారు. తమిళనాడులోని ఓ లోక్‌సభ నుంచి ఎన్నికల బరిలో నిలిచారు. ఆమె మరెవరో కాదు తమిళిసై సౌందరరాజన్. శుక్రవారం ఆమె సికింద్రాబాద్ లోక్‌సభ బీజేపీ అభ్యర్థి కిషన్‌రెడ్డికి మద్దతుగా వారాసిగూడ, నామాలగుండు, సీతాఫల్‌మండిలలో జరిగిన రోడ్ షోలో పాల్గొన్నారు. కమలం గుర్తుకు ఓటు వేయాలని ప్రజలను కోరారు. సినీనటుడు సాయికుమార్, నగర మాజీ మేయర్ బండ కార్తీకరెడ్డి పాల్గొన్నారు. - బౌద్ధనగర్



7న ప్రియాంక గాంధీ రోడ్ షో

కూకట్‌పల్లి: మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఈ నెల 7న ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ రోడ్ షోలో పాల్గొనున్నారు. ఈ సందర్భంగా శుక్రవారం కాంగ్రెస్ పార్టీ నాయకులు అంబేడ్కర్ వై జంక్షన్ నుంచి గోకుల్ ప్లాట్స్ చౌరస్తా వరకు రూట్ మ్యాప్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో ఏఐసీసీ ప్రతినిధి రోహిత్ చౌదరి, కూకట్‌పల్లి కోఆర్డినేటర్ వినయ్‌రెడ్డి, కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి బండి రమేష్, గొట్టిముక్కల వెంకటేశ్వరరావు, సత్యం శ్రీరంగం, శేరి సతీష్ రెడ్డి, సూరజ్ తివారి, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

సీసీఎస్‌లో చైల్డ్ కేర్ సెంటర్



సాక్షి, సిటీబ్యూరో: బషీర్‌బాగ్‌లోని ఓల్డ్ కమిషనరేట్‌లో ఉన్న సీసీఎస్‌లో పని చేసే సిబ్బంది, అధికారుల పిల్లలను సంరక్షించేందుకు ఆ భవనంలో చైల్డ్ కేర్ సెంటర్ ఏర్పాటు చేశారు. నగర కొత్వాల్ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి, జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రాస్, హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి శుక్రవారం దీనిని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నగరంలో పని చేస్తున్న అధికారులు పాల్గొన్నారు.

మల్కాజిగిరి మాదే...

- ఎల్‌బీ నగర్, ఉప్పల్‌లో ఐటీ అభివృద్ధి
- మౌలిక సదుపాయాల కల్పనపై ప్రత్యేక దృష్టి
- మల్కాజిగిరి లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థి సునీతా మహేందర్‌రెడ్డి

ప్రజలు కాంగ్రెస్ పాలన కోరుకుంటున్నారు

INTERVIEW



ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సిట్టింగ్ స్థానం.. తెలంగాణ ఉద్యమంలో కీలకంగా వ్యవహరించిన ఈటల రాజేందర్ .. అసెంబ్లీ ఎన్నికల్లో ఏడు నియోజకవర్గాల్లో బీఆర్ఎస్ విజయం.. ఇలా విభిన్నమైన రాజకీయ సమీకరణాలతో అందరి దృష్టి ఆకర్షిస్తోంది మల్కాజిగిరి లోక్‌సభ నియోజకవర్గం. ఎంతో మంది రాజకీయ నాయకుల ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేసిన చోట జిల్లాపరిషత్ ఎన్నికల్లో హ్యాట్రిక్ విజయాలు సాధించిన పట్నం సునీతా మహేందర్ రెడ్డి తన అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు సిద్ధమవుతున్నారు. ఈ సందర్భంగా ఆమె 'సాక్షి'తో ప్రత్యేకంగా మాట్లాడారు.. –సాక్షి, సిటీబ్యూరో

సీఎం రేవంత్‌రెడ్డి సిట్టింగ్ స్థానం నుంచి పోటీచేయడానికి అవకాశం లభించడం అదృష్టంగా భావిస్తున్నాను. మరో మారు ఈ నియోజకవర్గంలో కాంగ్రెస్ జెండా ఎగురవేయాలని సీఎం చాలెంజ్‌గా తీసుకున్నారు. గతంలో ఆయన విజయానికి పనిచేసిన నేతలు, కేడర్ అంతా కలిసికట్టుగా ఏకతాటిపై పనిచేస్తున్నారు. తెలంగాణ సమాజం రేవంత్‌రెడ్డిని గట్టిగా నమ్ముతోంది.

సానుకూల వాతావరణం ఉంది..

ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో పదేళ్ల పాటు జిల్లా పరిషత్ అధ్యక్షురాలిగా పనిచేశాను. ప్రతి మండలం, గ్రామ స్థాయిలో పార్టీలతో సంబంధం లేకుండా అన్ని వర్గాలల అభివృద్ధికి నిధులు అందించాను. ఏ ప్రాంతానికి వెళ్లినా ప్రజలు, నాయకులు బ్రహ్మరథం పడుతున్నారు. బీజేపీ, బీఆర్ఎస్ నుంచి నాయకులు, కార్యకర్తలు భారీగా పార్టీలో చేరుతున్నారు. తోటి మహిళను గెలిపించుకుంటామని మహిళలంతా స్వతహాగా ముందుకొస్తున్నారు.

స్థానిక సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా..

పార్లమెంటు నియోజకవర్గ పరిధిలో సమస్యలపై స్పష్టమైన అవగాహన ఉంది. మహేశ్వరం , ఎగువ ప్రాంతాల్లో వర్షాలు కురిస్తే ఎల్‌బీ నగర్ నియోజకవర్గంలో నివాస గృహాలు మునిగిపోతున్నాయి. తక్షణం వరద సమస్య పరిష్కరించడానికి సీఎం సానుకూలంగా ఉన్నారు. ఉప్పల్, మేడ్చల్, కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్, మల్కాజిగిరి నియోజకవర్గాల్లో ట్రాఫిక్, ఇతర సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం సిద్ధంగా ఉంది. మూసీ పరివాహక ప్రాంతంలో శాశ్వత పరిష్కారానికి ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. మల్కాజిగిరి నియోజకవర్గానికి ప్రత్యేకంగా ఒక మేనిఫెస్టో తయారు చేశాం.

ఆ రెండు పార్టీల మధ్య చీకటి ఒప్పందం..

బీజేపీ, బీఆర్ఎస్‌ల మధ్య చీకటి ఒప్పందం నడుస్తోంది. మాజీ మంత్రి మల్లారెడ్డి బీజేపీ అభ్యర్థి రాజేందర్ మధ్య జరిగిన సంభాషణే ఇందుకు సాక్ష్యం. బయట ఎన్ని మాటలు మాట్లాడినా లోలోపల వాళ్లంతా ఒక్కటే. ఎన్నికల సమయంలో పరస్పర అవగాహనతోనే ముందుకెళుతున్నారు.

మోసపూరిత వాగ్దానాలను ప్రజలు నమ్మరు..

ఎన్నికలు అనగానే రాజకీయ పార్టీలు రకాల హామీలతో ప్రజల ముందుకొస్తారు. గతంలో ఈ ప్రాంతంలో వరదలు వచ్చినపుడు అప్పటి రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు బండిపోతే బండి ఇస్తామన్నారు. ఒక్కరినీ ఆదుకున్న పాపాన పోలేదు. ఇలాంటివి ఎన్నో హామీలు గాలికి వదిలేశారు. అందుకే ఈ సారి బీజేపీని నమ్మే పరిస్థితి కనిపించడం లేదు. ఈటల రాజేందర్ ఇక్కడి ప్రజలకు కొత్త. స్థానిక సమస్యలపై ఆయనకు అవగాహన లేదు. బీఆర్ఎస్ పట్ల ప్రజల్లో నమ్మకం పోయింది. అందుకే ఆ పార్టీ తరఫున పోటీ చేయడానికే ఎవరూ ముందుకు రాలేదు.

ఉప్పల్, ఎల్‌బీ నగర్‌లో ఐటీ అభివృద్ధి చేస్తాం.

ఉప్పల్, ఎల్‌బీ నగర్ ప్రాంతాల్లో ఐటీ అభివృద్ధి చేస్తాం. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో జేఈఈ, నీట్, క్యాట్ శిక్షణ తరగతులు ఏర్పాటు చేస్తాం . మౌలిక సదుపాయాలు, ఉపాధి అవకాశాల కల్పనకు తగిన చర్యలు తీసుకుంటాం. ట్రాఫిక్ ఇబ్బందులు తీర్చేందుకు పై వంతెనలు (ఫ్లై ఓవర్ బ్రిడ్జి) నిర్మాణం, అంతర్గత రహదారులు, కాలుష్య నివారణకు తగిన చర్యలు తీసుకోవడం వంటి అంశాలకు ప్రాధాన్యం ఇస్తాం.

నటనతో మెప్పించి.. నగలతో ఉడాయించి...

బంజారాహిల్స్: సినిమాలో అవకాశం కోసం నిర్మాత వద్దకు వచ్చి ఓ యువకుడు తన నటనతో మెప్పించి సదరు నిర్మాత కళ్లుగప్పి నగదు, నగలతో ఉడాయించిన సంఘటన జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు... శ్రీకృష్ణానగర్ లక్కీ రెస్టారెంట్ సమీపంలో శ్రీబౌనేష్ ప్రొడక్షన్ పేరుతో బాబు అనే నిర్మాత సినిమా కార్యాలయాన్ని ఏర్పాటు చేశాడు. ఈ నెల 1న మధ్యాహ్నం తాను తీస్తున్న సినిమాలో నటీనటుల ఎంపిక కోసం ఆడిషన్స్ నిర్వహించారు. ఆడిషన్స్‌కు వచ్చిన శ్రీకాంత్ అనే యువకుడు తన నటనతో నిర్మాతను మెప్పించాడు. కొద్దిసేపటి తర్వాత సదరు నిర్మాత బయటికి వెళ్లి భోజనం తీసుకురావాల్సిందిగా శ్రీకాంత్‌కు చెప్పడంతో అతను ఆహారంతో పాటు మద్యం కూడా తీసుకువచ్చాడు. నిర్మాత మద్యం మత్తులో ఉండగా పక్కన టేబుల్‌పై ఉంచిన 10 తులాల గొలుసు, మూడు ఉంగరాలు, రాడో వాచ్, రూ. 50 వేలు తీసుకుని శ్రీకాంత్ అక్కడి నుంచి ఉడాయించాడు. కొద్దిసేపటి తర్వాత దీనిని గుర్తించిన సదరు నిర్మాత తన కుమారుడికి ఈ విషయం చెప్పాడు. నిర్మాత కుమారుడు ప్రవీణ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు జూబ్లీహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

డీఆర్ సెంటర్ల తనిఖీ

సాక్షి,సిటీబ్యూరో: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో సికింద్రాబాద్, హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గాల పరిధిలో ఏర్పాటు చేసిన పలు డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ సెంటర్లను శుక్రవారం నగర పోలీస్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డితో కలిసి జిల్లా ఎన్నికల అధికారి, జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రోస్ పరిశీలించారు.సెంటర్లలో చేయాల్సిన ఏర్పాట్లు, బందోబస్తు చర్యలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సంబంధిత అధికారులకు సూచించారు. కొన్ని సెంటర్లలోని స్ట్రాంగ్‌రూమ్‌లను పరిశీలించారు. ఆబిడ్స్‌లోని ఆల్‌సెయింట్స్ హైస్కూల్‌లో పోస్టల్ బ్యాలెట్ పోలింగ్ ఏర్పాట్లను తనిఖీ చేశారు.

ఈవీఎం కమిషనింగ్‌పై పరిపూర్ణ అవగాహన ఏర్పరచుకోవాలి

బంజారాహిల్స్: ఎన్నికల ప్రక్రియలో అతి కీలకమైన ఈవీఎం కమిషనింగ్‌పై సంబంధిత అధికారులు పరిపూర్ణమైన అవగాహన ఏర్పరచుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రాస్ సూచించారు. శుక్రవారం బంజారాహిల్స్‌లోని బంజారాభవన్‌లో సెక్టోరల్ అధికారులు, ఇంజనీర్లు, ఏఆర్‌ఓలకు ఈవీఎం కమిషనింగ్‌పై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయా అధికారులు ఈవీఎం కమిషనింగ్ పై పూర్తిస్థాయి అవగాహన కలిగి ఉండాలన్నారు. కమిషనింగ్ ఏ విధంగా చేయాలన్న ప్రక్రియ పై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. కార్యక్రమంలో హైదరాబాద్ జిల్లా కలెక్టర్ రిటర్నింగ్ అధికారి అనుదీప్ దురిశెట్టి, హైదరాబాద్ అదనపు కలెక్టర్ సికింద్రాబాద్ ఆర్‌ఓ హేమంత్ కేశవ్ పాటిల్, సికింద్రాబాద్ కంటోన్మెంట్ జాయింట్ సీఈవో, జిల్లా ఎలక్షన్ ట్రైనింగ్స్ అధికారి, అడిషనల్ కమిషనర్ (యూబీడీ) సునంద, తదితరులు పాల్గొన్నారు.

హెచ్ క్యూ ఆకార్ ఆశ ఆస్పత్రిలో ఎన్టీపీసీ ఒప్పందం



సాక్షి, సిటీబ్యూరో: ఎన్టీపీసీ సదరన్ రీజియన్ హెచ్ క్యూ ఆకార్ ఆశ ఆసుపత్రితో ఒప్పందం చేసుకుంది. దీంతో శారీరక వైకల్యంతో బాధపడుతున్న 150 మంది రోగులకు శస్త్ర చికిత్స, ఉచితంగా మందుల పంపిణీ, ఆహారం ఇతరత్రా సేవలను అందించనున్నారు.

పోస్టల్ బ్యాలెట్ ద్వారా 852 మంది ఓటు హక్కు వినియోగం

సాక్షి, సిటీబ్యూరో: పార్లమెంట్ ఎన్నికల విధుల్లో ఉన్న పోలింగ్ అధికారులు, సిబ్బంది తొలి రోజు 852 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకునేందుకు సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజక వర్గ పరిధిలో పికెట్ కేంద్రీయ విద్యాలయంలో ఫెసిలిటేషన్ సెంటర్ ఏర్పాటు చేయగా అందులో 342 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలో కోఠి అల్ సెయింట్ స్కూల్ ఫెసిలిటేషన్ సెంటర్‌లో 488 మంది, సికింద్రాబాద్ కంటోన్మెంట్ అసెంబ్లీ ఉప ఎన్నికల సందర్భంగా కంటోన్మెంట్ సీఈఓ కార్యాలయంలోని ఫెసిలిటేషన్ సెంటర్ లో 22 మంది ఓటు హక్కును వినియోగించుకున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి రోనాల్డ్ రాస్ తెలిపారు.

రాంగ్ రూట్‌లో నడిపితే చర్యలే..

- గత నెలలో 239 మంది వాహనదారులపై ఎఫ్ఐఆర్
- సైబరాబాద్ ట్రాఫిక్ జాయింట్ సీపీ జోయెల్ డెవిస్



సాక్షి, సిటీబ్యూరో: ఇకపై రాంగ్ రూట్‌లో బండి నడుపుతూ వెళ్లడం కుదరదు. మహా అయితే పోలీసులు ఈ–చలానా జారీ చేస్తారని తేలిగ్గా తీసుకుంటే సరిపోదు. రాంగ్ రూట్ డ్రైవింగ్‌లపై సైబరాబాద్ పోలీసులు ప్రత్యేక దృష్టిసారించారు. అపసవ్య దిశలో వాహనం నడిపే వాహనదారులను గుర్తించి వారిపై ఐపీసీ సెక్షన్ 336 కింద ఎఫ్ఐఆర్ నమోదు చేస్తున్నారు. గత నెలలో 239 మంది వాహనదారులపై కేసులు నమోదు చేసినట్లు ట్రాఫిక్ జాయింట్ సీపీ డీ జోయెల్ డెవిస్ తెలిపారు. శుక్రవారం సైబరాబాద్ మెయిన్ కాన్ఫరెన్స్ హాల్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. నిర్లక్ష్యంగా రాంగ్ రూట్‌లో డ్రైవింగ్ చేస్తూ ఇతరుల ప్రాణాలకు, వ్యక్తిగత భద్రతకు హాని కలిగిస్తున్నారని తెలిపారు. రాంగ్ సైడ్ డ్రైవింగ్ ఎక్కువగా జరిగే ప్రాంతాలను గుర్తించాలని, ఆయా వాహనదారులను గుర్తించేలా సీసీటీవీలో నిఘా ఉంచాలని సూచించారు. సమావేశంలో ట్రాఫిక్ డీసీపీ శ్రీనివాసరావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

తక్కువ ధరకు ప్లాట్ల పేరుతో రూ.12 కోట్లు స్వాహా

భార్యాభర్తల అరెస్టు

సాక్షి, సిటీబ్యూరో: వీబీజే క్యాప్‌స్టోన్ బిల్డర్స్ ప్రైవేట్ లిమిటెడ్ పేరుతో తక్కువ ధరకు ప్లాట్లు విక్రయిస్తామంటూ పలువురిని ఆకర్షించి రూ.12 కోట్లకు పైగా స్వాహా చేసిన కేసులో భార్యాభర్తలను సీసీఎస్ పోలీసులు అరెస్టు చేశారు. శుక్రవారం సీసీఎస్ డీసీపీ ఎన్.శ్వేత వివరాలు వెల్లడించారు. రాయదుర్గంలోని మైహోమ్ భుజలో నివసించే కందుల వెంకట ప్రసాద్ గుప్తా, కందుల అనురాధ గుప్తా బంజారాహిల్స్‌లో వీబీజే సంస్థను నిర్వహిస్తున్నారు. కాప్రాలో లక్ష్మీనగర్ కాలనీ వెల్ఫేర్ సొసైటీలో కొత్త వెంచర్ వేస్తున్నట్లు ప్రచారం చేసుకున్న వీరు మార్కెట్ ధరకంటే తక్కువ ధరకు ప్లాట్లు విక్రయిస్తామని పలువురిని ఆకర్షించారు. నకిలీ డాక్యుమెంట్ల సాయంతో అగ్రిమెంట్లు చేసి 15 మంది వినియోగదారుల నుంచి రూ.12.35 కోట్లు వసూలు చేశారు. మోపిదేవి మహాలక్ష్మి అనేక బాధితురాలి ఫిర్యాదుతో సీసీఎస్‌లో కేసు నమోదైంది. దర్యాప్తు చేసిన ఏసీపీ ఎ.రామ్ రెడ్డి నేతృత్వంలోని బృందం శుక్రవారం ప్రసాద్, అనురాధలను అరెస్టు చేశారు. ప్రసాద్‌పై సీసీఎస్, సరూర్‌నగర్, రాజమహేంద్రవరంతో పాటు ఏపీ సీఐడీలోనూ మరో ఆరు కేసులు ఉన్నట్లు అధికారులు తెలిపారు.

బెట్టింగ్ ముఠా ఆటకట్టు

- నలుగురు నిందితుల అరెస్టు
- పరారీలో మరో నలుగురు
- రూ. 20 లక్షల నగదు స్వాధీనం
- రూ. 3,85 లక్షల నగదు ఫ్రీజ్



నాగోలు: ఆన్‌లైన్ ఐపీఎల్ క్రికెట్ బెట్టింగ్‌లకు పాల్పడుతున్న ముఠాను ఎల్‌బీనగర్ ఎస్‌ఓటీ పోలీసులు, ఎల్‌బీనగర్ పోలీసులు అరెస్టు చేసి వారి నుంచి రూ. 20లక్షల నగదు స్వాధీనం చేసుకుని, బ్యాంక్ ఖాతాలో ఉన్న రూ. 3,85 లక్షల ఫ్రీజ్ చేశారు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి.. రాజస్థాన్‌కు చెందిన మనోజ్, విజయవాడకు చెందిన సందీప్‌రెడ్డి నేతృత్వంలో పీకేఆర్ కాలనీకి చెందిన కార్తీక్ రెడ్డి. నిర్మలానగర్‌కు చెందిన కాశిరెడ్డి అభిషేక్‌రెడ్డి, జ్యోతినగర్ కాలనీ చెందిన యాదగిరి, చంపాపేట్‌కు చెందిన మ్యాక రాజవర్ధన్‌రెడ్డి, నాగోల్‌కు చెందిన ప్రవీణ్, ఖమ్మంకు చెందిన చైతన్యతో కలిసి ముఠాగా ఏర్పడి గత కొంత కాలంగా ఆన్‌లైన్ బెట్టింగ్‌లకు పాల్పడుతున్నారు. ఆర్‌కేఆర్ కాలనీలోని ఓ ఇంట్లో ఈ దందా నడుస్తున్నట్లు సమాచారం అందుకున్న పోలీసులు శుక్రవారం దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా కార్తీక్‌రెడ్డి, అభిషేక్‌రెడ్డి, యాదగిరి, రాజవర్ధన్‌రెడ్డిలను అరెస్టు చేసి వారి నుంచి రూ. 20 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు. వారి బ్యాంక్ ఖాతాలో ఉన్న రూ. 3,85 లక్షల నగదును ఫ్రీజ్ చేశారు. ప్రవీణ్, చైతన్య, మనోజ్, సందీప్‌రెడ్డి పరారీలో ఉన్నారని త్వరలోనే వారిని అరెస్టు చేస్తామని పోలీసులు తెలిపారు.

బీఆర్ఎస్ బైక్ ర్యాలీలో అపశృతి

- డీజే వాహనం బ్రేక్ ఫెయిలై కార్యకర్త మృతి
- మరో ఇద్దరికి స్వల్ప గాయాలు



శ్రావణ్ కుమార్ మృతదేహం

బోడుప్పల్/ మేడిపల్లి: బీఆర్ఎస్ పార్టీ శుక్రవారం రాత్రి నిర్వహించిన బైక్ ర్యాలీలో అపశృతి చోటు చేసుకుంది. ఈ ఘటనలో ఓ యువకుడు మృతి చెందిన సంఘటన మేడిపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. మేడిపల్లి పోలీసులు, స్థానికుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి...బీఆర్ఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం పీర్జాదిగూడ, బోడుప్పల్ నగర పాలక సంస్థ పరిధిలో బైక్ ర్యాలీ నిర్వహించారు. పీర్జాదిగూడ నుంచి ప్రారంభమైన ఈ ర్యాలీలో మాజీ మంత్రి చామకూర మల్లారెడ్డి, బీఆర్ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి, మేయర్లు జక్కా వెంకట్‌రెడ్డి, సామల బుచ్చిరెడ్డి, పార్టీ అధ్యక్షులు మంద సంజీవ్‌రెడ్డి, బండారి రవీందర్‌తోపాటు కార్యకర్తలు నాయకులు పాల్గొన్నారు. మేడిపల్లిలో 8 గంటలకు బైక్ ర్యాలీ ముగింపు అనంతరం బోడుప్పల్‌కు చేరుకుంది. బోడుప్పల్ చెత్త డంపింగ్ నుంచి కొండపోచమ్మ మీదగా అంబేడ్కర్‌నగర్ గుట్టపై వెళుతుండగా డీజే వాహనం బ్రేక్ ఫెయిలై వెనక్కు రావడంతో వాహన కిందపడి శ్రావణ్ కుమార్(24) అనే యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. దీంతో అప్రమత్తమైన మల్లారెడ్డి, లక్ష్మారెడ్డి, అతడిని సమీపంలోని ఆర్‌బిఎం హాస్పిటల్‌కు తరలించగా పరీక్షించిన వైద్యులు అప్పటికే అతను మృతి చెందినట్లు ధ్రువీకరించారు.

గాయపడిన ఇద్దరికి కిమ్స్‌లో చికిత్స

బోడుప్పల్‌కు చెందిన శ్రీశైలం కారు డ్రైవర్, ఆయన స్నేహితుడు సంతోష్. ఇద్దరు డీజే వెనక ఉన్నారు. దీంతో సంతోష్ కాలుకు గాయాలు కాగా, శ్రీశైలంకు చేతులకు గాయాలయ్యాయి. వీరిని చికిత్స నిమిత్తం కిమ్స్ హాస్పిటల్‌కు తరలించారు.

హెచ్‌ఎండీఏలో మరో అధికారిపై ఏసీబీ నజర్

- నేడో,రేపో అరెస్టుకు రంగం సిద్ధం
- రెండు రోజుల క్రితమే నోటీసులు ఇచ్చిన ఏసీబీ
- ఎఫ్ఐఆర్ నమోదు

సాక్షి, సిటీబ్యూరో: హెచ్‌ఎండీఏలో మరో అవినీతి తిమింగళానికి ఉచ్చు బిగించేందుకు ఏసీబీ సన్నద్ధమైంది. రెండు రోజుల క్రితమే సదరు అధికారికి ఏసీబీ నోటీసులు జారీ చేసింది. తాజాగా ఎఫ్ఐఆర్ కూడా నమోదు చేసినట్లు తెలిసింది. ఒకటి,రెండు రోజుల్లో సదరు అధికారిని అరెస్టు చేసి విచారించే అవకాశం ఉన్నట్లు ఏసీబీ వర్గాలు పేర్కొన్నాయి. హెచ్‌ఎండీఏ మాజీ డైరెక్టర్ శివబాలకృష్ణపైన ఏసీబీ దాడుల అనంతరం హెచ్‌ఎండీఏ కార్యాలయంలోనూ ఏసీబీ అధికారులు వరుసగా సోదాలు నిర్వహించిన సంగతి తెలిసిందే. గత ప్రభుత్వ హయాంలో ఇచ్చిన అక్రమ అనుమతులకు సంబంధించిన ఫైళ్లను ఏసీబీ స్వాధీనం చేసుకుంది. ఈ క్రమంలో శివబాలకృష్ణతో కలిసి అక్రమాలకు పాల్పడిన అధికారులపైన అధికారులు అప్పటి నుంచే దృష్టి సారించారు. ఈ మేరకు హెచ్‌ఎండీఏలో కీలకమైన పరిపాలనపరమైన విధులను నిర్వహించే ఒక రెవెన్యూ అధికారి సైతం అధికార దుర్వినియోగానికి పాల్పడినట్లు ఏసీబీ నిర్ధారణకు వచ్చినట్లు తెలిసింది. శివబాలకృష్ణ నుంచి సేకరించిన సమాచారం ఆధారంగా సదరు రెవెన్యూ అధికారి నుంచి వివరణ తీసుకున్న అధికారులు మొదట నోటీసులు ఇచ్చి ఇప్పుడు ఆయన అరెస్టుకు రంగం సిద్ధం చేశారు.

హెచ్‌ఎండీఏను వెంటాడుతున్న ఏసీబీ...

అప్పట్లో శివబాలకృష్ణకు అన్ని విధాలుగా సహకరించిన అధికారులను ఇప్పుడు ఏసీబీ వెంటాడుతోంది. ఏ క్షణంలోనైనా సదరు అధికారులను అదుపులోకి తీసుకుని విచారించే అవకాశం ఉన్నట్లు సమాచారం. ఇప్పటికే పలు దఫాలుగా హెచ్‌ఎండీఏలో సోదాలు నిర్వహించి కీలకమైన ఫైళ్లను జప్తు చేసిన అధికారులు అందుకు బాధ్యులైన వారిపైన దృష్టి సారించారు. ఇందులో భాగంగానే భవన నిర్మాణ అనుమతుల్లో అధికారదుర్వినియోగానికి పాల్పడిన సదరు రెవెన్యూ అధికారిని విచారించనున్నారు. పుప్పాలగూడ, నార్సింగి, తదితర ప్రాంతాల్లో భవన నిర్మాణ అనుమతులకు రెవెన్యూ పరమైన అంశాల్లో ఆయన సహకరించినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ క్రమంలో ఆయన పెద్దమొత్తంలో లబ్ధి పొందినట్లు ఏసీబీ గుర్తించింది. భవన నిర్మాణాలు, లే అవుట్‌ల పైన వచ్చే ఫిర్యాదుల విషయంలోనూ అక్రమాలకు పాల్పడినట్లు ఏసీబీ పరిశీలనలో వెల్లడైనట్లు సమాచారం. హెచ్‌ఎండీఏలో డిప్యూటేషన్‌పైన కొనసాగుతున్న మరి కొందరు రెవెన్యూ అధికారులు కూడా రెవెన్యూ పరమైన క్లియరెన్స్‌లలో ఇదే తరహాలో అక్రమాలకు పాల్పడినట్లు ఆరోపణలు ఉన్నాయి. మరోవైపు ప్రణాళికా విభాగంలోనూ కొందరు అధికారులు శివబాలకృష్ణకు కీలకమైన అనుచరులుగా ఉండి అన్ని విధాలుగా సహకరించారు. ఇప్పటికే ఓ ఏపీఓ అధికారి ఉదంతం వెలుగులోకి రాగా, తాజా పరిణామాల నేపథ్యంలో మరి కొందరు అధికారులను సైతం ఏసీబీ భయం వెంటాడుతున్నట్లు తెలిసింది.' పై నుంచి వచ్చిన ఆదేశాల మేరకే పని చేశాం. ఏ ఒక్క అనుమతిలోనూ మా ప్రమేయం లేదు. కానీ ఇప్పుడు మూల్యం చెల్లించవలసి వస్తోంది.'అని ఒక అధికారి ఆవేదన వ్యక్తం చేసిన తీరు హెచ్‌ఎండీఏలో తాజా పరిణామాలను ప్రతిబింబిస్తుంది.

కాంగ్రెస్ పాలనలోనే అన్నివర్గాల సంక్షేమం



దానంకు మద్దతు తెలిపిన విద్యార్థులు

బంజారాహిల్స్: హిమాయత్‌నగర్ డివిజన్‌కు చెందిన విద్యార్థులు సికింద్రాబాద్ పార్లమెంట్ అభ్యర్థి దానం నాగేందర్‌ను కలిసి ఆయన గెలుపు కోసం స్వచ్ఛందంగా కృషి చేస్తామంటూ ముందుకువచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కొద్ది రోజుల్లోనే ప్రభుత్వ ఉద్యోగాలు వేల సంఖ్యలో భర్తీ చేసిందని ఈ సందర్భంగా విద్యార్థులు దానంకు మద్దతుగా నిలిచారు. చదువుకునే మాలాంటి విద్యార్థులకు ఉపాధి అవకాశాలను కాంగ్రెస్ పార్టీ మాత్రమే కల్పిస్తుందన్న భరోసా వచ్చిందన్నారు. కేంద్రంలో కూడా ఉద్యోగాలు రావాలంటే కాంగ్రెస్ పార్టీ రావాలని, అందుకు విద్యార్థులంతా కృషి చేస్తామని ప్రతినబూనారు. ఈ సందర్భంగా దానం మాట్లాడుతూ... ఎన్నికల ముందు ఇచ్చిన ఆరు గ్యారంటీ పథకాల్లో ఐదింటిని ఇప్పటికే అమలు చేశారన్నారు. అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరగాలంటే కేంద్రంలో కూడా కాంగ్రెస్ అధికారంలోకి రావాల్సిన అవసరం ఉందన్నారు.

బీజేపీతోనే న్యాయం

కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి



హిమాయత్‌నగర్: ఎస్సీలకు న్యాయం చేసే ఏకైక రాజకీయ పార్టీ బీజేపీ మాత్రమే అని కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి అన్నారు. నారాయణగూడలో గురువారం రాత్రి బీజేపీ నేత పందిర్ల ప్రసాద్ ఆధ్వర్యంలో జరిగిన ఎస్సీ మాలల సమ్మేళనానికి కిషన్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఎస్సీలు అన్ని రంగాలలో అభివృద్ధి చెందేందుకు ప్రధాని నరేంద్రమోదీ నేతృత్వంలోని కేంద్రం ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిందన్నారు. బీజేపీతోనే అన్ని వర్గాల వారికి న్యాయం జరుగుతుందని కిషన్‌రెడ్డి స్పష్టం చేశారు. ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు డాక్టర్ లక్ష్మణ్, రాష్ట్ర ఉపాధ్యక్షులు చింతల రామచంద్రారెడ్డి, గంగరాజు పాల్గొన్నారు.

నేటి నుంచి ఇంటి వద్దే ఓటింగ్

12 టీమ్‌లు.. రూట్లు..

- ఈ నెల 6న మరోసారి అవకాశం
- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు



హోమ్ ఓటింగ్‌పై అవగాహన కల్పిస్తున్న ఖైరతాబాద్ అసెంబ్లీ నోడల్ అధికారి అనితారెడ్డి



యూసుఫ్‌గూడ స్టేడియంలో స్ట్రాంగ్ రూమ్‌ను పరిశీలిస్తున్న జీహెచ్‌ఎంసీ కమిషనర్ రొనాల్డ్‌రాస్, నగర పోలీస్ కమిషనర్ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి

బంజారాహిల్స్: ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు పోస్టల్ బ్యాలెట్ ఓటర్లు, 85 ఏళ్ల పైబడిన వృద్ధులు, దివ్యాంగులు ఇంటి వద్దనే ఓటు వేసేందుకు అవకాశం కల్పించారు. దరఖాస్తు చేసుకుని ఆమోదం పొందిన ఈ ప్రత్యేక ఓటర్లు ఈవీఎం ద్వారా, పోస్టల్ బ్యాలెట్ ద్వారా కాకుండా ఇంటి వద్దనే ఓటు వేసే అవకాశాన్ని కల్పించారు. ఇంటి వద్దనే ఓటు వేసేందుకు ఈ నెల 4న (నేడు), 6న (సోమవారం) ఏర్పాటు చేశారు. శనివారం ఓటు వేయలేకపోయిన వారి కోసం ఈ నెల 6న మరోసారి అవకాశం కల్పించారు. ఈ రెండు దశల్లోనూ ఓటు వేయని వారికి పోలింగ్ కేంద్రాల్లో ఓటు వేసే అవకాశం ఉండదు. ఇంటి వద్దనే ఓటింగ్ కోసం అధికారులు ఇప్పటికే ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆయా నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారుల ఆధ్వర్యంలో ఈ ప్రక్రియను చేపడుతున్నారు.

- ఖైరతాబాద్ నియోజకవర్గంలో హోమ్ ఓటింగ్‌కు 2,777 మంది వృద్ధులు, దివ్యాంగ ఓటర్లు 1,566 మందిని గుర్తించారు. ఇందులో 149 మంది వృద్ధులు, ఏడుగురు దివ్యాంగులు హోమ్ ఓటింగ్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. వీరు ఇంటి వద్దనే ఓటు వేసేందుకు 12 టీమ్‌లు ఏర్పాటు చేశారు. అలాగే 12 రూట్లు కూడా గుర్తించారు. వీరందరూ ఈ నెల 4న, 6న రెండు దశల్లో తమ ఓటు హక్కును వినియోగించుకోవచ్చు.
- ఎన్నికల్లో పోలింగ్ శాతం పెంచేందుకు ఎన్నికల సంఘం వివిధ మార్గాల్లో చేపడుతున్న చర్యల్లో భాగంగా గత అసెంబ్లీ ఎన్నికల దగ్గర నుంచి హోమ్ ఓటింగ్‌కు శ్రీకారం చుట్టి ఈ పార్లమెంట్ ఎన్నికల్లో కూడా అమలుచేస్తున్నారు.
- నడవలేని, పోలింగ్ కేంద్రాలకు వెళ్లలేని ఓటర్లు ఓటింగ్‌కు దూరంగా ఉంటున్నారని, ఎట్టి పరిస్థితుల్లోనూ అర్హత ఉన్నవారు ఓటు వేయాల్సిందేనని గుర్తించి ఎన్నికల సంఘం ఈ వినూత్న చర్యలకు శ్రీకారం చుట్టింది.
- పోలింగ్ కేంద్రాలకు వెళ్లలేని స్థితిలో ఉండే 85 ఏళ్లు పైబడిన వృద్ధులు, 40 శాతం పైగా వైకల్యం ఉన్నవారికి ఇంటి వద్దనే ఓటు హక్కు అవకాశాన్ని కల్పించారు. ఇంటి నుంచి ఓటు హక్కు వినియోగానికి ఫారం-12(డి) ద్వారా గత మార్చి 22 నుంచి ఏప్రిల్ 22 వరకు దరఖాస్తులు స్వీకరించారు. 156 మంది దరఖాస్తు చేసుకోగా ఈ నెల 4, 6 తేదీల్లో ఇంటి వద్ద ఓటు హక్కు వినియోగానికి ఖైరతాబాద్ నియోజకవర్గ ఎన్నికల అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు.

ఓటు వేయించేందుకు ప్రత్యేక బృందాలు...

ఓటర్ల వద్దకు వెళ్లి ఓటు వేయించేందుకు ప్రతి 45 మంది ఓటర్లకు ఒక టీమ్‌ను ఏర్పాటు చేశారు. ఒక్కో టీమ్‌లో ప్రిసైడింగ్ అధికారి, ఓపీఓ, మైక్రో అబ్జర్వర్, వీడియోగ్రాఫర్, రూట్ అధికారి, సెక్టార్ అధికారితో కలిపి మొత్తం ఆరుగురు చొప్పున సభ్యులు ఉంటారు. వీరు తమకు కేటాయించిన తేదీల్లో ఆయా సెక్టార్ల పరిధిలోని ఓటర్ల ఇంటి వద్దకు వెళ్లి ఎన్నికల సంఘం నిబంధనల మేరకు ఓటు వేయిస్తారు. ఓటు వేయడం కోసం ఓటరు వద్ద ఫారం-13ఏ (గులాబీ రంగు కవర్) అటెస్టేషన్ కోసం, ఫారం-13బీ బ్యాలెట్ పేపర్ (నీలం రంగు కవర్)లో వివరాలు పూర్తి చేసి కవర్ల పైన బ్యాలెట్ పేపర్ క్రమసంఖ్య రాసి కవర్-సీ (పసుపు రంగు)లో పెట్టి సీల్ చేసి బ్యాలెట్ పెట్టెలో వేయిస్తారు.

పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ షురూ



పోస్టల్ బ్యాలెట్ ఓటు వేస్తున్న ఉద్యోగి

బంజారాహిల్స్: ఖైరతాబాద్ నియోజకవర్గం పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ ప్రక్రియ శుక్రవారం ప్రారంభమైంది. పికెట్‌లోని కేంద్రీయ విద్యాలయ పోలింగ్ కేంద్రంలో ఖైరతాబాద్ పోస్టల్ బ్యాలెట్ బూత్‌ను ఏర్పాటు చేశారు. మొదటి రోజున 42 మంది ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఖైరతాబాద్‌లో మొత్తం 1352 మంది పోస్టల్ బ్యాలెట్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఈ నెల 8వ తేదీ వరకు వీరంతా ఓటు వేసే అవకాశం కల్పించారు.

స్ట్రాంగ్ రూమ్‌లను పరిశీలించిన అధికారులు...

ఖైరతాబాద్, జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గాల డీఆర్‌ఏసీ సెంటర్లు, స్ట్రాంగ్ రూమ్‌లను యూసుఫ్‌గూడ కోట్ల విజయభాస్కర్‌రెడ్డి స్టేడియంలో ఏర్పాటుచేశారు. శుక్రవారం జీహెచ్‌ఎంసీ కమిషనర్, హైదరాబాద్ జిల్లా ఎన్నికల రిటర్నింగ్ అధికారి రొనాల్డ్‌రాస్, నగర పోలీసు కమిషనర్ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి సంబంధిత అధికారులతో కలిసి పరిశీలించారు. ఈవీఎంలు భద్రపరిచిన స్ట్రాంగ్‌రూమ్‌ల వద్ద పోలీసు భద్రత, తీసుకున్న చర్యలను తనిఖీ చేశారు. ఈ నెల 12న ఈవీఎంలు, వీవీ ప్యాట్లు ఇక్కడి నుంచే సంబంధిత అధికారులు పోలింగ్ స్టేషన్లకు చేరుస్తారని, ఇందుకోసం చేపట్టనున్న చర్యలపై సమీక్షించారు. స్టేడియం చుట్టూ భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటుచేయాలని సూచించారు. స్టేడియానికి వెళ్లే మార్గాల్లో పోలీస్ పికెట్‌లు ఏర్పాటు చేయనున్నారు. ప్రస్తుతం స్టేడియం వద్ద సాయుధ బలగాల పహారా కొనసాగుతుందని, జూబ్లీహిల్స్ పోలీసుల నిరంతర పర్యవేక్షణ ఉందని అధికారులు తెలిపారు. రాత్రిపూట పోలీసు పెట్రోలింగ్ కూడా ముమ్మరం చేశామన్నారు.

ప్రతి ఒక్కరూ ఓటు వేయాలి



ర్యాలీ నిర్వహిస్తున్న మహిళా సమాఖ్యల ప్రతినిధులు

బంజారాహిల్స్: ఓటు హక్కు కలిగిన ప్రతి ఒక్కరు విధిగా మే 13న జరిగే లోక్‌సభ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకోవాలని ఎన్నికల అధికారులు విస్తృత ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా శుక్రవారం ఎంఎస్ మక్తా రాజీనగర్‌లో మహిళా సమాఖ్యల ప్రతినిధులు, రిసోర్స్‌పర్సన్లు ఓటు హక్కు వినియోగంపై అవగాహన కల్పించారు. ఓటింగ్ శాతాన్ని పెంచేందుకు ప్రతి ఒక్కరూ ఓటును వినియోగించుకోవాలని ప్లకార్డులు ప్రదర్శించారు. డీపీవో ఆశా విరానిక పాల్గొన్నారు.

ముగిసిన వేసవి శిబిరం



చిన్నారులకు బహుమతులు అందజేస్తున్న పాస్టర్ ప్రభుదాస్

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్ నెం. 12లోని ఎమ్మెల్యే కాలనీ షారోన్ ఫుల్ గాస్పెల్ చర్చిలో వీబీఎస్-2024 ది క్వెస్ట్ ఫర్ పర్పస్ పేరుతో చిన్నారుల కోసం ఏర్పాటు చేసిన వేసవి శిబిరం శుక్రవారం ముగిసింది. ఈ సందర్భంగా చర్చిలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 15 రోజుల పాటు చిన్నారులకు వివిధ అంశాల్లో శిక్షణ ఇచ్చిన శిక్షకులను సత్కరించడంతో పాటు ఉత్తమ ప్రతిభ కనబరిచిన చిన్నారులకు బహుమతులను చర్చి పాస్టర్ ఎం.ప్రభుదాస్ అందించారు. కార్యక్రమంలో మంజుల, శ్యాంబాబు, మహిత తదితరులు పాల్గొన్నారు.

దానం భారీ మెజార్టీతో గెలిపించాలి

పంజగుట్ట: బడుగు, బలహీనవర్గాలు, పేదలు అందరూ సుభిక్షంగా ఉండాలంటే కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయాలని సోమాజిగూడ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు నారికెల నరేష్ అన్నారు. శుక్రవారం ఖైరతాబాద్, సోమాజిగూడ డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో పర్యటించి కాంగ్రెస్ పార్టీ సికింద్రాబాద్ అభ్యర్థి దానం నాగేందర్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరుతూ కరపత్రాలు పంపిణీ చేశారు. శుక్రవారం కావడంతో పలు మజ్జిద్‌ల వద్దకు వెళ్లి ప్రార్థనల అనంతరం ముస్లిం సోదరులకు కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

నియామకం



శ్రీనగర్‌కాలనీ: హైదరాబాద్ సెంట్రల్ డిస్ట్రిక్ట్ ఓబీసీ మోర్చా వైస్ ప్రెసిడెంట్‌గా ఎస్.బి.రాములు నియమితులయ్యారు. ఈ మేరకు నియామకపత్రాన్ని శుక్రవారం బీజేపీ కార్యాలయంలో బీజేపీ ఎలక్షన్ ఇంచార్జ్ వర్ధన్‌రెడ్డి, రాజస్తాన్ ఎమ్మెల్యే తారాచంద్ అందజేశారు. ఓబీసీలను సంఘటితం చేసి బీజేపీ విజయానికి కృషి చేస్తానని రాములు తెలిపారు. మాజీ కార్పొరేటర్ కిలారి మనోహర్, నేతలు కుంబాల గంగరాజు, తాడూరి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సమష్టిగా పని చేస్తాం.. భారీ మెజార్టీ సాధిస్తాం...

సికింద్రాబాద్ లోక్‌సభ నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి దానం నాగేందర్



మాట్లాడుతున్న కాంగ్రెస్ అభ్యర్థి దానం నాగేందర్

బంజారాహిల్స్: ఖైరతాబాద్ కాంగ్రెస్ పార్టీలో ఎటువంటి విభేదాలు లేవని తామంతా కలిసిమెలిసి పని చేస్తున్నామని సికింద్రాబాద్ లోక్‌సభ నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి దానం నాగేందర్ అన్నారు. శుక్రవారం బంజారాహిల్స్‌లోని లేక్‌వ్యూ బంజారా ఫంక్షన్ హాల్‌లో నియోజక వర్గం బూత్ స్థాయి నేతలు, కార్యకర్తల సమావేశాన్ని టీపీసీసీ కార్యదర్శి పి.విజయారెడ్డితో కలిసి ఆయన ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా దానం మాట్లాడుతూ... ఇక్కడ గ్రూపు రాజకీయాలు నడుస్తున్నాయంటూ కొంత మంది విష ప్రచారం చేస్తున్నారని అందులో ఎటువంటి వాస్తవం లేదని నియోజక వర్గ వ్యాప్తంగా ఉన్న నేతలమందరం కలిసి కట్టుగా పని చేస్తూ కాంగ్రెస్ పార్టీ ఘన విజయానికి కృషి చేస్తున్నామని అన్నారు. బూత్ స్థాయిలో కార్యకర్తలు ప్రతి ఓటు పట్ల అప్రమత్తంగా ఉండాలని అన్నారు. బీజేపీ వస్తే రాజ్యాంగాన్ని పూర్తిగా మార్చేస్తుందని రిజర్వేషన్లు రద్దు చేసేందుకు ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. అదేకనక జరిగితే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలు కుదేలైపోతాయని అన్నారు రిజర్వేషన్లు నిలబెట్టే కాంగ్రెస్ పార్టీ కావాలో వాటిని రద్దు చేసే ఇతర పార్టీలు కావాలో ప్రజలు నిర్ణయించుకోవాలని అన్నారు. టీపీసీసీ కార్యదర్శి పి.విజయారెడ్డి మాట్లాడుతూ... పార్టీ బాగుంటేనే అందరం బాగుంటామని ఆ విషయాన్ని కార్యకర్తలు గుర్తుంచుకోవాలని అన్నారు. కాంగ్రెస్ పార్టీ దానం నాగేందర్‌కు పార్టీ టికెట్ కేటాయించిందని నియోజకవర్గంలోని నేతలు, కార్యకర్తలం అంతా కలిసి భారీ మెజార్టీతో దానంను గెలిపించుకుంటామని అన్నారు. మా మధ్య ఎటువంటి మనస్పర్థలు లేవని కార్యకర్తలు క్షేత్ర స్థాయిలో కలిసికట్టుగా ఉంటూ కాంగ్రెస్ విజయానికి దోహదపడాలని కోరారు. ఏఐసీసీ సోషల్ మీడియా ప్రతినిధి డాక్టర్ అనిల్ కుమార్, సీనియర్ నేతలు మామిడి నర్సింగ్ రావు, రాములు చౌహాన్, వంశీకృష్ణ, వెంకటేశ్వర కాలనీ డివిజన్ అధ్యక్షుడు బి.శ్రీనివాస్ యాదవ్, నారికేళ్ల నరేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎర్రమంజిల్ హైస్కూల్ భవనం కూల్చివేతకు సన్నద్ధం!



ఎర్రమంజిల్ హైస్కూల్ ఆవరణలో చెట్లను కూల్చేస్తున్న నిమ్స్ యాజమాన్యం

బంజారాహిల్స్: ఎర్రమంజిల్ ప్రభుత్వ పాఠశాల భవనాన్ని నేలమట్టం చేసే ప్రక్రియకు నిమ్స్ యాజమాన్యం ముందుకు వచ్చింది. ఎప్పటి నుంచో ఈ స్కూల్ భవనాన్ని కూల్చివేసి నిమ్స్ ఆస్పత్రిని విస్తరించాలని ప్రణాళికలు రూపొందించగా ఎర్రమంజిల్ ప్రభుత్వ పాఠశాల పూర్వ విద్యార్థుల సంఘం అడ్డుకుంటూ న్యాయస్థానంలో కేసులు వేసింది. ఇన్నాళ్లు ఆగిన నిమ్స్ యాజమాన్యం తాజాగా కోర్టుకు సెలవులు రావడం, బడికి కూడా సెలవులు ప్రకటించడంతో ఈ భవనాన్ని కూల్చివేసేందుకు సిద్ధమైందని పూర్వ విద్యార్థుల సంఘం ఆందోళన వ్యక్తం చేసింది. మూడు రోజుల నుంచి పాఠశాల ఆవరణలో చెట్లను జేసీబీలతో నేలమట్టం చేస్తున్నారని, స్కూల్ భవనాన్ని కూడా కూల్చేందుకు సిద్ధమవుతున్నారని దుయ్యబట్టారు. మరోచోట స్కూల్ భవనాన్ని నిర్మించిన తర్వాతనే ఇప్పుడు ఉన్న స్కూల్‌ను కూల్చివేయాలని కోర్టు చెప్పినా సంబంధిత అధికారులు వినిపించుకోవడం లేదని, ఆర్‌అండ్‌బీ అధికారుల పాత్ర పైనా అనుమానాలు ఉన్నాయని విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. 1962లో ప్రారంభమైన ఈ పాఠశాలలో 600 మంది విద్యార్థులు చదువుతున్నారని, ఈ భవనాన్ని కూల్చివేస్తే పాఠశాల ఇక్కడ ఉండదని, తామంతా ఎక్కడ చదవాలంటూ విద్యార్థులు, తల్లిదండ్రుల్లో ఆందోళన మొదలైంది. ఆర్‌అండ్‌బీ అధికారుల నిర్వాకం, ప్రభుత్వం నిర్లక్ష్యం, నిమ్స్ యాజమాన్యం తొందరపాటు చర్యలతో 600 మంది విద్యార్థుల భవిష్యత్తు వీధుల పాలయ్యే ప్రమాదం ఏర్పడింది. కాంగ్రెస్ ప్రభుత్వం స్పందించి ఈ పాఠశాల భవనాన్ని కూల్చకుండా ఆపాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

కాంగ్రెస్‌లో చేరిన వడ్డెర సంఘం నేతలు

రహమత్‌నగర్: వడ్డెర్ల ఆత్మగౌరవ భవన సముదాయ ట్రస్ట్ చైర్మన్ జెరిపేటి సత్యనారాయణ, వైస్ చైర్మన్ ఎత్తరి అంతయ్య, డైరెక్టర్ డాక్టర్ ఓర్సు కృష్ణల నేతృత్వంలో నగరంలోని వివిధ ప్రాంతాలకు చెందిన వడ్డెర సంఘం నాయకులు ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ సమక్షంలో శుక్రవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా దానం మాట్లాడుతూ... వడ్డెర కులస్తుల సమస్యలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి వాటిని పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. నాయకులు కుమార్, మాణికేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

కేటీఆర్ రోడ్ షో సౌండ్ నిర్వాహకులపై కేసు

రహమత్‌నగర్: బీఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ రోడ్ షోలో పరిమితికి మించి సౌండ్, డ్రోన్ కెమెరాను ఏర్పాటు చేసిన నిర్వాహకులపై బోరబండ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసుల సమాచారం మేరకు... ఎన్నికల ప్రచారంలో భాగంగా రహమత్ నగర్ డివిజన్ శ్రీరాంనగర్‌లో గురువారం రాత్రి సికింద్రాబాద్ బీఆర్‌ఎస్ అభ్యర్థి పద్మారావుగౌడ్ తరఫున కేటీఆర్ రోడ్ షో నిర్వహించారు. రోడ్ షోలో పరిమితికి మించి డీజే సౌండ్ సిస్టమ్ ఏర్పాటు చేసి, నిషేధిత డ్రోన్ కెమెరాను వాడటంతో బోరబండ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కాంగ్రెస్ విజయం తథ్యం



శ్రీనగర్‌కాలనీ: లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం తథ్యమని, ప్రజలందరూ కాంగ్రెస్ వైపే ఉన్నారని కన్జూమర్ రైట్స్ ప్రొటెక్షన్ ఫోరం జాతీయ కార్యదర్శి పి.వి.రవిశేఖర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం సీఎం రేవంత్‌రెడ్డిని ఆయన నివాసంలో కలిశారు.

ట్రేడింగ్ పేరుతో ప్రైవేట్ ఉద్యోగికి రూ. 6.9 లక్షల టోకరా

హిమాయత్‌నగర్: స్టాక్ మార్కెట్ ట్రేడింగ్‌లో అధిక లాభాలు వస్తాయని నమ్మించి ఓ ప్రైవేట్ ఉద్యోగిని సైబర్ నేరగాళ్లు మోసం చేశారు. నగర సైబర్ క్రైమ్ ఏసీపీ శివమారుతి సమాచారం మేరకు... నగరానికి చెందిన 33 ఏళ్ల ఓ ప్రైవేట్ ఉద్యోగికి ఫేస్‌బుక్‌లో ట్రేడింగ్ పేరుతో మెసేజ్ వచ్చింది. అతడి పేరుతో సైబర్ నేరగాళ్లు ట్రేడింగ్ అకౌంట్‌ను సృష్టించి, 142 మంది సభ్యులతో ఉన్న వాట్సాప్ గ్రూప్‌లో యాడ్ చేశారు. అతని మొబైల్‌లో గ్రో యాప్‌ను ఇన్‌స్టాల్ చేయడానికి లింక్‌ను పంపారు. ఈ యాప్ ద్వారా బార్‌క్లేస్ ఇంటర్నేషనల్ అసెట్ మేనేజ్‌మెంట్‌లో తన డబ్బు పెట్టుబడి పెట్టడం ప్రారంభించాడు. ఈ విధంగా సైబర్ నేరగాళ్లు చెప్పిన ఫేక్ ట్రేడింగ్ అకౌంట్లో విడతల వారీగా పెట్టుబడులు పెట్టించారు. మొదట కొంత లాభాలు వచ్చాయని నమ్మించి, అనంతరం పెద్దమొత్తంగా ట్రేడింగ్, ఐపీఓలలో పెట్టుబడులు పెట్టించారు. అందు కోసం యాప్ ద్వారా లోన్ ఇచ్చినట్లు నమ్మించారు. తన డబ్బు విత్ డ్రా అవడంలేదు, లోన్ డబ్బులో 50 శాతం చెల్లించాలని చెప్పారు. ఈ విధంగా బాధితుడిని నుండి మొత్తం 6.90 లక్షలను సైబర్ నేరగాళ్లు కాజేశారు.

రియల్ ఎస్టేట్ రంగానికి మంచి భవిష్యత్



ఎస్ ఇన్‌ఫ్రా లోగోను ఆవిష్కరిస్తున్న డాక్టర్ స్రవంతి తదితరులు

బంజారాహిల్స్: హైదరాబాద్‌కు అన్ని వైపులా రియల్ ఎస్టేట్ రంగానికి మంచి భవిష్యత్ ఉందని ఇండియాలోని ఇతర నగరాల్లో స్థలాలు మరింత ఖరీదైన సమయంలో హైదరాబాద్ పెట్టుబడులకు స్వర్గధామంలా కనిపిస్తుందని యూత్ ఐకాన్ తెలంగాణ-2021 డాక్టర్ స్రవంతి ఎల్లసిరి అన్నారు. శుక్రవారం బంజారాహిల్స్‌లోని రాడిసన్ బ్లూ ప్లాజా హోటల్‌లో ఎస్ ఇన్‌ఫ్రా సంస్థ లోగో లాంచ్ కార్యక్రమం అట్టహాసంగా జరిగింది. ఈ లోగో లాంచ్ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ... పేద, మధ్య తరగతి ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా వారి సొంతి కలను నిజం చేసుకునే విధంగా ఎస్ ఇన్‌ఫ్రా సంస్థ కృషి చేయాలని కోరారు. సంస్థ ఎండీ కృష్ణ సాయి, ప్రాజెక్ట్ మేనేజర్ కె. సుధాకర్, వైస్ ప్రెసిడెంట్ భావన ఎల్లసిరి, ఫణిభూషణ్, ఆసిఫ్ అలీ, ఈశ్వర్ కుమారన్ పాల్గొన్నారు.

ఉత్సాహంగా కేఎల్‌హెచ్ టెక్నో-సాంస్కృతిక మహోత్సవం



విద్యార్థులకు ప్రశంసాపత్రాలను అందజేస్తున్న కేఎల్‌హెచ్ ప్రతినిధులు

బంజారాహిల్స్: కేఎల్ డీమ్డ్ టు బీ యూనివర్శిటీకి చెందిన కేఎల్‌హెచ్ బాచుపల్లి క్యాంపస్ వార్షిక టెక్నో -సాంస్కృతిక మహోత్సవం (వివెంటియా 2024) ఉత్సాహంగా జరిగింది. రెండు రోజుల పాటు జరిగిన ఈ కార్యక్రమంలో వివిధ కళాశాలల నుంచి 400 మంది విద్యార్థులు పాల్గొన్నారు. వివిధ అంశాల్లో విద్యార్థుల ఆవిష్కరణలు అబ్బురపరిచాయి. సాంకేతిక వర్క్‌షాప్‌లు, హ్యాకథాన్లు, కోడింగ్ బ్యాటిల్స్ తదితర కార్యక్రమాల్లో విద్యార్థులు ప్రతిభను చాటారు. ఈ ఉత్సవంలో గ్లామ్ కోడ్ కోచర్, బాట్స్ బాటిల్, హాక్-ఏ-థాన్, ఐడియాస్ స్పార్క్, పీసీబీ డిజైన్ వర్క్ షాప్ తదితర టెక్ కార్నర్ ఈవెంట్లు జరిగాయి. దీంతో పాటు ఈ-గేమింగ్, గేమ్ కాన్ క్వెస్ట్, స్మాష్ కార్ట్‌లు, తంబోలా తదితర నాన్-టెక్నో హబ్ ఈవెంట్లు వినోదాన్ని పంచాయి. కేఎల్ డీమ్డ్ టు బి యూనివర్శిటీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ పార్థసారధివర్మ మాట్లాడుతూ ఇటువంటి ఫెస్ట్‌లు కేవలం సాంకేతిక సామర్థ్యాన్ని మాత్రమే కాకుండా సామాజిక భావాన్ని, స్నేహాన్ని పెంపొందిస్తాయన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎల్.కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. పలు అంశాల్లో ప్రతిభ చాటిన విద్యార్థులకు అవార్డులు, ప్రశంసాపత్రాలను అందజేశారు.

హక్కుల పరిరక్షణలో ఐఎన్టీయూసీ కీలకం

ఐఎన్టీయూసీ జాతీయ అధ్యక్షుడు అంబటి కృష్ణమూర్తి



అభివాదం చేస్తున్న ఐఎన్టీయూసీ నేతలు

హిమాయత్‌నగర్: కార్మికుల హక్కుల పరిరక్షణలో ఐఎన్టీయూసీ కీలక పాత్ర పోషిస్తోందని ఆ యూనియన్ జాతీయ అధ్యక్షుడు అంబటి కృష్ణమూర్తి అన్నారు. బషీర్ బాగ్ దేశోద్ధారక భవన్‌లో శుక్రవారం ఐఎన్టీయూసీ తెలంగాణ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో 77 వ వ్యవస్థాపక దినోత్సవాలు ఘనంగా జరిగాయి. ఈ ఉత్సవాల్లో ఐఎన్టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గూడా ఐలయ్య గౌడ్ స్వాగతం పలకగా, అధ్యక్షుడు గుంజ శ్రీనివాస్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా కృష్ణమూర్తి మాట్లాడుతూ... కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రద్దు చేసిన కార్మిక చట్టాల పునరుద్ధరణ కోసం బలమైన ఉద్యమాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీని ప్రధానిగా చేయడానికి కార్మికవర్గమంతా కృషి చేయాలన్నారు. ఐఎన్టీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సతీష్ బాబు, దళిత సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఏవీ జేమ్స్, గ్రేటర్ హైదరాబాద్ సెంట్రింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి చాంద్ పాషా, ఐఎన్టీయూసీ జాతీయ కార్యనిర్వాహక కార్యదర్శి నడిమిటి నాగరాజు, నేతలు ఎ.రమేష్ యాదవ్, వి.అనిల్ రెడ్డి, జి.భాస్కర్, సి.గురు ప్రసాద్ రావు, ఎం.కృష్ణారెడ్డి, మహిళా నాగమణి తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల ప్రచారంలో మేము సైతం...

రహమత్‌నగర్: ఎన్నికల ప్రచారంలో మేము సైతం అంటు ముందుకు సాగుతున్నారు మహిళా నాయకురాల్లు. తమ అనుచర మహిళలతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్నారు. కాంగ్రెస్ అభ్యర్థి దానం నాగేందర్‌కు ఓటు వేయాలని సాటి మహిళా ఓటర్లను అభ్యర్థిస్తున్నారు. హెచ్‌ఎంసీ మాజీ డిప్యూటీ మేయర్, బోరబండ కార్పొరేటర్ బాబా ఫసియుద్దీన్ సతీమణి, కాంగ్రెస్ నాయకురాలు హబీబా సుల్తానా ప్రచారంలో శుక్రవారం ఉదయం మార్నింగ్ విత్ ఓటర్స్ కార్యక్రమం పేరుతో డివిజన్‌లోని వివిధ బస్తీలకు చెందిన మహిళలతో కలుస్తూ హస్తం గుర్తుకే ఓటు వేయాలని కోరారు. రహమత్‌నగర్ డివిజన్ కాంగ్రెస్ మహిళా నాయకురాల్లు అండాళు, మేఘన పద్మ, సువర్ణ, పర్వీన్ బేగంలు ఆయా బస్తీల్లో పర్యటిస్తూ విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు.

'జువైనల్ హోమ్‌లో సేవలు చేయండి'

బంజారాహిల్స్: డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా ద్విచక్ర వాహనాలు నడుపుతున్న ఏడుగురు మైనర్లను బంజారాహిల్స్ ట్రాఫిక్ పోలీసులు అదుపులోకి తీసుకుని శుక్రవారం నాంపల్లిలోని ఐదవ అదనపు మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ జువైనల్ కోర్టులో హాజరుపరిచారు. న్యాయమూర్తి వారిని సైదాబాద్‌లోని జువైనల్ హోంకు తరలించడమే కాకుండా వీరితో రెండు రోజుల పాటు సామాజిక సేవా కార్యక్రమాలు చేయించాలని ఆదేశిస్తూ తీర్పునిచ్చారు. ఈ ఏడుగురిని జువైనల్ హోంకు తరలించినట్లు బంజారాహిల్స్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సాయిప్రకాష్‌గౌడ్ తెలిపారు.

అగ్నికి ఆహుతైన స్క్రాప్ గోదాము

ఖైరతాబాద్: స్క్రాప్ గోదాం అగ్నికి ఆహుతైంది. ఖైరతాబాద్ పోలీసుల సమాచారం మేరకు... శుక్రవారం మధ్యాహ్నం బంజారాహిల్స్ రోడ్ నెం-1 పరిధిలోని ప్రేమ్‌నగర్‌లో స్క్రాప్ గోదాంలో కాగితాలు, ఫర్నిచర్, ప్లాస్టిక్ వస్తువులకు మంటలు అంటుకున్నాయి. దట్టమైన పొగలతో అగ్నికీలలు ఎగసి పడ్డాయి. ఈ సంఘటనతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. సమాచారం అందుకున్న పంజగుట్ట అగ్నిమాపక శాఖ సిబ్బంది రెండు ఫైర్ ఇంజన్ల సాయంతో మంటలను ఆర్పివేశారు.

ఆరు గ్యారంటీలు, రుణమాఫీ చెయ్.. రాజీనామా ఇస్తా..!

అవి చేయకుంటే సీఎం పదవికి రాజీనామా చేస్తావా?

- సీఎం రేవంత్‌రెడ్డికి మాజీ మంత్రి హరీశ్‌రావు సవాల్
- కేసీఆర్ బస్సుయాత్రతో కాంగ్రెస్, బీజేపీల్లో వణుకు
- అందుకే ప్రామిసరీ నోట్లు, గాడ్ ప్రామిస్‌లతో కొత్త నాటకాలు
- రేవంత్‌రెడ్డి ఢిల్లీకి గులాంగిరీ చేస్తున్నారని విమర్శ


నల్లగొండ పట్టణంలో రోడ్‌షోలో మాట్లాడుతున్న హరీశ్‌రావు

సాక్షి,సిద్దిపేట/చందూరు/అక్కన్నపేట(హుస్నాబాద్): ''ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారంటీలు, రైతులకు రూ.2 లక్షల రుణమాఫీని ఆగస్టు 15లోగా అమలు చేస్తే.. నేను రాజీనామా చేస్తా.. హామీలను అమలు చేయకపోతే సీఎం పదవికి రేవంత్‌రెడ్డి రాజీనామా చేస్తారా?'' అని మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు సవాల్ చేశారు. రేవంత్‌రెడ్డి రాజీనామా పత్రాన్ని ప్రెస్ అకాడమీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డికి పంపించాలని... పది నిమిషాల్లో నేనూ స్పీకర్ ఫార్మాట్‌లో రాజీనామా లేఖను పంపిస్తానని..ఇందుకు సిద్ధమా అని ప్రశ్నించారు. శుక్రవారం సిద్దిపేటలో, నల్లగొండలో, అదే జిల్లా చందూరులో, సిద్దిపేట జిల్లా అక్కన్నపేటలో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో మాట్లాడారు. వివరాలు ఆయన మాటల్లోనే.. ''ప్రమాణ స్వీకారం చేసి కుర్చీలో కూర్చోగానే రైతులకు రుణమాఫీ చేస్తానని బాండ్ పేపర్ రాసిచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి.. ఆ హామీ ఇప్పటికీ అమలు చేయలేదు. ఇప్పుడేమో ఆగస్టు 15లోగా రుణమాఫీ చేస్తానంటూ ఏ ఊరికి పోతే ఆ ఊరి దేవుడి మీద ఒట్టు పెడుతున్నారు. రేవంత్ రుణమాఫీ అమలు చేస్తే నేను ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తా. ఉప ఎన్నికల్లో కూడా పోటీచేయను. పదవుల కోసం చిల్లర రాజకీయాలు చేయడం నాకు అలవాటు లేదు.

కేసీఆర్ యాత్రను చూసి వణుకు

కేసీఆర్ బస్సుయాత్ర సూపర్ సక్సెస్ కావడంతో కాంగ్రెస్, బీజేపీలు నాటకాలు ఆడుతున్నాయి. చీకటి ఒప్పందంతో చెరో 8 సీట్లు పంచుకున్నాయి. ఒకరేమో దేవుడిని చూపించి, మరొకరు దేవుడి మీద ఒట్లు పెట్టి ఓట్లు అడుగుతున్నారు. కాంగ్రెస్ హిందువుల ఆస్తులను ముస్లింలకు పంచుతుందని ప్రధాని ఆరోపిస్తున్నారు. బీజేపీతో రిజర్వేషన్లు రద్దు అవుతాయని రేవంత్‌రెడ్డి అంటున్నారు. అవేమీ జరగబోవు. హైదరాబాద్‌ను ఉమ్మడి రాజధాని చేయడానికి చంద్రబాబు లాంటి వాళ్లు కుట్ర చేస్తున్నారు. మేం వాళ్ల ఆటలు సాగనివ్వబోం.

వారిది ఢిల్లీకి గులాంగిరీ!

రేవంత్‌రెడ్డి ఢిల్లీకి గులాంగిరీ చేస్తున్నారు. ఏం చేయాలన్నా ఢిల్లీకి వెళ్లాల్సిందే. తోడు పెళ్లికొడుకులా ఉప ముఖ్యమంత్రిని వెంట తీసుకుని ఇప్పటివరకు 20 ట్రిప్పులు పోయారు. అదే కేసీఆర్ తెలంగాణ ప్రజలే హైకమాండ్‌గా సేవలు అందించారు. స్వార్థం కోసం కొందరు నాయకులు పార్టీ మారొచ్చు కానీ, పార్టీ కోసం పనిచేసే నాయకులు, కార్యకర్తలు కేసీఆర్‌తో ఉన్నారు. అబద్ధపు హామీలిచ్చి అధికారంలోకి వచ్చి.. హామీలు అమలు చేయని కాంగ్రెస్‌ను పాతాళానికి తొక్కాలి. ఈ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థులను గెలిపించండి'' అని హరీశ్‌రావు పిలుపునిచ్చారు.


తిరుమలలో శుక్రవారం భారీ వర్షం కురవడంతో జలమయమైన ఆలయ ప్రాంగణం

ఏడాదిలోగా మళ్లీ కేసీఆర్ రాష్ట్ర రాజకీయాల్ని శాసిస్తారు


సికింద్రాబాద్ నియోజకవర్గ పరిధిలో జరిగిన రోడ్‌షోకి హాజరైన జనం

- కాంగ్రెస్ రాగానే కరెంటు, నీటి కష్టాలు వచ్చాయి
- బీజేపీ పాలనలో ప్రజలకు కష్టాలు
- బీజేపీలో రేవంత్ చేరడం ఖాయం
- నగరంలోని రోడ్ షోల్లో మాజీ మంత్రి కేటీఆర్

అడ్డగుట్ట, బన్సీలాల్‌పేట్, నాంపల్లి: లోక్‌సభ ఎన్నికల్లో పది నుంచి పన్నెండు సీట్లు బీఆర్‌ఎస్‌కు వస్తే ఏడాది లోపే మళ్లీ కేసీఆర్ రాష్ట్ర రాజకీయాల్ని శాసించే పరిస్థితి వస్తుందని మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.తారకరామారావు (కేటీఆర్) అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా సికింద్రాబాద్ లోక్‌సభ అభ్యర్థి పద్మారావుగౌడ్‌కు మద్దతుగా శుక్రవారం అడ్డగుట్ట డివిజన్ తుకారాంగేట్‌లో, సనత్‌నగర్ అసెంబ్లీ నియోజకవర్గం బన్సీలాల్‌పేట్ కమాన్ వద్ద, నాంపల్లి నియోజకవర్గం నోబుల్ టాకీస్ చౌరస్తాలో జరిగిన రోడ్‌షోల్లో కేటీఆర్ మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచిన కాంగ్రెస్ ఇప్పటివరకు చేసిందేమీ లేదని, ఇక చేసేది కూడా ఏమీ లేదని ప్రజలకు అర్థమైపోయిందన్నారు. ఇక పదేళ్లు కేంద్రంలో ఉన్న బీజేపీ రాష్ట్రానికి ఏమీ చేయలేదని, ఈ పరిస్థితుల్లో లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కి మెజారిటీ సీట్లు వస్తే మళ్లీ కేసీఆర్ చక్రం తిప్పుతారన్నారు.

తెలంగాణకు మోదీ ఏం చేశారు

మాయమాటలతో రెండు సార్లు అధికారంలోకి వచ్చిన నరేంద్ర మోదీ ప్రభుత్వం తెలంగాణ రాష్ట్ర ప్రజలకు చేసిందేమీ లేదని కేటీఆర్ విమర్శించారు. జన్‌ధన్ ఖాతాలు తెరిస్తే ప్రతీ ఖాతాలో రూ.15 లక్షలు జమ చేస్తానని, ప్రతి ఒక్కరికీ ఇండ్లు ఇస్తామని, ఇంటింటికీ నల్లా నీళ్లు అందిస్తామని, రైతుల ఆదాయం రెండింతలు చేస్తామని, బుల్లెట్ రైళ్లను తీసుకొస్తామని, నల్లధనం వెలికితీస్తామని చెప్పిన మోదీని.. ఇప్పుడు అడిగితే తెల్లముఖం వేస్తున్నారని ఎద్దేవా చేశారు.

కుర్‌కురే ప్యాకెట్లు పంచడం తప్ప కిషన్ చేసిందేంటి?

ఐదేళ్లుగా కేంద్ర మంత్రిగా ఉన్న కిషన్‌రెడ్డి సికింద్రాబాద్‌కు చేసిందేమిటని కేటీఆర్ ప్రశ్నించారు. ఆయన చేసిన ఒకటే ఒక్క పని కుర్‌కురే ప్యాకెట్లు పంపిణీ చేయడమేనని ఎద్దేవా చేశారు. హైదరాబాద్‌కు రూపాయి పని కూడా చేయని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అక్కరకు రాని చుట్టమని నిందించారు. క్రూడ్ ఆయిల్ ధరలు తగ్గినా కూడా పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గించకుండా సామాన్య ప్రజలను కష్టాల్లోకి తోసింది కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వమేనని ఆరోపించారు. ఇవి తప్పనికిషన్ రెడ్డి రుజువుచేస్తే రేపటికల్లా నా ఎమ్మెల్యే పదవిని రాజీనామా చేస్తానని కేటీఆర్ సవాల్ విసిరారు.

గ్రేటర్ ప్రజలు గ్రేట్

గ్రేటర్ హైదరాబాద్ ప్రజలు గత అసెంబ్లీ ఎన్నికల్లో ఎంతో తెలివిని ప్రదర్శించి బీఆర్‌ఎస్‌కు 16 ఎమ్మెల్యే సీట్లు ఇచ్చారని, ఆ ప్రజలందరికీ పాదాభివందనం చేస్తున్నానని కేటీఆర్ వ్యాఖ్యానించారు. హైదరాబాద్‌లో ప్రజలు అప్పుడే కరెంట్ కోతలు...నీటి కష్టాలతో బాధపడుతున్నారని తెలిపారు. లోక్‌సభ ఎన్నికల తరువాత కచ్చితంగా రేవంత్‌రెడ్డి బీజేపీలో చేరుతారని కేటీఆర్ ఆరోపించారు. ''రాహుల్ గాంధీ ఏమో మోదీని చౌకీదార్ చోర్ అంటే మోదీ బడే భాయ్ అని రేవంత్‌రెడ్డి అంటున్నారు. రాహుల్ ఏమో గౌతమ్ అదానీ ఫ్రాడ్ హై అని అంటే... గౌతమ్ అదానీ హమారా ఫ్రెండ్ హై అని రేవంత్ అంటున్నారు. లిక్కర్ స్కామ్ లేదనీ. కేజ్రీవాల్‌ను అరెస్టు చేయడం సరికాదని రాహుల్ గాంధీ అంటే... కేసీఆర్ కూతురును అరెస్టు చేయడం కరెక్టేనని, రేవంత్ రెడ్డి మాట్లాడుతున్నారు.. ఈ మాటలను బట్టి రేవంత్ తీరు ఏమిటో అర్థం చేసుకోవచ్చు'' అని కేటీఆర్ అన్నారు.


రోడ్‌షోలో అభివాదం చేస్తున్న కేటీఆర్, చిత్రంలో బీఆర్‌ఎస్ అభ్యర్థి పద్మారావుగౌడ్, తలసాని శ్రీనివాస్ యాదవ్

నగర వార్తలు

నగదు, మద్యం పంపిణీపై గట్టి నిఘా

సాక్షి, సిటీబ్యూరో: ఎన్నికల్లో నగదు, మద్యం, ఇతర వస్తువుల పంపిణీ జరగకుండా ప్రత్యేక దృష్టి సారించాలని హైదరాబాద్, సికింద్రాబాద్ లోక్‌సభ నియోజకవర్గాల వ్యయ పరిశీలకులు సెంథిల్‌కుమార్, అమిత్ శుక్లా సూచించారు. శుక్రవారం వారు జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూంలో ఎక్స్‌పెండిచర్ మానిటరింగ్ కమిటీ, ఎంసీఎంసీ, ఎక్సైజ్, పోలీస్, ఐటీ, తదితర నోడల్ అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. బ్యాంకుల ద్వారా పెద్ద మొత్తంలో జరిగే లావాదేవీలతో పాటు, యూపీఐ ద్వారా నిర్వహించే నగదు చెల్లింపులను సైతం నిశితంగా పరిశీలించాలన్నారు. ఆయా లావాదేవీల వివరాల నివేదికను జిల్లా ఎన్నికల అధికారికి అందించాలని సూచించారు. ఎన్నికల్లో మద్యం, నగదు పంపిణీ జరగకుండా కట్టుదిట్టంగా వ్యవహరించాలని, సమస్యాత్మక ప్రాంతాల పై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని పోలీస్, ఎక్సైజ్ అధికారులకు సూచించారు.

పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ ప్రారంభం


కంటోన్మెంట్‌లో పోస్టల్ ఓటింగ్ కేంద్రం, స్ట్రాంగ్‌రూమ్‌లను సందర్శించిన అధికారులు

కంటోన్మెంట్: సికింద్రాబాద్ కంటోన్మెంట్ అసెంబ్లీ ఉపఎన్నికలు, మల్కాజ్‌గిరి పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించి కంటోన్మెంట్ పరిధిలో పోస్టల్ ఓటింగ్ ప్రక్రియ ప్రారంభమైంది. జిల్లా ఎన్నికల, జీహెచ్‌ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రాస్, నగర పోలీసు కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డిలు కంటోన్మెంట్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి సీఈఓ మధుకర్ నాయక్‌తో కలిసి కంటోన్మెంట్ బోర్డు కార్యాలయంలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని సందర్శించారు. ఎన్నికల విధుల్లో ఉన్న పీఓ, ఏపీఓ, ఓపీఓ, పోలీసు ఇతర సిబ్బంది కోసం పోస్టల్ ఓటింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. ఈ నెల 3వ తేదీ నుంచి 8వ తేదీ వరకు ప్రతిరోజు ఉదయం 7.30 గంటల నుంచి సాయంత్రం 5.00 గంటల వరకు పోస్టల్ ఓటింగ్‌కు అవకాశం ఉంటుందని తెలిపారు. శనివారం నుంచి 85 ఏళ్ల పైబడిన వారు, దివ్యాంగులకు ఇంటి వద్దే ఓటింగ్ వేసే ప్రక్రియ ప్రారంభమవుతుందని తెలిపారు. అనంతరం అధికారులు వెస్లీ కళాశాల ఆవరణలో ఏర్పాటుచేసిన స్ట్రాంగ్ రూమ్‌ను పరిశీలించారు.

బరి.. ముగ్గురి గురి

కంటోన్మెంట్ ఉప ఎన్నికలో ముక్కోణపు పోటీ

- బీఆర్‌ఎస్‌కు సిట్టింగ్ స్థానం
- సిటీలో బోణీ కొట్టాలని కాంగ్రెస్
- పట్టు పెంచుకోవాలని బీజేపీ
- సర్వశక్తులు ఒడ్డుతున్న ప్రధాన పార్టీలు


జి. నివేదిత, బీఆర్‌ఎస్ అభ్యర్థి


ఎన్. శ్రీగణేశ్, కాంగ్రెస్ అభ్యర్థి


డాక్టర్ టీఎన్ వంశతిలక్, బీజేపీ అభ్యర్థి

కంటోన్మెంట్: సికింద్రాబాద్ కంటోన్మెంట్ అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో మొత్తం 15 మంది అభ్యర్థులు బరిలో నిలిచినప్పటికీ మూడు ప్రధాన పార్టీల అభ్యర్థుల మధ్యే పోటీ తీవ్రంగా ఉంది. కాంగ్రెస్, బీఆర్‌ఎస్, బీజేపీలకు ఈ ఎన్నికలు ప్రతిష్టాత్మకంగా మారాయి. నగరంలో ఒక్క స్థానం కూడా గెలవలేకపోయిన అధికార కాంగ్రెస్ పార్టీ కంటోన్మెంట్‌తో బోణీ కొట్టాలనే పట్టుదలతో ఉంది. ప్రత్యర్థులకంటే తామే ఇక్కడ బలంగా ఉన్నామని భావిస్తున్న బీఆర్‌ఎస్, సిట్టింగ్ స్థానాన్ని నిలుపుకోవడానికి సర్వశక్తులు ఒడ్డుతోంది. గత ఎన్నికల్లో రెండో స్థానాన్ని దక్కించుకున్న బీజేపీ ఈసారి ఎలాగైనా గెలవాలని ప్రయత్నిస్తోంది. నవంబర్లో జరిగిన ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థిగా గెలిచిన లాస్య నందిత మరణంతో వచ్చిన ఉప ఎన్నికల్లో ఆమె అక్క నివేదిత బీఆర్‌ఎస్ నుంచి బరిలో నిలిచారు. గత ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థిగా పోటీచేసిన శ్రీగణేశ్, అధికార కాంగ్రెస్ పార్టీలో చేరి మరోసారి తన అదృష్టాన్ని పరీక్షించుకోబోతున్నారు. బీజేపీ డాక్టర్ టీఎన్ వంశ తిలక్‌కు పార్టీ టికెట్ కేటాయించింది.

పట్టు నిలుపుకోవాలని బీఆర్‌ఎస్

బీఆర్‌ఎస్ పార్టీ మరోసారి సాయన్న కుటుంబానికే చెందిన ఆయన రెండో కుమార్తెకు నివేదితకు పార్టీ టికెట్ కేటాయించింది. అయితే రాష్ట్ర స్థాయి కార్పొరేషన్ల మాజీ చైర్మన్లు మన్నె కృషాంక్, గజ్జెల నాగేశ్, డాక్టర్ ఎర్రోళ్ల శ్రీనివాస్‌లు సైతం బీఆర్‌ఎస్ టికెట్ ఆశించి భంగపడ్డారు. దీంతో ఈ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ తరఫున ప్రచారానికి వారు దూరంగా ఉన్నారు. పెద్ద సంఖ్యలో బీఆర్‌ఎస్ నేతలు, ముఖ్యంగా ఒకనాటి సాయన్న అనుచరులు పదుల సంఖ్యలో పార్టీని వీడి కాంగ్రెస్‌లో చేరారు. సాయన్న, సోదరి లాస్యల సెంటిమెంట్‌పై ఆశలతో నివేదిత తన ప్రచారాన్ని కొనసాగిస్తున్నారు.

పట్టువదలని నేతగా..

రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్‌గా కాంగ్రెస్ యువనాయకుడైన నారాయణ్ శ్రీగణేశ్ 2014, 2018లో కాంగ్రెస్ టికెట్ ఆశించి భంగపడ్డారు. అయితే 2018లో బీజేపీ నుంచి పోటీ చేసి ఓటమి పాలయ్యారు. అనంతరం శ్రీగణేశ్ ఫౌండేషన్ ద్వారా విస్తృత ప్రజాసేవతో సొంత ఇమేజ్ పెంచుకున్నారు. ఈ క్రమంలో 2023లో మరోసారి బీజేపీ టికెట్ కేటాయించడంతో బీఆర్‌ఎస్‌కు గట్టి పోటీ ఇచ్చి రెండో స్థానంలో నిలిచారు. వ్యక్తిగత బలం, అధికార పార్టీ అండతో ఈసారి గెలుపు ఖాయం అన్న ధీమాలో ఆయన ఉన్నారు. కంటోన్మెంట్‌ను జీహెచ్‌ఎంసీలో విలీనం, రక్షణ, ఎయిర్‌పోర్టు భూముల్లోని సుమారు 10వేల కుటుంబాలకు పట్టాలు ఇస్తామంటూ తన ప్రచారంలో ప్రముఖంగా చెబుతున్నారు.

మోదీ చరిష్మాపైనే ఆశలు

ఉత్తరాది ప్రాంతాలకు చెందిన ఓటర్లు అధికంగా ఉండే కంటోన్మెంట్‌లో పార్లమెంట్ ఎన్నికల్లో ఆ ప్రభావం ప్రస్ఫుటంగా కనిపిస్తోంది. 2023 అసెంబ్లీ ఎన్నికల్లోనూ బీజేపీ రెండో స్థానం దక్కించుకుంది. అయితే ఆ పార్టీ తరఫున పోటీచేసిన అభ్యర్థి శ్రీగణేశ్ కాంగ్రెస్‌లోకి చేరడంతో మాజీమంత్రి టీఎన్ సదాలక్ష్మి కుమారుడైన డాక్టర్ టీఎన్ వంశ తిలక్‌కు టికెట్ కేటాయించింది. కంటోన్మెంట్ నియోజకవర్గానికి కొత్త వ్యక్తి కావడంతో సీనియర్ నేతలపైనే ఆధారపడాల్సి వస్తోంది. బీజేపీలోని అంతర్గత కుమ్ములాటల నేపథ్యంలో ఇప్పటికీ క్షేత్రస్థాయిలో ప్రచారం చేపట్టలేకపోయారు. అయితే మాదిగ అభ్యర్థికి టికెట్ ఇవ్వాలన్న తమ డిమాండ్‌కు తలొగ్గిన బీజేపీకి ఎమ్మార్పీఎస్ సంపూర్ణ మద్దతు ప్రకటించి విస్తృత ప్రచారం చేస్తోంది. పార్లమెంట్ ఎన్నికలతో కలిసి రావడంతో మోదీ చరిష్మాతో బీజేపీ ఈ స్థానంలో గెలుపుపై ఆశలు పెట్టుకుంది.

పూల ఆంథోనీని కలిసిన బీజేపీ,కాంగ్రెస్ అభ్యర్థులు





రాంగోపాల్‌పేట్: హైదరాబాద్ ఆర్చ్ డయాసిస్ బిషప్, కార్డినల్ పూల ఆంథోనీని బీజేపీ సికింద్రాబాద్, మల్కాజిగిరి, హైదరాబాద్ లోక్‌సభ అభ్యర్థులు జి.కిషన్‌రెడ్డి, ఈటల రాజేందర్, మాధవీలత, కంటోన్మెంట్ అసెంబ్లీకి బీజేపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న వంశతిలక్ ఆయనను కలిశారు. శుక్రవారం ఎస్పీ రోడ్‌లోని బిషప్ హౌజ్‌లో ఆయనను కలిసి ఆశీర్వాదం తీసుకున్నారు. వారితో కార్పొరేటర్ కొంతం దీపిక, మాజీ కార్పొరేటర్ వసంతయాదవ్ నాయకులు అరుల్‌రాజ్, రామకృష్ణ ఉన్నారు. కాగా.. సికింద్రాబాద్ లోక్‌సభ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి దానం నాగేందర్ సైతం కార్డినల్, బిషప్ పూల ఆంథోనీని కలిసి ఆశీర్వాదం తీసుకున్నారు.

విదేశీ విద్యార్థులకు ప్రైజ్‌మనీ.. పోటీకి శ్రీకారం..

సాక్షి, సిటీబ్యూరో: విదేశాల్లో విద్యనభ్యసించాలనుకునే నగర విద్యార్థుల కోసం గ్లోబల్ ఎడ్యుకేషన్, టాలెంట్ సొల్యూషన్స్ సంస్థ ఈటీఎస్ టోఫెల్ ఇండియా చాంపియన్‌షిప్ నిర్వహించనుంది. దీనిని గురువారం ప్రారంభించిన సందర్భంగా సంస్థ నగర ప్రతినిధులు పోటీ వివరాలను వెల్లడించారు. అండర్ గ్రాడ్యుయేట్, గ్రాడ్యుయేట్ విద్యార్థులు పాల్గొనగలిగే ఈ దేశవ్యాప్త పోటీ తొలిరౌండ్‌లో 20 నిమిషాల క్విజ్ ఉంటుందనీ, రెండోరౌండ్‌లో పాల్గొనేవారు జూలై 31న జరిగే టోఫెల్ ఐబీటీ పరీక్షలో పాల్గొనవలసి ఉంటుందన్నారు. పోటీ ద్వారా విద్యార్థులు ప్రైజ్ మనీగా రూ.15 లక్షల వరకూ గెలుచుకోవచ్చని తెలియజేశారు. అదనపు వివరాల కోసం https://www.etsindia.org/toefl&india&championship&social/కు లాగిన్ కావాలని కోరారు.

నకిలీ వైద్యుల గుట్టురట్టు

- తుకారాంగేట్, అంబర్‌పేటలో ఇద్దరిపై కేసు
- రూ. 1.60 లక్షల విలువైన మందుల సీజ్


పోలీసులు అరెస్ట్ చేసిన నకిలీ వైద్యుడు రాజు

అడ్డగుట్ట: తుకారాంగేట్, అంబర్‌పేట పోలీసుస్టేషన్ల పరిధిలో ఇద్దరు నకిలీ వైద్యుల గుట్టురట్టు చేశారు డ్రగ్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్. తుకారాంగేట్‌లో వాయు క్లీనిక్‌ను వెంకటేశ్వర్‌రెడ్డి(41) అనే నకిలీ డాక్టర్ నడుపుతున్నాడు. గురువారం రాత్రి డ్రగ్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ ఇన్‌స్పెక్టర్ గోవింద్‌సింగ్, జి.అనిల్ సిబ్బందితో కలిసి వాయు క్లినిక్‌పై దాడులు నిర్వహించారు. వెంకటేశ్వర్‌రెడ్డికి ఎటువంటి సర్టిఫికేషన్ లేదని, ఫేక్ రిజిస్ట్రేషన్ నంబర్లు, ఫేక్ ప్రిస్క్రిప్షన్ క్లినిక్‌లో ఉన్నట్లు అధికారులు గుర్తించారు. డ్రగ్ లైసెన్స్ లేకుండా క్లినిక్‌లో 44 రకాల మందులు విక్రయిస్తున్నట్లు కనుగొన్నారు. రైల్వేకు సంబంధించిన మందులు కూడా క్లినిక్‌లో దొరికినట్లు అధికారులు వెల్లడించారు. మొత్తం 1.60 లక్షల విలువ గల మందులను సీజ్ చేసినట్లు తెలిపారు. మురికివాడల్లో నివాసముంటున్న అమాయకపు ప్రజలను ఆసరాగా తీసుకొని అక్రమంగా డబ్బులు సంపాదిస్తున్న మరికొందరు నకిలీ డాక్టర్ల గుట్టు ఒక్కొక్కటిగా రట్టు చేస్తామని డ్రగ్ ఇన్‌స్పెక్టర్ గోవింద్‌సింగ్ తెలిపారు.

అర్హత సర్టిఫికెట్లు లేకుండా..

అంబర్‌పేట డివిజన్ రామంతాపూర్‌లో నివసించే రాజు గంగారం అంకల్ప్(53) న్యూపటేల్‌నగర్‌లో శ్రీ సాయి వెంకటేశ్వర క్లినిక్ పేరిట వైద్యం అందిస్తున్నాడు. ఎలాంటి అర్హత సర్టిఫికెట్‌లు లేకుండా అమయాక ప్రజలకు వైద్యం అందిస్తూ సొమ్ము చేసుకుంటున్నాడు. విశ్వసనీయ సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్ అడిషనల్ డీసీపీ అందెశ్రీనివాస్‌రావు, ఇన్‌స్పెక్టర్ నాగార్జున నేతృత్వంలో నకిలీ వైద్యుడిని పట్టుకున్నారు. అతని వద్ద నుంచి వైద్య పరికరాలు, సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. కేసు దర్యాప్తులో ఉంది.


నకిలీ డాక్టర్‌ను అదుపులోకి తీసుకొని మందులను సీజ్ చేసిన డ్రగ్ అధికారులు

వి'చిత్రం'గా.. వినూత్నంగా..!

చార్మినార్‌లో బీఆర్‌ఎస్ ప్రచారం



చార్మినార్: హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలోని చార్మినార్‌లో బీఆర్‌ఎస్ నాయకులు శుక్రవారం వినూత్నంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. హైదరాబాద్ బీఆర్‌ఎస్ అభ్యర్థి లేకుండానే మాజీ సీఎం కేసీఆర్, మాజీమంత్రి కేటీఆర్ బొమ్మల ప్రదర్శనతో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మొఘల్‌పురా డివిజన్ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు పుప్పాల రాధాకృష్ణ ఆధ్వర్యంలో జరిగిన ఈ ప్రచారంలో సీనియర్ నాయకులు పి.శ్రీకాంత్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. పార్టీ అభ్యర్థి గడ్డం శ్రీనివాస్‌యాదవ్ తరఫున ఎన్నికల ప్రచారం నిర్వహించిన ఈ నాయకులు అతని చిత్రపటం లేకుండానే కేసీఆర్, కేటీఆర్‌లకు సంబంధించిన పెద్దపెద్ద చిత్రపటాలను ఓటర్ల వద్దకు తీసుకెళ్లి వాటినే చూపిస్తూ.. ప్రచారం చేశారు.

గొలుసులతో కట్టి.. కట్టెలతో కొట్టి..

మూడు రోజులపాటు భర్తకు నరకం చూపించిన భార్య

ఘట్‌కేసర్: ఆస్తికోసం భర్తను భార్య గొలుసులతో కట్టేసి దారుణంగా కట్టెలతో కొట్టిన సంఘటన ఘట్‌కేసర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. ఘట్‌కేసర్‌కు చెందిన పత్తి నర్సింహ(50)కు బుడగజంగాల కాలనీలో సొంతిల్లు, 115 చదరపు గజాల స్థలం ఉన్నాయి. ఇతని భార్య భారతమ్మ, ఇద్దరు కుమారులు గణేష్, రాజు చేసిన అప్పులు తీర్చడానికి ప్లాట్‌ను అమ్మ వలసిందిగా నర్సింహపై గత ఐదు నెలలుగా ఒత్తిడి చేస్తున్నారు. వారి వేధింపులకు తాళలేక అతను పడమటిసోమారంలోని తన అమ్మ సంగమ్మతో కలిసి ఉంటున్నాడు. ఏప్రిల్ 30న భార్య, ఇద్దరు కొడుకులు నర్సింహను పడమటిసోమారం నుండి ఘట్‌కేసర్‌లోని ఇంటికి తీసుకొచ్చి, గొలుసులతో కాళ్లు, చేతులు కట్టేశారు. మూడు రోజులుగా గదిలో నిర్బంధించి కట్టెలతో కొడుతూ దారుణంగా హింసించారు. నర్సింహ స్నేహితుడైన గడ్డం మహేష్‌కు ఈ విషయం తెలియడంతో అతన్ని విడిపించారు. ఈ మేరకు నర్సింహ పోలీస్‌స్టేషన్‌లో భార్య, కుమారులపై శుక్రవారం ఫిర్యాదు చేశారు.


నిర్బంధంలో ఉన్న నర్సింహ

నల్లగొండ.. నెగ్గేదెవరు?

సిట్టింగ్ స్థానం నిలుపుకునేందుకు కాంగ్రెస్ తీవ్ర ప్రయత్నం

సాక్షి ప్రతినిధి, నల్లగొండ: పోరాటాల పురిటిగడ్డ నల్లగొండ జిల్లా. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం మొదలుకొని సాగునీటి కోసం బ్యాలెట్ యుద్ధం, తెలంగాణ మలిదశ ఉద్యమంలో తొలి అమరుడైన శ్రీకాంత్‌చారి ఇలా.. ఎందులో చూసినా నల్లగొండ జిల్లాది ప్రత్యేకస్థానం. 1940లోనే తెలంగాణ సాయుధ పోరాటాన్ని ప్రపంచానికి పరిచయం చేస్తే, 1952 తర్వాత జరిగిన మొదటి సార్వత్రిక ఎన్నికల్లో నల్లగొండ జిల్లా నుంచి ఎన్నికైన రావి నారాయణరెడ్డి దేశంలోనే అత్యధిక మెజారిటీతో గెలుపొంది పార్లమెంట్ భవనాన్నే ప్రారంభించారు. అలాంటి నల్లగొండ పార్లమెంట్ నియోజకవర్గంలో 1952 నుంచి 2019 వరకు 17 సార్లు ఎన్నికలు జరిగాయి. అందులో 7 సార్లు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు విజయం సాధించగా, ఆరుసార్లు కమ్యూనిస్టు పార్టీ, రెండుసార్లు టీడీపీ, ఒకసారి తెలంగాణ ప్రజాసమితి, పీడీఎఫ్ పార్టీల అభ్యర్థులు విజయం సాధించారు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధులు రావి నారాయణరెడ్డి, బొమ్మగాని ధర్మబిక్షం నల్లగొండ నుంచే ప్రాతినిధ్యం వహించగా, భీంరెడ్డి నర్సింహారెడ్డి రద్దయిన మిర్యాలగూడ నుంచి ప్రాతినిధ్యం వహించారు. అదే నియోజకవర్గం నుంచి రెండుసార్లు గెలిచిన సూదిని జైపాల్‌రెడ్డి ఉత్తమ పార్లమెంటేరియన్‌గా గుర్తింపు పొందారు. కేంద్రమంత్రి కూడా అయ్యారు.



నల్లగొండ పట్టణంలోని గడియారం సెంటర్

ఈసారైనా బోణీ కొట్టాలని బీఆర్ఎస్, బీజేపీ

సాగునీరే ప్రధానాస్త్రం... రైతులే నిర్ణేతలు

సిట్టింగ్ స్థానాన్ని కాపాడుకునేందుకు కాంగ్రెస్

ఒకప్పుడు కమ్యూనిస్టులకు కంచుకోటగా ఉన్న నల్లగొండపై క్రమంగా కాంగ్రెస్ పైచేయి సాధించింది. గత మూడు ఎన్నికల్లోనూ కాంగ్రెస్ పార్టీనే నల్లగొండలో గెలుపొందింది. ఉమ్మడి రాష్ట్రంలో 2009లో, తెలంగాణ ఏర్పడ్డాక జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో 2014, 2019లోనూ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులే గెలుపొందారు. మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో 11 స్థానాలను గెలుచుకున్న కాంగ్రెస్ ఎంపీ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. కుందూరు రఘువీర్‌రెడ్డిని గెలిపించేందుకు సర్వశక్తులూ ఒడ్డుతోంది. నాలుగోసారి కూడా తామే నల్లగొండలో పాగా వేసే లక్ష్యంతో ముందుకు సాగుతోంది. ఈ ఎన్నికల్లో పార్లమెంట్ ఇన్‌చార్జ్‌గా మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నీ తానై వ్యవహరిస్తుండగా, మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ప్రచార కార్యక్రమాల్లో విస్తృతంగా పాల్గొంటున్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం వంద రోజుల పాలనలో చేపట్టిన కార్యక్రమాలు, గత బీఆర్ఎస్ ప్రభుత్వం జిల్లాలో సాగునీటి ప్రాజెక్టులను పక్కన పడేసిందంటూ విమర్శిస్తూ ప్రజలను తమవైపు తిప్పుకునే ప్రయత్నం చేస్తోంది.



కుందూరు రఘువీర్‌రెడ్డి
కాంగ్రెస్

బోణీ కొట్టేందుకు బీఆర్ఎస్

బీఆర్ఎస్ పార్టీ రెండుసార్లు రాష్ట్రంలో అధికారంలో ఉంది. అయినా 2014, 2019 ఎన్నికల్లో నల్లగొండ పార్లమెంట్ స్థానాన్ని గెలుచుకోలేకపోయింది. 2018లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో జిల్లాలో అత్యధిక మంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు విజయం సాధించినా, ఆ తర్వాత నాలుగు నెలలకు జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను అడ్డుకోలేకపోయింది. ఉమ్మడి జిల్లాలోని రెండు ఎంపీ స్థానాల్లోనూ కాంగ్రెస్ అభ్యర్థులే విజయం సాధించారు. అదే తరహాలో ప్రస్తుత ఎన్నికల్లో నల్లగొండ బీఆర్ఎస్ అభ్యర్థి గెలుస్తారన్న ధీమాతో ముందుకు సాగుతోంది. కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారంటీల్లోని 13 పథకాల్లో కొన్ని కూడా అమలు చేయడం లేదంటూ విమర్శలు గుప్పిస్తోంది. ఇప్పటికే బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ నల్లగొండలో భారీ సభ నిర్వహించడం, ఆ తర్వాత తుంగతుర్తి, సూర్యాపేట నియోజక వర్గాల్లోనూ ఎండిపోయిన పంటపొలాలను పరిశీలించారు. ఇటీవల మిర్యాలగూడ, సూర్యాపేటలో బస్సు యాత్ర నిర్వహించారు. జిల్లా మాజీ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అన్నీ తానై ఈ ఎన్నికల్లో వ్యవహరిస్తున్నారు.



కంచర్ల కృష్ణారెడ్డి
బీఆర్ఎస్

మోదీ చరిష్మా, పాలకుల వైఫల్యాలే గెలిపిస్తాయంటున్న బీజేపీ

నల్లగొండ పార్లమెంట్ స్థానం ఏర్పడిన నాటి నుంచి ఇప్పటి వరకు బీజేపీ అభ్యర్థి విజయం సాధించలేదు. అప్పట్లో ఓరుగంటి రాములు ఎంపీగా పోటీ చేసి గట్టిపోటీ ఇచ్చారు. ఆ తర్వాత ఇంద్రసేనారెడ్డి లాంటి పెద్ద నాయకులు పోటీ చేసినా విజయం సాధించలేకపోయారు. ప్రస్తుతం దేశంలో మోదీ చరిష్మా కొనసాగుతోంది. రామమందిర నిర్మాణం చేపట్టడం, అక్కడ తలంబ్రాల బియ్యం ఇంటింటికి పంపిణీ చేయడం హిందువుల్లో బీజేపీ వైపు మళ్లారన్న ధీమాతో బీజేపీ ఉంది. ప్రధానంగా యువత అంతా మోదీ ఆకర్షణలో ఉన్నారని, ఆ మోదీ చరిష్మాతోనే ఈ పార్లమెంట్ ఎన్నికల్లో విజయం సాధించాలన్న ఉద్దేశంతో బీజేపీ ముందుకు సాగుతోంది. ప్రధానంగా గత ప్రభుత్వం, ప్రస్తుత ప్రభుత్వం వంద రోజుల పాలనలో వైఫల్యాలను ప్రచార అస్త్రాలుగా చేసుకొని, కేంద్ర ప్రభుత్వం ప్రజల కోసం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను వివరిస్తూ ముందుకు సాగుతున్నారు. ఈనెల 6వ తేదీన బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా నల్లగొండలో ప్రచారం చేయబోతున్నారు.



శానంపూడి సైదిరెడ్డి
బీజేపీ

ముగ్గురూ కొత్త వారే..

నల్లగొండ ఎంపీ సెగ్మెంట్‌లో ఈసారి ముగ్గురు కొత్త అభ్యర్థులే బరిలో నిలిచారు. కాంగ్రెస్ అభ్యర్థి కుందూరు రఘువీర్‌రెడ్డి ఇప్పటివరకు ఏ ఎన్నికల్లోనూ పోటీ చేయలేదు. ఆయన తండ్రి, మాజీ మంత్రి జానారెడ్డి అండదండలతోనే రాజకీయాల్లోకి వచ్చారు. బీఆర్ఎస్ కూడా కొత్త అభ్యర్థినే పోటీలోకి దింపింది. నల్లగొండ మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి సోదరుడు కంచర్ల కృష్ణారెడ్డికి టికెట్ ఇచ్చింది. ఈయన కూడా ఎక్కడా పోటీ చేయలేదు. బీజేపీ ఎంపీ అభ్యర్థిగా శానంపూడి సైదిరెడ్డి బరిలో ఉన్నారు. ఆయన 2018లో హుజూర్‌నగర్ ఎమ్మెల్యేగా గెలిచారు. 2023 ఎన్నికల్లో బీఆర్ఎస్ తరపున అదే సెగ్మెంట్ నుంచి పోటీ చేసి ఓడిపోయారు.

ప్రభావితం చేసే అంశాలు

- రైతులు, సాగునీరు, ప్రాజెక్టులే అన్ని పార్టీలకు ప్రధాన ప్రచార అస్త్రాలు
- ఎంపీ సెగ్మెంట్‌లో 7 లక్షల మంది రైతులు ఉన్నారు. వారి ఓట్లే కీలకం
- నాగార్జునసాగర్ ప్రాజెక్టు కేఆర్ఎంబీకి అప్పగింతపై కాంగ్రెస్, బీఆర్ఎస్ పరస్పర విమర్శలు
- బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో ఎస్ఎల్‌బీసీ సొరంగమార్గం పూర్తి చేయకపోవడం
- నెల్లికల్లు లిఫ్ట్, బ్రాహ్మణవెల్లెంల, డిండి తదితర పెండింగ్ ప్రాజెక్టులు

అసెంబ్లీ సెగ్మెంట్‌ల వారీగా ఓటర్ల వివరాలు ఇలా..

నియోజకవర్గం	పురుషులు	స్త్రీలు
దేవరకొండ(ఎస్టీ)	1,31,659	1,30,392
నాగార్జునసాగర్	1,15,710	1,20,464
మిర్యాలగూడ	1,15,543	1,20,299
హుజూర్‌నగర్	1,21,667	1,29,164
కోదాడ	1,19,068	1,25,878
సూర్యాపేట	1,18,770	1,24,893
నల్లగొండ	1,21,079	1,27,766
మొత్తం	8,43,496	8,78,856

2019 ఎన్నికల్లో ప్రధాన పార్టీల అభ్యర్థులకు లభించిన ఓట్లు

నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి (కాంగ్రెస్)
5,26,028 (44.73 శాతం)

వేమిరెడ్డి నర్సింహారెడ్డి (టీఆర్ఎస్)
5,00,346 (42.55 శాతం)

గార్లపాటి జితేంద్రకుమార్ (బీజేపీ)
52,709 (4.48 శాతం)



నేను సైతం..

ఇంటి నుంచి ఓటేసిన 108 ఏళ్ల వృద్ధురాలు

'ఓట్ ఫ్రం హోమ్' విధానంలో భాగంగా శుక్రవారం మొదటి రోజు 108 ఏళ్ల వృద్ధురాలు ఓటు హక్కును వినియోగించుకుంది. నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని హౌసింగ్‌బోర్డు కాలనీకి చెందిన ఈశ్వరమ్మ ఇంటికి వెళ్లి ఎన్నికల అధికారులు ఆమె ఓటును సేకరించారు. 85 ఏళ్లు దాటిన వృద్ధులు, దివ్యాంగులు ఇంటి నుంచి ఓటు హక్కు (ఓట్ ఫ్రం హోమ్) వినియోగించుకునే సదుపాయాన్ని ఎన్నికల కమిషన్ కల్పించడం తెలిసిందే. ఈనెల 6 వరకు ఓట్ ఫ్రం హోమ్ కొనసాగుతుంది.

- సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నిజామాబాద్

రేవంత్, రంజిత్ వ్యక్తిగత విమర్శలు మానాలి

బీజేపీ చేవెళ్ల అభ్యర్థి విశ్వేశ్వర్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: ఎన్నికల ప్రచార సభలలో ప్రధాని నరేంద్ర మోదీపై సీఎం రేవంత్ రెడ్డి తప్పుడు ఆరోపణలు చేస్తూ, అభ్యంతరకర భాషను ఉపయోగిస్తున్నారని బీజేపీ నేత, చేవెళ్ల ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి ధ్వజమెత్తారు. ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ మోదీపై రేవంత్ రెడ్డి, తనపై కాంగ్రెస్ చేవెళ్ల ఎంపీ అభ్యర్థి రంజిత్‌రెడ్డి వ్యక్తిగత విమర్శలు మానుకోవాలని హితవు పలికారు. రేవంత్‌రెడ్డి ఉపయోగిస్తున్న భాష తెలంగాణ గౌరవాన్ని తగ్గిస్తోందని పేర్కొన్నారు. పదేళ్లుగా మోదీ ప్రభుత్వం సంక్షేమ పథకాల రూపంలో రాష్ట్రానికి రూ.కోట్లు అందించిందని చెప్పారు. తనపై, ప్రధాన అనుచరులపై రంజిత్‌రెడ్డి గతంలో తప్పుడు కేసులు పెట్టించారని ఆరోపించారు. రంజిత్ రెడ్డికి దమ్ముంటే తన భార్య సంగీతారెడ్డి, తల్లిపై విమర్శలు మాని ప్రజా సమస్యలపై స్పందించాలని సవాల్ చేశారు. రంజిత్ రెడ్డి చేవెళ్ల నియోజకవర్గంలో ఎలాంటి ఉపయోగ కరమైన పనులు చేయలేదని స్పష్టం చేశారు. ఈసారి ఎన్నికల్లో ఓటమి ఖాయమని తెలిసే తన మెజార్టీని తగ్గించేందుకు.. తన పేరున్న కొంత మందితో నామినేషన్లు వేయించి ప్రజలను అయోమయానికి గురిచేస్తున్నారని ఆరోపించారు.

ఎన్నికల్లో గెలుపు కోసం కాంగ్రెస్ అడ్డదారులు

బీజేపీ నేత డాక్టర్ కె.లక్ష్మణ్



సాక్షి, హైదరాబాద్: లోక్‌సభ ఎన్నికల్లో గెలుపు కోసం కాంగ్రెస్ పార్టీ అబద్ధాలతో అడ్డదారులు తొక్కుతోందని, ఎలాగైనా గెలవాలని ప్రజల మధ్య ఘర్షణలు సృష్టిస్తోందని బీజేపీ ఓబీసీమోర్చా జాతీయ అధ్యక్షుడు డా.కె లక్ష్మణ్ ఆరోపించారు. రిజర్వేషన్ల విషయంలో ఎలాంటి మార్పు ఉండదని ప్రధాన మంత్రి మోదీ స్వయంగా చెప్పినా కూడా సీఎం రేవంత్‌రెడ్డి పదే పదే ఈ అంశాన్ని ముందు తెస్తూ దిగజారుడు రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ తొమ్మిదేళ్ల అధికారం తర్వాత కేసీఆర్‌కు గర్వం పెరిగితే కేవలం 90 రోజుల అధికారంతోనే రేవంత్‌రెడ్డికి గర్వం వచ్చిందన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చలేని ఆయన, బీజేపీ గాడిద గుడ్డు ఇచ్చిందని మాట్లాడుతున్నారని విమర్శించారు. ఓటుకు కోట్లు కేసులో నిందితుడిగా ఉన్న రేవంత్‌రెడ్డికి ప్రధాని మోదీని విమర్శించే హక్కు లేదన్నారు. దేశంలో అడుగడుగునా రిజర్వేషన్ల అమలును అడ్డుకున్నది కాంగ్రెస్ ప్రభుత్వాలే అనే విషయం రేవంత్‌రెడ్డి తెలుసుకోవాలన్నారు. మండల్ కమిషన్ రిపోర్టును వ్యతిరేకించిన వ్యక్తి రాజీవ్‌గాంధీ అని.. కులరహిత దేశం కావాలని, కుల రిజర్వేషన్‌లు వద్దని ఆయన అన్నారని గుర్తు చేశారు. ముస్లింల ఓట్ల కోసం గతంలో కేసీఆర్, ఇప్పుడు రేవంత్‌రెడ్డి పోటీ పడుతున్నారన్నారు.

మోదీకేం తెలుసు మంగళసూత్రం విలువ

దానం నాగేందర్ వివాదాస్పద వ్యాఖ్యలు



బంజారాహిల్స్: సికింద్రాబాద్ లోక్‌సభ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి, ఎమ్మెల్యే దానం నాగేందర్ ప్రధాని నరేంద్రమోదీపై వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. శుక్రవారం బంజారాహిల్స్‌లోని లేక్‌వ్యూ బంజారా ఫంక్షన్ హాల్‌లో ఖైరతాబాద్ నియోజకవర్గం బూత్ స్థాయి ముఖ్య నేతలు, కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నాగేందర్ మాట్లా డుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఆడపిల్లల పుస్తెల తాళ్లు కూడా ఉండవని విమర్శిస్తున్నారు కానీ, మోదీకి ఏం తెలుసు వాటి విలువ అని ప్రశ్నించారు. ఆయనకు భార్య లేదని ఆమె ఉంటే వాటి విలువ తెలిసేదని వ్యాఖ్యానించారు. ''ప్రతి విజయవంతమైన పురుషుడి వెనుక ఓ స్త్రీ ఉంటుందనే నానుడి ఉంది. కానీ ప్రధాని మోదీ వెనుక ఆమె లేదు.. అందువల్ల మంగళసూత్రాల విలువ ఆయనకు తెలియదు'' అని విమర్శించారు. దేశంలో 400 సీట్లు బీజేపీకి కావాలని అంటున్నారని, నిజంగా అన్ని సీట్లు వస్తే చైనా, రష్యాల్లో మాదిరిగా అధ్యక్ష పాలన పెట్టి వచ్చే 20 ఏళ్ళ పాటు వాళ్ళే ఉంటారన్నారు. కాగా, మోదీపై దానం చేసిన వ్యాఖ్యలు సోషల్ మీడియాలో బాగా వైరల్ అయ్యాయి.

దేశ సంపద ప్రజలకే చెందాలని రాహుల్‌గాంధీ పోరాటం

- ఒడిశాలో బాక్సైట్ తవ్వకాలను సైనికుడిలా అడ్డుకున్నారు
- రాయగఢ్ ఎంపీ ఎన్నికల ప్రచారంలో డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క




సాక్షి, హైదరాబాద్: ప్రధాని మోదీ దేశ సంపదను అంబానీ, అదానీ, క్రోనీ క్యాపిటల్‌కు పంచిపెట్టడాన్ని ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారని, సంపద ఈ దేశ ప్రజలకే చెందాలని రాహుల్‌గాంధీ భారత్ జోడోయాత్ర చేపట్టారని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. ఒడిశా రాష్ట్రంలో బాక్సైట్ తవ్వకాలకు వేదాంత కంపెనీ సిద్ధం కాగా, ఢిల్లీ నుంచి రాహుల్‌గాంధీ వచ్చి ఓ సైనికుడిలా ఆ తవ్వకాలను అడ్డుకున్నారన్నారు. శుక్రవారం ఒడిశా రాష్ట్రంలోని రాయగఢ్ లోక్‌సభ పరిధిలో ఏర్పాటు చేసిన ఎన్నికల సభలో భట్టి పాల్గొని ప్రసంగించారు. కరువు ప్రాంతమైన ఒడిశా రాష్ట్రానికి గాంధీల కుటుంబం ఆది నుంచి అధిక ప్రాధాన్యం ఇస్తుందన్నారు. ఇక్కడ కరువు ఏర్పడినప్పుడు ప్రధాని నెహ్రూ పర్యటించి నిధులు మంజూరు చేశారని గుర్తు చేశారు.

పీఎస్ సప్తగిరి ఎంపీగా గెలిపించాలి

ఇక్కడి వనరుల దోపిడీని అడ్డుకునేందుకు ఉన్నత విద్యావంతుడు, అమెరికా నుంచి వచ్చిన పీఎస్ సప్తగిరిని ఎంపీగా గెలిపించాలని కోరారు. బీజేపీ అధికారంలోకి వస్తే ఇందిరాగాంధీ తెచ్చిన రిజర్వేషన్లు రద్దు అవుతాయని, ఒడిశాలో 70 శాతం జనాభా బీసీ, ఎస్సీ ఎస్టీలు ఉన్నారని, రిజర్వేషన్లు కాపాడుకునేందుకు కాంగ్రెస్‌కు మద్దతు ఇవ్వాలని కోరారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ప్రతి మహిళకు నెలకు రూ.2వేలు, ఎస్సీ, ఎస్టీ మహిళలకు మరో వెయ్యి రూపాయలు జోడించి రూ.3వేల ఆర్థిక సాయం అందిస్తామన్నారు. ఈ సభలో ఏఐసీసీ నాయకులు భక్త చరణ్‌దాస్, ఆర్‌సీ కుంతియా, మీనాక్షి నటరాజన్ పాల్గొన్నారు.

పార్లమెంట్ ఎన్నికల తర్వాత బీఆర్ఎస్ నాలుగు ముక్కలు

46 జీఓపై కమిటీ వేసి రద్దు చేస్తాం: మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి



తన ఆస్తులను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి పేరుపై బదిలీ చేసిన డాక్యుమెంట్స్‌ను మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి అందజేస్తున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి తీన్మార్ మల్లన్న

నల్లగొండ: పార్లమెంట్ ఎన్నికల తర్వాత బీఆర్ఎస్ పార్టీ నాలుగు ముక్కలవుతుందని.. అధికారంలో ఉన్నప్పుడు కేసీఆర్ ప్రజల సొమ్మును దోచుకోవడంతో కూతురు జైలుకెళ్లిందని, వారు కూడా జైలుకు వెళ్లకతప్పదని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా తీన్మార్ మల్లన్న నామినేషన్ వేసిన సందర్భంగా శుక్రవారం నల్లగొండలో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో కోమటిరెడ్డి మాట్లాడారు. తీన్మార్ మల్లన్న కేసీఆర్ దోపిడీపై పోరాటం చేశాడని, ఆయన్ను ఎమ్మెల్సీ ఎన్నికల్లో అధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. జీఓ 46తో నిరుద్యోగులకు అన్యాయం జరుగుతుందని, ఎమ్మెల్సీ ఎన్నికల తర్వాత దానిపై అసెంబ్లీ సమావేశాల్లో కమిటీ వేసి రద్దు చేస్తామని చెప్పారు.

ప్రభుత్వానికి ఆస్తులు అప్పగించిన తీన్మార్ మల్లన్న

నల్లగొండ-ఖమ్మం-వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి చింతపండు నవీన్ (తీన్మార్ మల్లన్న) తన కుటుంబం పేరు మీద ఉన్న ఆస్తులను ప్రభుత్వానికి అప్పగిస్తున్నట్టు ప్రకటించారు. కాంగ్రెస్ కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతూ.. తన కుటుంబం పేర ఇప్పటివరకు రూ.కోటీ 50 లక్షల ఆస్తులు ఉన్నాయని చెప్పారు. తన భార్య ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్నదని, ఆమె ఒప్పుకున్నాకే ఆమె పేరు మీద ఉన్న కోటిన్నర ఆస్తిని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి పేరున రాసి ఇస్తున్నట్టు ప్రకటించారు. రాజకీయాల్లో పారదర్శకత, జవాబుదారీతనం ఉండాలన్న ఉద్దేశంతో ఆస్తులను అప్పగించినట్టు చెప్పారు. తనకు ఒక్క అవకాశం ఇస్తే.. రాజకీయాల్లో సంచలన మార్పులు తీసుకొస్తానని ఆయన చెప్పారు. అంతకుముందు ఆయన నల్లగొండ పట్టణంలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డితో పాటు పలువురు ఎమ్మెల్యేలతో కలిసి ర్యాలీలో పాల్గొన్నారు.

తీన్మార్ మల్లన్నపై 56 కేసులు

రాష్ట్రంలోని వివిధ పోలీస్‌స్టేషన్లలో తనపై 56 కేసులు ఉన్నాయని తన ఎన్నికల అఫిడవిట్‌లో తీన్మార్ మల్లన్న పేర్కొన్నారు. తన పేరుతో రూ.16.34 లక్షల విలువైన బంగారం, ఆస్తులు, నగదు ఉండగా, తన భార్య పేరుతో రూ.17.66 లక్షల విలువైన బంగారం, ఆస్తులు, నగదు ఉన్నట్లు అందులో పేర్కొన్నారు. మార్కెట్ విలువ ప్రకారం రూ.3 లక్షల విలువైన వ్యవసాయ భూమి, రూ.50 లక్షల విలువలైన వ్యవసాయేతర భూమి, రూ.50 లక్షల విలువైన నివాస గృహం ఉన్నట్లు తెలిపారు. రూ.31.29 లక్షల అప్పులు ఉన్నట్టు వివరించారు.

కాంగ్రెస్.. దద్దమ్మ ప్రభుత్వం

అసెంబ్లీ ఎన్నికలప్పుడు తప్పుడు హామీలతో వెన్నుపోటు

- మళ్లీ ఇప్పుడు లోక్‌సభ ఎన్నికలకు అసంబద్ధ హామీలా?
- కేంద్ర పథకాలపై దమ్ముంటే సీఎం రేవంత్‌రెడ్డి చర్చకు రావాలి
- కేంద్రం చేస్తున్నవి కూడా కాంగ్రెస్ చేస్తున్నట్టు చూపి లబ్ధి పొందే కుట్ర
- సిగ్గులేకుండా ట్రిపుల్ ఆర్‌ను తన ఖాతాలో వేసుకున్నారు
- రైల్వేల గురించి మాట్లాడే హక్కు కాంగ్రెస్ నేతలకు లేదు
- కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: అసెంబ్లీ ఎన్నికల మేనిఫెస్టోలో లెక్కలేనన్ని హామీలిచ్చి వెన్నుపోటు పొడిచిన కాంగ్రెస్ పార్టీ ఇప్పుడు మళ్లీ అసంబద్ధ వాగ్దానాలతో లోక్‌సభ ఎన్నికలకు మేనిఫెస్టో విడుదల చేసిందని కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి. కిషన్‌రెడ్డి మండిపడ్డారు. హైదరాబాద్‌లో శుక్రవారం కిషన్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ మేనిఫెస్టోలో కాంగ్రెస్ కల్లబొల్లి హామీలతో ప్రజలను మళ్లీ మోసం చేసేందుకు ప్రయత్నిస్తోందని ధ్వజమెత్తారు. వంద రోజుల్లో గ్యారంటీలు అమలు చేయలేని దద్దమ్మ ప్రభుత్వానికి.. ప్రజలను వెన్నుపోటు పొడిచిన కాంగ్రెస్ పార్టీకి ఈ లోక్‌సభ ఎన్నికల్లో ఓట్లడిగే నైతిక హక్కు లేదన్నారు. ఉచిత విద్యుత్ ఎక్కడా అమలు జరగడం లేదనీ, అందరికీ కరెంట్ బిల్లులు వస్తున్నాయని ఆరోపించారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఇప్పటికే ప్రజల్లో తిరిగే పరిస్థితి లేదన్న కిషన్‌రెడ్డి.. ఊళ్లలో ఓట్ల కోసం వచ్చే కాంగ్రెస్ నాయకులను హామీల అమలు ఏమైందంటూ ప్రజలు నిలదీయాలని పిలుపునిచ్చారు. కేంద్రం అమలు చేస్తున్న పథకాలపై మాట్లాడేందుకు దమ్ముంటే సీఎం రేవంత్ రెడ్డి చర్చకు రావాలని సవాల్ చేశారు. అలాగే రైల్వేల కోసం యూపీఏ హయాంలో ఎన్ని నిధులు ఇచ్చారో.. మోదీ వచ్చాక ఎన్ని నిధులు వచ్చాయో చర్చకు రావాలని రేవంత్‌రెడ్డిని కిషన్‌రెడ్డి డిమాండ్ చేశారు.

చేతి గుర్తు బదులు గాడిద గుడ్డు పెట్టుకున్నారేమో?

కాంగ్రెస్ పార్టీ లోక్‌సభ ఎన్నికల మేనిఫెస్టోలో ఎలాంటి పసలేదని విమర్శించిన కిషన్‌రెడ్డి ఎన్నికలకు ముందే కాంగ్రెస్ కాడి కింద పడేసి చేతులు ఎత్తేసిందని ఎద్దేవా చేశారు. ''గ్యారంటీల పేరుతో గాడిద గుడ్డు ఇచ్చారు. తమ ఎన్నికల చిహ్నం చేతి గుర్తు మార్చుకొని గాడిద గుడ్డు గుర్తు పెట్టుకున్నారేమోనని రాష్ట్ర ప్రజలు అనుకుంటున్నారు' అని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ నాయకులు రీజినల్ రింగ్ రోడ్డు నిర్మాణాన్ని సిగ్గు లేకుండా తమ ఖాతాలో వేసుకుంటున్నారని ధ్వజమెత్తిన కిషన్‌రెడ్డి.. దానికి కర్త కర్మ క్రియ బీజేపీనే అని స్పష్టం చేశారు. ప్రజావాణి దరఖాస్తులు ఎన్ని పరిష్కరించారని నిలదీశారు. ప్రజావాణిలో కనీసం సీఎం ఒక్క రోజు కూడా పాల్గొనలేదని గుర్తు చేశారు.

రాష్ట్రంలో ఏం మార్పు వచ్చింది?

తెలంగాణలో ఏ మార్పు మొదలైందని హైదరాబాద్‌లో బోర్డులు పెడుతున్నారని కిషన్‌రెడ్డి నిలదీశారు. కేసీఆర్ కుటుంబ పాలన పోయి సోనియా కుటుంబ పాలన వచ్చిందని ఆరోపించారు. '28,942 ఉద్యోగాలు భర్తీ చేసినట్లు కాంగ్రెస్ తప్పుడు ప్రచారం చేస్తోందన్నారు. గత ప్రభుత్వంలో పెండింగ్‌లో ఉంచిన నియామకాలకు సంబంధించి అపాయింట్‌మెంట్ లెటర్స్ ఇచ్చి కాంగ్రెస్ ఖాతాలో వేసుకుంటున్నారని ఆరోపించారు.

అవన్నీ ఏమయ్యాయి?

తెలంగాణలో రేషన్ కార్డులు ఇస్తున్నారా? సింగరేణి కార్మికులకు కోటి బీమా కల్పించారా ? ఒక్క మహిళ సంఘానికైనా వడ్డీ లేని రుణం ఇచ్చారా'అని కిషన్‌రెడ్డి నిలదీశారు. ఇప్పటికీ ఒక్క తెల్లరేషన్ ఇవ్వకపోగా ఇచ్చినట్లు హోర్డింగులతో అడ్వర్టైజ్‌మెంట్లతో ప్రచారం చేసుకుంటున్నారని మండిపడ్డారు. వంద రోజుల్లో 5 గ్యారంటీలు అమలు చేశామంటూ, దావోస్ నుంచి రూ.40 ,232 కోట్ల పెట్టుబడులు తీసుకొచ్చామంటూ, హోంగార్డులు, జర్నలిస్టులకు రూ. 5 లక్షల బీమా కల్పించినట్లు మెట్రో పిల్లర్లపై హోర్డింగులతో అబద్ధపు ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. అప్పుడు కేసీఆర్ హామీలిచ్చి మసిపూసి మారేడుకాయ చేసేవారు.. ఇప్పుడు రేవంత్ రెడ్డి అయిదు నెలల్లోనే కాంగ్రెస్ అవినీతి మార్కును చూపించారని ధ్వజమెత్తారు. ఎన్నికలకు ముందే బీఆర్ఎస్ చేతులెత్తేసిందని ఎద్దేవా చేశారు.

బీజేపీలో ఐటీ కంపెనీల యజమానులు చేరిక

శుక్రవారం పార్టీ కార్యాలయంలో ఐటీ కంపెనీ యజమాని ఊరంగంటి వెంకటేష్ యాదవ్ ఆధ్వర్యంలో పలువురు ఐటీ కంపెనీల యజమానులు, ఉద్యోగులు, వరంగల్ జిల్లాకు చెందిన దగ్గు విజేందర్‌రావు ఆధ్వర్యంలో పలువురు బీజేపీలో చేరారు. వారికి కండువా కప్పి కిషన్‌రెడ్డి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో బీఆర్ఎస్ నేతలు ఉన్నారు.

ఇద్దరు లాలు ప్రసాద్‌లు... అయితే ఏంటి?

- పోటీ చేయొద్దని చెప్పలేం
- సుప్రీంకోర్టు స్పష్టీకరణ



ఈవీఎంపై ఇద్దరు రాహుల్ గాంధీలు కనిపిస్తే? ఎవరికి ఓటేయాలి? ఇది ఎంతో కొంతమంది ఓటర్లను అయోమయానికి గురి చేసే అంశమే. కీలక అభ్యర్థుల పేర్లను పోలిన వారిని ప్రత్యర్థి పార్టీలు బరిలో దించి ఓట్లను చీల్చడం పరిపాటే. కొన్నిసార్లు అభ్యర్థుల గెలుపోటములనే ప్రభావితం చేసే ఈ పోకడకు చెక్ పెట్టాలంటూ 'సాబు స్టీఫెన్' అనే వ్యక్తి ఏకంగా సుప్రీంకోర్టులోనే పిల్ వేశారు! అదే పేరుతో మరొకరు పోటీలో ఉండడం వల్ల వెంట్రుకవాసి తేడాతో ఓటమి పాలైన ఉదంతాలను ఉదహరించారు. ''2004 లోక్‌సభ ఎన్నికల్లో కేరళలో అలప్పుజ స్థానంలో కాంగ్రెస్ తరఫున పోటీ చేసిన వీఎం సుధీరన్ కేవలం 1,009 ఓట్ల తేడాతో ఓటమి పాలయ్యారు. అక్కడ వీఎస్ సుధీరన్ అనే ఇండిపెండెంట్‌కు ఏకంగా 8,282 ఓట్లు పోలయ్యాయి. ప్రత్యర్థి పార్టీలు డబ్బు, తదితరాలు ఎరగా చూపి ఇలాంటి నకిలీలను ప్రోత్సహిస్తున్నాయి. ఈ చర్యలు ప్రజాప్రాతినిధ్య చట్ట నిబంధనలకు వ్యతిరేకం'' అని వాదించారు. ''ప్రముఖ అభ్యర్థుల పేరును పోలిన వారు బరిలో ఉంటే వారి నేపథ్యాన్ని కూలంకషంగా విచారించాల్సిందిగా ఎన్నికల సంఘాన్ని ఆదేశించండి. నకిలీలని తేలితే పోటీ నుంచి నిషేధించేలా చూడండి'' అని కోరారు. కానీ, ఈ పిల్‌ను సుప్రీంకోర్టు శుక్రవారం తోసిపుచ్చింది. ఒకే తరహా పేర్లున్నంత మాత్రాన ఎన్నికల్లో పోటీ చేయకుండా అడ్డుకోవడం సరికాదని న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్ సారథ్యంలోని ధర్మాసనం అభిప్రాయపడింది. ''రాహుల్ గాంధీ, లాలు ప్రసాద్ యాదవ్ వంటి ప్రముఖుల పేర్లున్న వారిని పోటీ చేయొద్దందామా? తల్లిదండ్రులు ఆ పేర్లు పెట్టిన కారణంగా ఎన్నికల్లో పోటీకి దూరంగా ఉంచగలమా? పిల్లలకు ఏ పేరు పెట్టుకోవాలనేది తల్లిదండ్రుల హక్కు'' అని పేర్కొంటూ పిల్‌ను కొట్టేసింది! - న్యూఢిల్లీ

దేశానికి ఆయువుపట్టయిన ఢిల్లీని కొల్లగొట్టిన వారే ఎర్రకోటలో జెండా ఎగరేయడం ఆనవాయితీగా వస్తోంది. గతంలో కాంగ్రెస్ నేతృత్వంలోని యూపీఏ, ఆపై బీజేపీ సారథ్యంలోని ఎన్డీఏ ఢిల్లీని క్లీన్‌స్వీప్ చేసి కేంద్రంలో అధికారం చేపట్టాయి. గత రెండు ఎన్నికల్లో రాజధానిలోని మొత్తం 7 ఎంపీ సీట్లనూ కైవసం చేసుకున్న బీజేపీ ఈసారి హ్యాట్రిక్ కోసం ప్రయత్నిస్తోంది. ఎంపీలపై వ్యతిరేకతను అధిగమించేందుకు ఏకంగా ఆరుగురు సిట్టింగులను పక్కన పెట్టేసింది! ఇక కాంగ్రెస్‌తో పొత్తు పెట్టుకొన్న ఆప్.. ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ అరెస్టు తాలూకు సానుభూతిని అనుకూలంగా మార్చుకోవాలని యోచిస్తోంది. కేజ్రీవాల్ భార్య సునీత పార్టీ ప్రచార బాధ్యతలను తన భుజానికెత్తుకున్నారు. - సాక్షి, న్యూఢిల్లీ


ఢిల్లీ గల్లీలు... ఎవరివో!

స్టేట్ స్కాన్

లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికల్లో పూర్తిగా భిన్నమైన తీర్పు ఇవ్వడం ఢిల్లీ ఓటర్లకు కొన్నేళ్లుగా ఆనవాయితీగా వస్తోంది. దశాబ్దాలుగా ఢిల్లీ రాజకీయాలను శాసించిన కాంగ్రెస్‌పై 90వ దశకం నుంచి క్రమంగా బీజేపీ ఆధిపత్యం మొదలైంది. ఆ తర్వాత నుండి హస్తినలో అధికారం ఆ రెండు పార్టీల మధ్యే మారుతూ వచ్చింది. 2009లో ఢిల్లీలోని మొత్తం ఏడు లోక్‌సభ స్థానాలనూ కాంగ్రెస్ క్లీన్‌స్వీప్ చేయగా 2014, 2019ల్లో అదే ఫీట్‌ను బీజేపీ చేసి చూపించింది. అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీపై 'చీపురు' తిరగేసిన ఆప్ లోక్‌సభకు వచ్చేసరికి ఒక్క స్థానమూ దక్కించుకోలేక పోయింది. ఓట్లపరంగా కూడా బీజేపీ ఆ రెండు పార్టీలకు అందనంత ఎత్తులో నిలిచింది. కమలం గుర్తుకు 56.86 శాతం ఓట్లు రాగా హస్తానికి 22.51 శాతం, ఆప్‌కు గుర్తుకు 14.79 శాతం పోలయ్యాయి. కాకపోతే అసెంబ్లీ ఎన్నికల్లో మాత్రం బీజేపీకి ఆప్ చేతిలో వరుసగా భంగపాటు తప్పడం లేదు.

కేజ్రీవాల్ అరెస్టు కలిసొచ్చేనా?

నయా రాజకీయాలతో సంచలనం అరవింద్ కేజ్రీవాల్ 2012లో పెట్టిన ఆమ్ ఆద్మీ పార్టీ నానాటికీ బలపడుతూ వచ్చింది. 2013 ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో ఆప్.. 70 సీట్లకు 28 స్థానాలు సాధించింది. బీజేపీకి 32 సీట్లు రావడంతో హంగ్ ఏర్పడింది. ప్రభుత్వ ఏర్పాటుకు బీజేపీ ముందుకు రాకపోవడంతో 8 సీట్లొచ్చిన కాంగ్రెస్ మద్దతుతో కేజ్రీవాల్ తొలిసారి సీఎం అయ్యారు. కానీ 49 రోజులకే రాజీనామా చేశారు. 2014 లోక్‌సభ ఎన్నికల్లో ఆప్‌కు ఒక్క సీటూ రాలేదు. కానీ 2015 అసెంబ్లీ ఎన్నికల్లో ఏకంగా 67 సీట్లతో సంచలనం సృష్టించింది. కేజ్రీవాల్ రెండోసారి సీఎం అయ్యారు. మళ్లీ 2019 లోక్‌సభ ఎన్నికల్లో చేతులెత్తేసినా 2020 అసెంబ్లీ ఎన్నికల్లో మాత్రం 62 సీట్లతో ముచ్చటగా మూడోసారి సీఎం అయ్యారు. ఈ లోక్‌సభ ఎన్నికల్లో విపక్ష ఇండియా కూటమి తరఫున సుడిగాలి ప్రచారానికి సన్నద్ధమైన కేజ్రీవాల్ ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో అరెస్టై జైలు పాలయ్యారు. ఇది ఆప్‌కు కలిసొస్తుందా, ప్రతికూలంగా మారుతుందా అన్నది ఆసక్తికరం. అయితే లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ప్రచారం నిమిత్తం కేజ్రీవాల్‌కు మధ్యంతర బెయిల్ మంజూరు చేసే అంశాన్ని పరిశీలిస్తామని సుప్రీంకోర్టు శుక్రవారం పేర్కొనడం ఆప్‌కు ఊరటనిచ్చే పరిణామమే. దీనిపై మే 7న కోర్టు వెలువరించబోయే నిర్ణయం కోసం పార్టీ ఉత్కంఠగా ఎదురు చూస్తోంది.



బీజేపీ 'హ్యాట్రిక్' గురి...

ఢిల్లీలో హ్యాట్రిక్ క్లీన్‌స్వీప్ కోసం బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మనోజ్ తివారీ తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ భోజ్‌పురి సూపర్ స్టార్ 2014లో ఇక్కడి నుంచే బీజేపీ తరఫున లోక్‌సభ ఎన్నికల్లో అరంగేట్రం చేశారు. తర్వాత ఢిల్లీ బీజేపీ పగ్గాలు చేపట్టి 7 సీట్లనూ క్లీన్‌స్వీప్ చేయడంలో కీలక పాత్ర పోషించారు. ఈసారి తివారీ తప్ప మిగతా ఆరుగురు సిట్టింగులనూ బీజేపీ మార్చేయడం విశేషం! ఢిల్లీ మద్యం కుంభకోణాన్ని బీజేపీ ప్రధాన ప్రచారాంశంగా జనంలోకి తీసుకెళ్తోంది. మోదీ ఫ్యాక్టర్‌తో పాటు సీఏఏ, అయోధ్య రామ మందిరం, ఆర్టికల్ 370 రద్దు తదితరాలను నమ్ముకుంది. పూర్వాంచలీలు, ముస్లింల ఆధిపత్యముండే ఈశాన్య ఢిల్లీ స్థానంలో బిహార్‌కు చెందిన ఇద్దరు అభ్యర్థుల మధ్య కీలక పోరు జరగనుంది. హ్యాట్రిక్‌తో మూడోసారి లోక్‌సభలో అడుగుపెట్టాలనుకుంటున్న మనోజ్ తివారీ ఒకవైపు, కాంగ్రెస్ నుంచి కన్హయ్య కుమార్ మరోవైపు బరిలో ఉన్నారు. అభ్యర్థుల ఎంపికలో బీజేపీ సామాజిక సమతూకం పాటించింది. తూర్పు ఢిల్లీ నుంచి పంజాబీ అయిన హరీశ్ మల్హోత్రా, చాందినీ చౌక్ నుంచి బనియా నాయకుడు ప్రవీణ్ ఖండేల్వాల్, దక్షిణ ఢిల్లీ నుంచి గుజ్జర్ నాయకుడు రాంవీర్ సింగ్ బిధూరి, పశ్చిమ ఢిల్లీ నుంచి జాట్ నాయకుడు కమల్జీత్ సెహ్రావత్, ఎస్సీ రిజర్వ్‌డ్ వాయవ్య ఢిల్లీ నుంచి దళిత నాయకుడు యోగేంద్ర చందోలియాలను బరిలో నిలిపింది. కమల్‌జీత్‌తో పాటు న్యూఢిల్లీ నుంచి దివంగత సుష్మా స్వరాజ్ కుమార్తె బాసురీ స్వరాజ్ రూపంలో ఇద్దరు మహిళలకూ అవకాశం ఇచ్చింది.

సునీతా కేజ్రీవాల్ ప్రచారం...

ఢిల్లీలో ఇండియా కూటమి భాగస్వాములుగా ఆప్ 4 స్థానాల్లో, కాంగ్రెస్ 3 చోట్ల బరిలో దిగుతున్నాయి. రాజధానిలో బీజేపీకి ఎలాగైనా ముకుతాడు వేయాలని చూస్తున్నాయి. 'ఢిల్లీ మోడల్'ను కేజ్రీవాల్ ప్రధానంగా ప్రచారం చేశారు. ఆయన జైలుపాలైన నేపథ్యంలో ఆప్ ప్రచార భారాన్ని భార్య సునీతా కేజ్రీవాల్ భుజానికెత్తుకున్నారు. ఆమె సభలకు మంచి స్పందన కూడా లభిస్తోంది. ధరల పెరుగుదల, నిరుద్యోగం, కార్పొరేట్లతో మోదీ కుమ్మక్కు వంటి అంశాలను ఆప్, కాంగ్రెస్ గట్టిగా ప్రజల్లోకి తీసుకెళ్తున్నాయి. పౌరసత్వ సవరణ చట్టం (సీఏఏ)పైనా విమర్శలు గుప్పిస్తున్నాయి. కేజ్రీవాల్ అరెస్టు నేపథ్యంలో, విపక్షాలపై దర్యాప్తు సంస్థలను మోదీ సర్కారు ఉసిగొల్పుతోందన్న అంశాన్ని ప్రధానంగా ప్రస్తావిస్తున్నాయి.



పోలింగ్ తేదీ: మే 25

సర్వేలేమంటున్నాయి...

ఢిల్లీలో ఈసారి కూడా బీజేపీ మొత్తం 7 లోక్‌సభ సీట్లనూ క్లీన్‌స్వీప్ చేస్తుందని పలు సర్వేలు అంటున్నాయి. అయితే కేజ్రీవాల్ అరెస్టు తాలూకు సానుభూతి ఆప్‌కు కలిసొస్తే ఆ పార్టీకి ఒకట్రెండు స్థానాలు దక్కే అవకాశం లేకపోలేదని చెబుతున్నారు.

పోలింగ్ బూత్ గుర్తింపు... మొబైల్ నంబర్‌తో



పోలింగ్ బూత్ ఎక్కడో తెలియడం లేదా? మన ఓటు ఏ పోలింగ్ బూత్‌లో ఉందో మొబైల్ నంబర్ సాయంతో చాలా ఈజీగా తెలుసుకోవచ్చు. తెలుగు రాష్ట్రాల్లో ఈ నెల 13న లోక్‌సభకు పోలింగ్ జరగనుండటం తెలిసిందే. ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీకి కూడా అదే రోజు ఎన్నికలు జరగనున్నాయి. ఓటు ఎక్కడుందో తెలుసుకోవడానికి ఓటర్ ఐడీ కార్డు సాయంతో సులువుగా తెలుసుకోవచ్చు. ఓటరు ఐడీలో ఇంగ్లిష్ అక్షరాలు, 10 అంకెలతో కూడిన ఎపిక్ ఐడీ పోలింగ్ బూత్‌ను గుర్తించడానికి కీలకమవుతుంది. ఏ కారణంతోనైనా కార్డు అందుబాటులో లేని వారు ఆన్‌లైన్‌లోనే ఎపిక్ నంబర్ గురించి తెలుసుకోవచ్చు.

ఇలా చేస్తే సరి

ఎపిక్ నంబర్ కోసం ఈసీ పోర్టల్ (voters. eci.gov.in)ను సందర్శించాలి. అందులో కుడివైపు కనిపించే సర్వీసెస్ విభాగంలో 'ఈ-ఎపిక్ డౌన్‌లోడ్' ఆప్షన్ ఎంపిక చేసుకోవాలి. తర్వాత వచ్చే పేజీలో సైనప్‌ను ఎంపిక చేసుకోవాలి. మొబైల్ నంబర్, ఈ మెయిల్ అడ్రస్ ఇచ్చి క్యాప్చా ఎంటర్ చేసి, కంటిన్యూ చేయాలి. తర్వాత పేరు నమోదు చేసి, పాస్‌వర్డ్ ఎంపిక చేసుకోవాలి. మొబైల్‌కు వచ్చే ఓటీపీని ఎంపిక చేస్తే అకౌంట్ క్రియేట్ అవుతుంది. అప్పటికే ఖాతా ఉన్న వారు సైనప్ చేయనవసరం లేదు. మొబైల్ నంబర్ లేదా ఈమెయిల్ ఐడీ, పాస్‌వర్డ్‌తో ఖాతాలోకి లాగిన్ అవడం ద్వారా ఈ-ఎపిక్ డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. అలా ఎపిక్ నంబర్ తెలిసిపోతుంది. తర్వాత సైట్ హోం పేజీలో కుడివైపున ఉన్న 'సెర్చ్ ఇన్ ఎలక్టోరల్ రోల్' ఎంపిక చేసుకోవాలి. వచ్చే ప్రత్యేక పేజీలో ఎపిక్ నంబర్ నమోదు చేయాలి. రాష్ట్రం ఎంపిక చేసుకుని క్యాప్చా కోడ్ నమోదు చేసి సెర్చ్ బటన్ ఓకే చేయాలి. మీ పోలింగ్ బూత్‌తో పాటు పోలింగ్ స్టేషన్ ఆఫీసర్ తదితర వివరాలు కూడా లభిస్తాయి. ఇదే పోర్టల్ నుంచి ఫిర్యాదులు సైతం దాఖలు చేయవచ్చు. ఎపిక్ నంబర్ ఉన్న వారు నేరుగా సెర్చ్ ఇన్ ఎలక్టోరల్ రోల్ ఆప్షన్‌కు వెళ్లవచ్చు. - సాక్షి, నేషనల్ డెస్క్

కీలకమైన ఉత్తరప్రదేశ్‌లో లోక్‌సభ ఎన్నికల పోరు పశ్చిమ యూపీ నుంచి యాదవ భూమికి చేరింది. బ్రజ్, రోహిఖండ్ ప్రాంతాల్లోని 10 లోక్‌సభ స్థానాలకు 7న మూడో విడతలో పోలింగ్ జరగనుంది. యాదవులు, ముస్లింలు ఒక్కటైతే అక్కడ వారి తీర్పే ఫైనల్. వారి ఓట్లపైనే ఆశలు పెట్టుకున్న సమాజ్‌వాదీ పార్టీకి మూడో విడత అగ్నిపరీక్ష కానుంది. యూపీలో తొలి రెండు విడతల్లో జాట్ బెల్ట్‌గా భావించే పశ్చిమ యూపీలోని 16 స్థానాలకు పోలింగ్ ముగియడం తెలిసిందే... - సాక్షి, నేషనల్ డెస్క్

యాదవ భూమిలో ఎస్పీకి అగ్నిపరీక్ష

యూపీలో మూడో దశలో 10 చోట్ల పోలింగ్

యాదవులు, ముస్లింల ప్రాబల్య ప్రాంతాలే

సంభల్



• జియావుర్ రెహమాన్

యాదవ ఆధిపత్య స్థానమిది. దివంగత ఎస్పీ దిగ్గజం ములాయం సింగ్ యాదవ్ 1998, 1999ల్లో ఇక్కడి నుంచే లోక్‌సభకు వెళ్లారు. 2004లోనూ ఎస్పీ నేత రామ్‌గోపాల్ యాదవ్ గెలిచారు. 2014లో మాత్రం బీజేపీ నేత సత్యపాల్ సింగ్ సైని గెలిచారు. 2019లో ఎస్పీ నేత షఫీకుర్ రెహమాన్ బార్క్ భారీ విజయం సాధించారు. ఆయన అనారోగ్యంతో కన్నుమూయడంతో ఈసారి మనవడు, సిట్టింగ్ ఎమ్మెల్యే జియావుర్ రెహమాన్‌కు ఎస్పీ టికెటిచ్చింది. బీజేపీ మళ్లీ ఓబీసీ సామాజిక వర్గానికి చెందిన పరమేశ్వర్ లాల్ సైనీనే రంగంలోకి దింపింది. బీఎస్పీ నుంచి షౌలత్ అలీ పోటీ చేస్తున్నారు.

ఫతేపూర్ సిక్రీ



• రాజ్‌కుమార్ చాహర్

2009లో ఈ స్థానాన్ని బీఎస్పీ సొంతం చేసుకుంది. గత రెండు ఎన్నికల నుంచి మాత్రం బీజేపీదే విజయం. 2019లో ఆ పార్టీ అభ్యర్థి రాజ్‌కుమార్ చాహర్ ఘన విజయం సాధించారు. కాంగ్రెస్ అభ్యర్థి రాజ్ బబ్బర్‌కు 1.72 లక్షల ఓట్లు పోలైతే, చాహర్ ఏకంగా 6.67 లక్షల ఓట్లు సొంతం చేసుకున్నారు! దాంతో ఈ విడత కూడా చాహర్‌కే బీజేపీ టికెటిచ్చింది. కాంగ్రెస్ నుంచి రామ్‌నాథ్ సికర్‌వార్, బీఎస్పీ నుంచి రామ్‌నివాస్ శర్మ పోటీలో ఉన్నారు. ఎస్పీ మాజీ నేత భగవాన్ శర్మ (గుడ్డూ పండిట్) స్వతంత్ర అభ్యర్థిగా పోటీలో ఉండటం కాంగ్రెస్‌కు ప్రతికూలం కానుంది.

ఫిరోజాబాద్



• విశ్వదీప్ సింగ్

ఇదీ ఎస్పీ ఆధిపత్యమున్న స్థానమే. 2009లో ఎస్పీ అధినేత అఖిలేశ్ యాదవ్, 2014లో ఆయన సోదరుడు అక్షయ్ యాదవ్ విజయం సాధించారు. 2019లో మాత్రం ఫిరోజాబాద్ బీజేపీ పరమైంది. ఆ పార్టీ అభ్యర్థి డాక్టర్ చంద్రసేన్ జడాన్ 28 వేలకు పైగా ఓట్ల మెజారిటీతో ఎస్పీ అభ్యర్థి అక్షయ్ యాదవ్‌పై గెలిచారు. ఈసారి ఎస్పీ నుంచి మళ్లీ అక్షయ్ బరిలో ఉన్నారు. బీజేపీ మాత్రం సిట్టింగ్ ఎంపీని మార్చి విశ్వదీప్ సింగ్‌కు టికెటిచ్చింది.

హత్రస్



• అనూప్ ప్రధాన్

ఈ ఎస్సీ రిజర్వ్‌డ్ స్థానం 1991 నుంచీ బీజేపీ కంచుకోట. కాంగ్రెస్ అయితే 1971 తర్వాత ఇక్కడ ఎన్నడూ గెలవలేదు! ఇక ఎస్పీ, బీఎస్పీ ఈ స్థానంలో ఒక్కసారి కూడా గెలుపు ముఖమే చూడలేదు! 2009లో బీజేపీతో పొత్తు పెట్టుకున్న ఆరెల్డీ ఇక్కడ విజయం సాధించింది. 2019లో ఎస్పీ అభ్యర్థి రామ్‌జీ లాల్ సుమన్‌పై బీజేపీ అభ్యర్థి రాజ్‌వీర్ సింగ్ దిలార్ 2.6 లక్షల మెజారిటీతో ఘన విజయం సాధించారు. 66 ఏళ్ల దిలార్ ఏప్రిల్ 24న గుండెపోటుతో ఆకస్మికంగా మృతి చెందడంతో బీజేపీ టికెట్ అనూప్ ప్రధాన్‌కు లభించింది. ఎస్పీ తరఫున జస్వీర్ వాల్మీకి పోటీ చేస్తున్నారు.

బీజేపీ హవా కొనసాగేనా!?

మూడో విడతలో పోలింగ్ జరిగే 10 స్థానాల్లో ఎనిమిది 2019లో బీజేపీ గెలుచుకున్నవే. ఈసారి కాంగ్రెస్, ఎస్పీ కలిసి బరిలో దిగగా బీఎస్పీ ఒంటరి పోరు చేస్తోంది. ప్రభుత్వ వ్యతిరేక ఓట్లు వాటి మధ్య చీలితే బీజేపీ లాభపడనుంది. ఈ 10 లోక్‌సభ స్థానాల్లో ముస్లింలతో పాటు ఓబీసీలు, ముఖ్యంగా యాదవ్‌ల పాటు ఓట్లు ఎక్కువ. ఎటా, ఫిరోజాబాద్, మెయిన్‌పురి, బుదౌన్, సంభాల్ యాదవ ప్రాబల్య స్థానాలు. సంభాల్, ఆవ్లా, ఫతేపూర్ సిక్రీ, ఆగ్రా, ఫిరోజాబాద్‌ల్లో ముస్లిం ఓటర్లు 13 శాతమున్నారు. బరేలీలోనైతే ఏకంగా 33 శాతం దాకా ఉంటారు! ఇతర లోక్‌సభ స్థానాల్లో లోధ్, కచ్చి, శాక్య, మురావోల ప్రాబల్యమూ ఉంది.

ఎటా



• రాజ్‌వీర్‌సింగ్

ఆది నుంచీ బీజేపీని ఆదరిస్తున్న స్థానమిది. 1999, 2004 ఎన్నికల్లో మాత్రం ఎస్పీ నెగ్గింది. 2009 ఎన్నికల్లో యూపీ మాజీ సీఎం కల్యాణ్ సింగ్ ఇక్కడి నుంచి స్వతంత్ర అభ్యర్థిగా గెలవడం విశేషం! ఆయన కుమారుడు రాజ్‌వీర్‌సింగ్ 2014, 2019 ఎన్నికల్లో బీజేపీ నుంచి విజయం సొంతం చేసుకున్నారు. ఈసారీ ఆయనే బరిలో ఉన్నారు. ఎస్పీ తరఫున దవేశ్ శాక్య, బీఎస్పీ నుంచి మహమ్మద్ ఇర్ఫాన్ బరిలో ఉన్నారు.

బరేలీ



• ఛత్రపాల్ సింగ్

కేంద్ర మాజీ మంత్రి సంతోష్ గంగ్వార్ ఇక్కడి నుంచి ఎనిమిదిసార్లు బీజేపీ తరఫున గెలిచారు! ఒక్క 2009 మినహాయిస్తే 1989 నుంచి అన్ని ఎన్నికల్లో గంగ్వార్‌దే గెలుపు! ఈసారి మాత్రం బీజేపీ ఆయన్ను పక్కన పెట్టింది. అదే సామాజిక వర్గానికి చెందిన ఛత్రపాల్ సింగ్ గంగ్వార్‌కు టికెటిచ్చింది. ఎస్పీ నుంచి ప్రవీణ్ సింగ్ అరాన్ బరిలో ఉన్నారు. బీఎస్పీ అభ్యర్థి ఛోటేలాల్ గంగ్వార్ నామినేషన్ తిరస్కరణకు గురవడం ఆ పార్టీకి షాకిచ్చింది. దీంతో ఇక్కడ ద్విముఖ పోటీయే నెలకొంది.

బదాయూ



• ఆదిత్య యాదవ్

ఎస్పీకి కీలకమైన స్థానమిది. 1996 నుంచి 2014 దాకా ఆ పార్టీకి కంచుకోట. 2009, 2014ల్లో ఎస్పీ అభ్యర్థి ధర్మేంద్ర యాదవ్ నెగ్గారు. 2019లో బీజేపీ అభ్యర్థి సంఘమిత్ర మౌర్య ఆయనపై కేవలం 18 వేల మెజారిటీతో విజయం సాధించారు. ఈ విడత దుర్విజయ్ శాక్యను బీజేపీ పోటీలో దించింది. ఎస్పీ కూడా సీనియర్ నేత శివపాల్ యాదవ్ ఒత్తిడితో ఆయన కుమారుడు ఆదిత్యకు టికెటిచ్చింది. ధర్మేంద్ర యాదవ్‌ను పక్కన పెట్టడం దానికి ప్రతికూలంగా మారొచ్చంటున్నారు.

ఆవ్లా



• ధర్మేంద్ర కశ్యప్

1989 నుంచి బీజేపీ ఇక్కడ ఆరుసార్లు గెలిచింది. 2009 నుంచి ఆ పార్టీకే ఇక్కడి ఓటర్లు పట్టం కడుతున్నారు. గత రెండు ఎన్నికల్లోనూ గెలిచిన ధర్మేంద్ర కశ్యప్‌కే ఈసారి కూడా బీజేపీ టికెట్ దక్కింది. ఎస్పీ నుంచి నీరజ్ మౌర్య, బీఎస్పీ తరఫున అబిద్ అలీ పోటీలో ఉన్నారు. ఇక్కడ 2014లో ఎస్పీ, 2019 ఎన్నికల్లో బీఎస్పీ రెండో స్థానంలో నిలిచాయి.

పరిచయం

రచనా బెనర్జీ. అందం, అభినయం కలబోసిన నటిగా దక్షిణాదికి చిరపరిచితం. ఒడిశా సినీ పరిశ్రమలోనూ వెలుగు వెలిగిన బెంగాలీ బ్యూటీ. దీదీ అనగానే తృణమూల్ అధినేత్రి మమతాయే గుర్తొస్తారు. అయితే సూపర్‌హిట్ బెంగాలీ టీవీ షో 'దీదీ నంబర్‌వన్'కు హోస్ట్‌గా అలరిస్తూ రచన దీదీ నంబర్‌వన్ అయ్యారు. తృణమూల్ నుంచే రాజకీయ అరంగేట్రమూ చేస్తున్నారు...! - సాక్షి, నేషనల్ డెస్క్



దీదీ కాదు... దీదీ నంబర్‌వన్

నటిగా ప్రయాణం..

1974 అక్టోబర్ 2న కోల్‌కతాలో జన్మించిన రచన అసలు పేరు ఝుంఝుమ్ బెనర్జీ. కోల్‌కతా సౌత్ సిటీ కాలేజీలో డిగ్రీ చేశారు. 1990లో సెకండియర్లో ఉండగానే మిస్ కలకత్తా టైటిల్ గెలుచుకున్నారు. 1994లో మిస్ ఇండియా పోటీల్లోనూ పాల్గొన్నారు. ఆకర్షణీయమైన ముఖం, అందమైన చిరునవ్వు ఆమెకు బోలెడు సినీ అవకాశాలు తెచ్చిపెట్టాయి. బెంగాలీ చిత్రం 'దాన్ ప్రాటిదాన్'తో తొలిసారి వెండితెరపై కనిపించారు. బెంగాలీతో పాటు దక్షిణాదిలోనూ వరుసగా సినిమాలు చేశారు. కన్యాదానం సినిమాతో తెలుగువారికి పరిచయమయ్యారు. అమితాబ్ బచ్చన్, చిరంజీవి, మిథున్ చక్రవర్తి వంటి సూపర్ స్టార్లతో కలిసి పనిచేశారు. ఒరియా నటుడు సిద్ధాంత మహాపాత్రతో కలిసి ఏకంగా 40 సినిమాలు చేశారు. ప్రసేన్‌జిత్ ఛటర్జీతోనూ 35 బెంగాలీ సినిమాల్లో నటిస్తే వాటిలో 32 సూపర్ డూపర్‌హిట్లే! సినిమాలు చేస్తూనే వ్యాపారవేత్తగానూ ఎదిగారు. సామాజిక మాధ్యమాల్లో కూడా యాక్టివ్‌గా ఉంటారు. ఇన్‌స్టాగ్రాం, ఎక్స్‌లో రచనకు లక్షల్లో ఫాలోవర్లున్నారు.

రాజకీయాల్లోకి...

సినిమాలకు గుడ్‌బై చెప్పాక రచన టీవీపై దృష్టి సారించారు. సూపర్‌హిట్ బెంగాలీ టీవీ షో దీదీ నంబర్ వన్‌కు ముఖ్య అతిథిగా ఆహ్వానించడానికి తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి, సీఎం మమతా బెనర్జీని కలిశారు. రాజకీయాల్లోకి వెళ్తారని అప్పుడే ప్రచారం జరిగినా కొట్టిపడేశారు. బీజేపీకి బెంగాల్లో బలం పెరుగుతుండటం, పలువురు టీఎంసీ నేతలపై ఆరోపణల నేపథ్యంలో ఈ ఎన్నికల్లో బలమైన కొత్త ముఖాన్ని తెరపైకి తేవాలని మమత భావించారు. ఆ మేరకు భారీ ర్యాలీలో రచనను హుగ్లీ నుంచి లోక్‌సభ అభ్యర్థిగా ప్రకటించారు. అక్కడి బీజేపీ సిట్టింగ్ ఎంపీ లాకెట్ చటర్జీ కూడా సినీ నటి. పైగా రచనకు మంచి స్నేహితురాలు కూడా. అదంతా వ్యక్తిగతమని, పోటీ పోటీయేనని అంటున్నారు రచన.

వంద శాతం ఇస్తా...

తృణమూల్ కాంగ్రెస్‌లో చేరాల్సిందిగా మమత అడిగినప్పుడు కాస్త ఆలోచించి అంగీకరించినట్టు చెప్పారు రచన. ''దీదీ నాకు ఎన్నో ఏళ్లుగా తెలుసు. జీవితంలో ప్రతి దశలోనూ కొత్త అవకాశం వస్తుంది. దాన్ని అందిపుచ్చుకోవాలి. అందుకే లోక్‌సభకు దీదీ నా అభ్యర్థిత్వాన్ని ప్రకటించినప్పుడు పొంగిపోయా. నాన్న ఉంటే ఎంతో సంతోషించేవాడు. నా నిర్ణయంతో అమ్మ సంతోషంగా ఉంది. గతంలో లైవ్ స్టేజ్ షోల కోసం రెండు మూడుసార్లు హుగ్లీ వెళ్లా. ఇక నుంచి అదే నా అడ్డా. జీవితంలో ఏం చేసినా 100 శాతం చిత్తశుద్ధితో కష్టపడ్డా. అదే స్ఫూర్తితో నాయకురాలిగానూ రాణించి దీదీ నమ్మకం నిలబెడతా'' అన్నారు.

నవికా: మరి మీ చెల్లి వాళ్లతో పనిచేస్తోంది. పవర్ పాలిటిక్స్‌లో ఆమె ఏ విధంగా రాణిస్తుందనుకుంటున్నారు? షర్మిలకు సునీత కూడా తోడయ్యారు.
సీఎం జగన్: వాళ్లకు వాళ్ల వ్యక్తిగత కారణాలున్నాయి. అయితే వాళ్లు ఎంచుకున్న మార్గం, సమయం రెండూ సరైనవి కావు. ప్రతి కుటుంబంలో ఒక జనరేషన్‌లో ఒకరు మాత్రమే రాజకీయాలను లీడ్ చేస్తారు. మిగిలిన వాళ్లు లీడ్ చేసే వారికి మద్దతుగా నిలుస్తారు. రెండో జనరేషన్ రాజకీయాల్లోకి రాకూడదు. దీన్ని నమ్ముతాను. ఈ క్రమంలో వారిని రాజకీయాల్లోకి రావద్దనే సూచించాను. వ్యాపారాలు, ఇంకా వాళ్లకు ఇష్టమైన రంగాల్లో రాణించేలా ప్రోత్సహించాను. రాజకీయాల్లోకి వచ్చి కుటుంబంలో సంబంధాలు దెబ్బతినేలా చేయొద్దని కోరాను. రాజకీయాల్లోకి వస్తే ప్రత్యర్థులు దీన్ని అవకాశంగా మలుచుకుని మన మధ్యే చిచ్చుపెట్టి సంబంధాలను కలుషితం చేస్తారని చెప్పాను. మనలో మనమే ప్రత్యర్థులుగా మారిపోతామని తెలియజేశాను.

నవికా: వారి వెనకాల చంద్రబాబు ఉన్నారని మీరు నమ్ముతున్నారా?
సీఎం జగన్: అవును. నమ్మాల్సిన పరిస్థితి ఇప్పుడు ఏర్పడింది. చంద్రబాబు వాళ్లను ప్రోత్సహిస్తున్నట్టు స్పష్టంగా కనిపిస్తోంది. రాజకీయాల్లో ఉన్నప్పుడు విలువలు, సిద్ధాంతాలు ఉండాలి. పార్టీకి ఎంతో విధేయుడిగా ఉన్న నా తండ్రి పేరును కాంగ్రెస్ పార్టీ చార్జిషీట్‌లలో పెట్టింది. అక్రమ కేసులు పెట్టి నన్ను జైలు పాలు చేసింది. నాపై కేసులు పెట్టింది కూడా కాంగ్రెస్, తెలుగుదేశం పార్టీ నాయకులే. ఈ కేసులో కో పిటీషన్ వేసింది టీడీపీ. నా తండ్రి బతికి ఉన్నన్ని రోజులు, నేను ఆ పార్టీలో ఉన్నన్ని రోజులు నేను నిజాయితీపరుడిని. నేను ఆ పార్టీ వీడిన వెంటనే నా తండ్రి, నాపైనా అవినీతి మరక వేశారు. నన్ను పార్టీ నుంచి బయటకు పంపేశారు. ఈ రోజుకూ వారు నాపై మోపిన తప్పుడు కేసులపై పోరాటం **చేస్తున్నాను.**

నవికా: అందుకే చంద్రబాబు నాయుడిని జైలుకు పంపించారా?
సీఎం జగన్: చంద్రబాబు నాయుడు చేయకూడని పని చేశారు. స్కిల్ స్కామ్‌లో కీలకంగా వ్యవహరించారు. అలా అతను చేసి ఉండకూడదు. ఆయన స్కామ్‌లో ప్రమేయం ఉందనడానికి పూర్తి ఆధారాలు ఉన్నాయి. కోర్టుల్లోనూ చంద్రబాబుకు వ్యతిరేకంగా తగిన సాక్ష్యాలతో వాదనలు జరిగాయి. అందుకే కటకటాల వెనక్కి వెళ్లాడు. రాష్ట్ర ప్రభుత్వం సమర్పించిన సాక్ష్యాలతో కోర్టులు ఏకీభవించాయి. అందుకే అతను 52 రోజులు జైలులో ఉన్నాడు.
నవికా: చివరికి బెయిల్ వచ్చింది కదా?
సీఎం జగన్: బెయిల్ పొందడం అనేది హక్కు. అది జైలులోకి వెళ్లిన ఎవరికైనా.. ఎప్పుడో ఒకప్పుడు రావాల్సిందే. అంతేగానీ, సరైన సాక్ష్యాలు లేకుంటే చంద్రబాబు జైలుకి వెళ్లేవారు కాదేమో! **చంద్రబాబుపై కేసుల్లో ఎక్కడా రాజకీయ కోణంలో వ్యవహరించలేదు.**





క్లీన్ స్వీప్ ఖాయం

టైమ్స్ నౌ గ్రూప్ ఎడిటర్-ఇన్-చీఫ్ నవికా కుమార్ ఇంటర్వ్యూలో సీఎం వైఎస్ జగన్

సాక్షి, అమరావతి :

'రాష్ట్ర చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించేలా సుపరిపాలన అందించాం. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీల్లో 99 శాతం అమలు చేశాం. అర్హతే ప్రామాణికంగా, వివక్ష చూపకుండా.. అవినీతికి తావులేకుండా.. అత్యంత పారదర్శకంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించాం. దేశ చరిత్రలో ఎన్నడూ లేని రీతిలో డీబీటీ రూపంలో పేదల ఖాతాల్లో రూ.2.70 లక్షల కోట్లు జమ చేశాం. విప్లవాత్మక సంస్కరణలతో విద్య, వైద్య, వ్యవసాయ, పారిశ్రామిక రంగాల్లో ప్రగతి సాధించాం. గ్రామ, వార్డు సచివాలయాలు-వలంటీర్ల వ్యవస్థ ద్వారా ఇంటి గుమ్మం వద్దకే ప్రభుత్వ సేవలు అందిస్తున్నాం. ప్రభుత్వం వల్ల మంచి జరిగి ఉంటేనే ఓటు వేసి ఆశీర్వదించాలని ప్రజలను కోరుతున్నాం' అని వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చెప్పారు. ప్రజల్లో తమ ప్రభుత్వంపై ఉన్న విశ్వసనీయత, నమ్మకమే.. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ క్లీన్ స్వీప్ చేయడానికి దారితీస్తుందని ధీమా వ్యక్తం చేశారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో రాష్ట్రంలో, దేశంలో రాజకీయ పరిణామాలపై సీఎం వైఎస్ జగన్‌ను టైమ్స్ నౌ గ్రూప్ ఎడిటర్-ఇన్-చీఫ్ నవికా కుమార్ ఇంటర్వ్యూ చేశారు. ఇంటర్వ్యూ వివరాలు ఇలా ఉన్నాయి.

నవికా: రాష్ట్రంలో ఎన్నికలు జరగబోతున్నాయి. ఒకవైపు టీడీపీ, బీజేపీ, జనసేన.. మరోవైపు కాంగ్రెస్ పార్టీ నుంచి మీ చెల్లెళ్లు మీ మీద పోరాటానికి వస్తున్నారు. ఈ క్రమంలో ఎవరితో పోరాడేందుకు మీరు సిద్ధంగా ఉన్నారు?
సీఎం జగన్: మా ప్రభుత్వంపై పోరాటానికి వస్తున్న ప్రతి ఒక్కరితో పోరాటానికి నేను సిద్ధంగా ఉన్నాను. ఇక్కడ ఇంకో ముఖ్య విషయం ఏమిటంటే కాంగ్రెస్ పార్టీ రిమోట్ కంట్రోల్ కూడా చంద్రబాబు చేతుల్లోనే ఉంది. రేవంత్‌రెడ్డి ద్వారా చంద్రబాబు నా చెల్లెలు షర్మిలను ప్రభావితం చేస్తున్నారు. కాంగ్రెస్ పార్టీలో నా చెల్లిని అడ్డుపెట్టుకుని వైఎస్సార్‌సీపీ ఓటర్లలో చీలిక తెచ్చి లబ్ధి పొందాలని వాళ్లు భావిస్తున్నారు. మా ప్రభుత్వంపై ప్రజల్లో ఎక్కడా వ్యతిరేకత లేదు. ప్రజాస్వామ్యంలో 50 శాతానికి పైగా ఓట్లతో గెలిచాం. చెప్పినవి చేసి చూపించాం. అందువల్ల ప్రజలు మాతోనే ఉన్నారు. దేవుడి దయతో మేం స్వీప్ చేయబోతున్నాం.

> **నవికా:** మీపై ప్రతిపక్షాలు అవినీతి ఆరోపణలు చేస్తున్నాయి.. దానికి మీరేమంటారు?
> **సీఎం జగన్:** దాదాపు 2.70 లక్షల కోట్ల రూపాయలు నేరుగా (డీబీటీ) ప్రజల ఖతాల్లో జమ చేశాను. ప్రజల ఆధార్ నంబర్, బ్యాంకు ఖాతా వివరాలతో సహా ఆధారాలు ఉన్నాయి. మరి అవినీతి చేశానని వారు ఎలా అంటారు? 90 శాతం కుటుంబాలకు మేలు జరిగింది.

నవికా: కాంగ్రెస్ పార్టీకి చెందిన తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి చంద్రబాబుతో చేతులు కలిపారని మీరు అంటున్నారు. ఈ విషయం బీజేపీకి తెలియదంటారా?
సీఎం జగన్: ఈ ప్రశ్న మీరు ఆ పార్టీ వాళ్లను అడగాలి.

నవికా: మీరు పరాజయం పాలవ్వబోతున్నారనే బీజేపీ మీతో పొత్తు పెట్టుకోలేదా? టీడీపీతో బీజేపీ పొత్తు పెట్టుకుందని మీరేమైన నిరాశకు గురయ్యారా?
సీఎం జగన్: పొత్తు పెట్టుకుంటానని నేను ఏ పార్టీని కోరలేదు. గొప్ప పరిపాలనను మేం అందించాం. ఈ క్రమంలో మేం పొత్తులు పెట్టుకుని ఎన్నికలకు పోవాల్సిన అవసరం లేదు. మా రాష్ట్రంలో బీజేపీ, కాంగ్రెస్ ఈ రెండు జాతీయ పార్టీలు అప్రధానం. వాళ్ల పార్టీ, వాళ్లకు ఇష్టం వచ్చినట్టు పొత్తులు పెట్టుకున్నారు. మా రాష్ట్ర ప్రజల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకునే కొన్ని సందర్భాల్లో ఎన్‌డీఏ ప్రభుత్వానికి కొన్ని బిల్లుల విషయంలో మద్దతు ఇచ్చాం. ప్రజల ప్రయోజనాలకు ఇబ్బంది అనిపించినప్పుడు ఆ బిల్లులకు మేం మద్దతు ఇవ్వలేదు. ఉదాహరణకు మైనార్టీల హక్కులకు విఘాతం కలిగించే బిల్లులకు మేం మద్దతు ఇవ్వలేదు. సీఏఏకు వ్యతిరేకంగా మేం అసెంబ్లీలో తీర్మానం కూడా చేశాం.

> **నవికా:** మీరు రాజకీయాల్లోకి రావాలని నిర్ణయించుకున్నాకే మిమ్మల్ని టార్గెట్ చేశారా?
> **సీఎం జగన్:** నేను ఎంపీ అయ్యి 100 రోజులు కూడా పూర్తవకుండానే నా తండ్రి చనిపోయారు. ఆ తర్వాత ప్రతి ఒక్కరితో పోరాడాల్సి వచ్చింది.

నవికా: రాష్ట్రానికి ప్రత్యేక **హోదా సాధించడం** కోసమే మీరు ఎన్‌డీఏ ప్ర**భుత్వానికి మద్దతు** ఇచ్చారనే వాదన ఉంది. **ఈ క్రమంలో హోదా అం**శంపై ఏదైనా భరోసా ల**భించిందా?**
సీఎం జగన్: రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇస్తామని కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో ఒప్పుకుంది. కానీ.. అప్పట్లో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ ప్రత్యేక హోదా కల్పించే అంశాన్ని విభజన చట్టంలో చేర్చకుండా అన్యాయం చేసింది. పార్లమెంట్‌లో కేంద్రం చేసిన ప్రకటన మేరకు ప్రత్యేక హోదా రాష్ట్రానికి వస్తుందని మేం నమ్మాం. కానీ.. చంద్రబాబు ప్రత్యేక ప్యాకేజీకి అంగీకరించి, ప్రత్యేక హోదాను కేంద్రానికి తాకట్టు పెట్టేశారు. ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా కల్పించే విషయంలో బీజేపీ, కాంగ్రెస్ రెండు జాతీయ పార్టీలు చెలగాటం ఆడాయి. ప్రత్యేక హోదాను సాధించడమే ప్రధాన అజెండాగా మేం అడుగులు ముందుకు వేశాం, వేస్తున్నాం. మా మీద ఆధారపడిన ప్రభుత్వం కేంద్రంలో వస్తే కచ్చితంగా ప్రత్యేక హోదాను సాధిస్తాం.

నవికా: పూర్తి మెజార్టీతో కాకుండా కేంద్రంలో సంకీర్ణ ప్రభుత్వం వస్తేనే హోదా వస్తుందని భావిస్తున్నారా?
సీఎం జగన్: ఇది నిజం. అందరికీ ఇది తెలిసిన అంశమే.

నవికా: మెజార్టీ లేక సంకీర్ణం.. కేంద్రంలో ఏ ప్రభుత్వం రాబోతుందని మీరు భావిస్తున్నారు?
సీఎం జగన్: జాతీయ స్థాయిలో రాజకీయ పరిణామాలు ఎలా ఉన్నాయో అంచనా వేయడం సాధ్యం కాకపోవచ్చు. జాతీయ మీడియా చేసిన సర్వేలు కొన్ని సార్లు నిజం కావచ్చు. కాపోవచ్చు.

నవికా: రాహుల్ గాంధీ ప్రధాని అవుతారని మీరు అనుకుంటున్నారా?
సీఎం జగన్: రాహుల్ గాంధీ, నరేంద్ర మోదీ ఇద్దరిని నేను దగ్గరగా చూశాను. వ్యక్తిగతంగా రాహుల్ గాంధీ, మోదీతో పోల్చి చూస్తే.. మైనార్టీలకు వ్యతిరేకం అని తప్పితే మిగతా అంశాల్లో మోదీనే మంచివారు. కాంగ్రెస్ పార్టీకి ఎంతో విధేయుడిగా ఉన్న నా తండ్రి మరణించాక నా కుటుంబాన్ని ఏ విధంగా వేధింపులకు గురి చేశారో అందరికీ తెలుసు. ఆ వేధింపులకు నేనే సాక్షి. ఈ క్రమంలో ఏ విధంగా రాహుల్ గాంధీ మంచివాడని అనాలి?

నవికా: రాజకీయాల్లో ఉన్నత ఆశయాలు ఉన్నాయని చెబుతున్నారు మీరు.. అందుకే మీ చెల్లెళ్లు మీ నుంచి దూరమయ్యారా? మీరు పార్టీలోకి రానివ్వకపోవడంతోనే వేరే పార్టీల వైపు వెళ్లారా?
సీఎం జగన్: వాళ్లను తీసుకొస్తే అది కుటుంబ రాజకీయంగా మారిపోతుంది. ఒకే కుటుంబంలోని ఒక జనరేషన్ నుంచి ఎక్కువ మంది రాజకీయాల్లో ఉంటే అది పార్టీ అవ్వదు. మరేదో అవుతుంది. నాకు స్పష్టమైన విజన్ ఉంది. పార్టీ వారసత్వానికి వచ్చిన ఇబ్బంది లేదు. ప్రజలకు మంచి చేసేందుకు నాకు సుదీర్ఘ భవిష్యత్తు ఉంది. వారసత్వం అనేది వేరే ప్రస్తావన. కుటుంబ సభ్యుల మధ్య సంబంధాలు ఎలా ఉండాలంటే.. ఎవరైనా వస్తే సంతోషంగా మాట్లాడుకోగలగాలి. అందరూ కలిసి ఒకేచోట కూర్చుని సరదాగా ఉండాలి. అంతేగానీ ప్రతి చోట రాజకీయం అంటే ఎలా? ఒక కుటుంబం నడిపే పార్టీ ఎప్పటికీ బతకదు.

నవికా: మీ చెల్లెలితో మీ అనుబంధం ఎలా ఉండేది?
సీఎం జగన్: దురదృష్టవశాత్తు ఆమె చంద్రబాబుతో కలిసింది. ఆయన చెప్పినట్టే రాజకీయాలు చేస్తోంది. మా కుటుంబానికి తీవ్ర అన్యాయం చేసిన కాంగ్రెస్ పార్టీలో చేరి.. ఆ పార్టీకి రాష్ట్రంలో నాయకత్వం వహిస్తోంది. (నవికా: ఆమె మీ కుటుంబమే కదా..) మా కుటుంబ సభ్యురాలు అయి ఉండి కూడా.. బయటకు వెళ్లడం, రాజకీయ శత్రువులతో చేతులు కలపడం నాకు బాధ కలిగిస్తోంది.

నవికా: మీ ఇద్దరి విషయంలో.. రెండు వైపులా మీ తల్లి ఎలా మేనేజ్ చేస్తున్నారు?
సీఎం జగన్: ఈ రోజు రాజకీయాల్లో ఎవరు పోటీ చేస్తున్నారు.. ఎవరు చేయట్లేదు అనేది కాదు. రాష్ట్రంలో మా ప్రభుత్వం చేసిన మంచిని మేము చెబుతున్నాం. ఇక్కడ జగన్ ఒక వైపు.. మిగిలిన వారందరూ మరో వైపు ఉన్నారు. ప్రజలు ఓటు ద్వారా తమ మద్దతు తెలుపుతారు. అలాంటి రాజకీయమే నడుస్తోంది. కుటుంబ రాజకీయాలు ఇక్కడ పని చేయవు.

నవికా: చంద్రబాబు చెప్పినట్టే.. ఆయనకు ఏమి అవసరమో అదే.. మీ చెల్లెలు చేస్తున్నారని ఎలా చెబుతున్నారు? కాంగ్రెస్ పార్టీలోని సభ్యులు ఆమెకు ఆశలు కల్పించి ఉండొచ్చుకదా?
సీఎం జగన్: ఇక్కడ వాస్తవం ఏమంటే.. ఏమి జరుగుతుందో నాకు స్పష్టంగా తెలుసు. (నవికా: మీరేమైనా ఫోన్ ట్యాపింగ్ చేశారా? తెలంగాణలో **కేసీఆర్ ప్రభుత్వంలో రేవంత్ రెడ్డి ఫోన్ ట్యాప్ చేశారని చెబుతున్నట్టు) ఎవరైనా ఎందుకు ఫోన్ ట్యాపింగ్ చేయాలి. ఆమె నా సొంత చెల్లెలు. అందుకే ఏం జరిగిందో ఏం జరుగుతోందో నాకు** తెలుసు. ఎవరు ఆడిస్తున్నారో.. ఎవరు నీచ రాజకీయాలు చేస్తున్నారో నాకు తెలుసు.

నవికా: నారీ శక్తిని విశ్వసిస్తున్న దేశంలో.. తండ్రి వారసత్వం వాటా కొడుకులకు మాత్రమే కాదు.. కూతుళ్లకు వర్తిస్తుందంటే మీరు ఏమంటారు?
సీఎం జగన్: దీనినే సరిగా అర్థం చేసుకోవాలి. ఇక్కడ వారసత్వం కోసం పోరాటం జరగట్లేదు. మా నాన్న 2009లో అందరినీ విడిచి వెళ్లిపోయారు. మనం 2024లో మాట్లాడుకుంటున్నాం. దాదాపు 15 ఏళ్లు అవుతుంది నాన్న వెళ్లిపోయి. ఇక్కడ ముఖ్యమంత్రిగా నా ఐదేళ్ల పాలనను ప్రజలు చూశారు. నా పాలనను విశ్వసిస్తే వారే ఓటు రూపంలో నాకు మద్దతుగా నిలుస్తారు. లేకుంటే వేరే వైపు చూస్తారు. ఆ పోరాటమే నడుస్తోంది గానీ, వారసత్వం ఎక్కడి నుంచి వస్తుంది?



నవికా: ఏపీలో కాంగ్రెస్, ఎన్‌డీఏ, జగన్ ముక్కోణపు పోటీలో ఉన్నారు? ఏమైనా మీ ఓటు బ్యాంకుపై ప్రభావం చూపుతారా?
సీఎం జగన్: ఈ రోజు నేను చెప్పే మాటలను (మార్క్) గుర్తు పెట్టుకోండి. ఎన్నికలు ముగిసిన తర్వాత మళ్లీ రండి. కాంగ్రెస్‌కు నోటా కంటే ఒక్క ఓటు కూడా ఎక్కువ రాదు. వైఎస్సార్‌సీపీ, టీడీపీ నేతృత్వంలోని కూటమి మధ్యే పోటీ.

నవికా: 2019 ఎన్నికల్లో మీరు రికార్డు విజయం సాధించారు. 175 శాసనసభ స్థానాల్లో 151 స్థానాలు, 25లో 22 పార్లమెంట్ స్థానాలు గెలుచుకున్నారు. ఇప్పుడు ఎన్ని స్థానాలను మీరు గెలవబోతున్నారు?
సీఎం జగన్: ఎన్నికల్లో 50 శాతం ఓట్లు సాధించడం అనేది ముఖ్యమైనది. గత ఎన్నికల్లో మేము 49.96 శాతం ఓట్లు సాధించాం. ఈ సారి దేవుడి దయతో 2019లో వచ్చిన ఓట్ల కంటే ఎక్కువ తెచ్చుకుంటామని నాకు బలమైన నమ్మకం ఉంది. మీరు మంచి విశ్లేషణ చేస్తారు.. మీరే ఆ రోజు టీవీలో నంబర్లు చూస్తారు.

నవికా: దేశంలో ప్రత్యర్థి పార్టీలు ఈవీఎంలపై ఆరోపణలు చేస్తున్నాయి? దీనిపై మీరు ఏమంటారు?
సీఎం జగన్: నేను దేశంలో ప్రజాస్వామ్యం బతికి ఉందని ప్రగాఢంగా విశ్వసిస్తున్నాను. అలాంటప్పుడు వేరే విషయాలను పట్టించుకోవాల్సిన అవసరం లేదు.

నవికా: ఏపీలో బీజేపీ పొత్తును మీరు టార్గెట్ చేశారు. 2014లో కలిసి పోటీ చేసిన వాళ్లు.. తిరిగి 2024లో వస్తున్నారు? మీరు దీనిని అవకాశవాద పొత్తుగా ఎందుకు చూస్తున్నారు?
సీఎం జగన్: ఎన్నికల్లో పోటీ చేసే ప్రతి పార్టీ మేనిఫెస్టో ప్రకటిస్తుంది. అదే పార్టీ విజన్‌ను ప్రజల దగ్గరకు తీసుకెళ్లే మార్గదర్శకంగా ఉంటుంది. పాలనా పని తీరును కూడా మేనిఫెస్టోలో చెప్పిన అంశాలతో నేరవేర్చామా లేదా అని పోల్చి చూడాలి. ఇదే ఎన్నికల్లో ప్రజల దగ్గరకు వెళ్లి ఓట్లను అడిగేందుకు మన అర్హతను నిర్ణయిస్తుంది. ఇప్పుడు కూటమిగా వస్తున్న వాళ్లే.. గతంలో చంద్రబాబు సంతకంతో రకరకాల హామీలతో కరపత్రం ముద్రించి 2014లో ప్రతి ఇంటికీ పంపించారు. కూటమి నాయకుల ఫొటోలతో ముద్రించారు. ఇదే విషయాన్ని నా ప్రతి బహిరంగ సభలోనూ ప్రజలకు చెబుతున్నాను. వాళ్ల మేనిఫెస్టోను చూపించి.. అందులోని వాగ్దానాలను చదివి.. ఇవన్నీ 2014 ఎన్నికల తర్వాత అమలు చేశారా? లేదా? అంటూ ప్రజలనే అడుగుతున్నాను. అం**దులో నెరవేర్చిన ఒక్క హామీనైనా చెప్పమంటున్నాను. చెప్పడానికి అందులో ఒక్కటంటే ఒక్కటీ లేదని ప్రజలు స్పష్టం చేస్తున్నారు. అప్పట్లో ఆ కూటమి ప్రజలను మోసం చేసింది.** అందుకే 2019 ఎన్నికల్లో చంద్రబాబు అధికారం నుంచి తుడిచి పెట్టుకుపోయాడు. 151 ఎమ్మెల్యే, 22 ఎంపీ స్థానాల్లో మేము గెలిచాం. మళ్లీ అదే కూటమి.. అదే చంద్రబాబు.. కొత్త మేనిఫెస్టోతో వచ్చారు.

నవికా: ఐదేళ్ల మీ పాలనను ప్రజలు చూశారు. చంద్రబాబు కంటే మీరు మెరుగైన పాలన అందించారని ప్రజలు నమ్ముతారని అనుకుంటున్నారా?
సీఎం జగన్: చంద్రబాబు నాయుడు ప్రజలకు ఇచ్చిన హామీల్లో ఒక్కటీ నెరవేర్చలేదు. కానీ మేం 2019లో మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను త్రికరణశుద్ధితో అమలు చేశాం. మా మేనిఫెస్టోను ప్రతి సంవత్సరం ప్రతి ఇంటికి తీసుకెళ్లి ప్రజలకే ఇచ్చి.. అందులో వారికి ప్రభుత్వం నుంచి ఏమేం అందాయో టిక్ చేయమని చెప్పాం. మొదటి ఏడాదిలోనే దాదాపు 86, 87 శాతం హామీలు అమలు చేస్తే.. ఇప్పటికి 99 శాతం హామీలు అమలు చేశారని ప్రజలే చెబుతున్నారు. అది మా ప్రభుత్వం, మా పార్టీపై ప్రజలకున్న విశ్వసనీయత. అదే మా నమ్మకం.

నవికా: చంద్రబాబు జైలుకు వెళ్లి, బెయిల్‌పై బయటకు వచ్చాక సభలు నిర్వహించారు. అదే సమయంలో మీరూ సిద్ధం సభలు పెట్టారు. చంద్రబాబుకు ప్రజల నుంచి సానుభూతి రాకూడదనే మీరు సిద్ధం సభలు నిర్వహించారని ప్రతిపక్షాలు అంటే మీరేమంటారు?
సీఎం జగన్: (నవ్వుతూ..) నేను సిద్ధం సభలు పెట్టినట్టే వారూ రాజకీయ సభలు పెట్టారు. కానీ జగన్ సిద్ధం సభలకు ప్రజలు భారీగా తరలి వచ్చారు. వారి సభలకు ఎవరూ రాలేదు. దానికి నేనేం చేయగలను.. ఈ ప్రశ్న వారినే అడగాలి. జగన్ అంత జనాన్ని ఎలా ఆకట్టుకుంటున్నాడు.. మీరెందుకు ప్రజలను ఆకట్టుకోలేకపోయారని వారినే అడగండి.

నవికా: మీ చిన్నాన్న వివేకానందరెడ్డి హత్య మీ కుటుంబంలో వివాదాస్పదంగా మారింది. ఆ హత్య కేసులో ఆయన భార్య, మీ చెల్లెళ్లు కూడా గత ఐదేళ్లుగా కేసు దర్యాప్తులో న్యాయం జరగలేదంటున్నారు.
సీఎం జగన్: ఈ అంశం మా కజిన్స్ మధ్య ఉంది. మా కజిన్ సిస్టర్ ప్రస్తుతం ఎంపీగా ఉన్న మరో కజిన్ బ్రదర్‌పై ఆరోపణలు చేస్తోంది. ఆరోపణలు కజిన్‌పై చేస్తున్నారు. దురదృష్టం ఏమిటంటే ఘటన జరిగినప్పుడు ఇవేమీ లేవు. కానీ సడెన్‌గా ఈ మార్పు ఎందుకు వచ్చింది? దీనికంతటికీ కారణం చంద్రబాబే.

నవికా: ప్రతి సమస్యకు చంద్రబాబుతో సంబంధం ఉంటుందా?
సీఎం జగన్: ఇక్కడ జరుగుతున్నది జగన్, చంద్రబాబు మధ్య పోరాటం. జగన్‌ను ఒంటిరిగా ఎదుర్కోలేక చంద్రబాబు నా కుటుంబాన్నే నాకు వ్యతిరేకంగా మార్చాలని చూస్తున్నారు. జగన్ ఎప్పుడూ ఒంటరి కాదు.. నా వెనుక ప్రజలున్నారు. ఇలాంటప్పుడు నాపై వ్యతిరేకత ఎందుకొస్తుంది! ప్రజలకు అవసరమైనవన్నీ చేస్తున్నాను. ఇలాంటప్పుడు ఇతర పార్టీల అవసరం ఏముంది?

> **నవికా:** వన్ నేషన్.. వన్ ఎలక్షన్‌కు మీరు మద్దతిస్తారా?
> **సీఎం జగన్:** కచ్చితంగా మద్దతిస్తాం. ఇప్పటికే మద్దతిచ్చాం

నవికా: రాజకీయ ప్రతీకారంతో అనుకోండి, లేదా మరేమైనాగానీ మీపై ఉన్న సీబీఐ కేసుల గురించి ప్రతిపక్షాలు మాట్లాడుతున్నాయి.. అవి మీ ప్రత్యర్థులకు ఆయుధాలుగా మారతాయనుకుంటున్నారా?
సీఎం జగన్: నాపై ఉన్న కేసులు నా ప్రభుత్వంలో, నా పాలనలో నమోదైనవి కాదు. మా నాన్న చనిపోయినప్పుడు.. నేను రాజకీయంగా వారికి ఎక్కడ అడ్డు తగులుతానో అని భయపడి చంద్రబాబు, కాంగ్రెస్ కలిసి కుట్రతో పెట్టిన కేసులు. **అత్యంత దురదృష్టకరమైన విషయం ఏంటంటే.. నాపై అక్రమ కేసులు బనాయించడానికి చేసిన ఆరోపణలు ఏ కాలానికి సంబంధించినవి? అప్పటికి నేను ఎమ్మెల్యేను కాను, ఎంపీనీ కాను.** పైగా అప్పట్లో నేను హైదరాబాద్‌లో కూడా లేను. ఆ సమయంలో నేను ఏ ఒక్క మంత్రితోగానీ ఏ ఒక్క ఐఏఎస్ ఆఫీసర్‌తోగానీ ఏ ఒక్క ఐపీఎస్ అధికారితో గానీ ఎప్పుడూ మాట్లాడలేదు. ఇది వాస్తవం.

నవికా: వారసత్వ రాజకీయాలకు కాలం చెల్లిందని మోదీ అన్నట్టు.. రాజకీయాలు, కుటుంబం మిమ్మల్ని ఇబ్బంది పెడుతున్నాయా?
సీఎం జగన్: ఆయన ఏ సందర్భంగా అన్నారో నాకు తెలియదుగానీ మోదీ అన్న మాటలను నేను బలంగా నమ్ముతున్నాను. కుటుంబాన్ని బేలెన్స్‌గా చూసుకోవాలన్నది నా బలమైన నమ్మకం. అయితే కుటుంబంలో సమస్యలు వచ్చినప్పుడు వాటిని సమర్థవంతంగా ఎదుర్కోలేకపోతే పార్టీని నడపలేం. అలాంటప్పుడు అప్రమత్తంగా లేకపోతే పార్టీ నష్టపోతుంది. పులివెందులలో నేను నామినేషన్ వేసినప్పుడు ఈ అంశంపై స్పష్టంగా చెప్పాను. కడప నుంచే ఆమె (షర్మిల) ఎంపీగా పోటీ చేస్తోంది. ఇదే స్థానం నుంచి నా కజిన్ ఎంపీగా ఉండి నా పార్టీ తరఫున పోటీలో ఉన్నారు. ముఖ్యమంత్రిగా నేను ఉన్నానంటే అది దేవుడి దయ. ఈ పదవి అణగారిన, వెనుకబడిన వర్గాలు, అగ్రవర్ణ పేదలకు మేలు చేయడానికి లభించిన అవకాశం. నేను డబ్బు సంపాదించుకోవడానికో లేక నా కుటుంబ సభ్యులను కోటీశ్వరులను చేయడానికో కాదు. వారు నా నుంచి అలాంటివి ఆశలు పెట్టుకోకూడదు. ఇదే విషయాన్ని బహిరంగంగానే చెప్పాను.

నవికా: కాంగ్రెస్ నుంచి బయటకు రావడంతోనే ఇబ్బందులు మొదలయ్యాయా?
సీఎం జగన్: అవును, నిజానికి నా జీవితంలో 16 నెలలు ఎవరు చెల్లిస్తారు? నన్ను జైల్లో పెట్టారు, కారణం ఏంటి?

నవికా: కేంద్రంలోని బీజేపీ తన ప్రతిపక్షాలను దెబ్బ తీసేందుకు కేంద్ర ఏజెన్సీలను పావుగా వాడుకుంటోందని కాంగ్రెస్ చెబుతోంది, మీరేం చెబుతారు?
సీఎం జగన్: అధికారంలో ఉన్నప్పుడు కాంగ్రెస్ ఏం చేసింది? నాపై నమోదు చేసిన కేసులే అందుకు ఉదాహరణ. 2004 నుంచి 2009 వరకు నా తండ్రి ముఖ్యమంత్రి. ఇప్పుడు 2024 వచ్చింది. కాంగ్రెస్ ఏం చేసింది.. అధికారంలో ఉన్నవారు తమ అధికారాన్ని చెడు కోసం వాడుకుంటున్నారు. ఇలా చేయడం దురదృష్టకరం. ఒక వేలు ఒకరి వైపు చూపిస్తే.. నాలుగు వేళ్లు మనవైపే చూపిస్తాయి, అది అర్థం చేసుకోవడం లేదు.

నవికా: ఎన్‌డీఏ, ఇండియా కూటమిలో మీరు భాగస్వామ్యం కాలేదు ఎందుకు? రాహుల్ గాంధీ, అఖిలేష్ యాదవ్, మమతా బెనర్జీ వంటి ప్రతిపక్ష నేతలు ఉండటం వల్ల ఇండియా కూటమి మీకు అంత అనుకూలం కాదనుకున్నారా?
సీఎం జగన్: ఈ రెండు జాతీయ పార్టీలూ ఆంధ్రప్రదేశ్‌లో అప్రధానమైనవి అనేది మనం ముందుగా గుర్తించాలి. ఎవరైనా వాటితో కలిసి ఎందుకు పోటీ చేయాలనేది ప్రాథమిక ప్రశ్న. రాష్ట్ర ప్రయోజనాలు, సమగ్రాభివృద్ధే లక్ష్యంగా అంశాల వారీగా కేంద్రానికి వైఎస్సార్‌సీపీ మద్దతు ఇస్తుంది. దేనికి మద్దతివ్వాలి.. దేనికి ఇవ్వకూడదనేది మేం ఆలోచించుకుంటాం.

నవికా: ఒకవేళ ఎన్‌ఆర్‌సీ వస్తే మద్దతిస్తారా?
సీఎం జగన్: మద్దతు ఇవ్వం.

నవికా: జగన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ ఎలాంటి పరిస్థితుల్లోనూ రాజీ పడకుండా తనకంటూ సొంత గుర్తింపుతోనే ముందుకు వెళ్లాలనుకుంటోందా? దానికి మీరు పూర్తిగా కట్టుబడి ఉన్నారా?
సీఎం జగన్: కచ్చితంగా. విశ్వసనీయత, నైతిక విలువలతో కూడిన రాజకీయాలు చేస్తున్నాం. రాజకీయాలలో విశ్వసనీయత ప్రధానమైనదని నేను గట్టిగా నమ్ముతాను. ప్రజల కోసం ఎవరితోనైనా పోరాటం చేయడానికి సిద్ధం.

నవికా: ప్రధాని నరేంద్ర మోదీ గురించి ఏమనుకుంటున్నారు. చాలా సమావేశాల్లో ఆయనతో కలిసి మీరు పాల్గొన్నారు. ఈ మధ్య ఆయన చాలా పొత్తులు పెట్టుకున్నారు. మీరెలా భావిస్తున్నారు?
సీఎం జగన్: రాజకీయాల్లో మోదీని, రాహుల్ గాంధీలను చూశాం. అయితే మైనార్టీలకు వ్యతిరేకం వంటి కొన్ని విషయాల్లో మోదీతో మేం విభేదించవచ్చు. కానీ ఆయన మంచి నాయకుడే.

నవికా: రాహుల్ గాంధీ గురించి చెప్పాలంటే ఏం చెబుతారు. మీరొక భారతీయ పౌరుడిగా చెప్పండి.
సీఎం జగన్: నేను ఇప్పటికే ఈ విషయంపై చెప్పాను. ఒక వేళ రాహుల్ మంచి నాయకుడైతే ప్రజలే ఓట్లేసి గెలిపిస్తారు. కాంగ్రెస్ పార్టీ నాకు చేసిన అన్యాయాన్ని బట్టి రాహుల్‌పై నా అభిప్రాయం నాకుంది. నాకైతే రాహుల్ అంటే వ్యక్తిగతంగా ఇష్టం లేదు.

నవికా: మూడు రాజధానుల అంశం గురించి ఏమంటారు?
సీఎం జగన్: ఆ నిర్ణయం ఇప్పటికే జరిగిపోయింది. ఇందులో ఎలాంటి సందేహం లేదు. విశాఖ పరిపాలన రాజధాని, అమరావతి శాసన రాజధాని, కర్నూలు న్యాయ రాజధానిగా ఉంటాయి. 2024 ఎన్నికల్లో విజయం సాధించి..



నవికా: ఇప్పుడున్న పరిస్థితుల్లో చంద్రబాబు మీకు ఎన్నికల్లో పోటీదారు అనుకుంటున్నారా? చంద్రబాబు జైలుకెళ్లి వచ్చిన తర్వాత ప్రజల ఆలోచనలో మార్పు వచ్చిందనుకుంటున్నారా? లేక ఉచిత పథకాలు ఫలితాలిస్తాయని అనుకుంటున్నారా?
సీఎం జగన్: ఇవన్నీ కాదు. మా ఐదేళ్ల పాలనపై ప్రజలు సంతృప్తిగా ఉన్నారు. ప్రజలకు ఇస్తున్నవి ఉచిత పథకాలుగా చూడకూడదు. అవి సామాజిక పెట్టుబడి. పరిపాలన, విద్య, వైద్య, వ్యవసాయ, పారిశ్రామిక రంగాల్లో గొప్ప సంస్కరణలు తెచ్చాం. ప్రభుత్వ స్కూళ్లన్నీ ఇంగ్లిష్ మీడియం స్కూళ్లుగా మారాయి. స్కూల్స్ అప్‌గ్రేడ్ అయ్యాయి. మూడో తరగతి నుంచే పిల్లలు టోఫెల్ గురించి ఆలోచిస్తున్నారు. ఆరో తరగతి నుంచే డిజిటల్ క్లాస్ రూమ్స్ వచ్చాయి. ఎనిమిదో తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లు ఇచ్చాం. ఐబీ సిలబస్ అందిస్తున్నాం. మా రాష్ట్రంలో 2025 నుంచి ఒకటో తరగతిలోనే ఐబీ సిలబస్ బోధిస్తాం. 2035 నుంచి మా పిల్లలు ఐబీ సర్టిఫికెట్ పొందుతారు. ఇవన్నీ ప్రజల కళ్ల ముందు కనిపిస్తున్నాయి. ప్రతి గ్రామంలో మార్పు వచ్చింది. ఏ గ్రామానికి వెళ్లినా దాదాపు 600 రకాల సేవలు ఇంటి వద్దకే అందుతున్నాయి. ప్రతి సర్టిఫికెట్, ప్రతి సంక్షేమ పథకం, ప్రతి సేవ.. వలంటీర్ ద్వారా ఇంటి గుమ్మం ముందుకే వస్తున్నాయి. విలేజ్ క్లినిక్, రైతుల కోసం రైతు భరోసా కేంద్రం (ఆర్‌బీకే), ఇంగ్లిష్ మీడియం స్కూల్, నవీకరించిన పాఠశాలలు, నవీకరించిన సిలబస్.. ఇలాంటివేవీ గతంలో లేవు. ఆరోగ్యం, వ్యవసాయం, విద్యలో చాలా మార్పు వచ్చింది. ముఖ్యంగా పాలనలో మార్పు స్పష్టంగా కనిపిస్తోంది. నేను అధికారంలోకి రాక ముందు, ఇవన్నీ చేయక ముందు ఏదైనా సంక్షేమ పథకంలో ప్రభుత్వం నుంచి ఒక రూపాయి ప్రజలకు ఎలాంటి అవినీతి లేకుండా, వివక్ష చూపకుండా అర్హులందరికీ చేరుతుందంటే ఎవరూ నమ్మే వారు కాదు.

> **నవికా:** యూనిఫాం సివిల్ కోడ్‌కు మద్దతిస్తున్నారా?
> **సీఎం జగన్:** మేం మద్దతివ్వడం లేదు. సీఏఏను వ్యతిరేకిస్తూ అసెంబ్లీలో తీర్మానం కూడా చేశాం.

సీఎంగా నేను ప్రమాణ స్వీకారం కూడా విశాఖలోనే చేస్తాను.

నవికా: ఎన్నికల్లో మీకెన్ని అసెంబ్లీ సీట్లు వస్తాయనుకుంటున్నారు? 151 సంఖ్యను దాటుతామని అనుకుంటున్నారా? బీజేపీకి, టీడీపీకి ఎన్ని సీట్లు వస్తాయని అనుకుంటున్నారు?
సీఎం జగన్: మా పార్టీ క్లీన్ స్వీప్ చేస్తుంది. నన్ను నమ్మండి. నంబర్స్ చూస్తూ ఉండండి.

నవికా: ప్రధాన మంత్రి ఎవరవుతారని అనుకుంటున్నారు?
సీఎం జగన్: అది ఎన్నికల్లో ప్రజలు నిర్ణయిస్తారు. అందరూ చెబుతున్నది, టీవీల్లో చూస్తున్నదానిని బట్టి మోదీ మళ్లీ అధికారంలోకి వస్తారని అనిపిస్తోంది. ఎవరు అధికారంలోకి వస్తారు.. ఉత్తర్‌ప్రదేశ్, బీహార్, మధ్యప్రదేశ్, రాజస్థాన్, కర్ణాటక ఎన్నికల్లో ఏం జరుగుతుందో చెప్పడానికి నేనేమీ సెఫాలజిస్ట్(విశ్లేషకుడు)ను కాదు. ఒక వేళ ఎవరైనా ఏదైనా చెబితే అది కేవలం ఒక అంచనా మాత్రమే.

నవికా: మీరు మళ్లీ అధికారంలోకి వస్తే ప్రజలకు ఇంత కంటే గొప్పగా ఏం చేస్తారు?
సీఎం జగన్: మేనిఫెస్టోలో చెప్పిన ప్రతిదీ పెద్ద హామీయే. అవన్నీ చేస్తాం.

నవికా: మీ సోదరిని మిస్ అవుతున్నారా?
సీఎం జగన్: కచ్చితంగా మిస్ అవుతున్నాను(భావోద్వేగంతో). దురదృష్టవశాత్తు ఆమె బయటకు వెళ్లింది. కానీ ప్రేమలు ఎక్కడికిపోతాయి?

నవికా: ఆమె విషయంలో అంతా మంచి జరుగుతుందని ఆశిస్తున్నారా?
సీఎం జగన్: దురదృష్టవశాత్తు ఆమె ఆ మార్గాన్ని ఎంచుకుంది. ఈ పరిస్థితి మారచ్చు.. మారకపోవచ్చు.

> **నవికా:** రాష్ట్రం ఫిస్కల్ హెల్త్ (ఆర్థిక పరిస్థితి) గురించి ఏమంటారు?
> **సీఎం జగన్:** చంద్రబాబు పాలనలో కంటే ప్రస్తుతం చాలా చాలా గొప్పగా ఉంది రాష్ట్రం. దానికి సంబంధించిన లెక్కలన్నీ అందుబాటులో ఉన్నాయి.


మధ్యాహ్నం 12.10 గంటలకు.. పశ్చిమ గోదావరి జిల్లా నరసాపురంలో సీఎం వైఎస్ జగన్ ఎన్నికల సభకు హాజరైన భారీ జనసందోహంలో ఓ భాగం


మధ్యాహ్నం 2 గంటలకు.. పల్నాడు జిల్లా పెదకూరపాడు నియోజకవర్గం క్రోసూరులో సీఎం వైఎస్ జగన్ ఎన్నికల సభకు హాజరైన భారీ జనసందోహంలో ఓ భాగం


సాయంత్రం 4.15 గంటలకు.. ప్రకాశం జిల్లా కనిగిరిలో సీఎం జగన్ సభకు హాజరైన అశేష జనసందోహంతో నిండిపోయిన మూడు రోడ్ల కూడలి

పింఛన్ ఎత్తేశారు!

బాబు సూపర్ సిక్స్‌లో మాయం.. అవ్వాతాతల పెన్షన్లపై పాపిష్టి కళ్లు

నరసాపురం, క్రోసూరు, కనిగిరి ఎన్నికల సభల్లో సీఎం జగన్ ధ్వజం

- బాబు కడుపుమంట ఇంకా చల్లారక పండుటాకులను బ్యాంకుల చుట్టూ తిప్పుతున్నాడు..
- ఒక్క నెల ఓపిక పట్టండి.. మీ బిడ్డ తొలి సంతకం అవ్వాతాతల కోసమే
- మళ్లీ మనం రాగానే మీ ఇంటికే పింఛన్లు.. పెరుగుదల కూడా కనిపిస్తుంది
- మన ఐదేళ్ల పాలనలో లంచాలు లేని సమాజాన్ని ఆవిష్కరించాం
- గ్రామ, వార్డు సచివాలయాలతో 600 సేవలు మన ఇంటికే నడిచి వస్తున్నాయి
- పేదల ఖాతాల్లోకి నేరుగా రూ.2.70 లక్షల కోట్లు.. నా తమ్ముళ్లు, చెల్లెమ్మలకు 2.31 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలిచ్చాం.. ఈ మంచిని కొనసాగించేందుకు రెండు ఓట్లు ఫ్యాన్‌కే వేయండి
- విలువలు, విశ్వసనీయతలను గెలిపించండి



వైఎస్సార్‌సీపీ ఎన్నికల గుర్తు 'ఫ్యాన్'ను ప్రజలకు చూపిస్తున్న సీఎం జగన్

రాకముందే అవ్వాతాతలకు అవస్థలు

"14 ఏళ్లు అధికారంలో ఉండీ ఏ పేదవాడికీ, ఏమీ చేయని చంద్రబాబు ఈనాడులో ఇచ్చిన ప్రకటన చూశారా? సూపర్ సిక్స్‌లో అవ్వాతాతల పెన్షన్‌ను అప్పుడే ఎత్తేశారు. సూపర్ సిక్స్‌లో అవ్వాతాతల పెన్షన్ మీకు ఎక్కడైనా కనిపించిందా? చంద్రబాబు రాకమునుపే అవ్వాతాతలు బ్యాంకుల చుట్టూ, ఆఫీసుల చుట్టూ ఎండనకా వాననకా తిరగాల్సిన పరిస్థితులు వచ్చేశాయి. ఇక పొరపాటున చంద్రబాబు పాలన వస్తే చంద్రముఖి మళ్లీ నిద్రలేస్తుంది. అవ్వాతాతలు ప్రతి ఒక్కరూ ఇది జ్ఞాపకం పెట్టుకోమని కోరుతున్నా."

- కనిగిరి సభలో సీఎం జగన్

మరిన్ని వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి


అనంతపురం జిల్లా బుక్కరాయసముద్రంలోని ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు వద్ద సొమ్మసిల్లిన వృద్ధురాలు

నీ కళ్లు చల్లబడ్డయా బాబూ!

ఎర్రటి ఎండలో విలవిల్లాడుతున్న పండుటాకులు

పాపం... దూరంగా ఉన్న బ్యాంకులకు వెళ్లలేక వృద్ధుల అవస్థలు

(సాక్షి, అమరావతి) పింఛన్ల కోసం ఎర్రటి ఎండలో వృద్ధులు, దివ్యాంగులు, అనారోగ్య బాధితులు బ్యాంకుల వెంట, ఏటీఎంల వెంట, సచివాలయాల వెంట తిరుగుతున్నారు. కొందరు సొమ్మసిల్లి పడిపోతున్నారు. కొందరైతే ప్రాణాలే కోల్పోతున్నారు. ఇప్పుడు నీ కళ్లు చల్లబడ్డాయా చంద్రబాబు నాయుడూ? ఇప్పుడు నీ మనసు శాంతించిందా? ఐదేళ్లుగా ప్రతి నెలా 1వ తేదీనే నేరుగా అవ్వాతాతల ఇళ్లకు వెళ్లి పింఛన్లు అందజేస్తున్న వలంటీర్లు... ఈ ఒకటి రెండు నెలల్లోనే ఓటర్లను ప్రభావితం చేసేస్తారా? ఒకవేళ ప్రభావితం చేయగలిగి ఉంటే ఇప్పటికే చేసి ఉండేవారు కదా!!. ఐదేళ్లలో లేనిది... ఈ రెండు నెలల్లో మారింది.. ఏంటి చంద్రబాబు నాయుడూ నీ కుట్ర బుద్ధి తప్ప? మీరే గనక పనిగట్టుకుని కోర్టుల్లో పిటిషన్లు వేసి, ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదులు చేసి వలంటీర్లను ఈ కార్యక్రమానికి దూరం చేయకుండా ఉంటే అవ్వాతాతలకు ఈ కష్టాలుండేవా? ఇదెక్కడి రాజకీయం బాబూ?

బ్యాంకుల్లో వెయ్యమన్నదీ మీరేగా?

ప్రతి పథకాన్నీ నేరుగా బ్యాంకు ఖాతాల్లో వేస్తున్న ప్రభుత్వం పింఛన్లను మాత్రం ఎందుకు వేయటం లేదు? వలంటీర్లు నేరుగా ఇవ్వాల్సిన అవసరం ఏముంది? చంద్రబాబు నాయుడు నుంచి... ఆయన వదిన, బీజేపీ రాష్ట్ర శాఖ అధ్యక్షురాలు పురంధేశ్వరి, దత్త పుత్రుడు పవన్ కల్యాణ్... వీళ్లు చెప్పినట్టల్లా ఆడే రిటైర్డ్ ఐఏఎస్ అధికారి నిమ్మగడ్డ రమేశ్‌కుమార్ వీళ్లంతా అడిగిన ప్రశ్న ఇదే. అక్కడితో ఆగలేదు వీళ్లెవరూ. కోర్టులకెక్కారు. వలంటీర్లు పింఛన్లు ఇవ్వటానికి ఈ మూడు నెలలూ వీల్లేదన్నారు. నేరుగా వాళ్ల బ్యాంకు ఖాతాల్లోనే నగదు వెయ్యాలని ఎన్నికల కమిషన్‌కు నిమ్మగడ్డ రమేశ్ స్వయంగా చెప్పారు. చంద్రబాబు, పురంధేశ్వరి, పవన్ కల్యాణ బహిరంగ సభల్లో కూడా ఇదే చెప్పారు. నిజానికి బ్యాంకు ఖాతాల్లో వేస్తే ఏమవుతుందో ప్రభుత్వానికి తెలియదా? ప్రతి పథకాన్నీ పైసా అవినీతికి తావు లేకుండా నేరుగా లబ్ధిదారులకే చేరుస్తున్న వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి ఇదంతా తెలియదా? కానీ పింఛన్లు తీసుకుంటున్న వాళ్లంతా వృద్ధులు, దివ్యాంగులు, వివిధ వ్యాధులతో బాధపడుతూ మంచానికి పరిమితమైన వాళ్లు. బ్యాంకు ఖాతాల్లో వేస్తే తీసుకోవటం వాళ్లకంత సులువేమీ కాదు. బ్యాంకులు ఎక్కడో ఊళ్లకు దూరంగా ఉంటాయి. అన్ని గ్రామాల్లోనూ ఏటీఎంలు అందుబాటులో లేవు. పైపెచ్చు ఖాతాల్లోని డబ్బులు ఎలా తియ్యాలో కూడా కొందరికి తెలియదు. కొందరికి ఖాతాలే లేవు. ఇంకొందరిదైతే ఇల్లు కదల్లేని పరిస్థితి. అందుకే బ్యాంకుల్లో వేయకుండా... ఆ నగదును బ్యాంకుల్లో డ్రా చేసి నేరుగా వలంటీర్లు ఇళ్లకు పట్టుకెళ్లి వాళ్లకు ఇస్తున్నారు. ఒకరకంగా ఖాతాల్లో వేయటానికన్నా అడ్వాన్స్‌డ్ ప్రక్రియ ఇది. అలాంటి ప్రక్రియను నిలిపేయించడానికి నీకు మనసెలా ఒప్పింది చంద్రబాబూ? ఖాతాల్లో వెయ్యమని చెప్పేటప్పుడు వీళ్లు ఇన్ని కష్టాలు పడతారన్న సంగతి నీకు తెలియనిది కాదు కదా? మండుటెండల్లో విలవిల్లాడుతున్న వృద్ధుల శాపాలిపుడు ఊరికే పోవు కదా?

బాబు రక్షణకు ఎల్లో మీడియా...

ఎండలకు విలవిల్లాడుతూ వృద్ధులు పెడుతున్న శాపనార్థాలకు తానెక్కడ కొట్టుకుపోతాడోనన్న భయం చంద్రబాబునిపుడు నిలువెల్లా వణికిస్తోంది. దీంతో పింఛన్లు ఇవ్వటానికి సచివాలయ సిబ్బందిని వినియోగించాలని, వాళ్ల ద్వారా ఇంటింటికీ పంచాలని కథలు చెబుతున్నారు. నిజానికి సచివాలయ సిబ్బందిని కూడా మొదట్లో అడ్డుకున్నది చంద్రబాబే. పైపెచ్చు ప్రతి ఇంటికీ అడ్రస్ పట్టుకుని వెతకటం, ఆ చిరునామాలో ఉన్నవారికి ఇవ్వటం ఎవరో కొత్తవారిని చెయ్యమంటే సాధ్యం కాదు. అయితే ఈసీ ఆదేశాల మేరకు 80 ఏళ్లు దాటిన వృద్ధులు, మంచానికి పరిమితమైన వారి విషయంలో సచివాలయ సిబ్బంది ఇళ్లకు వెళ్లే పింఛన్లు ఇస్తున్నారు. దారుణమేంటంటే ఇలా పింఛన్లిచ్చేటపుడు కొందరు చిరునామాలు దొరక్క వలంటీర్ల సాయం తీసుకుంటున్నారు. కానీ వారు వలంటీర్ల సాయం తీసుకున్నారన్న కారణంతో 'ఈనాడు' దాని తోక మీడియా దౌర్భాగ్యపు రాతలు రాసి ఆయా సచివాలయ సిబ్బందిని సస్పెండ్ చేసే దాకా వెంటాడుతున్నాయి. చంద్రబాబు మాత్రం సచివాలయ సిబ్బంది ఇళ్లకు వెళ్లి ఇస్తే బాగుంటుందని సన్నాయి నొక్కులు నొక్కుతున్నారు. పైపెచ్చు చేసిందంతా చేసి... ఇలా వృద్ధులు మండుటెండల్లో బయటకు రావటానికి జగనే కారణమని 'ఉల్టా చోర్...' తరహాలో నిందిస్తున్నారు. ఈ మాటలు ఎవరూ నమ్మటం లేదని తెలిసి... ఎల్లో మీడియానూ రంగంలోకి దింపారు. 'ఈ పాపం జగన్‌దే' అంటూ శుక్రవారం 'ఈనాడు' పతాక శీర్షికల్లో వంటి వార్చిన కథనం ఉద్దేశం బాబును రక్షించటమే.

మొదటి నుంచీ వలంటీర్లంటే కక్షే...

కోవిడ్ సమయంలో ప్రాణాలకు తెగించి పనిచేసిన ఏపీ వలంటీర్ల సైన్యాన్ని ప్రశంసించని వారు లేరు. కానీ చంద్రబాబు ముఠాకు మొదటి నుంచీ ఈ వ్యవస్థంటే ఇష్టం లేదు. వలంటీర్ల సేవల కారణంగా వైఎస్ జగన్ ప్రభుత్వానికి పేరొస్తుండటమే దీనికి కారణం. ఈ వ్యవస్థను ఎలాగైనా దెబ్బతీయాలన్న ఉద్దేశంతో వలంటీర్లంతా మగవాళ్లు లేనపుడు ఇళ్లకు వెళ్లి తలుపులు కొడుతున్నారని, వీళ్లది మూటలు మోసే ఉద్యోగమని చంద్రబాబు నాయుడు నానా మాటలూ అన్నారు. ఇక ఈయన గారి దత్తపుత్రుడైతే మూడడుగులు ముందుకేసి.. వలంటీర్లు అమ్మాయిలను ఎత్తుకుపోతున్నారని, ఉమెన్ ట్రాఫికింగ్‌కు పాల్పడుతున్నారని తీవ్రమైన ఆరోపణలు చేశారు. కానీ వీళ్ల పథకాలేవీ పారకపోవటంతో... తాము వలంటీర్లకు వ్యతిరేకం కాదంటూ, గెలిస్తే వారి పారితోషికాన్ని పెంచుతామంటూ మాట్లాడుతున్నారు.

బాబు యావ తెలియనిదెవరికి?

బాబుకు పని చేయటం చేతకాదు. కానీ చేయని పనిని కూడా అందంగా చెప్పుకోవటంలో మాత్రం పెద్ద బిడ్డే. అమరావతిలో ఒకటిరెండు భవనాలు కూడా కట్టకుండానే అదో పెద్ద సింగపూర్‌లా అయిపోయినట్లు అంతర్జాతీయంగా ప్రచారం చేసుకున్న ఘనత బాబుది. ఇక 2015లో గోదావరి నదిని ఈయనే కనిపెట్టినట్టు పుష్కరాల సందర్భంగా భారీ ప్రచార వీడియోను షూట్ చేయబోయి ఏకంగా 29 మంది అమాయక భక్తుల్ని బలితీసుకున్నాడు. ఏడాదిన్నర కిందట కూడా... ఎక్కువ మంది జనం వచ్చినట్లుగా చూపించుకోవాలన్న తాపత్రయంలో ఇరుకు సందులో సభ నిర్వహించి, జనాన్ని రప్పించడం కోసం తాయిలాలు కూడా ఇవ్వటంతో తొక్కిసలాట జరిగి ఆరుగురు ప్రాణాలు కోల్పోయారు. ఇలా చెబుతూ పోతే బాబు ప్రచారపిచ్చికి ఎంతైనా చాలదు.

నిందితుడిని హంతకుడని ఎలా ముద్ర వేస్తారు?

షర్మిల, సునీత, బీటెక్ రవిని నిలదీసిన హైకోర్టు ధర్మాసనం

- కోర్టు ముందు పెండింగ్‌లో ఉన్న కేసు గురించి ఎలా మాట్లాడతారు?
- హంతకుడిని సీఎం రక్షిస్తున్నారని ఎలా చెబుతారు?
- ఇలా చెప్పడం తప్పు కాదా? ఇది నేరపూరిత చర్య కాదా?
- ఐదేళ్ల క్రితం ఘటనపై ఇప్పుడెందుకు ఇంతలా మాట్లాడుతున్నారు?.. ఎందుకు మసాలా జోడిస్తున్నారు?
- మధ్యంతర ఉత్తర్వుల ఎత్తివేతకు దాఖలైన పిటిషన్లను పరిష్కరించండి
- 8లోగా నిర్ణయం వెలువరించండి
- కడప జిల్లా కోర్టుకు హైకోర్టు ఆదేశం



సాక్షి, అమరావతి: వైఎస్ వివేకా హత్య ఐదేళ్ల క్రితం జరిగితే ఇప్పుడెందుకు దాని గురించి ఇంతలా మాట్లాడుతున్నారని పీసీసీ అధ్యక్షురాలు షర్మిల, వివేకా కుమార్తె సునీత, టీడీపీ నేత బీటెక్ రవిని హైకోర్టు ప్రశ్నించింది. ఈ కేసుకు ఎందుకు మసాలా జోడిస్తున్నారని నిలదీసింది. కోర్టు ముందు పెండింగ్‌లో ఉన్న కేసు గురించి ఎలా మాట్లాడతారని ప్రశ్నించింది. ఓవైపు కేసు విచారణలో ఉంటే నిందితుడిగా ఉన్న వ్యక్తిని హంతకుడని ఎలా చెబుతారని నిలదీసింది. అలాగే హంతకుడిని ముఖ్యమంత్రి రక్షిస్తున్నారని ఎలా అంటారని ప్రశ్నించింది. ఇలా చెప్పడం తప్పు కాదా? నేరపూరిత చర్యల కిందకు రాదా? అని నిలదీసింది. అలాంటప్పుడు కడప కోర్టు అంత అత్యవసరంగా ఎందుకు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసిందని బీటెక్ రవి తరఫు సీనియర్ న్యాయవాది ఉన్నం మురళీధరరావు ప్రశ్నించారు. దీనికి హైకోర్టు ఘాటుగా స్పందించింది. కోర్టును నిందించవద్దని హెచ్చరించింది. వివేకా హత్య గురించి మాట్లాడొద్దని, అలాగే తప్పుడు ఆరోపణలు, దుష్ప్రచారం చేయొద్దంటూ ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను ఎత్తివేయాలని కోరుతూ బీటెక్ రవి తదితరులు దాఖలు చేసిన పిటిషన్లపై వీలైనంత త్వరగా విచారణ ముగించాలని కడప జిల్లా కోర్టును హైకోర్టు ఆదేశించింది. ఈ నెల 8లోపు నిర్ణయం వెలువరించాలని స్పష్టం చేసింది. తద్వారా కడప జిల్లా కోర్టు ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను సవాల్ చేస్తూ సునీత, బీటెక్ రవి, షర్మిల దాఖలు చేసిన వ్యాజ్యాలను పరిష్కరించింది. ఈ మేరకు న్యాయమూర్తులు జస్టిస్ గుహనాథన్ నరేందర్, జస్టిస్ వెణుతురుమల్లి గోపాలకృష్ణారావు ధర్మాసనం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది.

వివేకా హత్య కేసుకు మసాలా ఎందుకు కలుపుతున్నారు..?

ఈ సమయంలో ధర్మాసనం స్పందిస్తూ.. వివేకా హత్య కేసులో నిందితుడిగా ఉన్న వ్యక్తిని హంతకుడని ఎలా ముద్ర వేస్తారని ప్రశ్నించింది. అలా హంతకుడని చెప్పడం కోర్టు ధిక్కారమే అవుతుందని వైఎస్సార్‌సీపీ తరఫు సీనియర్ న్యాయవాది సీవీ మోహన్‌రెడ్డి తెలిపారు. తిరిగి ధర్మాసనం జోక్యం చేసుకుంటూ.. ఫలానా వ్యక్తి (ముఖ్యమంత్రి) నిందితులను రక్షిస్తున్నారని ఎలా చెబుతారని నిలదీసింది. వివేకా హత్య కేసులో సీబీఐ దాఖలు చేసిన చార్జిషీట్ పబ్లిక్ డాక్యుమెంట్ అని, తాము మాట్లాడుతోంది అందులో అంశాలనేనని మురళీధరరావు చెప్పారు. ధర్మాసనం స్పందిస్తూ.. వివేకా హత్య కేసుకు ఎందుకు మసాలా కలుపుతున్నారని ప్రశ్నించింది. తాము అలాంటిదేమీ చేయడం లేదని గత ఎన్నికల్లో వివేకా హత్య కేసును నారాసుర రక్తచరిత్ర అంటూ ఎన్నికల్లో వాడుకున్నారన్నారు. అదే తాము మాట్లాడుతుంటే తప్పుపడుతున్నారన్నారు. సునీత తరఫు న్యాయవాది గూడపాటి వెంకటేశ్వరరావు వాదనలు వినిపిస్తూ.. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్న సమయంలో నేతల వ్యాఖ్యలపై అభ్యంతరాలుంటే ఎన్నికల కమిషన్ వద్దకు వెళ్లాల్సి ఉంటుందన్నారు. అలాంటిదేమీ చేయకుండా నేరుగా కోర్టులో వేసిన పిటిషన్‌కు విచారణార్హత లేదన్నారు. ఇరుపక్షాల వాదనలు విన్న ధర్మాసనం.. ఈ నెల 8 తేదీలోపు బీటెక్ రవి తదితరులు దాఖలు చేసిన పిటిషన్లపై నిర్ణయం వెలువరించాలని కడప జిల్లా కోర్టును ఆదేశించింది.

సునీత తదితరుల వ్యాజ్యాలకు విచారణార్హతే లేదు..

వైఎస్సార్‌సీపీ తరఫున సీనియర్ న్యాయవాది సీవీ మోహన్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ సునీత, తదితరులు దాఖలు చేసిన వ్యాజ్యాలకు విచారణార్హతే లేదన్నారు. కడప జిల్లా కోర్టు ఇచ్చిన ఉత్తర్వులను ఎత్తివేయాలని కోరుతూ బీటెక్ రవి తదితరులు అక్కడే పిటిషన్లు దాఖలు చేశారని తెలిపారు. వాటిపై కడప జిల్లా కోర్టులో విచారణ జరుగుతోందన్నారు. మళ్లీ ఇదే అంశంపైనే హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారని, ఇది ఏమాత్రం సరికాదన్నారు. తాము పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేస్తామని గడువు ఇవ్వాలని కోరారు. బీటెక్ రవి తరఫున సీనియర్ న్యాయవాది ఉన్నం మురళీధరరావు వాదనలు వినిపిస్తూ.. వైఎస్సార్‌సీపీ పిటిషన్‌లో ప్రతివాదులుగా ఉన్న తమ వాదనలు వినకుండానే కడప జిల్లా కోర్టు ఉత్తర్వులు జారీ చేసిందన్నారు.

అవినాశ్ బెయిల్ రద్దుకు నిరాకరణ

దస్తగిరి పిటిషన్‌ను కొట్టేసిన తెలంగాణ హైకోర్టు



సాక్షి, హైదరాబాద్: మాజీమంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్యకేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న కడప ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డి బెయిల్ రద్దుకు తెలంగాణ హైకోర్టు నిరాకరించింది. కిరాయి హంతకుడు (అప్రూవర్, ఏ–4) దస్తగిరి దాఖలు చేసిన పిటిషన్‌ను కొట్టివేస్తూ శుక్రవారం తీర్పు చెప్పింది. దస్తగిరి ఆరోపిస్తున్నట్లు అవినాశ్ సాక్షులను బెదిరించినట్లు సరైన ఆధారాలు లేవని స్పష్టం చేసింది. అవినాశ్ బెయిల్ రద్దుచేయాలని కోరుతూ ఇదే కేసులో నిందితుడైన దస్తగిరి తెలంగాణ హైకోర్టులో మార్చిలో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై విచారించిన న్యాయమూర్తి జస్టిస్ కె.లక్ష్మణ్ శుక్రవారం తీర్పు చెప్పారు. వైఎస్ వివేకానందరెడ్డి హత్యకేసులో వైఎస్ అవినాశ్‌రెడ్డి బెయిల్ రద్దు చేయాలని కోరుతూ అప్రూవర్‌గా మారిన కిరాయి హంతకుడు పిటిషన్ వేయడం వెనుక రాజకీయ దురుద్దేశాలున్నాయని సీనియర్ న్యాయవాది టి.నిరంజన్‌రెడ్డి అంతకుముందు వాదనల్లో పేర్కొన్నారు. ఈ అంశంలో ఎన్నికల్లో లబ్ధిపొందేందుకు ఏపీ ప్రతిపక్ష నేత చంద్రబాబు ఆదేశాలతో దస్తగిరి ఈ పిటిషన్ దాఖలు చేశాడని చెప్పారు. ఓ పక్క కేసు విచారణ సాగుతుండగా.. కడప నుంచి పోటీచేస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి, వైఎస్ వివేకా కూతురు.. అవినాశ్‌ను హంతకుడిగా చిత్రీకరించేందుకు శతవిధాలా ప్రయత్నం చేస్తున్నారని వివరించారు. ఇక్కడ రెండు ఆరోపణలు చేస్తున్నారని.. ఒకటి దస్తగిరి తండ్రిపై దాడి, రెండోది జైల్లో దస్తగిరిని చైతన్యరెడ్డి కలిశారన్నది.. ఈ రెండు ఆరోపణలకు ఒక్క ఆధారమూ లేదని చెప్పారు. సీబీఐ వాదనల అనంతరం తీర్పు రిజర్వు చేసిన న్యాయమూర్తి శుక్రవారం తీర్పు చెప్పారు.

వైఎస్ భాస్కర్‌రెడ్డికి బెయిల్

- తెలంగాణ హైకోర్టు ఉత్తర్వులు
- పలు షరతుల విధింపు
- హియర్ సే ఎవిడెన్స్ సాక్ష్యంగా చెల్లదు
- గూగుల్ టేకవుట్ ప్రామాణికం కాదని ఆ సంస్థే చెబుతుంది
- వాదనలు వినిపించిన పిటిషనర్ తరఫు న్యాయవాది నిరంజన్‌రెడ్డి
- కావాలనే సీబీఐ విచారణను జాప్యం చేస్తోంది
- ఈ వాదనలతో ఏకీభవించిన కోర్టు.. బెయిల్‌కు అంగీకారం
- ఇదే కేసులో గజ్జల ఉదయ్‌శంకర్‌రెడ్డి, సునీల్ యాదవ్ బెయిల్ పిటిషన్లు కొట్టివేత

సాక్షి, హైదరాబాద్: మాజీ మంత్రి వైఎస్ వివేకానంద రెడ్డి హత్య కేసులో వైఎస్ భాస్కర్‌రెడ్డికి తెలంగాణ హైకోర్టు శుక్రవారం బెయిల్ మంజూరు చేసింది. ఈ సందర్భంగా పలు షరతులు విధించింది. ట్రయల్ కోర్టు అనుమతి లేకుండా ఆంధ్రప్రదేశ్‌లోకి ప్రవేశించొద్దని ఆదేశించింది. అలాగే కోర్టుకు పాస్‌పోర్టు, రూ.2 లక్షల వ్యక్తిగత పూచీకత్తు సమర్పించాలని, ఇద్దరు షూరిటీలు ఇవ్వాలని సూచించింది. ప్రతి మంగళవారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల మధ్య హైదరాబాద్ సీసీఎస్‌లో హాజరు కావాలని భాస్కర్‌రెడ్డికి ఆదేశాలు జారీ చేసింది. విచారణలో జోక్యం చేసుకోవద్దని, సాక్షులను బెదిరించొద్దని ఆదేశించింది. కాగా వైఎస్ వివేకా హత్య కేసులో గజ్జల ఉదయ్‌కుమార్‌రెడ్డి, సునీల్ యాదవ్ బెయిల్ పిటిషన్లను కొట్టివేసింది. సీబీఐ దర్యాప్తు పక్షపాత వైఖరితో సాగుతోందని, కావాలనే ఈ కేసులో తమను ఇరికించారని.. తమకు వ్యతిరేకంగా ఎలాంటి సాక్ష్యం లేదని.. బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ వైఎస్ భాస్కర్‌రెడ్డి, ఉదయ్‌కుమార్‌రెడ్డితో పాటు సునీల్ యాదవ్ హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేసిన సంగతి తెలిసిందే. దీనిపై విచారణ చేపట్టిన న్యాయమూర్తి జస్టిస్ కె.లక్ష్మణ్ ధర్మాసనం శుక్రవారం తీర్పు వెలువరించారు.

భాస్కర్‌రెడ్డి అరెస్టు సమర్థనీయం కాదు..

నాకు మరొకరు చెప్పారని సాక్ష్యం చెప్పడం (హియర్ సే ఎవిడెన్స్) చట్టప్రకారం సాక్ష్యంగా చెల్లదని వైఎస్ భాస్కర్ రెడ్డి తరఫు సీనియర్ న్యాయవాది నిరంజన్ రెడ్డి వాదనలు వినిపించారు. అలాగే గూగుల్ టేకవుట్ ప్రామాణికమని ఆ సంస్థే ధృవీకరణ ఇవ్వదన్నారు. ఇలాంటి సాక్ష్యాలతో వైఎస్ భాస్కర్‌రెడ్డి, ఉదయ్‌కుమార్‌రెడ్డి అరెస్టు సమర్థనీయం కాదన్నారు. 'మూడో చార్జిషీట్ (ఈ కేసులో 2వ మధ్యంతర చార్జిషీట్) దాఖలు చేసే వరకు పిటిషనర్లపై ఎలాంటి ఆరోపణలు లేవు. ఆ తర్వాత నిందితులుగా చేర్చడంలో కుట్ర కోణం దాగి ఉంది. వైఎస్ అవినాశ్‌రెడ్డి బెయిల్ రద్దు కోరుతూ సుప్రీంకోర్టును ఆశ్రయించినవారు కిరాయి హంతకుడు దస్తగిరి (ఏ–4) యథేచ్ఛగా తిరగడానికి మాత్రం పూర్తిగా సహకరిస్తున్నారు. హత్య వెనుక వైఎస్ భాస్కర్‌రెడ్డి, ఉదయ్‌కుమార్‌రెడ్డి ఉన్నారని గంగిరెడ్డి తనకు చెప్పారని దస్తగిరి వాంగ్మూలం ఇచ్చినా.. గంగిరెడ్డి మాత్రం తాను అలా చెప్పలేదని పేర్కొన్నారు. దస్తగిరి చెప్పిన విషయానికి అత్యంత ప్రాధాన్యం ఇస్తున్న సీబీఐ ఇతరుల వాంగ్మూలాలను మాత్రం పట్టించుకోవడంలేదు' అని నిరంజన్ రెడ్డి కోర్టు దృష్టికి తెచ్చారు.

తండ్రి తన కుమారుడికి ఫోన్ చేయడం కూడా కుట్రేనా?

'రెండున్నర నెలలు ఢిల్లీలో సీబీఐ కస్టడీలో ఉన్నానని దస్తగిరి చెప్పాడు. ఆ తర్వాతే అప్రూవర్‌గా మారి పిటిషనర్ల పేర్లు చెప్పాడు. దస్తగిరి బెయిల్‌కు సీబీఐ పూర్తిగా సహకరించింది. నాటి దర్యాప్తు అధికారి రాంసింగ్‌పై తీవ్ర ఆరోపణలున్నాయి. ఈయనపై సుప్రీంకోర్టులో పిటిషన్లు కూడా దాఖలయ్యాయి. దీంతో అత్యున్నత న్యాయస్థానం కేసు దర్యాప్తు బాధ్యత నుంచి ఆయనను తప్పించి.. మరొకరిని నియమిస్తూ ఆదేశాలు జారీ చేసింది. హత్య జరిగిన రోజు వైఎస్ అవినాశ్‌రెడ్డికి ఆయన తండ్రి వైఎస్ భాస్కర్‌రెడ్డి ఫోన్ చేయడాన్ని కూడా సీబీఐ కుట్ర కోణంగా పేర్కొనడం సమంజసం కాదు. తండ్రి తన కుమారుడికి ఫోన్ చేయడం కూడా కుట్రేనా? కావాలనే ట్రయల్ కోర్టులో సీబీఐ విచారణను సాగదీస్తోంది' అని నిరంజన్‌రెడ్డి న్యాయమూర్తికి నివేదించారు.

వీటిని పరిగణనలోకి తీసుకుని బెయిల్ ఇవ్వాలి..

"పిటిషనర్లపై ఉన్నది కేవలం ఆరోపణలు మాత్రమే సాక్ష్యాలు లేవు. వైఎస్ భాస్కర్‌రెడ్డి వయసు దాదాపు 72 ఏళ్లు. ఆయన ఆరోగ్య పరిస్థితి బాగోకపోవడంతో ట్రయల్ కోర్టు పలుమార్లు మధ్యంతర బెయిల్ మంజూరు చేసింది. అత్యవసరమైతే 30 నిమిషాల్లో నిపుణులైన వైద్యుల వద్దకు చేర్చాల్సి ఉంటుంది. జైలులో ఉంటే అదెలా సాధ్యం? ఆయనకు ఏదైనా జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారు? ఆయన ఏడాదిగా జైలులో ఉంటున్నారు. వీటిని పరిగణనలోకి తీసుకుని భాస్కర్‌రెడ్డితో పాటు ఉదయ్‌కుమార్‌రెడ్డికి బెయిల్ మంజూరు చేయాలి. ఇదే హైకోర్టు శివశంకర్‌రెడ్డికి బెయిల్ మంజూరు చేసింది. వీరికి కూడా అదే వర్తిస్తుంది. సరైన సాక్ష్యాలు లేనప్పుడు నెలల తరబడి నిందితులను జైలులో ఉంచడం వారి హక్కులను హరించడమే అవుతుందని సుప్రీంకోర్టు పలుమార్లు చెప్పింది' అని నిరంజన్‌రెడ్డి గుర్తు చేశారు. ఆ తర్వాత సీబీఐ తరఫు న్యాయవాది వాదనలు వినిపించారు. వాదనలు పూర్తి కావడంతో న్యాయమూర్తి గత నెలలో తీర్పును రిజర్వ్ చేశారు. తాజాగా వైఎస్ భాస్కర్‌రెడ్డి తరఫు న్యాయవాది వాదనలతో ఏకీభవించిన న్యాయమూర్తి ఆయనకు బెయిల్ మంజూరు చేస్తూ తన తీర్పును వెలువరించారు.

క్లుప్తంగా...

భారీగా బంగారం, వెండి పట్టివేత

- 34 కేజీల బంగారం, 43 కిలోల వెండి స్వాధీనం

శంషాబాద్ (హైదరాబాద్): శంషాబాద్ ఎయిర్‌పోర్టు ప్రధాన రోటరీ వద్ద ఆర్‌జీఐఏ తనిఖీల్లో భారీఎత్తున బంగారం, వెండి బయటపడ్డాయి. ఆర్‌జీఐఏ సీఐ బాలరాజు చెప్పిన వివరాల ప్రకారం..ముంబైలోని ఒక కొరియర్ ఏజెన్సీ ద్వారా ఎయిర్‌పోర్టుకు కార్గోలో వచ్చిన పార్సిల్‌ను.. నగరంలోని బేగంబజార్ కొరియర్ సంస్థకు చెందిన ఆరుగురు సిబ్బంది అందుకుని మారుతి వ్యాన్‌లో బయల్దేరారు. అధికారులు తనిఖీలు చేపట్టగా వారి వద్ద 34 కిలోల బంగారం, 43 కిలోల వెండి బయటపడ్డాయి. ఎన్నికల సంఘం అధికారిక ధ్రువీకరణ పత్రం, బిల్లులకు సంబంధించిన ఇతర పత్రాలు కూడా సరిగ్గా లేవని గుర్తించారు. దీంతో స్వాధీనం చేసుకున్న బంగారం, వెండిని ఎన్నికల సంఘం అధికారులకు అందజేసి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

5.96 కిలోల బంగారపు కడ్డీలు స్వాధీనం

- బంగారం విలువ రూ.4.31 కోట్లు
- డీఆర్‌ఐ అధికారుల అదుపులో నలుగురు



చౌటుప్పుల్: హైదరాబాద్–విజయవాడ జాతీయ రహదారిపై పంతంగి టోల్‌ప్లాజా వద్ద గురువారం అర్ధరాత్రి డీఆర్‌ఐ అధికారులు భారీగా బంగారం స్వాధీనం చేసుకున్నారు. కోల్‌కతా నుంచి నలుగురు రూ.4.31 కోట్ల విలువైన 5.96 కిలోల బంగారాన్ని 35 కడ్డీలుగా మార్చారు. ఆ కడ్డీలను కారులో స్టీరింగ్ కింది భాగంలో ఎవరికీ అనుమానం రాకుండా ఉండేలా ప్రత్యేకంగా అమర్చారు. అక్కడి నుంచి హైదరాబాద్‌కు బయల్దేరారు. పక్కా సమాచారం అందడంతో డీఆర్‌ఐ (డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటలిజెన్స్) అధికారులు పంతంగి టోల్‌ప్లాజా వద్ద మాటు వేశారు. వాహనాల తనిఖీలో భాగంగా కారును తనిఖీ చేయగా బంగారం కడ్డీలు లభించాయి. వెంటనే కారులోని నలుగురు స్మగ్లర్లను అదుపులోకి తీసుకున్నారు. నిందితులతోపాటు బంగారాన్ని హైదరాబాద్‌లోని పోలీస్ ప్రధాన కార్యాలయానికి తరలించారు. అయితే దీనిపై తమకు వివరాలు తెలియవని స్థానిక పోలీసులు తెలిపారు.

స్వయంగా హాజరుకు అనుమతివ్వండి

ప్రత్యేక కోర్టును కోరిన ఎమ్మెల్సీ కవిత

సాక్షి, న్యూఢిల్లీ: ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో తీహార్ జైలులో జ్యుడీషియల్ కస్టడీలో ఉన్న బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత.. స్వయంగా హాజరుకు అవకాశం కల్పించాలని రౌజ్ అవెన్యూ కోర్టును కోరారు. ఈ మేరకు ఆమె తరఫు న్యాయవాదులు ప్రత్యేక కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. కవిత జ్యుడీషియల్ కస్టడీ ఈ నెల 7తో ముగియనుంది. సీబీఐ, ఈడీ కేసుల్లో ఈ నెల 6న తీర్పు కవితకు వ్యతిరేకంగా వస్తే మంగళవారం ఆమెను న్యాయమూర్తి ముందు హాజరుపరచాల్సి వస్తుంది. గత విచారణ సమయంలో కవితను వర్చువల్ విధానం ద్వారా అధికారులు న్యాయమూర్తి ముందు హాజరు పరిచారు. అయితే ఈ సారి స్వయంగా హాజరయ్యేలా అవకాశం ఇవ్వాలని ఆమె అభ్యర్థించారు. దీనిపై స్పందించిన ప్రత్యేక కోర్టు, దర్యాప్తు సంస్థలకు నోటీసులు జారీ చేసింది.

సీబీఐ విచారణకు అభ్యంతరం లేదు

- వామనరావు దంపతుల కేసులో సుప్రీంకోర్టుకు స్పష్టం చేసిన తెలంగాణ ప్రభుత్వం

సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణలో సంచలనం సృష్టించిన న్యాయవాద దంపతులు గట్టు వామనరావు, నాగమణి హత్య కేసును సీబీఐ విచారణ చేసేందుకు ఎలాంటి అభ్యంతరం లేదని తెలంగాణ ప్రభుత్వం సుప్రీం కోర్టుకు స్పష్టం చేసింది. వామనరావు దంపతుల హత్యపై ఉన్నతస్థాయి విచారణ జరిపించాలంటూ గట్టు కిషన్‌రావు దాఖలు చేసిన పిటిషన్‌ను శుక్రవారం జస్టిస్ సుందరేశ్, జస్టిస్ ఎస్‌వీఎన్ భట్టిల ధర్మాసనం విచారించింది. ఈ కేసు పిటిషనర్ కోరినట్లు సీఐడీతో విచారణ జరిపించడానికి లేదంటే కోర్టు ఆదేశిస్తే సీబీఐ విచారణకు సమ్మతమేనని తెలంగాణ ప్రభుత్వం తరఫు న్యాయవాది ధర్మాసనానికి తెలిపారు. దీంతో కేసులో నిందితులను కూడా పార్టీలుగా చేర్చాలని ధర్మాసనం పిటిషనర్‌కు సూచించింది. మరికొన్ని పత్రాలు, సీడీలు కోర్టుకు సమర్పించడానికి పిటిషనర్‌కు అనుమతిచ్చింది. నిందితులంతా బెయిల్‌పై ఉన్నారని పిటిషనర్ తరఫు న్యాయవాది ధర్మాసనం దృష్టికి తీసు కొచ్చారు. నిందితుల వాదనలు విన్న తర్వాతే నిర్ణయం తీసుకుంటామని ధర్మాసనం స్పష్టం చేసింది. సీబీఐ విచారణకు అభ్యంతరం లేదన్న తెలంగాణ ప్రభుత్వ వైఖరిని రికార్డుల్లోకి తీసుకుంటున్నట్లు పేర్కొన్న ధర్మాసనం నిందితులకు నోటీసులకు జారీ చేసింది.

సాయం లేదు.. సానుభూతే మిగిలింది

పని ఇవ్వడం లేదు..పూట గడవటమే కష్టంగా ఉంది ● ఆగిపోయిన గౌరవ వేతనం..వివాదాల్లో ఇంటి స్థలం

'సాక్షి'తో పద్మశ్రీ కిన్నెర మొగులయ్య

తుర్కయాంజాల్: 'అసెంబ్లీ ఎన్నికల నాటి నుంచి నెలవారీ గౌరవ వేతనం నిలిచిపోయింది. నా కుమారుడికి అనారోగ్య సమస్యలున్నాయి. నా ఆరోగ్యం అంతంత మాత్రమే. ప్రతినెలా మందులు, వైద్యానికి రూ.7వేల దాకా ఖర్చు అవుతుంది. ఇంట్లో పూట గడవడం కష్టంగా ఉంది. ఎక్కడికైనా పనికి వెళితే సానుభూతి చూపించి పని కూడా ఇవ్వడం లేదని' పద్మశ్రీ కిన్నెర మొగులయ్య వాపోయాడు. మొగులయ్య ఇటీవల తుర్కయాంజాల్ మున్సిపల్ పరిధి కమ్మగూడలోని ఓ నిర్మాణ స్థలం వద్ద పనిచేస్తూ కనిపించిన ఓ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. దీనిపై బీఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ట్విట్టర్ (ఎక్స్) వేదికగా స్పందించారు. బీఆర్‌ఎస్ పార్టీ ఆయనకు ఎప్పుడూ అండగా ఉంటుందని పేర్కొన్నారు. దీనిపై స్పందించిన ప్రభుత్వం కూడా ఆయనకు నెలవారీ గౌరవ వేతనం చెల్లిస్తున్నామని పేర్కొనడం గమనార్హం. ఈ నేపథ్యంలో మొగులయ్యను 'సాక్షి' ఫోన్‌లో పలకరించింది.

12 మెట్ల కిన్నెర గానంతో....

నాగర్‌కర్నూల్ జిల్లా లింగాల మండలం అవుసాలికుంటకు చెందిన దర్శనం మొగులయ్య 12 మెట్ల కిన్నెర కళాకారుడు. గతంలో ఆయన 52 దేశాల ప్రతినిధుల ముందు తన 12 మెట్ల కిన్నెర గానంతో ప్రదర్శనలు ఇచ్చారు. ఆయన జీవిత చరిత్రను 8వ తరగతి సాంఘిక శాస్త్రంలో పాఠ్యాంశంగా చేర్చారు. 2015లో కేసీఆర్ చేతుల మీదుగా ఉగాది విశిష్ట పురస్కారం అందుకున్నారు. భారత ప్రభుత్వం 2022లో పద్మశ్రీ పురస్కారంతో సత్కరించింది. రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ ఆయన కళపై డాక్యుమెంటరీ రూపొందించింది. ఆ తర్వాత తెలంగాణ ప్రభుత్వం రూ.కోటి నగదు ప్రోత్సాహంతో పాటు, రంగారెడ్డి జిల్లాలో 600 గజాల ఇంటి స్థలాన్ని ఇస్తామని హామీ ఇచ్చింది. హయత్‌నగర్‌లో స్థలం కేటాయించింది. పొజిషన్ చూపించకపోవడం, వివాదాల నేపథ్యంలో ఆయన ఆ స్థలంలోకి వెళ్లలేకపోయారు. ప్రభుత్వం ఇచ్చిన కోటిరూపాయల్లో కొంత ఖర్చు చేసి తుర్కయాంజల్ 60 గజాల స్థలం కొనుగోలు చేసి ఇంటి నిర్మాణానికి శ్రీకారం చుట్టాడు. అయితే ఆ పనులు మధ్యలోనే ఆగిపోయాయి. మిగిలిన డబ్బుతో పిల్లలకు పెళ్లిళ్లు చేసి, అప్పులు తీర్చాడు.



కూలి పనిచేస్తున్న కిన్నెర మొగులయ్య (ఫైల్)

ఆ ఇంటి స్థలం కోసం..

గత ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ఇంటిస్థల విషయమై పలుమార్లు రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయానికి వెళ్లాడు. అధికారులను కలిసినా ఏ ఫలితం లేదు. మూడుసార్లు వెళితే...మూడుసార్లు కొత్త కలెక్టర్‌లు దర్శనమిచ్చారని చెప్పాడు. ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కను కలిశానని, తన సమస్యలను వారి దృష్టికి తీసుకెళ్లానని చెప్పారు.

'అమిత్ షా' వీడియో అప్‌లోడ్ చేసింది వంశీకృష్ణ

కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా టీమ్‌లో సభ్యుడిగా గుర్తింపు

- వాట్సాప్ ద్వారా అతడి వద్దకు చేరిన మార్ఫింగ్ వీడియో
- దాన్ని తమ ఖాతాల ద్వారా షేర్ చేసిన మరో నలుగురు
- వెల్లడించిన హైదరాబాద్ సైబర్ క్రైమ్ డీసీపీ దార కవిత
- ఐదుగురికీ షరతులతో బెయిల్ మంజూరు చేసిన నాంపల్లి కోర్టు
- హైదరాబాద్‌లోనే మకాం వేసిన ఢిల్లీ స్పెషల్ సెల్ అధికారులు
- న్యాయపరంగా ఒత్తిడి చేసేందుకు ప్రయత్నాలు.. హైదరాబాద్‌కు వచ్చిన ఓ సీనియర్ అధికారి

సాక్షి, హైదరాబాద్: కేంద్ర హోం మంత్రి అమిత్ షా మార్ఫింగ్ వీడియోను కాంగ్రెస్ 'ఎక్స్' హ్యాండిల్‌లో అప్‌లోడ్ చేసినది టీపీసీసీ సోషల్ మీడియా యూనిట్‌కు చెందిన పెండ్యాల వంశీకృష్ణ అని హైదరాబాద్ సైబర్ క్రైమ్ డీసీపీ దార కవిత వెల్లడించారు. ఆయనతోపాటు నలుగురు నిందితులను గురువారం అరెస్టు చేశామని.. వారిని శుక్రవారం నాంపల్లి కోర్టులో ప్రవేశపెట్టామని చెప్పారు. కోర్టు వారికి షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసిందని ప్రకటించారు. మరోవైపు ఈ ఐదుగురు నిందితులలో ముగ్గురు ఢిల్లీ స్పెషల్ సెల్ పోలీసులకు కూడా వాంటెడ్ కావడంతో.. ఆ అధికారులు హైదరాబాద్‌లోనే మకాం వేశారు. నాంపల్లి కోర్టు బెయిల్ మంజూరు చేసిన తర్వాత ఆ ఐదుగురి ఆచూకీ వీరికి లభించలేదు. దీంతో న్యాయపరంగా ఒత్తిడి చేయాలని నిర్ణయించిన ఢిల్లీ స్పెషల్ సెల్.. ఓ ఐపీఎస్ అధికారిని హైదరాబాద్‌కు పంపడం గమనార్హం.

వాట్సాప్‌లో వచ్చిన వీడియోతో..

గత నెల 23న మెదక్‌లో జరిగిన ఎన్నికల ప్రచార సభలో కేంద్ర హోంమంత్రి అమిత్ షా పాల్గొన్నారు. ఆయన రిజర్వేషన్లను రద్దు చేస్తామని మాట్లాడినట్టుగా మార్ఫింగ్ చేసిన వీడియో అదే రోజున వాట్సాప్ ద్వారా వంశీకి చేరింది. వంశీ దాన్ని 'ఎట్‌ఐఎన్‌సీతెలంగాణ' హ్యాండిల్‌లో అప్‌లోడ్ చేయడంతోపాటు మరికొన్ని ఖాతాలకు షేర్ చేశారు. ఇదే సోషల్ మీడియా యూనిట్‌లో సభ్యులుగా ఉన్న మన్నె సతీశ్, పి.నవీన్, ఆస్మా తస్లీం, కోయ గీత కూడా తమ వ్యక్తిగత హ్యాండిల్స్‌లో ఆ వీడియోను అప్‌లోడ్ చేయడంతోపాటు వాట్సాప్ గ్రూపుల్లోనూ షేర్ చేశారు. అయితే ఈ వీడియోలోని అంశాలు సున్నితంగా ఉన్నట్టు గుర్తించి అవన్నీ డిలీట్ చేశారు. కానీ అప్పటికే ఆ వీడియో దేశవ్యాప్తంగా వైరల్‌గా మారింది. బీజేపీ తెలంగాణ జనరల్ సెక్రటరీ జి.ప్రేమేందర్‌రెడ్డి దీనిపై ఫిర్యాదు చేయడంతో 27న హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసుస్టేషన్‌లో.. కేంద్రం అధీనంలోని ఐ4సీ ఫిర్యాదుతో ఢిల్లీ స్పెషల్ సెల్‌లో 28న కేసులు నమోదయ్యాయి. ఢిల్లీ స్పెషల్ సెల్ పోలీసులు సోమవారం హైదరాబాద్‌కు వచ్చి సీఎం రేవంత్‌రెడ్డికి, టీపీసీసీ సోషల్ మీడియా యూనిట్‌కు చెందిన మన్నె సతీష్, పి.నవీన్, ఆస్మా తస్లీంలకు నోటీసులు జారీ చేశారు. రేవంత్‌రెడ్డి తన న్యాయవాది ద్వారా లిఖిత పూర్వక సమాధానం ఇవ్వగా.. మిగతా ముగ్గురూ బుధవారం ఢిల్లీకి వెళ్లలేదు. దీనితో ఢిల్లీ స్పెషల్ సెల్ పోలీసులు గురువారం తెల్లవారుజామున హైదరాబాద్‌కు చేరుకున్నారు. కానీ రాష్ట్ర సైబర్ క్రైమ్ పోలీసులు అప్పటికే ఈ ముగ్గురితోపాటు వంశీ, గీతలను అదుపులోకి తీసుకున్నారు.

కోర్టులో బెయిల్..

సైబర్ క్రైమ్ పోలీసులు శుక్రవారం ఐదుగురు నిందితులను నాంపల్లి కోర్టులో హాజరు పరిచారు. కోర్టు వారికి రూ.10 వేల చొప్పున ష్యూరిటీ, ప్రతి సోమ, శుక్రవారాల్లో దర్యాప్తు అధికారి ముందు హాజరుకావాలన్న షరతులతో బెయిల్ ఇచ్చింది. మరోవైపు ఢిల్లీ స్పెషల్ సెల్ బృందం హైదరాబాద్‌లోనే మకాం వేసింది. సతీశ్, నవీన్, ఆస్మా తస్లీంలను అదుపులోకి తీసుకుని ఢిల్లీ తరలించాలని భావించింది. కానీ కోర్టు నుంచి బయటికి వచ్చిన ఐదుగురి ఆచూకీ స్పెషల్ సెల్‌కు దొరకలేదు. దీంతో న్యాయపరంగా ఒత్తిడి చేయాలని నిర్ణయించిన ఢిల్లీ ఉన్నతాధికారులు.. ఓ సీనియర్ ఐపీఎస్ అధికారిని శుక్రవారం హైదరాబాద్ పంపారు.

ఫోన్లు, కంప్యూటర్లు స్వాధీనం చేసుకోవడంతో

ఢిల్లీ స్పెషల్ సెల్ పోలీసులు మన్నె సతీశ్, పి.నవీన్, ఆస్మా తస్లీమాలకు ఇచ్చిన నోటీసుల్లో ఎలక్ట్రానిక్ డివైజ్‌లతో సహా రావాలని స్పష్టం చేసింది. సాధారణంగా ఇలాంటి కేసుల్లో ఫోన్, ట్యాబ్, ల్యాప్‌టాప్, సీపీయూ లేదా హార్డ్‌డిస్క్ వంటి డివైజ్‌లను స్వాధీనం చేసుకుని.. అందులోని ఆధారాలను చూపుతుంటారు. అయితే వీరిని ముందే అరెస్టు చేసిన సైబర్ క్రైమ్ పోలీసులు.. ఐదు సెల్‌ఫోన్లు, ఒక ట్యాబ్, రెండు ల్యాప్‌టాప్స్, రెండు సీపీయూలను స్వాధీనం చేసుకున్నారు. వాటిని ఫోరెన్సిక్ పరీక్షల నిమిత్తం కోర్టు ద్వారా ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపనున్నారు. అంటే భవిష్యత్తులో మన్నె సతీశ్, నవీన్, తస్లీమాలను ఢిల్లీ స్పెషల్ సెల్ అదుపులోకి తీసుకోగలిగినా.. ఎలక్ట్రానిక్ డివైజ్‌లను స్వాధీనం చేసుకోవడం మాత్రం కష్టసాధ్యమేనని నిపుణులు చెప్తున్నారు. వాటిని విశ్లేషించనిదే నేర నిరూపణకు ఆధారాలను సేకరించడం సాధ్యం కాదని అంటున్నారు. మరోవైపు టీపీసీసీ సోషల్ మీడియా యూనిట్‌లో పనిచేస్తున్న పెండ్యాల వంశీకృష్ణకు వాట్సాప్ ద్వారా ఈ మార్ఫింగ్ వీడియో ఎవరు పంపారనే దానిపై హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు స్పష్టత ఇవ్వలేదు.

నిందితులపై కోడ్ ఉల్లంఘన కేసు కూడా..

టీపీసీసీ సోషల్ మీడియా యూనిట్ అమిత్ షా మార్ఫింగ్ వీడియోను షేర్ చేయడంలో ఎన్నికల కోడ్ ఉల్లంఘన కూడా ఉన్నట్టు సైబర్ క్రైమ్ పోలీసులు గుర్తించారు. 27న ఐపీసీలోని 469, 505 (1)(సీ) సెక్షన్ల కింద మాత్రమే ఈ కేసు పెట్టగా.. అదనంగా 171 జీ, 502 (2) సెక్షన్లతోపాటు ప్రజాప్రాతినిధ్య చట్టం–1951లోని 125 సెక్షన్ కూడా జోడించినట్లు తెలిపారు.

ఓటుకు కోట్లు కేసు విచారణ వాయిదా

బీఆర్‌ఎస్ నేతల పిటిషన్ విచారించిన సుప్రీంకోర్టు



సాక్షి, న్యూఢిల్లీ: తెలుగు రాష్ట్రాల్లో సంచలనం సృష్టించిన ఓటుకు కోట్లు కేసు విచారణను సుప్రీం కోర్టు వాయిదా వేసింది. కేసు దర్యాప్తును మధ్యప్రదేశ్‌కు బదిలీ చేయాలంటూ బీఆర్‌ఎస్ నేతలు జగదీశ్‌రెడ్డి, సత్యవతి రాథోడ్, మహమ్మద్ అలీ, సంజయ్ దాఖలు చేసిన పిటిషన్‌ను శుక్రవారం జస్టిస్ బీఆర్ గవాయి, జస్టిస్ సతీష్ చంద్ర శర్మ, జస్టిస్ సందీప్ మెహతాతో కూడిన ధర్మాసనం విచారించింది. ఈ పిటిషన్ రిజిస్ట్రీ దగ్గర విచారణ జరగాల్సి ఉండగా కేవలం రాజకీయ ఉద్దేశంతోనే బెంచ్ ముందు పిటిషనర్లు ప్రస్తావించారని తెలంగాణ ప్రభుత్వం తరఫు సీనియర్ న్యాయవాదులు ముకుల్ రోహత్గి, మేనకా గురుస్వామి ధర్మాసనం దృష్టికి తీసుకొచ్చారు. పిటిషనర్ల తరఫు సీనియర్ న్యాయవాది సిద్ధార్థ దవే అభ్యంతరం తెలిపి.. పిటిషనర్ల వాదన వినాలని ధర్మాసనానికి విజ్ఞప్తి చేశారు.

మధ్యప్రదేశ్‌కే ఎందుకు?

దేశంలో అన్ని రాష్ట్రాలు ఉండగా మధ్యప్రదేశ్‌కు బదిలీ చేయాలని ఎందుకు కోరుకుంటున్నారని బీఆర్‌ఎస్ నేతల తరఫు న్యాయవాదులను జస్టిస్ శర్మ ప్రశ్నించారు. ఈ సమయంలోనే ఇరు పక్షాల న్యాయవాదుల మధ్య వాగ్వాదం జరిగింది. మరోవైపు తెలంగాణ ప్రభుత్వం తరఫు సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూత్రా ఆన్‌లైన్ వాదనలు ప్రారంభించడంతో ధర్మాసనం ఒకింత అసహనం వ్యక్తం చేసింది. క్రమశిక్షణ అవసరమని హితవు పలికింది. విచారణను జూలైకు వాయిదా వేస్తున్నట్లు ధర్మాసనం పేర్కొంది. తెలంగాణ ప్రభుత్వం తరఫు ఏఓఆర్ శ్రావణ్‌కుమార్, పిటిషనర్ల తరఫు సీనియర్ న్యాయవాది దామా శేషాద్రి నాయుడు హాజరయ్యారు.

రుణం తీసుకుని ఎగ్గొట్టారు.. పదకొండేళ్ల తర్వాత చిక్కారు

- బ్యాంకు నుంచి, పలువురు వ్యక్తుల నుంచి కోట్లలో రుణం తీసుకున్న దంపతులు
- బెంగళూరులో పోలీసులకు దొరికిన దంపతులు

సాక్షి,హైదరాబాద్: బ్యాంకులు, పలు ప్రైవేటు ఫైనాన్స్ సంస్థలు, పెట్టుబడిదారులను రూ.కోట్లలో మోసగించిన ఇద్దరు పాత నేరస్తులను సీఐడీ తెలంగాణ విభాగం అధికారులు అరెస్టు చేశారు. ఈ మేరకు సీఐడీ అదనపు డీజీ శిఖాగోయెల్ ఈ మేరకు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. బెంగళూరుకు చెందిన మనికొండ ఆంజనేయులు, ఆయన భార్య మనికొండ రీతాలు పలు రకాల మొబైల్ ఫోన్లు, కమ్యూనికేషన్ పరికరాలను దిగుమతి చేసే వ్యాపారం కోసం ఎస్‌బీఐ బాల్‌నగర్ బ్రాంచ్ నుంచి 2013లో రూ.27కోట్లు రుణం తీసుకున్నారు. ఆ తర్వాత నుంచి రుణం ఎగవేయడంతో బ్యాంకు అధికారులు బాల్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆ కేసు దర్యాప్తును సీఐడీకి బదిలీ చేశారు. కేసు దర్యాప్తులో భాగంగా హైదరాబాద్ సిటీ, సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోనూ ఈ ఇద్దరిపై మరో నాలుగు కేసులు కూడా నమోదైనట్లు తెలిసింది. బ్యాంకులతోపాటు పలువురి నుంచి మొత్తం రూ.60 కోట్ల మేర వసూలు చేసి మోసగించినట్లు కూడా వెల్లడైంది. పూర్తి సమాచారం సేకరించిన సీఐడీ బృందం 11 ఏళ్ల తర్వాత నిందితులిద్దరినీ బెంగళూరులో అరెస్టు చేసి కూకట్‌పల్లి అదనపు మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ కోర్టులో హాజరు పరిచినట్లు శిఖా గోయెల్ తెలిపారు.

చట్టప్రకారం చర్యలు తీసుకోండి

బీఆర్‌ఎస్ వినతిపత్రంపై కేంద్ర ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం



సాక్షి, హైదరాబాద్: ఫోన్ ట్యాపింగ్‌కు సంబంధించి బీఆర్‌ఎస్ ఇచ్చిన వినతి పత్రంపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. ఫోన్ ట్యాపింగ్ కేసులో కేటీఆర్‌పై నిరాధార ఆరోపణలను ప్రసారం చేస్తున్న యూట్యూబ్ చానెళ్లు, వెబ్‌సైట్లను బ్లాక్ చేయాలని కోరుతూ బీఆర్‌ఎస్ తరఫున ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరెడ్డి పిటిషన్ దాఖలు చేశారు. అలాంటి వీడియోలను నిలుపుదల చేయడంతోపాటు గతంలో చేసిన వాటిని తొలగించేలా లేదా బ్లాక్ చేసేలా సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లకు సూచించాలని కేంద్ర సమాచార, ప్రసార శాఖ ఆదేశాలు ఇవ్వాలని కోరారు. ఈ పిటిషన్‌పై న్యాయమూర్తి సీవీ భాస్కర్‌రెడ్డి ధర్మాసనం శుక్రవారం విచారణ చేపట్టింది. పిటిషనర్ తరఫు న్యాయవాది మాట్లాడుతూ.. ఇది ఎన్నికల కోడ్ ఉల్లంఘన కిందకే వస్తుందని పేర్కొనగా, అలాంటప్పుడు ఈసీకి వినతిపత్రం ఎందుకు ఇవ్వలేదని, ప్రతివాదిగా ఎందుకు చేర్చలేదని కోర్టు ప్రశ్నించింది. కాగా, గత నెల 25న బీఆర్‌ఎస్ ఇచ్చిన వినతిపత్రంపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని కేంద్ర సమాచార, ప్రసార శాఖకు ఆదేశిస్తూ, విచారణ ముగించింది.

ట్యాపింగ్ కేసులో ఏ1గా ప్రభాకర్‌రావు

ఎస్‌ఐబీ మాజీ చీఫ్ పేరును ప్రధాన నిందితుడిగా చేర్చిన పంజగుట్ట పోలీసులు

- ఏ6గా మీడియా అధినేత శ్రావణ్‌కుమార్‌రావు పేరు కూడా..
- నాంపల్లి కోర్టులో మెమో దాఖలు.. అరెస్టు వారెంట్ కోసం అభ్యర్థన
- ఇవి జారీ అయితేనే ఇంటర్‌పోల్ ద్వారా రెడ్ కార్నర్ నోటీసులకు అవకాశం



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో సంచలనం సృష్టించిన విపక్ష నేతల ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ వ్యవహారంలో సూత్రధారిగా ఆరోపణలు ఎదుర్కొంటున్న స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్యూరో (ఎస్‌ఐబీ) మాజీ చీఫ్ టి.ప్రభాకర్‌రావును తాజాగా పోలీసులు ప్రధాన నిందితుడి (ఏ1)గా చేర్చారు. అలాగే ఆరో నిందితుడి (ఏ6)గా ఓ మీడియా సంస్థకు అధినేత అయిన శ్రావణ్‌కుమార్‌రావును చూపారు. ఈ మేరకు పంజగుట్ట పోలీసులు నాంపల్లి కోర్టులో శుక్రవారం మెమో దాఖలు చేశారు. ఈ కేసులో ఇప్పటికే ఎస్‌ఐబీ మాజీ డీఎస్పీ డి.ప్రణీత్‌రావు, అదనపు ఎస్పీలు మేకల తిరుపతన్న, ఎన్.భుజంగరావు, టాస్క్‌ఫోర్స్ మాజీ ఓఎస్డీ పి.రాధాకిషన్‌రావును పోలీసులు నిందితులుగా పేర్కొన్నారు.

రెడ్ కార్నర్ నోటీసుల జారీకి వీలుగా..

పంజగుట్ట ఠాణాలో ఈ కేసు నమోదైనప్పుడు కేవలం అధికారిక సమాచారం, ఆధారాల ధ్వంసం ఆరోపణలే ఉన్నాయి. దీంతో ప్రణీత్‌రావునే నిందితుడిగా పేర్కొన్నారు. ఆయన అరెస్టు, విచారణ, కేసు దర్యాప్తులో వెలుగులోకి వచ్చిన అంశాల ఆధారంగా మిగిలిన ముగ్గురినీ నిందితులుగా చేర్చి అరెస్టు చేశారు. అనంతరం ప్రభాకర్‌రావు పాత్రపై పక్కా ఆధారాలు లభించడంతో టెలిగ్రాఫ్ యాక్ట్‌ను జోడిస్తూ నిందితుల నేరాంగీకార వాంగ్మూలాలు, రిమాండ్ రిపోర్టుల్లో ఆయన పేరు ప్రస్తావించారు. కానీ ఇప్పటివరకు నిందితుడిగా మాత్రం చేర్చలేదు. అయితే ప్రణీత్‌రావుపై మార్చి 10న కేసు నమోదవగా ఆ మర్నాడే ప్రభాకర్‌రావు అమెరికా పరారయ్యారు. అలాగే ఆ తర్వాత శ్రావణ్‌కుమార్‌రావు కూడా అమెరికా వెళ్లిపోయారు. ఈ నేపథ్యంలో ఇంటర్‌పోల్ సాయంతో వారిని వెనక్కి రప్పించాలంటే కేసులో నిందితులుగా చూపాల్సి ఉండటంతో ఈ చర్య చేపట్టారు.

పాస్‌పోర్టు గడువు 3 నెలలు..

సుదీర్ఘకాలం ఎస్‌ఐబీ చీఫ్‌గా వ్యవహరించిన టి.ప్రభాకర్‌రావు గతేడాది డిసెంబర్ 4న రాజీనామా చేశారు. ఆపై ఎస్‌ఐబీలోని ఎస్‌ఓటీ వార్ రూమ్‌లో ఉన్న ట్యాపింగ్ సంబంధిత సమాచారాన్ని ధ్వంసం చేయాల్సిందిగా ప్రణీత్‌రావును ఆదేశించారు. ఈ విషయం వెలుగులోకి రావడంతో తొలుత ఫిబ్రవరి 13న అమెరికా వెళ్లడానికి విమాన టికెట్ కొన్నారు. కానీ వెళ్లలేదు. ప్రణీత్‌రావుపై కేసు నమోదవడంతో ఆ మరుసటి రోజే తిరుపతి ప్రయాణమైన ప్రభాకర్‌రావు.. కుటుంబీకులకు కూడా చెప్పకుండా అట్నుంచి చెన్నై మీదుగా అమెరికా వెళ్లిపోయారు. ప్రస్తుతం ఆయన టెక్సాస్‌లో నివసిస్తూ వైద్యం చేయించుకుంటున్నట్లు సమాచారం. ఆయన వీసా గడువు మరో మూడు నెలలు ఉండగా ఆ తర్వాత కూడా ఆయన తిరిగి వస్తారనే నమ్మకం పోలీసులకు లేదు. దీంతో ఇంటర్‌పోల్ సాయంతో రెడ్ కార్నర్ నోటీసు జారీ చేయించడం ద్వారా ప్రభాకర్‌రావును వెనక్కి రప్పించాలని నిర్ణయించారు. ఈ మేరకు మెమో దాఖలు చేయడంతోపాటు వారిద్దరూ విదేశాల్లో ఉండటంతో అరెస్టుకు అనుమతిస్తూ వారెంట్ జారీ చేయాల్సిందిగా సీఆర్పీసీ సెక్షన్ 73 ప్రకారం కోర్టును అభ్యర్థించారు. వారెంట్ జారీ అయితే వారిద్దరూ మోస్ట్ వాంటెడ్‌గా మారినట్లే. ఆపై సీబీఐ ద్వారా ఇంటర్‌పోల్‌కు లేఖ రాయడం ద్వారా రెడ్ కార్నర్ నోటీసులు జారీ చేయించే అవకాశం ఉంది.

విచారణ కొనసాగించండి

ఫేక్ వీడియో కేసులో ఢిల్లీ పోలీసులకు హైకోర్టు ఆదేశం

సాక్షి, హైదరాబాద్: కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఫేక్ వీడియో కేసులో చట్టప్రకారం విచారణ కొనసాగించాలని ఢిల్లీ పోలీసులను రాష్ట్ర హైకోర్టు ఆదేశించింది. అరెస్టు సహా ఎలాంటి కఠిన చర్యలు చేపట్టవద్దని స్పష్టం చేస్తూ, తదుపరి విచారణను జూన్ 12కు వాయిదా వేసింది. దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఫేక్ వీడియో కేసులో హైదరాబాద్ సీసీఎస్ పోలీసులు తెలంగాణ కాంగ్రెస్ సోషల్ మీడియా ఇన్‌చార్జి మన్నె సతీశ్‌తోపాటు మరికొందరిని అదుపులోకి తీసుకున్న విషయం తెలిసిందే. ఆ తర్వాత వీరికి ట్రయల్‌కోర్టు బెయిల్ కూడా మంజూరు చేసింది. అయితే ఇదే కేసులో ఢిల్లీ పోలీసులు ఏప్రిల్ 29న జారీ చేసిన 41ఏ సీఆర్‌పీసీ నోటీసులను సవాల్ చేస్తూ మన్నె సతీశ్, అస్మా తస్లీమ్, అంబాల శివకుమార్, పి.నవీన్, కోయ గీత, పి.వంశీకృష్ణ హైకోర్టులో లంచ్‌మోషన్ రూపంలో పిటిషన్ దాఖలు చేశారు. రాష్ట్ర హోం శాఖ ముఖ్య కార్యదర్శి, హైదరాబాద్ సీపీ, సైబర్ క్రైమ్ ఎస్‌హెచ్‌వో, బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ప్రేమేందర్‌రెడ్డి, ఢిల్లీ స్పెషల్ సెల్ ఎస్‌హెచ్‌వో, ప్రభుత్వ ఉద్యోగి శరణ్‌సింగ్‌లను ప్రతివాదులుగా పేర్కొన్నారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ బి.విజయ్‌సేన్‌రెడ్డి శుక్రవారం విచారణ చేపట్టారు. పిటిషనర్ల తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ, ఒకే అంశంపై రెండు వేర్వేరు ప్రాంతాల్లో కేసులు నమోదు చేయడం చట్టవిరుద్ధమని, గతంలో సుప్రీంకోర్టు ఈ విషయాన్ని వెల్లడించిందని పేర్కొన్నారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. చట్టప్రకారం విచారణను కొనసాగించాలని ఆదేశించారు.

వేసవికి ప్రత్యేక రైళ్లు



సాక్షి, హైదరాబాద్: వేసవి ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని పలు మార్గాల్లో ప్రత్యేక రైళ్లు నడపనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్వో సీహెచ్ రాకేశ్ తెలిపారు. ఈ మేరకు తిరుపతి–సికింద్రాబాద్ (07510–07509) ప్రత్యేక రైలు ఈనెల 9న రాత్రి 8.05 గంటలకు తిరుపతి నుంచి బయల్దేరి మరుసటి రోజు ఉదయం 9.10 గంటలకు సికింద్రాబాద్‌కు చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో 12వ తేదీ రాత్రి 8 గంటలకు సికింద్రాబాద్ నుంచి బయల్దేరి మరుసటి రోజు ఉదయం 8.20 గంటలకి తిరుపతికి చేరుకుంటుంది. సికింద్రాబాద్–బ్రాహ్మంపూర్ (07027/07028) స్పెషల్ ట్రైన్ ఈనెల 10న రాత్రి 8.45 గంటలకు సికింద్రాబాద్ నుంచి బయల్దేరి మరుసటి రోజు మధ్యాహ్నం 2.45 గంటలకు బ్రాహ్మంపూర్ చేరుకుంటుంది. తిరుగుప్రయాణంలో 11వ తేదీ సాయంత్రం 4.45 గంటలకు బయల్దేరి మరుసటి రోజు ఉదయం 10.05 గంటలకు సికింద్రాబాద్ చేరుకుంటుంది. భువనేశ్వర్–ముంబై (08420/08419) స్పెషల్ ట్రైన్ ఈనెల 8, 15, 22, 29, జూన్ 5, 12, 19, 26 తేదీల్లో (బుధవారం) రాత్రి 11 గంటలకు భువనేశ్వర్ నుంచి బయల్దేరి శుక్రవారం ఉదయం 10.30 గంటలకు ముంబై చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో ఈనెల 10, 17, 24, 31, జూన్ 7, 14, 21, 28 తేదీల్లో (శుక్రవారం) మధ్యాహ్నం 1.20 గంటలకి బయల్దేరి ఆదివారం తెల్లవారు జామున 1.45 గంటలకు భువనేశ్వర్‌కు చేరుకుంటుంది.

అమిత్ షా డీప్‌ఫేక్ వీడియో.. తెలంగాణ నుంచే వైరల్

▶ మొదటి పేజీ తరువాయి

చేపట్టారు. మొదట పోస్ట్ చేసిన వ్యక్తిని అరెస్టు చేయాలని భావిస్తున్నారు. ఈ విషయంలో 'ఎక్స్' నుంచి మరింత సమాచారం కోసం వేచి చూస్తున్నారు.

ల్యాండ్ లైన్ ఐపీ అడ్రస్ నుంచి..

గత నెల 23న మెదక్ సభలో కేంద్ర హోంమంత్రి అమిత్ షా బీజేపీ గెలిస్తే.. ఎస్సీ, ఎస్టీ, బీసీ రిజర్వేషన్లను రద్దు చేస్తామంటూ మాట్లాడినట్టు ఓ వీడియో ప్రత్యక్షమైంది. ఎక్స్, ఫేస్‌బుక్ ఖాతాల్లో అది వైరల్‌గా అయి దేశవ్యాప్తంగా దుమారం రేపింది. దీనిపై కేంద్ర హోంశాఖ ఫిర్యాదు మేరకు.. ఢిల్లీ స్పెషల్ సెల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. దేశవ్యాప్తంగా నలుగురిని అరెస్టు చేశారు. తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా కన్వీనర్ మన్నె సతీశ్, శివకుమార్ అంబాలా, నవీన్, ఆస్మా తస్లీంలకు నోటీసులు జారీ చేశారు. మరోవైపు ఆ వీడియో ఎక్కడి నుంచి వచ్చింది, ఎవరు ముందు పోస్ట్ చేశారన్న దానిపై సమగ్ర నివేదిక ఇవ్వాలని ఎక్స్, ఫేస్‌బుక్‌లను స్పెషల్ సెల్ పోలీసులు ఆదేశించారు. ఈ మేరకు ప్రాథమిక నివేదిక ఇచ్చిన 'ఎక్స్' సంస్థ.. తొలుత ఆ వీడియో పోస్ట్ అయినది తెలంగాణ నుంచేనని వెల్లడించింది. ఒక ల్యాండ్‌లైన్ ఐపీ అడ్రస్ నుంచి ఈ వీడియో పోస్ట్ అయినట్టుగా పేర్కొంది. అయితే ఎవరు చేశారనేది ఇంకా వెల్లడించలేదు. దీంతో ఢిల్లీ స్పెషల్ సెల్ పోలీసులు మళ్లీ 'ఎక్స్'కు లేఖ రాశారు. కచ్చితంగా ఎవరి ఐపీ అడ్రస్ నుంచి వచ్చింది? ఎక్స్‌లో పోస్ట్ చేసిన తర్వాత ఎంతమంది వీక్షించారు? ఎవరెవరు షేర్ చేశారు? కామెంట్లు/లైకులు తదితర సమగ్ర వివరాలు ఇవ్వాలని కోరారు. 'ఎక్స్' సంస్థ ఒకట్రెండు రోజుల్లో సమగ్ర నివేదిక అందించే అవకాశం ఉంది.

ఫేస్‌బుక్ నుంచి పెండింగ్: ఢిల్లీ స్పెషల్ సెల్ పోలీసులు ఫేస్‌బుక్ పైనా ఫోకస్ చేశారు. 'ఎక్స్'లో ట్వీట్ చేసిన వ్యక్తే ఫేస్‌బుక్‌లో పోస్ట్ చేశారా? లేక ఇతరులు ఎవరైనా చేశారా అనేది ఆరా తీస్తున్నారు. సదరు వీడియో పోస్ట్ అయిన ఐపీ అడ్రస్, వాడే ఫోన్ నంబరు, ఇంటర్నెట్ వివరాలు ఇవ్వాలని ఫేస్‌బుక్‌ను ఆదేశించారు. ఫేస్‌బుక్ నుంచి కూడా వివరాలు అందాక.. తెలంగాణలో మరిన్ని అరెస్టులు ఉండే అవకాశం ఉందని ఢిల్లీ స్పెషల్ సెల్ వర్గాల సమాచారం.



ఎండలోనుంచి వచ్చిన వెంటనే
చల్లటి నీళ్లు తాగుతున్నారా?

ఎండలో తిరిగి ఇంటికి వచ్చిన వెంటనే ఫ్రిడ్జ్ లోనుంచి బాటిల్ తీసుకుని చల్లని నీళ్లు గటగటా తాగడం చాలా మందికి అలవాటే. విపరీతమైన వేడిలో మన శరీరానికి రిఫ్రిజిరేటర్‌లోని చల్లటి నీరు కొంత ఉపశమనం కలిగించేమాట నిజమే అయినా ఇలా చేయడం మంచిది కాదంటున్నారు ఆరోగ్య నిపుణులు.

ఎండలోనుంచి వచ్చిన వెంటనే చల్లటి నీళ్లు తాగడం వల్ల గొంతు నొప్పి, టాన్సిలైటిస్ సమస్య మాత్రమే కాదు.. జీర్ణక్రియ నుంచి రోగనిరోధక వ్యవస్థ వరకు... చివరకు గుండెపై కూడా తీవ్ర ప్రభావం పడుతుంది.

ఎందుకంటే రిఫ్రిజిరేటర్‌లోని చల్లటి నీటిని తాగడం వల్ల రక్తనాళాలు కుచించుకుపోతాయి. అదేవిధంగా ఆహారం తిన్న తర్వాత చల్లటి నీరు తాగడం వల్ల శరీర ఉష్ణోగ్రత తగ్గిపోయి జీర్ణక్రియలో సమస్యలు తలెత్తుతాయి. దీంతో ఘన ఆహారం సరిగా జీర్ణం కాదు. ఫలితంగా మలబద్ధకం వస్తుంది.

అంతేకాదు, చల్లటి నీటిని తాగడం వల్ల ఈ నాడి చల్లబడుతుంది. ఇది హృదయ స్పందన రేటును తగ్గిస్తుంది. గుండె కొట్టుకునే వేగం ఒక్కసారిగా తగ్గితే గుండెపోటు వచ్చే ప్రమాదం ఉంది.

రిఫ్రిజిరేటర్‌లోని చల్లటి నీటిని ఎక్కువగా తాగడం వల్ల రోగనిరోధక శక్తి తగ్గుతుంది. ఫలితంగా శరీరంలో వివిధ రకాల సమస్యలు సంభవిస్తాయి. చల్లటి నీటిని తాగడం వల్ల శరీరంలో పేరుకుపోయిన కొవ్వు గట్టిపడుతుంది. ఇది బరువు పెరిగేందుకు దారితీస్తుంది.

అందువల్ల వీలయినంత వరకు ఎండలో నుంచి రాగానే చల్లటి నీళ్లు తాగకూడదు. అందులోనూ ఫ్రిజ్‌లోని నీళ్లు తాగడం అసలు మంచిది కాదు. కొంచెంసేపు ఆగిన తర్వాత కుండలోని నీళ్లు లేదా నార్మల్ వాటర్ ముందు తాగి, ఆ తర్వాత చల్లటి నీళ్లు తాగినా ఫరవాలేదు.

పిల్లల్లో... వ్యాధి నిరోధకత పెంచండిలా!





వేసవి సెలవలు ఇచ్చేశారు. పిల్లలందరూ ఇంటి దగ్గరే ఉంటారు. ఈ సమయంలోనే వారికి వ్యాధినిరోధక శక్తి అంటే ఇమ్యూనిటీ పెరిగే ఆహారాన్ని అందించడం వల్ల స్కూళ్లు తిరిగి తెరిచి, వర్షాలు పడినా కూడా చిన్నా చితకా వ్యాధులు రాకుండా ఉంటాయి. పిల్లలకు ఎలాంటి ఆహారం అందించాలో తెలుసుకుందాం...

సాధారణంగా పోషకాలన్నీ ఉన్న సమీకృత ఆహారం అందించడం వల్ల వ్యాధినిరోధకత పెరుగుతుంది. అందుకు ఏం చేయాలో చూద్దాం...

గుడ్డు: కోడిగుడ్డులో పోషకాలు సమృద్ధిగా ఉంటాయి. పిల్లలకు రోజూ ఒక ఉడికించిన గుడ్డు తినిపించాలి. కండరాలు, చర్మం, గుండె ఆరోగ్యానికి గుడ్డు మంచిది. పిల్లల ఎదుగుదలకు అవసరమైన విటమిన్ ఎ, బి2 (రైబోఫ్లేవిన్) కోడిగుడ్డులో లభిస్తాయి.



ఆకుకూరలు: ఆకుపచ్చటి ఆకుకూరలు, కొత్తిమీర, పాలకూర, ఈ సీజన్‌లో సమృద్ధిగా లభించే మునగకాడలు వంటివి తప్పనిసరిగా పెట్టాలి. వీటిలో ఫైబర్‌తోపాటు ఐరన్, జింక్, మినరల్స్ లభిస్తాయి.



పెరుగు, మజ్జిగ: పెరుగులో ప్రోబయోటిక్స్, విటమిన్ బి12 లభిస్తాయి. ఇది పొట్టలో చెడు బ్యాక్టీరియా వృద్ధి చెందకుండా కాపాడుతుంది. ఇమ్యూనిటీని పెంచుతుంది. కాబట్టి పిల్లలు ఇష్టంగా తినేలా ఫ్రూట్ యోగర్ట్, వెజిటబుల్స్ రైతా, బూందీ రైతా రూపంలో ఇవ్వొచ్చు.

పసుపు: పసుపులో యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలుంటాయి. పిల్లలకు రోజూ ఇచ్చే ఆహారంలో చిటికెడు పసుపును చేర్చడం వల్ల ఆస్తమా, అలర్జీకి సంబంధించిన సమస్యలు దరిచేరకుండా ఉంటాయి. పాలల్లో పసుపు వేసి తాగించడం అలవాటు చేయవచ్చు.

బాదం, జీడిపప్పు, ఎండుద్రాక్ష, వాల్‌నట్స్, అప్రికాట్స్ వంటివి ఎక్కువగా తినిపించడం వల్ల మెదడు ఎదుగుదలకు అవసరమైన పోషకాలు లభించడంతో పాటు పిల్లల్లో ఇమ్యూనిటీ పెరుగుతుంది.

ఇంకా సీజనల్ ఫ్రూట్స్ అయిన మామిడి, జామ, తాటిముంజలు, సపోటా వంటివి ఇవ్వాలి.

పిల్లలకు స్వీట్స్, పంచదార ఎక్కువగా ఉండే ఇతర పదార్థాలైన ఫ్రూట్‌జ్యూస్‌లు, చాక్లెట్స్, ప్యాకేజ్డ్ స్నాక్స్‌ను ఎక్కువగా తినిపించకూడదు. ఇవి ఇమ్యూనిటీని తగ్గిస్తాయి. ముఖ్యంగా పిల్లలు రోజూ తగినంత నిద్రపోయేలా చూడాలి. గంటసేపైనా బయట ఆడుకునేలా ప్రోత్సహించాలి. ఈ జాగ్రత్తలు పాటించడం మంచిది.

మీకు తెలుసా?

మెదడుకు పదును..!



బజారులో నడిచి వెళ్తున్నప్పుడు తెలిసిన వ్యక్తి ఎదురు పడితే వెంటనే పేరు గుర్తురాదు. పలకరింపుగా నవ్వి ఏదో ఒక రకంగా మేనేజ్ చేయాల్సి వస్తుంది. ఇలా తరచూ జరుగుతుంటే మెదడు బద్ధకంగా ఉంటోందని, మతిమరుపు పెరుగుతోందని జాగ్రత్త పడాల్సిందే. వార్ధక్య లక్షణాలను దూరంగా ఉంచడానికి దేహానికి వ్యాయామం చేసినట్లే మెదడు చురుగ్గా ఉండడానికి తగినంత వ్యాయామం కావాలి. రోజూ కనీసం ఒక్క పజిల్‌నైనా పరిష్కరించడం జ్ఞాపకశక్తిని మెరుగుపరుచుకోవడానికి మంచి మార్గం. అలా మెదడును కూడా చురుగ్గా ఉంచినప్పుడే మతిమరుపు అనే వార్ధక్య లక్షణం దూరమవుతుంది. రోజూ ఈ ప్రాక్టీస్ ఉంటే డెబ్బై ఏళ్లు నిండినా సరే జ్ఞాపకశక్తి తగ్గదు. మతిమరుపు దరిచేరదు. దరిచేర్చుకోకూడని మిత్రుడు మతిమరుపు, మెదడు వాడదాం... మెదడును 'వాడి'గా ఉంచుకుందాం.

చక్కెర తగ్గిస్తే కలిగే
ప్రయోజనాలివి



చక్కెర ఉన్న పానీయాలు, స్వీట్లు, ఇతర పదార్థాలను తినడం మానేస్తే శరీరంలోకి అధికంగా చేరే కేలరీల పరిమాణం తగ్గుతుంది. దీని వల్ల బరువు నియంత్రణలో ఉంటుంది. ● చక్కెరను దూరం పెట్టడం వల్ల హైబీపీ, గుండె జబ్బులు సహా ఇతర ఆరోగ్య సమస్యలు వచ్చే ముప్పు తగ్గుతుంది ● నోటి ఆరోగ్యం, దంత సంరక్షణ కోసం చక్కెరను దూరం పెట్టడం చాలా మంచిది. చక్కెరతో కూడిన ఆహార పదార్థాలను దూరం పెడితే నోటి సమస్యలు వచ్చే అవకాశం కూడా తగ్గుతుంది ● చక్కెర తినడం మానేయడం వల్ల టైప్–2 డయాబెటిస్ వచ్చే అవకాశం కూడా చాలా తగ్గుతుంది. మూడ్ స్వింగ్స్, చిరాకు, కోపం తగ్గుతుంది. చర్మం త్వరగా ముడతలు పడటం తగ్గి కాంతిమంతంగా మారుతుంది ● జీర్ణక్రియ మెరుగుపడుతుంది. కడుపుబ్బరం, గ్యాస్, మలబద్ధకం వంటి సమస్యలు తగ్గుతాయి.

హెల్త్ టిప్స్



● కిస్మిస్‌లలో జింక్, కాల్షియం, విటమిన్లు అధికంగా ఉంటాయి. ఇవి మనకు ఎంతగానో మేలు చేస్తాయి. రాత్రిపూట కొన్ని కిస్మిస్‌లను తిని గోరువెచ్చటి నీరు తాగితే మరుసటి రోజు ఉదయం విరేచనం సాఫీగా జరుగుతుంది. మలబద్ధకం తగ్గుతుంది. దీంతో పైల్స్ సమస్య నుంచి బయట పడవచ్చు. అలా కాకపోతే రాత్రి పూట కిస్మిస్‌లను నీటిలో నానబెట్టి.. మరుసటి రోజు ఉదయం కూడా తినవచ్చు. ఎలా తిన్నా సమస్య నుంచి బయట పడతారు.

● బాదంపప్పులో ప్రోటీన్లు, ఒమెగా 3 ఫ్యాటీ యాసిడ్లు, విటమిన్ ఇ, కాల్షియం, ఫాస్ఫరస్ అధికంగా ఉంటాయి. అందువల్ల బాదంపప్పును రోజూ తింటే పైల్స్ సమస్య నుంచి బయట పడవచ్చు. ఇందుకు గాను బాదంపప్పును రాత్రి పూట నీటిలో నానబెట్టాలి. మరుసటి రోజు ఉదయాన్నే పరగడుపునే వాటిని పొట్టు తీసి తినాలి. దీని వల్ల శరీరంలోని వ్యర్థాలు బయటకు పోవడంతోపాటు మలబద్ధకం తగ్గుతుంది. పైల్స్ సమస్య నుంచి బయట పడవచ్చు.

● జామపండ్లలో విటమిన్లు, మినరల్స్ అనేకం ఉంటాయి. ఇవి దంతాలు, చిగుళ్ల సమస్యలు, జీర్ణ సమస్యలను తగ్గిస్తాయి. జామ పండ్లను తినడం వల్ల తిన్న ఆహారం సరిగ్గా జీర్ణమవుతుంది. మలబద్ధకం ఉండదు. అలాగే పైల్స్ కూడా తగ్గిపోతాయి. రోజూ రాత్రి భోజనం చేసిన తరువాత నిద్రకు ముందు ఒక జామ పండును తింటే ఈ ప్రయోజనం కలుగుతుంది. దీంతో రోగ నిరోధక శక్తి కూడా పెరుగుతుంది.

● రోజూ పరగడుపునే మూడు లేదా నాలుగు పచ్చి వెల్లుల్లి రెబ్బలను తీసుకుని పెనంపై వేసి వేయించి వాటిని అలాగే తినాలి. నేరుగా తినలేం అనుకుంటే తేనెతో కలిపి తీసుకోవచ్చు. దీని వల్ల జీర్ణ శక్తి పెరుగుతుంది. మెటబాలిజం మెరుగు పడుతుంది. గ్యాస్ సమస్యలు తగ్గుతాయి. అజీర్ణం నుంచి బయట పడతారు. మలబద్ధకం తగ్గి పైల్స్ నుంచి విముక్తి పొందవచ్చు.

● జీర్ణ సమస్యలను తగ్గించడంలో బెల్లం అద్భుతంగా పనిచేస్తుంది. రోజూ రాత్రి భోజనం అనంతరం చిన్న బెల్లం ముక్కను చప్పరిస్తూ తినాలి. దీంతో తిన్న ఆహారం సరిగ్గా జీర్ణమవుతుంది. మరుసటి రోజు సుఖ విరేచనం అవుతుంది. క్రమం తప్పకుండా రోజూ రాత్రి బెల్లం తింటే పైల్స్ సమస్య నుంచి బయట పడవచ్చు.

కన్నప్పకి బై బై


● విష్ణు మంచు, అక్షయ్ కుమార్

బాలీవుడ్ స్టార్ హీరో అక్షయ్ కుమార్ 'కన్నప్ప'కి బై బై చెప్పారు. తన పాత్రకి సంబంధించిన సన్నివేశాలను పూర్తి చేసిన ఆయనకి చిత్ర యూనిట్ వీడ్కోలు పలికింది. విష్ణు మంచు హీరోగా ముఖేష్ కుమార్ సింగ్ దర్శకత్వం వహిస్తున్న చిత్రం 'కన్నప్ప'. అవా ఎంటర్‌టైన్‌మెంట్, 24 ఫ్రేమ్స్ ఫ్యాక్టరీ బ్యానర్‌లపై మంచు మోహన్‌బాబు పాన్ ఇండియా స్థాయిలో ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ఈ మూవీలో ప్రభాస్, అక్షయ్ కుమార్, మోహన్‌బాబు, మోహన్ లాల్, శరత్ కుమార్, బ్రహ్మానందం తదితరులు ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు. ఇటీవల హైదరాబాద్‌లో ప్రారంభమైన షెడ్యూల్‌లో అక్షయ్ కుమార్ జాయిన్ అయిన సంగతి తెలిసిందే. తాజాగా తన సీన్లకు సంబంధించిన షూట్‌ను ఆయన పూర్తి చేశారు. ''అక్షయ్ కుమార్‌గారి నుంచి ఎంతో నేర్చుకున్నాను. ఈ ప్రయాణం ఎంతో విలువైనది'' అని సోషల్ మీడియా ద్వారా పేర్కొన్నారు విష్ణు మంచు. ''ధైర్యవంతుడైన యోధుడు, శివ భక్తుడైన కన్నప్ప కథతో ఈ చిత్రం అద్భుతంగా రూపొందుతోంది. ఈ సినిమా షూటింగ్ చివరి దశకు చేరుకుంది'' అన్నారు మేకర్స్.


● నయనతార

ముంబైలో వేట్టయాన్


● అమితాబ్ బచ్చన్ ● రజనీకాంత్

ముంబైలో అమితాబ్ బచ్చన్‌ను కలిశారు వేట్టయాన్. రజనీకాంత్ హీరోగా 'జై భీమ్' ఫేమ్ టీజే జ్ఞానవేల్ దర్శకత్వంలో రూపొందుతున్న సినిమా 'వేట్టయాన్' (వేటగాడు). అమితాబ్ బచ్చన్, ఫాహద్ ఫాజిల్, రానా ఇతర లీడ్ రోల్స్‌లో దుషారా విజయన్, మంజు వారియర్, రితికా సింగ్ కీలక పాత్రల్లో నటిస్తున్న చిత్రం ఇది. తాజాగా 'వేట్టయాన్' చిత్రీకరణ ముంబైలో ప్రారంభమైంది. రజనీకాంత్, అమితాబ్ బచ్చన్ పాల్గొంటుండగా కీలక సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారు. గతంలో హైదరాబాద్‌లో జరిగిన 'వేట్టయాన్' షూటింగ్ షెడ్యూల్‌లో రజనీ, అమితాబ్ కాంబినేషన్ సీన్స్ తీశారు. ఇప్పుడు ముంబైలో వీరిద్దరి కాంబినేషన్ సీన్స్‌ను తీస్తున్నారు. బూటకపు ఎన్‌కౌంటర్స్ నేపథ్యంలో ఈ సినిమా ఉంటుందని టాక్.

వినోదాల పతంగ్


● ప్రీతి పగడాల

ప్రీతి పగడాల, ప్రణవ్ కౌశిక్, వంశీ పూజిత్ ముఖ్య తారలుగా నటించిన చిత్రం 'పతంగ్'. ప్రణీత్ ప్రత్తిపాటి దర్శకత్వం వహించారు. సినిమాటిక్ ఎలిమెంట్స్ అండ్ రిషన్ సినిమాస్‌పై విజయ్ శేఖర్ అన్నే, సంపత్ మక, సురేష్ కొత్తింటి నిర్మించిన ఈ చిత్రం టీజర్‌ను డైరెక్టర్ బుచ్చిబాబు సానా విడుదల చేశారు. ఈ సినిమా కాంటెస్ట్ విజేతలకు సిరిసిల్ల మాజీ ఎంపీ రాజయ్య బహుమతులు అందించారు. బుచ్చిబాబు సానా మాట్లాడుతూ– ''ఈ మూవీ కంటెంట్ చూస్తుంటే 'హ్యాపీడేస్' సినిమాలా ఘన విజయం సాధిస్తుందనిపిస్తోంది'' అన్నారు. ''తొలిసారి పతంగుల పోటీతో రాబోతున్న కామెడీ స్పోర్ట్స్ డ్రామా చిత్రం 'పతంగ్'' అన్నారు ప్రణీత్ ప్రత్తిపాటి. ''వేసవిలో మా సినిమా ప్రేక్షకుల ముందుకు రానుంది'' అన్నారు సంపత్ మక. ప్రణవ్ కౌశిక్, ప్రీతి పగడాల, వంశీ పూజిత్, క్రియేటివ్ నిర్మాత నాని బండ్రెడ్డి పాల్గొన్నారు.

టాక్సిక్‌లో..?

యశ్ 'టాక్సిక్' సినిమాలో నయనతార భాగం కానున్నారా? అంటే అవుననే టాక్ కన్నడ ఇండస్ట్రీలో వినిపిస్తోంది. యశ్ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'టాక్సిక్'. మలయాళ నటి–దర్శకురాలు గీతూ మోహన్‌దాస్ ఈ సినిమాను తెరకెక్కిస్తున్నారు. ఈ సినిమాలో హీరోయిన్‌గా కియారా అద్వానీ, శ్రుతీహాసన్ వంటి స్టార్స్ పేర్లు వినిపించాయి. అలాగే యశ్‌కు సోదరి పాత్రలో కరీనా కపూర్ నటిస్తారనే ప్రచారం జరిగింది. దీనికి తోడు తాను సౌత్ సినిమా అంగీకరించినట్లు ఆ మధ్య కరీనా స్వయంగా వెల్లడించారు. అది 'టాక్సిక్' సినిమానే అనే ప్రచారం సాగింది. అయితే తాజాగా షూటింగ్ కాల్షీట్స్ సర్దుబాటు చేయలేని కారణంగా ఈ ప్రాజెక్ట్ నుంచి కరీనా కపూర్ తప్పుకున్నారనే ప్రచారం జరుగుతోంది. ఈ ప్లేస్‌లో నయనతారను తీసుకోవాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నారట. 2010లో ఉపేంద్ర నటించిన 'సూపర్' కన్నడలో నయనతారకు తొలి సినిమా. వార్తల్లో ఉన్న ప్రకారం నయనతార 'టాక్సిక్' సినిమా చేస్తే.. పద్నాలుగేళ్ల తర్వాత ఆమె కన్నడ సినిమా చేసినట్లవుతుంది.

లక్ష్మీ కటాక్షం ఫిక్స్


● 'లక్ష్మీ కటాక్షం' పోస్టర్


సాయికుమార్ లీడ్ రోల్‌లో సూర్య దర్శకత్వం వహించిన చిత్రం 'లక్ష్మీ కటాక్షం: ఫర్ ఓట్'. ఆమని, వినయ్, అరుణ్, దీప్తీ వర్మ, చరిష్మా శ్రీకర్, హరి ప్రసాద్, సాయికిరణ్ ఏడిద కీలక పాత్రల్లో నటించారు. యు. శ్రీనివాసుల రెడ్డి, బి. నాగేశ్వర రెడ్డి, వహీద్ షేక్, కె. పురుషోత్తం రెడ్డి నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 10న రిలీజ్ కానుంది. ''పొలిటికల్ సెటైరికల్ డ్రామా, కామెడీ నేపథ్యంలో రూపొందిన చిత్రం ఇది. ఈ చిత్రంలో ఓటర్లే వారి ఓటుకు ఒక రేటు నిర్ణయించుకుని నాయకులని ముప్పుతిప్పలు పెట్టే సీన్లు ప్రేక్షకులను నవ్విస్తాయి'' అన్నారు మేకర్స్.


● మెరిల్ స్ట్రీప్

ఈ పురస్కారం నాకో గౌరవం

హాలీవుడ్ ప్రముఖ నటి మెరిల్ స్ట్రీప్ ఆనందంలో ఉన్నారు. ఈ నెల 14 నుంచి 25 వరకు ఫ్రాన్స్‌లో 77వ కాన్స్ ఫిల్మ్ ఫెస్టివల్ జరగనున్న సంగతి తెలిసిందే. ఈ చలన చిత్రోత్సవాల్లో ప్రతిష్ఠాత్మకమైన పామ్ డి ఓర్ గౌరవ పురస్కారానికి మెరిల్ స్ట్రీప్‌ను ఎంపిక చేసినట్లు నిర్వాహకులు ప్రకటించారు. ఆమె ఆనందానికి కారణం ఇదే. ఈ ఏడాది మెరిల్ స్ట్రీప్‌కు, జపాన్‌కు చెందిన యానిమేషన్ 'స్టూడియో ఘిబ్లి' నిర్వాహకులకు, హాలీవుడ్ దర్శక–నిర్మాత జార్జ్ వాల్టన్ లూకాస్ జూనియర్ (స్టార్ వార్స్, ఇండియానా జోన్స్' ఫేమ్)కు పామ్ డి ఓర్ పురస్కారాన్ని అందజేస్తారు. ఈ సందర్భంగా మెరిల్ స్ట్రీప్ మాట్లాడుతూ – ''ఈ అవార్డుకు ఎంపిక కావడాన్ని గౌరవంగా భావిస్తున్నాను. అంతర్జాతీయ నటీనటులు, ఫిల్మ్ మేకర్స్ భాగస్వామ్యులైన కాన్స్ వేదికగా నేను ఈ అవార్డును గెలుచుకోవడం అనేది ఫిల్మ్ మేకింగ్ రంగంలో నాకు దక్కిన ఓ అద్భుత విజయంగా భావిస్తున్నాను'' అని చెప్పుకొచ్చారు. గతంలో హాలీవుడ్ స్టార్స్ టామ్ క్రూజ్, మైఖేల్ డగ్లస్, హారిసన్ ఫోర్డ్ వంటివారికి పామ్ డీ ఓర్ అవార్డు దక్కింది.

1980లో ఏం జరిగింది?


● రాకేష్ వర్రె

'ఉయ్యాలా జంపాలా, మజ్ను' చిత్రాల ఫేమ్ విరించి వర్మ దర్శకత్వం వహించిన చిత్రం 'జితేందర్ రెడ్డి'. రాకేష్ వర్రె హీరోగా నటించారు. వైశాలీ రాజ్, రియా సుమన్, ఛత్రపతి శేఖర్, సుబ్బరాజు, రవి ప్రకాశ్ ఇతర పాత్రల్లో నటించారు. ముదుగంటి రవీందర్ రెడ్డి నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 10న విడుదల కానుంది. ఈ సందర్భంగా విరించి వర్మ మాట్లాడుతూ– ''1980లో జరిగిన వాస్తవ ఘటనల ఆధారంగా పొలిటికల్ డ్రామాగా ఈ సినిమాను రూపొందించాం. ప్రేమకథలు దర్శకత్వం వహించిన నేను 'జితేందర్ రెడ్డి' లాంటి యాక్షన్ మూవీ చేయడంతో క్రేజ్ నెలకొంది'' అన్నారు. ఈ చిత్రానికి కెమెరా: వీఎస్ జ్ఞాన శేఖర్, సంగీతం: గోపీ సుందర్.

సూపర్ డీలక్స్...


● అషు రెడ్డి

'బిగ్ బాస్' ఫేమ్ అషు రెడ్డి, చాందినీ చౌదరి, వశిష్ఠ సింహా, జై భారత్ ముఖ్య తారలుగా రూపొందుతున్న చిత్రం 'యేవమ్'. ప్రకాశ్ దంతులూరి దర్శకత్వంలో ఈ చిత్రాన్ని నవదీప్, పవన్ గోపరాజు నిర్మిస్తున్నారు. ఈ చిత్రంలో హారిక పాత్ర చేస్తున్న అషు రెడ్డి లుక్‌ను విడుదల చేశారు. ''మహిళా సాధికారతను చాటి చెప్పే నేపథ్యంలో 'యేవమ్' ఉంటుంది. నా బాడీ సూపర్ డీలక్స్ అని అషు రెడ్డి కిక్ ఇచ్చే పాత్రలో ఎందుకు కనిపించబోతున్నారో తెలియాలంటే 'యేవమ్' విడుదల వరకు ఆగాల్సిందే. కొత్త కథతో వైవిధ్యమైన నరేషన్‌తో ఈ సినిమా ఉంటుంది'' అని యూనిట్ పేర్కొంది.

ఎమోషనల్ సత్య


● హమరేశ్, ప్రార్థన

సమాజంలో తన వల్ల తన తల్లిదండ్రులకు ఏ మాత్రం ఇబ్బంది కలగకూడదని ఆలోచించే ఓ కొడుకు కథతో రూపొందిన చిత్రం 'సత్య'. హమరేశ్, ప్రార్థనా సందీప్ జంటగా నటించిన ఈ చిత్రానికి వాలీ మోహన్‌దాస్ దర్శకుడు. శివమ్ మీడియా పతాకంపై శివ మల్లాల నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 10న విడుదల కానుంది. ఈ సందర్భంగా వాలి మాట్లాడుతూ– ''సత్య' సినిమా హిట్ అయి, యూనిట్‌కి మంచి పేరు తెస్తుందని ఆశిస్తున్నాను'' అన్నారు. ''ఈ సినిమా సెన్సార్ పూర్తయింది. ఈ నెల 10న తెలుగు రాష్ట్రాల్లో భారీ స్థాయిలో సినిమాను విడుదల చేయనున్నాం'' అన్నారు శివ మల్లాల.

ఏమయ్యిందే...


● అశోక్ గల్లా, మానస

అశోక్ గల్లా, వారణాసి మానస జంటగా నటిస్తున్న చిత్రం 'దేవకీ నందన వాసుదేవ'. అర్జున్ జంధ్యాల దర్శకుడు. 'హనుమాన్' మూవీ ఫేమ్ డైరెక్టర్ ప్రశాంత్ వర్మ ఈ కథ అందించారు. నల్లపనేని యామిని సమర్పణలో సోమినేని బాలకృష్ణ నిర్మిస్తున్నారు. భీమ్స్ సిసిరోలియో సంగీతం అందించిన ఈ మూవీ నుంచి 'ఏమయ్యిందే..' అంటూ సాగే తొలి పాట లిరికల్ వీడియోను రిలీజ్ చేశారు. సురేష్ గంగుల రాసిన ఈ పాటని ఈశ్వర్ దాతు పాడారు.

సాక్షి బిజినెస్
శనివారం
4-5-2024

స్టాక్‌ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▽	733	73,878
నిఫ్టీ ▽	172	22,475

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

సూచీ			
నాస్‌డాక్	16,141	△	300
డోజోన్స్	38,646	△	421
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,213	△	41
డాక్స్	18,002	△	105
షాంఘై (శుక్రవారం ముగింపు)	3,105	▽	8
నికాయ్ (శుక్రవారం ముగింపు)	38,236	▽	38

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ (రూ.లలో)

ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)	71,191	▽	136
బంగారం (99.5 స్వచ్ఛత)	70,906	▽	135
వెండి (కేజీ)	79,989	△	270

ఫారెక్స్‌ రేట్లు (రూ.లలో)

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్‌ డాలర్	ఛాయమేజిక్	81.84	85.13
£	బ్రిటన్‌ పౌండ్	ఛాయమేజిక్	102.36	106.93
€	యూరో	ఛాయమేజిక్	87.44	91.55
¥	జపాన్‌ ఎన్‌ (100)	ఛాయమేజిక్	43.00	64.00
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఛాయమేజిక్	52.71	56.97
S$	సింగపూర్‌ డాలర్	ఛాయమేజిక్	59.29	63.53
SAR	సౌదీ రియాల్	ఛాయమేజిక్	21.37	22.91
UAE D	యూఏఈ దిర్హామ్	ఛాయమేజిక్	21.85	23.62
¥	చైనా యువాన్	ఛాయమేజిక్	10.39	12.39

ఎంఆర్‌ఎఫ్‌ డివిడెండ్‌ రూ. 194

క్యూ4 లాభం రూ. 396 కోట్లు

న్యూఢిల్లీ: టైర్ల తయారీ దిగ్గజం ఎంఆర్‌ఎఫ్‌ లిమిటెడ్‌ గత ఆర్థిక సంవత్సరం (2023–24) చివరి త్రైమాసికంలో ప్రోత్సాహకర ఫలితాలు సాధించింది. జనవరి–మార్చి(క్యూ4)లో కన్సాలిడేటెడ్‌ నికర లాభం 16 శాతం ఎగసి రూ. 396 కోట్లను అధిగమించింది. మొత్తం ఆదాయం సైతం రూ. 5,842 కోట్ల నుంచి 8 శాతం పుంజుకుని రూ. 6,349 కోట్లకు చేరింది. వాటాదారులకు తాజాగా షేరుకి రూ. 194 చొప్పున తుది డివిడెండ్‌ ప్రకటించింది. ఇప్పటికే రూ. 3 చొప్పున రెండుసార్లు డివిడెండ్లు చెల్లించింది. వెరసి గతేడాదికి మొత్తం రూ. 200 డివిడెండ్‌ ఇచ్చినట్లయ్యింది. కాగా.. పూర్తి ఏడాదికి ఎంఆర్‌ఎఫ్‌ నికర లాభం రూ. 769 కోట్ల నుంచి రూ. 2,081 కోట్లకు దూసుకెళ్లింది. మొత్తం ఆదాయం రూ. 23,008 కోట్ల నుంచి రూ. 25,169 కోట్లకు బలపడింది.

ఫలితాల నేపథ్యంలో శుక్రవారం ఎంఆర్‌ఎఫ్‌ షేరు బీఎస్‌ఈలో 4 శాతం పతనమై రూ. 1,28,500 వద్ద ముగిసింది.

టైటన్‌ నికర లాభం ప్లస్‌

రూ. 771 కోట్లుగా నమోదు ● షేరుకి రూ. 11 డివిడెండ్‌



న్యూఢిల్లీ: టాటా గ్రూప్‌ డైవర్సిఫైడ్‌ దిగ్గజం టైటన్‌ కంపెనీ లిమిటెడ్‌ చివరి త్రైమాసికంలో ఆసక్తికర ఫలితాలు సాధించింది. జనవరి–మార్చి(క్యూ4)లో కన్సాలిడేటెడ్‌ నికర లాభం 5 శాతం పుంజుకుని రూ. 771 కోట్లను తాకింది. అంతక్రితం ఏడాది (2022–23) క్యూ4లో రూ. 736 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం మరింత అధికంగా రూ. 9,419 కోట్ల నుంచి రూ. 11,472 కోట్లకు ఎగసింది. నిర్వహణ లాభం(ఇబిటా) 6 శాతం మెరుగై రూ. 1,109 కోట్లకు చేరింది. ఇబిటా మార్జిన్లు 0.9 శాతం నీరసించి 9.9 శాతానికి పరిమితమయ్యాయి. ఇక పూర్తి ఏడాదికి టైటన్‌ నికర లాభం కన్సాలిడేటెడ్‌ ప్రాతిపదికన రూ. 3,274 కోట్ల నుంచి రూ. 3,496 కోట్లకు బలపడింది. మొత్తం ఆదాయం రూ. 38,675 కోట్ల నుంచి రూ. 47,501 కోట్లకు జంప్‌చేసింది. వాటాదారులకు షేరుకి రూ. 11 చొప్పున డివిడెండ్‌ ప్రకటించింది.

టైటన్‌ షేరు బీఎస్‌ఈలో 1 శాతం నష్టంతో రూ. 3,535 వద్ద ముగిసింది.

గోద్రెజ్‌ ప్రాపర్టీస్‌ రికార్డ్‌

రూ. 471 కోట్లు లాభం ● బుకింగ్స్‌లోనూ కొత్త రికార్డ్‌



న్యూఢిల్లీ: రియల్టీ రంగ దిగ్గజం గోద్రెజ్‌ ప్రాపర్టీస్‌ మార్చి త్రైమాసికంలో 14 శాతం వృద్ధితో రూ. 471 కోట్ల నికర లాభం ఆర్జించింది. ఒక త్రైమాసికానికి ఇది కంపెనీ చరిత్రలోనే అత్యధికంకాగా.. మొత్తం ఆదాయం సైతం రూ. 1,839 కోట్ల నుంచి రూ. 1,915 కోట్లకు బలపడింది. అమ్మకాల బుకింగ్స్‌ రెట్టింపై రూ. 9,519 కోట్లను తాకాయి. ఇక పూర్తి ఏడాదికి సైతం నికర లాభం రూ. 571 కోట్ల నుంచి రూ. 725 కోట్లకు జంప్‌ చేసింది. మొత్తం ఆదాయం రూ. 3,039 కోట్ల నుంచి రూ. 4,334 కోట్లకు ఎగసింది. ఈ కాలంలో లాభాలతోపాటు.. బుకింగ్స్‌లో సరికొత్త రికార్డ్‌ సాధించినట్లు ఎగ్జిక్యూటివ్‌ చైర్‌పర్సన్‌ పిరోజ్‌షా గోద్రెజ్‌ పేర్కొన్నారు. బుకింగ్స్‌ 84 శాతం దూసుకెళ్లి రూ. 22,527 కోట్లను తాకినట్లు వెల్లడించారు. ఈ బాటలో 2024–25 రూ. 27,000 కోట్ల విలువైన బుకింగ్స్‌ సాధించే వీలున్నట్లు అంచనా.

గోద్రెజ్‌ ప్రాపర్టీస్‌ షేరు ఎన్‌ఎస్‌ఈలో 1.5 శాతం లాభంతో రూ. 2,570 వద్ద ముగిసింది.

అదానీ గ్రీన్‌ నేలచూపు

లాభం 39 శాతం క్షీణత ● రూ. 310 కోట్లకు పరిమితం



న్యూఢిల్లీ: ప్రైవేట్‌ రంగ కంపెనీ అదానీ గ్రీన్‌ ఎనర్జీ చివరి త్రైమాసికంలో నిరుత్సాహకర ఫలితాలు ప్రకటించింది. కన్సాలిడేటెడ్‌ నికర లాభం 39 శాతం క్షీణించి రూ. 310 కోట్లకు పరిమితమైంది. మొత్తం ఆదాయం సైతం రూ. 2,977 కోట్ల నుంచి రూ. 2,806 కోట్లకు నీరసించింది. అయితే మొత్తం వ్యయాలు రూ. 2,053 కోట్ల నుంచి రూ. 2,379 కోట్లకు పెరిగాయి. దీంతో లాభాలు ప్రభావితమయ్యాయి. కార్యకలాపాల సామర్థ్యం 35 శాతం ఎగసి 10,934 మెగావాట్లకు చేరగా.. పునరుత్పాదక విభాగం నుంచి 2,848 మెగావాట్లు జత కలిశాయి. వీటిలో సోలార్‌ 2,418 మెగావాట్లు, విండ్‌ 430 మెగావాట్లు చొప్పున ఉన్నాయి. వెరసి దేశీయంగా 10,000 మెగావాట్ల పునరుత్పాదక ఇంధన సామర్థ్యం కలిగిన తొలి కంపెనీగా అదానీ గ్రీన్‌ ఎనర్జీ ఆవిర్భవించింది.

అదానీ గ్రీన్‌ షేరు ఎన్‌ఎస్‌ఈలో 0.6 శాతం బలపడి రూ. 1,797 వద్ద ముగిసింది.

రికార్డు గరిష్ఠం నుంచి నిఫ్టీ వెనక్కి..

అధిక వెయిటేజీ షేర్లలో అమ్మకాలు ● 74 వేల స్థాయి దిగువకు సెన్సెక్స్‌



ముంబై: ఆరంభ లాభాలు కోల్పోయిన స్టాక్‌ సూచీలు శుక్రవారం భారీ నష్టాలతో ముగిశాయి. అధిక వెయిటేజీ రిలయన్స్‌ ఇండస్ట్రీస్‌(–2%), హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్‌(–1%), భారతీ ఎయిర్‌టెల్‌(–2%), ఎల్‌అండ్‌టీ (–3%) క్షీణించి సూచీల పతనానికి ప్రధాన కారణమయ్యాయి. వారాంతపు రోజున సెన్సెక్స్‌ 733 పాయింట్లు పతనమై 73,878 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 172 పాయింట్లు నష్టపోయి 22,475 వద్ద నిలిచింది. ట్రేడింగ్‌ ప్రారంభంలోనే సెన్సెక్స్‌ 484 పాయింట్లు పెరిగి 75,095 వద్ద ఇంట్రాడే గరిష్టాన్ని తాకింది. నిఫ్టీ 147 పాయింట్లు బలపడి 22,795 జీవితకాల గరిష్టాన్ని నమోదు చేసింది. సెన్సెక్స్‌ ఇంట్రాడే గరిష్ఠం (75,095) నుంచి 1630 పాయింట్లు కోల్పోయి 73,465 వద్ద, నిఫ్టీ ఆల్‌టైం హై స్థాయి (22,795) నుంచి 447 పాయింట్లు క్షీణించి 22,348 వద్ద ఇంట్రాడే కనిష్టాలకు దిగివచ్చింది.

● సెన్సెక్స్‌ ఒకశాతం పతనంతో బీఎస్‌ఈలో రూ.2.25 లక్షల కోట్లు హరించుకుపోయాయి. ఇన్వెస్టర్ల సంపదగా భావించే బీఎస్‌ఈలో కంపెనీల మొత్తం విలువ రూ.406 లక్షల కోట్లకు దిగివచ్చింది.

భారత్‌లో యాపిల్‌ జోరు

మార్చిలో రెండంకెల వృద్ధి నమోదు



హైదరాబాద్, బిజినెస్‌ బ్యూరో: టెక్నాలజీ దిగ్గజం యాపిల్‌ భారత్‌ మార్కెట్లో జోరు కొనసాగిస్తోంది. ప్రపంచవ్యాప్తంగా మార్చి త్రైమాసికంలో కంపెనీ 90.8 బిలియన్‌ డాలర్ల ఆదాయం సాధించింది. గతేడాది ఇదే కాలంతో పోలిస్తే ఆదాయం 4% తగ్గినప్పటికీ భారత్‌లో మాత్రం బలమైన రెండంకెల వృద్ధితో సరికొత్త రికార్డు నమోదు చేయడం విశేషం. అంతర్జాతీయంగా మార్చి త్రైమాసికంలో ఐఫోన్ల విక్రయాలు 10.4 % క్షీణించి 45.9 బిలియన్‌ డాలర్లకు వచ్చి చేరాయి.

కోడిగుడ్లు (హోల్‌సేల్‌-నెక్‌ / 100కు రూ.లలో)

4-5-2024	
విశాఖ	460–00
చిత్తూరు	523–00
ఈస్ట్, వెస్ట్‌ గోదావరి	450–00
విజయవాడ	450–00
రిటైల్‌ ధర (డజను)	60.00
హైదరాబాద్	445–00
వరంగల్	447–00
రిటైల్‌ ధర	5.50

అతి నియంత్రణలతోనే వాహనాల రేట్లకు రెక్కలు

బజాజ్‌ ఆటో ఎండీ రాజీవ్‌ బజాజ్‌

పుణే, బిజినెస్‌ బ్యూరో: కాలుష్యాన్ని కట్టడి చేసే పేరిట అతి నియంత్రణలు, అధిక స్థాయి జీఎస్‌టీలను అమలు చేయడం వల్లే వాహనాల రేట్లకు రెక్కలు వచ్చాయని బజాజ్‌ ఆటో ఎండీ రాజీవ్‌ బజాజ్‌ వ్యాఖ్యానించారు. బ్రెజిల్‌ వంటి దేశాల్లో మోటార్‌సైకిళ్లపై పన్నులు 8–14 శాతం శ్రేణిలో ఉండగా దేశీయంగా మాత్రం అత్యధికంగా 28 శాతం జీఎస్‌టీ ఉంటోందని ఆయన తెలిపారు. ఈ నేపథ్యంలో వాహనాల ధరలను తగ్గించే పరిస్థితి ఉండటం లేదని, దీంతో నిర్వహణ వ్యయాలైనా తగ్గే విధంగా వాహనాలను రూపొందించడం ద్వారా కొనుగోలుదారులకు కొంతైనా ఊరటనిచ్చే ప్రయత్నం జరుగుతోందని బజాజ్‌ చెప్పారు. 125 సీసీ పైగా సామర్థ్యం ఉండే స్పోర్ట్స్‌ మోటార్‌సైకిళ్ల విభాగంలో తమకు ముప్పై రెండు శాతం మేర వాటా ఉందని, దీన్ని మరింతగా పెంచుకునే దిశగా డబుల్‌ ఇంజిన్‌ సర్కార్‌ నినాదం తరహాలో డబుల్‌ ఇంజిన్‌ కారోబార్‌ (కార్యకలాపాలు) వ్యూహాన్ని అమలు చేస్తున్నట్లు రాజీవ్‌ చెప్పారు.



బజాజ్‌ ఆటో తాజాగా పల్సర్‌ ఎన్‌ఎస్‌ 400జీ మోటార్‌ సైకిల్‌ను ఆవిష్కరించింది. ప్రారంభ ఆఫర్‌ కింద దీని ధర రూ. 1,85,000గా (ఢిల్లీ ఎక్స్‌షోరూం) ఉంటుంది. డెలివరీలు జూన్‌ మొదటివారం నుంచి ప్రారంభమవుతాయని సంస్థ ఎండీ రాజీవ్‌ బజాజ్‌ తెలిపారు. స్పోర్ట్స్‌ సెగ్మెంట్‌లో తమ స్థానాన్ని మరింత పటిష్టం చేసుకునేందుకు ఇది తోడ్పడగలదని ఆయన పేర్కొన్నారు. ఇప్పటివరకు పల్సర్‌ బైకులు 1.80 కోట్ల పైచిలుకు అమ్ముడైనట్లు బజాజ్‌ వివరించారు. పరిమిత కాలం పాటు వర్తించే ఆఫర్‌ కింద కొత్త పల్సర్‌ను రూ. 5,000కే బుక్‌ చేసుకోవచ్చు. నాలుగు రంగుల్లో ఇది లభిస్తుంది. శక్తివంతమైన 373 సీసీ ఇంజిన్, 6 స్పీడ్‌ గేర్‌ బాక్స్, ఎలక్ట్రానిక్‌ థ్రోటిల్‌ తదితర ప్రత్యేకతలు ఇందులో ఉంటాయి.

సీఎన్‌జీ మోటార్‌సైకిల్‌ను జూన్‌ 18న ఆవిష్కరించనున్నామని రాజీవ్‌ చెప్పారు. ఇది ప్రపంచంలోనే తొలి సీఎన్‌జీ బైక్‌ అన్నారు.



సెలెక్ట్‌ మొబైల్స్‌ మెగా సేల్‌ ఆఫర్లు

హైదరాబాద్: మల్టీ బ్రాండ్‌ మొబైల్స్‌ రిటైల్‌ సంస్థ 'సెలెక్ట్‌ మొబైల్స్‌' ఆరవ వార్షికోత్సవం సందర్భంగా మెగా సేల్‌ ఆఫర్లు ప్రకటించింది. ప్రతి మొబైల్‌ కొనుగోలుపై ఉచిత బహుమతి పొందవచ్చు. స్మార్ట్‌ఫోన్లు, టీవీలు, ల్యాప్‌టాప్‌లు, ఎలక్ట్రానిక్‌ ఉపకరణాలపై ప్రత్యేక ఆఫర్లు అందిస్తుంది. ఎస్‌బీఐ కార్డుపై 7.5% తక్షణ డిస్కౌంట్, బజాజ్‌ ఫైనాన్స్‌ ద్వారా కొనుగోలుపై రూ.4000 తక్షణ క్యాష్‌ బ్యాక్‌ ఇస్తుంది. సెలెక్ట్‌ మొబైల్స్‌ స్టోర్లలో ఈ మెగా సేల్‌ ఆఫర్లు జూన్‌ 4 వరకు అందుబాటులో ఉంటాయని సంస్థ సీఎండీ వై.గురు తెలిపారు.

సాక్షి స్పోర్ట్స్



వెస్టిండీస్‌ టి20 జట్టులో షమర్‌ జోసెఫ్‌

వచ్చే నెలలో జరిగే పురుషుల టి20 ప్రపంచకప్‌ క్రికెట్‌ టోర్నీలో పాల్గొనే వెస్టిండీస్‌ జట్టును ప్రకటించారు. 15 మంది సభ్యులతో కూడిన వెస్టిండీస్‌ జట్టుకు రోవ్‌మన్‌ పావెల్‌ సారథ్యం వహిస్తాడు. మెకాయ్, ఒషానె థామస్, కైల్‌ మేయర్స్‌లకు స్థానం దక్కలేదు. విండీస్‌ పేస్‌ బౌలింగ్‌ కొత్త సంచలనం షమర్‌ జోసెఫ్‌కు తొలిసారి టి20 జట్టులో చోటు లభించింది. ఈ ఏడాది ఆస్ట్రేలియా పర్యటనలో 24 ఏళ్ల షమర్‌ బ్రిస్బేన్‌ టెస్టులో 8 వికెట్లు పడగొట్టి 27 ఏళ్ల తర్వాత ఆసీస్‌ గడ్డపై విండీస్‌కు టెస్టు విజయాన్ని అందించి అందరి దృష్టిని ఆకర్షించాడు. టి20 ప్రపంచకప్‌ టోర్నీకి జూన్‌ 2 నుంచి 29 వరకు వెస్టిండీస్‌–అమెరికా సంయుక్తంగా ఆతిథ్యమివ్వనుంది.

వెస్టిండీస్‌ జట్టు: రోవ్‌మన్‌ పావెల్‌ (కెప్టెన్), అల్జారి జోసెఫ్‌ (వైస్‌ కెప్టెన్), జాన్సన్‌ చార్లెస్, రోస్టన్‌ చేజ్, షిమ్రన్‌ హెట్‌మైర్, జేసన్‌ హోల్డర్, షై హోప్, అకీల్‌ హొసీన్, బ్రాండన్‌ కింగ్, గుడకేశ్‌ మోతీ, నికోలస్‌ పూరన్, ఆండ్రీ రసెల్, షెర్ఫాన్‌ రూథర్‌ఫోర్డ్, రొమారియో షెఫర్డ్, షమర్‌ జోసెఫ్‌.

ఆరో ర్యాంక్‌లో గుకేశ్‌

ప్రపంచ చెస్‌ ర్యాంకింగ్స్‌



గుకేశ్‌కు కేంద్ర క్రీడల మంత్రి అనురాగ్‌ ఠాకూర్‌ సన్మానం

చెన్నై: గత నెలలో క్యాండిడేట్స్‌ చెస్‌ టోర్నమెంట్‌లో విజేతగా నిలిచిన భారత గ్రాండ్‌మాస్టర్, తమిళనాడు టీనేజర్‌ దొమ్మరాజు గుకేశ్‌ ప్రపంచ చెస్‌ ర్యాంకింగ్స్‌లో పురోగతి సాధించాడు. గత నెలలో 16వ స్థానంలో ఉన్న గుకేశ్‌ తాజా ర్యాంకింగ్స్‌లో ఏకంగా 10 స్థానాలు ఎగబాకి 6వ ర్యాంక్‌కు చేరుకున్నాడు. క్యాండిడేట్స్‌ టోర్నీ ప్రదర్శనతో గుకేశ్‌ 21 రేటింగ్‌ పాయింట్లు సాధించాడు. ప్రస్తుతం గుకేశ్‌ ఖాతాలో 2764 రేటింగ్‌ పాయింట్లున్నాయి. తెలంగాణకు చెందిన గ్రాండ్‌మాస్టర్‌ ఇరిగేశి అర్జున్‌ ఒక స్థానం మెరుగుపర్చుకొని 2761 రేటింగ్‌ పాయింట్లతో తొమ్మిదో ర్యాంక్‌లో నిలిచాడు. భారత దిగ్గజం విశ్వనాథన్‌ ఆనంద్‌ 2751 రేటింగ్‌ పాయింట్లతో 11వ స్థానంలో ఉన్నాడు. భారత ఇతర గ్రాండ్‌మాస్టర్లు ప్రజ్ఞానంద 14వ ర్యాంక్‌లో, విదిత్‌ 28వ ర్యాంక్‌లో, పెంటేల హరికృష్ణ 37వ ర్యాంక్‌లో ఉన్నారు. మహిళల చెస్‌ ర్యాంకింగ్స్‌లో భారత గ్రాండ్‌మాస్టర్లు కోనేరు హంపి 5వ ర్యాంక్‌లో, ద్రోణవల్లి హారిక 11వ ర్యాంక్‌లో, వైశాలి 13వ ర్యాంక్‌లో ఉన్నారు.

రన్నరప్‌ అర్జున్‌



మాల్మో (స్వీడన్‌): టెపె సెజెమన్‌ ఓపెన్‌ అంతర్జాతీయ చెస్‌ టోర్నీలో భారత గ్రాండ్‌మాస్టర్, తెలంగాణ ప్లేయర్‌ ఇరిగేశి అర్జున్‌ రన్నరప్‌గా నిలిచాడు. ఎనిమిది మంది గ్రాండ్‌మాస్టర్ల మధ్య ఏడు రౌండ్లపాటు జరిగిన ఈ టోర్నీలో పీటర్‌ స్విడ్లెర్‌ (రష్యా), అర్జున్, నొదిర్‌బెక్‌ అబ్దుసత్తొరోవ్‌ (ఉజ్బెకిస్తాన్‌) 4.5 పాయింట్లతో ఉమ్మడిగా అగ్రస్థానంలో నిలిచారు. విజేతను నిర్ణయించడానికి ఈ ముగ్గురి మధ్య బ్లిట్జ్‌ గేమ్‌ టైబ్రేక్‌ నిర్వహించారు. టైబ్రేక్‌లో అర్జున్, నొదిర్‌బెక్‌ చేతిలో స్విడ్లెర్‌ ఓడిపోయాడు. దాంతో అర్జున్, నొదిర్‌బెక్‌ టైటిల్‌ కోసం తలపడ్డారు. అర్జున్, నొదిర్‌బెక్‌ మధ్య రెండు గేమ్‌లు నిర్వహించగా... తొలి గేమ్‌ను అర్జున్‌ 'డ్రా' చేసుకొని, రెండో గేమ్‌లో ఓడిపోవడంతో నొదిర్‌బెక్‌ చాంపియన్‌గా అవతరించాడు.

పుష్కర కాలం తర్వాత...

ముంబైలో ముంబై ఇండియన్స్‌పై కోల్‌కతా విజయం

24 పరుగులతో నెగ్గిన నైట్‌రైడర్స్‌ ● రాణించిన వెంకటేశ్‌ అయ్యర్, స్టార్క్‌

ముంబై: వాంఖెడే మైదానంలో 12 సంవత్సరాల తర్వాత కోల్‌కతా నైట్‌రైడర్స్‌ (కేకేఆర్‌) మెరిసింది. 2012లో చివరిసారిగా ఈ వేదికపై ముంబై ఇండియన్స్‌ జట్టును ఓడించిన కోల్‌కతా ఇప్పుడు మళ్లీ గెలుపు బావుటా ఎగురవేసింది. శుక్రవారం జరిగిన ఈ పోరులో కేకేఆర్‌ 24 పరుగుల తేడాతో ముంబైని ఓడించింది. టాస్‌ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన కోల్‌కతా 19.5 ఓవర్లలో 169 పరుగులకు ఆలౌటైంది. వెంకటేశ్‌ అయ్యర్‌ (52 బంతుల్లో 70; 6 ఫోర్లు, 3 సిక్స్‌లు) అర్ధ సెంచరీ సాధించగా... మనీశ్‌ పాండే (31 బంతుల్లో 42; 2 ఫోర్లు, 2 సిక్స్‌లు) రాణించాడు. అనంతరం ముంబై 18.5 ఓవర్లలో 145 పరుగులకే ఆలౌటై ఓడిపోయింది. సూర్యకుమార్‌ యాదవ్‌ (35 బంతుల్లో 56; 6 ఫోర్లు, 2 సిక్స్‌లు) టాప్‌ స్కోరర్‌గా నిలవగా, కోల్‌కతా పేసర్‌ స్టార్క్‌కు 4 వికెట్లు దక్కాయి.

ఆదుకున్న వెంకటేశ్‌...

కోల్‌కతా ఇన్నింగ్స్‌లో 6.1 ఓవర్లు ముగిసేసరికే సగం జట్టు అవుట్‌! తుషార బౌలింగ్‌ జోరుతో మొదలైన జట్టు పతనం వేగంగా సాగింది. తన తొలి ఓవర్లోనే సాల్ట్‌ (5)ను అవుట్‌ చేసి శుభారంభం అందించిన తుషార... రెండో ఓవర్లో రఘువంశీ (13), శ్రేయస్‌ అయ్యర్‌ (6)లను వెనక్కి పంపాడు. పాండ్యా తొలి ఓవర్లోనే నరైన్‌ (8) కూడా పెవిలియన్‌ చేరగా, రింకూ సింగ్‌ (9) విఫలమయ్యాడు. ఈ దశలో వెంకటేశ్, పాండే కలిసి పరిస్థితిని చక్కదిద్దే ప్రయత్నం చేశారు. ఆశించిన స్థాయిలో భారీ షాట్లు కొట్టకపోయినా ఇన్నింగ్స్‌ కుప్పకూలిపోకుండా వీరు కాపాడారు. ఆరో వికెట్‌కు 62 బంతుల్లో 83 పరుగులు జత చేసిన అనంతరం పాండే వెనుదిరిగాడు. సమన్వయ లోపంతో రసెల్‌ (7) రనౌట్‌ కావడం చివరి ఓవర్లలో కేకేఆర్‌ స్కోరింగ్‌ అవకాశాలను దెబ్బ తీసింది. 36 బంతుల్లో అర్ధసెంచరీ పూర్తి చేసుకున్న వెంకటేశ్‌ తర్వాతి 16 బంతుల్లో 20 పరుగులే చేయగా... ఆఖరి 5 ఓవర్లలో 41 పరుగులే చేసి నైట్‌రైడర్స్‌ 5 వికెట్లు చేజార్చుకుంది.

సూర్యకుమార్‌ అర్ధసెంచరీ...

ఛేదనలో ముంబై కూడా తడబడింది. కేకేఆర్‌ బౌలర్లు ఆధిపత్యం ప్రదర్శించడంతో పవర్‌ప్లే ముగిసేసరికి ఇషాన్‌ కిషన్‌ (13), నమన్‌ (11), రోహిత్‌ శర్మ (11) వికెట్లు కోల్పోయింది. ఆ తర్వాత 10 పరుగుల వ్యవధిలో తిలక్‌ వర్మ (4), నేహల్‌ వధేరా (6), హార్దిక్‌ పాండ్యా (1) కూడా వెనుదిరిగారు. అయితే ఈ దశలో సూర్యకుమార్‌ దూకుడైన బ్యాటింగ్‌ ముంబై విజయంపై ఆశలు రేపింది. అరోరా వేసిన ఓవర్లో 3 ఫోర్లు, సిక్స్‌ బాదిన సూర్య 30 బంతుల్లో హాఫ్‌ సెంచరీని అందుకున్నాడు. విజయానికి 28 బంతుల్లో 50 పరుగులు కావాల్సిన స్థితిలో సూర్య అవుట్‌ కావడం మ్యాచ్‌ను మలుపు తిప్పింది. చివర్లో టిమ్‌ డేవిడ్‌ (20 బంతుల్లో 24; 1 ఫోర్, 1 సిక్స్‌) కొంత పోరాడినా లాభం లేకపోయింది. 19వ ఓవర్లో స్టార్క్‌ 3 వికెట్లు తీసి మ్యాచ్‌ను ముగించాడు.



స్కోరు వివరాలు

కోల్‌కతా నైట్‌రైడర్స్‌ ఇన్నింగ్స్‌: సాల్ట్‌ (సి) తిలక్‌ (బి) తుషార 5; నరైన్‌ (బి) పాండ్యా 8; రఘువంశీ (సి) సూర్యకుమార్‌ (బి) తుషార 13; శ్రేయస్‌ (సి) డేవిడ్‌ (బి) తుషార 6; వెంకటేశ్‌ (బి) బుమ్రా 70; రింకూ సింగ్‌ (సి అండ్‌ బి) చావ్లా 9; పాండే (సి) (సబ్‌) బ్రెవిస్‌ (బి) పాండ్యా 42; రసెల్‌ (రనౌట్‌) 7; రమణ్‌దీప్‌ (సి) కొయెట్జీ (బి) బుమ్రా 2; స్టార్క్‌ (బి) బుమ్రా 0; అరోరా (నాటౌట్‌) 0; ఎక్స్‌ట్రాలు 7; **మొత్తం (19.5 ఓవర్లలో ఆలౌట్‌) 169. వికెట్ల పతనం:** 1–7, 2–22, 3–28, 4–43, 5–57, 6–140, 7–153, 8–155, 9–155, 10–169. **బౌలింగ్‌:** తుషార 4–0–42–3, బుమ్రా 3.5–0–18–3, కొయెట్జీ 2–0–24–0, పాండ్యా 4–0–44–2, నమన్‌ 3–0–25–0, చావ్లా 3–0–15–1.

ముంబై ఇండియన్స్‌ ఇన్నింగ్స్‌: ఇషాన్‌ కిషన్‌ (బి) స్టార్క్‌ 13; రోహిత్‌ శర్మ (సి) పాండే (బి) నరైన్‌ 11; నమన్‌ (బి) వరుణ్‌ 11; సూర్యకుమార్‌ (సి) సాల్ట్‌ (బి) రసెల్‌ 56; తిలక్‌ (సి) నరైన్‌ (బి) వరుణ్‌ 4; వధేరా (బి) నరైన్‌ 6; పాండ్యా (సి) పాండే (బి) రసెల్‌ 1; డేవిడ్‌ (సి) శ్రేయస్‌ (బి) స్టార్క్‌ 24; కొయెట్జీ (బి) స్టార్క్‌ 8; చావ్లా (సి) నరైన్‌ (బి) స్టార్క్‌ 0; బుమ్రా (నాటౌట్‌) 1; ఎక్స్‌ట్రాలు 10; **మొత్తం (18.5 ఓవర్లలో ఆలౌట్‌) 145. వికెట్ల పతనం:** 1–16, 2–38, 3–46, 4–61, 5–70, 6–71, 7–120, 8–144, 9–144, 10–145. **బౌలింగ్‌:** అరోరా 3–0–35–0, స్టార్క్‌ 3.5–0–33–4, వరుణ్‌ 4–0–22–2, నరైన్‌ 4–0–22–2, రసెల్‌ 4–0–30–2.



'ప్లేయర్‌ ఆఫ్‌ ద మ్యాచ్‌' వెంకటేశ్‌ అయ్యర్‌

ఐపీఎల్‌ పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	పా	నె.ర.రే
రాజస్తాన్	10	8	2	16	0.622
కోల్‌కతా	10	7	3	14	1.098
లక్నో	10	6	4	12	0.094
హైదరాబాద్	10	6	4	12	0.072
చెన్నై	10	5	5	10	0.627
ఢిల్లీ	11	5	6	10	-0.442
పంజాబ్	10	4	6	8	-0.062
గుజరాత్	10	4	6	8	-1.113
ముంబై	11	3	8	6	-0.356
బెంగళూరు	10	3	7	6	-0.415

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, పా-పాయింట్లు, నె.ర.రే-నెట్‌ రన్‌రేట్‌

ఐపీఎల్‌లో నేడు

బెంగళూరు X గుజరాత్
వేదిక: బెంగళూరు
రాత్రి 7: 30 గంటల నుంచి స్టార్‌ స్పోర్ట్స్, జియో సినిమా యాప్‌లో ప్రత్యక్ష ప్రసారం

పదేళ్ల తర్వాత దక్షిణాఫ్రికాతో టెస్టు

- వచ్చే నెలలో భారత్‌లో దక్షిణాఫ్రికా మహిళల క్రికెట్‌ జట్టు పర్యటన
- వన్డే, టి20 సిరీస్‌లు కూడా ఆడనున్న సఫారీ బృందం

బెంగళూరు: భారత్‌లో దక్షిణాఫ్రికా మహిళల క్రికెట్‌ జట్టు పర్యటన ఖరారైంది. వచ్చే జూన్, జూలైలో పూర్తిస్థాయి ద్వైపాక్షిక సిరీస్‌లో భాగంగా భారత్‌తో దక్షిణాఫ్రికా ఒక టెస్టు, మూడు వన్డేలు, మూడు టి20 మ్యాచ్‌లు ఆడుతుంది. ముందుగా బెంగళూరులో జూన్‌ 16న వన్డే సిరీస్‌ మొదలవుతుంది. 19న రెండో వన్డే, 23న మూడో వన్డేతో 50 ఓవర్ల ఫార్మాట్‌ ముగుస్తుంది. వన్డే సిరీస్‌ ముగిశాక ఏకైక టెస్టు పోరు జూన్‌ 28 నుంచి చెన్నైలో జరుగుతుంది. భారత్, దక్షిణాఫ్రికా జట్ల మధ్య ఇది కేవలం మూడో టెస్టు కానుంది. దక్షిణాఫ్రికాలోని పార్ల్‌ వేదికగా ఈ రెండు జట్ల మధ్య తొలి టెస్టు 2002లో... భారత్‌లోని మైసూరు వేదికగా రెండో టెస్టు 2014లో జరిగాయి. ఆ తర్వాత ఈ రెండు జట్లు టెస్టు ఫార్మాట్‌లో మరో మ్యాచ్‌ ఆడలేదు. దక్షిణాఫ్రికాతో ఆడిన రెండు టెస్టుల్లోనూ భారతే నెగ్గింది. ఏకైక టెస్టు ముగిశాక బెంగళూరులో ఈ రెండు జట్ల మధ్య జూలై 5, 7, 9 తేదీల్లో మూడు టి20ల సిరీస్‌ జరుగుతుంది.



టెస్టుల్లో టాప్‌ ర్యాంక్‌ కోల్పోయిన భారత్‌

- మళ్లీ అగ్రస్థానానికి ఆస్ట్రేలియా
- ఐసీసీ టీమ్‌ ర్యాంకింగ్స్‌

దుబాయ్: మూడు ఫార్మాట్లలో అగ్రస్థానంలో కొనసాగిన భారత క్రికెట్‌ జట్టు ఆధిపత్యానికి టెస్టుల్లో గండిపడింది. అంతర్జాతీయ క్రికెట్‌ మండలి (ఐసీసీ) తాజాగా విడుదల చేసిన టెస్టు ర్యాంకింగ్స్‌లో ప్రపంచ టెస్టు చాంపియన్‌ ఆస్ట్రేలియా టాప్‌ ర్యాంక్‌కు ఎగబాకడంతో టీమిండియా రెండో ర్యాంక్‌కు పడిపోయింది. వార్షిక ర్యాంక్‌ల సవరణ వల్ల భారత్‌ ర్యాంక్‌ మారింది. ప్రస్తుతం భారత్‌ 120 రేటింగ్‌ పాయింట్లతో రెండో స్థానంలో ఉండగా, 124 పాయింట్లతో ఆస్ట్రేలియా అగ్రస్థానానికి చేరుకుంది. ఇంగ్లండ్‌ (105), దక్షిణాఫ్రికా (103) వరుసగా మూడు, నాలుగో ర్యాంకుల్లో ఉన్నాయి. పరిమిత ఓవర్ల ఫార్మాట్‌లలో టీమిండియా టాప్‌ ర్యాంక్‌ పదిలంగా ఉంది. సొంతగడ్డపై వన్డే ప్రపంచకప్‌ ఫైనల్లో ఆసీస్‌ చేతిలో ఓడినప్పటికీ భారత్‌ 122 పాయింట్లతో అగ్రస్థానాన్ని నిలబెట్టుకుంది. ఆస్ట్రేలియా (116), దక్షిణాఫ్రికా (112) వరుసగా రెండు, మూడో స్థానాల్లో ఉన్నాయి. టి20 ర్యాంకింగ్స్‌లో భారత్‌ 264 పాయింట్లతో నంబర్‌వన్‌గా కొనసాగుతోంది. ఇంగ్లండ్‌ (252)ను అధిగమించిన ఆస్ట్రేలియా (257) రెండో స్థానానికి ఎగబాకగా, డిఫెండింగ్‌ వరల్డ్‌ చాంపియన్‌ ఇంగ్లండ్‌ మూడో ర్యాంక్‌కు పడిపోయింది.



రోహిత్, కమిన్స్‌ (ఫైల్‌)

తెలంగాణ భగభగ!

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రమంతా అత్యధిక ఉష్ణోగ్రతలతో భగభగ మండిపోతోంది. మునుపెన్నడూ లేనంతగా వరుసగా రెండు వారాలుగా అత్యధిక ఉష్ణోగ్రతలతో కుతకుతలాడుతోంది. ఏప్రిల్ నెలలో రాష్ట్రంలోని చాలాచోట్ల ఏకంగా 45 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రత దాటింది. గత రెండు దశాబ్దాల్లో వరుసగా 45 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రత నమోదు కావడం ఇదే తొలిసారి అని వాతావరణ నిపుణులు చెబుతున్నారు. మే నెల మొదటి వారం ఏకంగా 46.7 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రత నమోదు కావడం గమనార్హం. శుక్రవారం రాష్ట్రంలోని చాలాచోట్ల 46.7 డిగ్రీల అత్యధిక ఉష్ణోగ్రత నమోదైనట్లు రాష్ట్ర ప్రణాళిక శాఖ గణాంకాలు చెబుతున్నాయి. ఖమ్మం జిల్లా పమ్మి, జగిత్యాల జిల్లా నేరెళ్ల, సూర్యాపేట జిల్లా మునగాల, పెద్దపల్లి జిల్లా మంథనిలో గరిష్ట ఉష్ణోగ్రత 46.7 డిగ్రీల సెల్సియస్ చొప్పున నమోదైంది. శుక్రవారం రాష్ట్రంలోని ప్రధాన నగరాల్లో నమోదైన గరిష్ట ఉష్ణోగ్రతలు పరిశీలిస్తే.... ఖమ్మంలో సాధారణం కంటే 5.1 డిగ్రీలు ఎక్కువగా 45 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైంది. అలాగే భద్రాచలం, మహబూబ్‌నగర్, హైదరాబాద్‌లలో సాధారణంకన్నా 4 డిగ్రీల సెల్సియస్ చొప్పున గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. రానున్న రెండు రోజులు చాలాచోట్ల గరిష్ట ఉష్ణోగ్రతలు సాధారణం కంటే ఎక్కువగా నమోదయ్యే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ హెచ్చరించింది. దీనికితోడు వడగాడ్పులు సైతం తీవ్రంగా ఉండే అవకాశం ఉన్నట్లు చెప్పింది. పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, నాగర్‌కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల, కరీంనగర్, ఖమ్మం జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసిన వాతావరణ శాఖ... మిగతా జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది.

రాష్ట్రంలో పలుచోట్ల 46.7 డిగ్రీల అత్యధిక ఉష్ణోగ్రతలు

- సాధారణం కంటే 2 నుంచి 5 డిగ్రీలు ఎక్కువగా నమోదు
- మరో రెండు రోజులు ఇదే పరిస్థితి.. తీవ్ర వడగాడ్పులకు అవకాశం
- తొమ్మిది జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసిన వాతావరణ శాఖ

శుక్రవారం ప్రధాన కేంద్రాల్లో నమోదైన గరిష్ట ఉష్ణోగ్రతలు (డిగ్రీల సెల్సియస్‌లలో)

కేంద్రం	గరిష్టం
ఖమ్మం	45.0
మహబూబ్‌నగర్	44.5
నిజామాబాద్	44.3
రామగుండం	44.2
భద్రాచలం	44.0
హైదరాబాద్	43.6
మెదక్	43.6
నల్లగొండ	43.5
ఆదిలాబాద్	43.3
హనుమకొండ	43.0

పిడుగుపాటుతో ఇద్దరు మృతి

ములకలపల్లి/పెనుబల్లి: ఉమ్మడి ఖమ్మంజిల్లాలో శుక్రవారం పిడుగుపాటుతో ఇద్దరు మృతి చెందారు. ములకలపల్లి మండలం ఒడ్డు రామవరం గ్రామానికి చెందిన రైతు బోడా శివరామ్(40) సంజీవపల్లి శివారులోని కొనుగోలు కేంద్రంలో ధాన్యం ఆరబోశాడు. వర్షం కురుస్తున్న క్రమంలో ధాన్యంపై పట్టాలు కప్పుతున్నాడు. ఆ సమయంలో పిడుగు పడడంతో అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. పక్కనే ఉన్న మరో రైతు గుగులోత్ శ్రీను కూడా అపస్మారక స్థితికి చేరుకున్నాడు.

- పెనుబల్లి మండలం కేఎం.బంజర్ గ్రామానికి చెందిన ఎనికేపల్లి పూర్ణచందర్‌రావు(33) గేదెలు ఇంటికి రాకపోవడంతో వెతకడానికి ద్విచక్ర వాహనంపై వెళ్లాడు. ఈక్రమంలో గాలిదుమ్ముతో పాటు ఉరుములు, మెరుపులు వస్తుండటంతో తిరిగి ఇంటికి బయలుదేరాడు. ఈక్రమంలోనే సమీపాన పిడుగు పడగా అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. దీంతో స్థానికులు తిరువూరు తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతి చెందాడు.

ఎండదెబ్బకు ఆరుగురు బలి

సాక్షి నెట్‌వర్క్: విపరీతమైన ఎండల దెబ్బకు శుక్రవారం రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో ఆరుగురు మృత్యువాత పడ్డారు. వరంగల్ జిల్లా గీసుకొండ మండలం ధర్మారానికి చెందిన రైతు వేల్పుల శ్రీనివాస్(55), జనగామ జిల్లా తరిగొప్పులకి చెందిన వృద్ధుడు దామెర సాయిలు(80), యాదాద్రి జిల్లా భువనగిరి మండలం అనంతారానికి చెందిన ఎల్లంల నర్సిరెడ్డి(63), సూర్యాపేట జిల్లా ఆత్మకూర్(ఎస్) మండలం గట్టికల్లు గ్రామానికి చెందిన సంద్యాల సర్వయ్య(83), జాజిరెడ్డిగూడెం మండలం పర్సాయపల్లికి చెందిన రైతు మహేశ్వరం అప్పారెడ్డి(55), మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల మండల పరిధిలోని చర్లపల్లి గ్రామానికి చెందిన హేమలత(68) వడదెబ్బకు గురై మృతి చెందారు.

ఎండలు, వడగాడ్పులు.. అప్రమత్తత అవసరం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ఎండల తీవ్రతతోపాటు పెరుగుతున్న వడగాడ్పులను ఎదుర్కొనేలా తగిన చర్యలు తీసుకోవాలని ఆయా జిల్లాల్లోని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి అధికారులను ఆ శాఖ ముఖ్యకార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా ఆదేశించారు. శుక్రవారం జిల్లా పంచాయతీ అధికారులతో ఆయన టెలీకాన్ఫరెన్స్ నిర్వహించి పలు సూచనలు చేశారు.

పనిచేయని ఏసీలు.. ఇంటి నుంచి కూలర్లు



ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆసుపత్రిలో రోగులు ఎండ వేడికి అల్లాడిపోతున్నారు. ఆసుపత్రిలోని రెండో అంతస్తులోని పల్మనాలజీ విభాగంలో ఏసీలు పనిచేయడం లేదు. మరోవైపు ఎండల తీవ్రత రోజురోజుకు పెరుగుతుండడంతో రోగులు ఉక్కపోతను తాళలేకపోతున్నారు. విధిలేని పరిస్థితుల్లో కొందరు ఇంటి నుంచి కూలర్లను తెచ్చుకుని వేడి నుంచి ఉపశమనం పొందుతున్నారు. ఏసీలకు మరమ్మతులు చేయించాల్సిన రిమ్స్ అధికారులు పట్టించుకోకపోవడం తీవ్ర విమర్శలకు తావిస్తోంది. - సాక్షి ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.